
'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే
నాకు అసలైన పండుగ రోజు'

సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 12+12 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 202

శనివారం 12-10-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 12+12 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 202



శనివారం 12-10-2024

పాఠకులు, ఏజెంట్లు, ప్రకటనకర్తలు, శ్రేయోభిలాషులకు సాక్షి విజయదశమి శుభాకాంక్షలు

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

న్యూస్‌రీల్

డీఎస్పీగా క్రికెటర్ సిరాజ్ బాధ్యతల స్వీకారం



క్రికెటర్ మహ్మద్ సిరాజ్ డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. టీ20 ప్రపంచ కప్ గెలిచిన భారత క్రికెట్ జట్టులో కీలకపాత్ర పోషించిన సిరాజ్‌కు గ్రూప్–1 ఆఫీసర్ పోస్టును ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీ వేదికగా ప్రకటించడం తెలిసిందే.

- వివరాలు 2లో▶

రెండున్నర గంటలు టెన్షన్..



తమిళనాడులోని తిరుచ్చి నుంచి షార్జాకు 141 మంది ప్రయాణికులతో శుక్రవారం టేకాఫ్ అయిన ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానంలో తలెత్తిన సాంకేతిక సమస్య తీవ్ర ఉత్కంఠకు దారితీసింది. రెండున్నర గంటలపాటు విమానం గాల్లో చక్కర్లు కొట్టి ఇంధనాన్ని ఖాళీ చేశాక చివరకు సురక్షితంగా ల్యాండ్ అయింది.

- వివరాలు 6లో▶

చెన్నై శివారులో రైలు ప్రమాదం



చెన్నై వైపు వస్తున్న దర్భంగా ఎక్స్‌ప్రెస్ తిరువళ్లూరు జిల్లా కవరపేట స్టేషన్ వద్ద శుక్రవారం రాత్రి 8:30 గంటల సమయంలో ఆగి ఉన్న గూడ్స్‌ను ఢీ కొంది. ఈ ప్రమాదంలో రెండు బోగీలు పాక్షికంగా కాలిపోయాయి. మొత్తం 15 బోగీలు పట్టాలు తప్పాయి. ఈ ప్రమాదంలో ఐదుగురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు.

- వివరాలు 6లో▶

కేసీఆర్ కట్టింది గడీలు..

మేం కట్టేది బడులు

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పిల్లలను ఒకే గొడుగు కిందికి తెస్తున్నాం

కుల రహిత సమాజ స్థాపనే ప్రభుత్వ లక్ష్యం: సీఎం రేవంత్‌రెడ్డి

- కొందుర్గులో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భవన నిర్మాణానికి శంకుస్థాపన
- గత పదేళ్లలో విద్యావ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైందని విమర్శ



శుక్రవారం రంగారెడ్డి జిల్లా కొందుర్గులో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, రంగారెడ్డి జిల్లా: 'గత ముఖ్యమంత్రి గడీలు, పార్టీ ఆఫీసులు కడితే.. మేము పేద పిల్లల కోసం సమీకృత గురుకుల పాఠశాలలు నిర్మిస్తున్నాం. తెలంగాణలోని 28 నియోజకవర్గాల్లో వీటిని కడుతున్నాం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పిల్లలను ఒకే గొడుగు కిందికి తీసుకురావడం ద్వారా కుల రహిత సమాజ స్థాపనే ప్రభుత్వ లక్ష్యం..'అని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. 25 ఎకరాల్లో, రూ.125 కోట్ల అంచనా వ్యయంతో రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గం కొందుర్గులో అత్యాధునిక హంగులతో నిర్మించ తలపెట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భవనానికి శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో సీఎం మాట్లాడారు.

అయినవాళ్లకు పదవులు..పేదలకు బర్రెలు

'కేసీఆర్ గత పదేళ్లలో విద్యావ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేశారు. ఏడు లక్షల కోట్లు అప్పు చేశారు కానీ విద్యాలయాలకు పైసా విదల్చలేదు. పైగా ఐదు వేలకుపైగా స్కూళ్లను మూసి వేయించారు. ఒక నియోజకవర్గానికో, ఒక కులానికో గురుకులాన్ని ఏర్పాటు చేసినా వాటిలో కనీస సదుపాయాలు కల్పించలేదు. నలుగురు ఉండాల్సిన

మిగతా 2వ పేజీలో ▶

ముందు ఎంజీబీఎస్, మెట్రో పిల్లర్లు కూల్చండి

ఆ తర్వాత మూసీ సుందరీకరణ చేపట్టండి

ఈ ప్రాజెక్టు కోసం రూ.1.5 లక్షల కోట్లు ఎక్కడి నుంచి తెస్తారు?

డీపీఆర్, యాక్షన్ ప్లాన్ లేకుండా, డ్రైనేజీ వ్యవస్థను సరిదిద్దకుండా ఎలా చేస్తారు?

మీడియా చిట్‌చాట్‌లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం మూసీ సుందరీకరణ చేసే ముందు మహాత్మాగాంధీ బస్టాండ్ (ఎంజీబీఎస్)ను, మెట్రో పిల్లర్లను కూల్చాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. వాటిని తొలగించకుండా మూసీ ప్రక్షాళన ఎలా సాధ్యమని ప్రశ్నించారు. మూసీ సుందరీకరణపై సీఎం రేవంత్‌రెడ్డి తన ప్రణాళికలను రీషెడ్యూల్ చేయాల్సిందేనని ఆయన డిమాండ్ చేశారు. 'ఈ ప్రాజెక్ట్ కోసం రూ.1.5 లక్షల కోట్లు ఎక్కడి నుంచి తెస్తారు? ఎలాంటి డీపీఆర్, కార్యాచరణ ప్రణాళిక లేకుండా, అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థను సరిదిద్దకుండా సుందరీకరణ ఎలా చేస్తారు? ప్రభుత్వమే రోడ్లువేసి, విద్యుత్ కనెక్షన్లు, ఇంటినంబర్, ఆధార్‌కార్డులు ఇచ్చి.. ఇప్పుడు పేదలు, దిగువ మధ్యతరగతి వారి ఇళ్లు కూలుస్తామంటే ఎలా? ముందు ఇళ్లు కూల్చుతాము, ఆ తర్వాత ప్రణాళిక వేస్తామంటే.. భవిష్యత్‌లో ఈ ప్రాజెక్ట్ నిలిచిపోతే బాధిత ప్రజలు ఎక్కడికి వెళ్లాలి? ఇళ్ల కూల్చివేతపై మూసీ ప్రభావిత ప్రాంతంలో సీఎం రేవంత్‌రెడ్డి దర్బార్ పెట్టి ప్రజలను ఒప్పించాలి. సీఎం వస్తే నేను కూడా అక్కడకు వచ్చి ప్రజల తరపున మాట్లాడేందుకు సిద్ధం'అని కిషన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బీజేపీ కార్యాలయంలో ఆయన మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ.. 'ప్రభుత్వం పేదల ఇళ్లను కూల్చే ముందు ఇమ్లీబన్‌లోని ఎంజీబీఎస్‌ను, అక్కడి మెట్రో పిల్లర్లు, స్టేషన్‌ను కూల్చాలి. మూసీ పరీవాహక ప్రాంతంలో 30, 40 ఏళ్ల కిందటే పేదలు తమ కష్టార్జితంతో ఇళ్లు కట్టుకుని నివసిస్తుంటే, ప్రభుత్వం పెద్ద పెద్ద ఫామ్‌హౌస్‌లను వదిలిపెట్టి పేదలపై పడతామంటే మేము విడిచిపెట్టే ప్రసక్తే లేదు'అని హెచ్చరించారు. కాగా, తమతో

మిగతా 3వ పేజీలో ▶

సమస్యలకు పరిష్కారాలు యుద్ధక్షేత్రంలో కాదు

- సంక్షోభాలు సమసిపోవాలంటే శాంతి చర్చలు, దౌత్య మార్గాలే శరణ్యం
- ప్రపంచంలో శాంతి కోసం మా వంతు ప్రయత్నాలు కొనసాగిస్తాం
- ఇండో–పసిఫిక్ ప్రాంతంలో సంపూర్ణ శాంతి, అభివృద్ధిని కోరుకుంటున్నాం
- తూర్పు ఆసియా శిఖరాగ్ర సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టీకరణ



6లో

గౌతమ బుద్ధుడు జన్మించిన దేశం నుంచి వచ్చా. ఇది యుద్ధాల యుగం కాదని పదేపదే చెబుతున్నా. సమస్యలకు పరిష్కారాలు యుద్ధక్షేత్రం నుంచి రావు. మానవతా దృక్పథంతో వ్యవహరించాలి. సంక్షోభాలు సమసిపోవాలంటే శాంతి చర్చలు, దౌత్య మార్గాల్లో సంప్రదింపులపై తప్పనిసరిగా దృష్టి పెట్టాలి. విశ్వబంధుగా మా బాధ్యతలు నిర్వర్తిస్తాం.

అణ్వాయుధ వ్యతిరేక పోరాటానికి

నోబెల్ శాంతి బహుమతి

జపాన్ సంస్థ 'నిహాన్ హిడాన్‌క్యో'కు ప్రతిష్టాత్మక గుర్తింపు

ప్రకటించిన నార్వే నోబెల్ కమిటీ

హిరోషిమా, నాగసాకిపై అమెరికా అణుబాంబు దాడిలో బయటపడ్డ పౌరులు స్థాపించిన సంస్థే 'నిహాన్ హిడాన్‌క్యో'



- వివరాలు 6లో▶



వాటిల్లో నీటి నిల్వ ప్రమాదకరం

- మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లపై రాష్ట్రానికి ఎన్డీఎస్‌ఏ స్పష్టీకరణ
- మూడు బరాజ్‌ల్లోనూ సికెంట్ పైల్ ఫౌండేషన్ నిర్మాణమే
- ఇప్పటికిప్పుడు నీటిని నిల్వ చేస్తే దిగువ ప్రాంతాలకు పెను ముప్పు అవకాశాలు
- తుది నివేదిక కోసం డిసెంబర్ వరకు ఆగండి

- వివరాలు 3లో

దీపావళిలోపు కార్పొరేషన్ పదవులు

టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్ చిట్‌చాట్

- దసరాకు చేద్దామనుకున్నా ఆ రెండు రాష్ట్రాల ఎన్నికలతో సాధ్యం కాలేదు
- త్వరలోనే మంత్రివర్గ విస్తరణతోపాటు టీపీసీసీకి కొత్త కార్యవర్గం
- వ్యాఖ్యల ఉపసంహరణతోనే కొండా సురేఖ వివాదం ముగిసిపోయింది
- చాలామంది బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లోకి వస్తారు
- స్థానిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్, బీజేపీలు కలిసి పోటీ చేసే అవకాశం



సాక్షి, హైదరాబాద్: దీపావళిలోపు రెండోదఫా కార్పొరేషన్ పదవులు ప్రకటిస్తామని టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్ వెల్లడించారు. దసరాలోపు చేద్దామని అనుకున్నా హరియాణా, కశ్మీర్ రాష్ట్రాల్లో ఎన్నికల కారణంగా సాధ్యం కాలేదని, ఏఐసీసీ నాయకత్వం కూడా బిజీగా ఉండడంతో మంత్రివర్గ విస్తరణ విషయంలోనూ, టీపీసీసీ కొత్త కార్యవర్గం ఏర్పాటులోనూ జాప్యం జరిగిందన్నారు. శుక్రవారం గాంధీభవన్‌లో

మిగతా 2వ పేజీలో ▶

సెలవు

దసరా పర్వదినం సందర్భంగా నేడు సాక్షి కార్యాలయానికి సెలవు. కావున ఆదివారం సంచిక వెలువడదు. పునర్దర్శనం సోమవారం.

ఇదండీ జోక్



మనక్కాదు! వారికే 'ఆయుధం'

'ఇందిరమ్మ'లో కదలిక



కమిటీల విధివిధానాల ఉత్తర్వులు జారీ

- ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్ల ఆధ్వర్యంలో త్వరలో సభ్యుల ఎంపిక
- చైర్మన్లుగా సర్పంచ్‌లు, వార్డు కౌన్సిలర్లు, కార్పొరేటర్లు
- ఈ కమిటీల ఆధ్వర్యంలోనే లబ్ధిదారుల ఎంపిక.. తనిఖీ

సాక్షి, హైదరాబాద్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఎట్టకేలకు కదలిక వచ్చింది. లబ్ధిదారులను గుర్తించేందుకు వీలుగా ఇందిరమ్మ కమిటీల విధివిధానాలను ఖరారు చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. డిసెంబర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే కొన్ని సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టినా, ఇందిరమ్మ ఇళ్ల విషయంలో మాత్రం ఆచితూచి వ్యవహరించింది. మూడు నెలల తర్వాత ఈ పథకాన్ని భద్రాచలంలో మంత్రులందరితో కలిసి సీఎం ప్రారంభించారు. కానీ లబ్ధిదారుల ఎంపికలో జాప్యం జరుగుతూ వచ్చింది. ఏడున్నర నెలల తర్వాత ఇప్పుడు ఇందిరమ్మ కమిటీలకు సంబంధించిన ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఇళ్ల నిర్మాణానికి వీలుగా కసరత్తు మొదలయ్యే అవకాశం కనిపిస్తోంది. ఒక్కోటి రూ.5 లక్షల వ్యయంతో నియోజకవర్గానికి మూడున్నర వేలు చొప్పున ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం సిద్ధమైన విషయం తెలిసిందే. సొంత స్థలం ఉండి, పక్కా ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తారు.

ప్రస్తుతానికి సొంత జాగా ఉన్నవారికే..

గ్రామ, పట్టణ స్థాయి (వార్డు/డివిజన్‌లవారీగా)లో ఏర్పాటయ్యే ఈ కమిటీలే ఇప్పుడు ఇందిరమ్మ పథకంలో కీలకంగా వ్యవహరించనున్నాయి. లబ్ధిదారుల ఎంపిక మొదలు, సోషల్ ఆడిట్ వరకు ప్రధాన పాత్ర పోషించనున్నాయి. గ్రామ స్థాయి కమిటీలను ఎంపీడీవోలు, వార్డు స్థాయిలో మున్సిపల్ కమిషనర్లు నామినేట్ చేస్తారు. ప్రస్తుతానికి సొంత జాగాలు ఉన్నవారినే పరిగణనలోకి తీసుకుంటారు. సొంత జాగా లేని వారికి ఇళ్లను మంజూరు చేయరు. సొంత జాగాలో కచ్చా ఇల్లు ఉన్నవారు, పక్కా ఇల్లు ఉన్నవారెవరన్న విషయంలో జాగ్రత్తగా వివరాలు సేకరించాలని ప్రభుత్వం ఇప్పటికే అధికారులను ఆదేశించింది. కేంద్ర ప్రభుత్వం నుంచి

మిగతా 2వ పేజీలో ▶

క్లుప్తంగా...

బాధ్యతలను దసరా గుర్తు చేస్తుంది

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: దసరా పండుగ మనలో కొత్త ఉత్సాహాన్ని నింపడంతోపాటు.. బాధ్యతలను కూడా గుర్తు చేస్తుందని కేంద్ర బొగ్గు, గనుల శాఖల మంత్రి జి.కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. సత్యం, సదాచార మార్గంలో కర్తవ్యనిష్ఠతో ముందుకెళ్లడం ద్వారా ఎంతటి కష్టాన్నయినా ఎదుర్కొని విజయం సాధిస్తామనేది విజయదశమి మనకందించే సందేశమని వివరించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు.

జీవన తాత్వికత తెలిపే దసరా: మాజీ సీఎం కేసీఆర్



సాక్షి, హైదరాబాద్: మనిషి తనలోని చెడు మీద నిత్యపోరాటం చేస్తూ.. మంచి దిశగా విజయం సాధించాలనే జీవన తాత్వికతను విజయదశమి తెలియజేస్తుందని బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

వైఎస్ జగన్ దసరా శుభాకాంక్షలు



సాక్షి, అమరావతి: ప్రజలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు. దుర్గాష్టమి, మహర్నవమి, విజయదశమి పండుగలను పురస్కరించుకుని తెలుగు రాష్ట్రాల ప్రజలకు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారందరికీ దసరా శుభాకాంక్షలు తెలిపారు. లోక కంటకుడైన మహిషాసురుడిని జగన్మాత సంహరించినందుకు, చెడుపై మంచి, దుష్టశక్తులపై దైవశక్తుల విజయానికి ప్రతీకగా జరుపుకునే పండుగే విజయదశమి అని ఆయన అన్నారు. చెడు ఎంత దుర్మార్గమైనదైనా, ఎంత శక్తిమంతమైనదైనా అంతిమ విజయం మంచినే వరిస్తుందని పేర్కొన్నారు. ఆ జగన్మాత ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలంతా సుఖశాంతులు, సిరిసంపదలతో తులతూగాలని, రాష్ట్రంలోని ప్రతి ఒక్క కుటుంబానికి విజయాలు సిద్ధించాలని, ఆ కనకదుర్గమ్మవారి దీవెనలు, ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని వైఎస్ జగన్ ఆకాంక్షించారు.

పాప వినాశనానికి చిహ్నం దసరా

మంత్రి సీతక్క



సాక్షి, హైదరాబాద్: పాప వినాశనానికి, సత్యానికి, ధర్మానికి చిహ్నంగా నిలిచే దసరా సామూహిక వేడుకకు ప్రతీకగా నిలుస్తుందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి కూడా రాష్ట్ర ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు.

జగన్మాత దయ ఉండాలి: మంత్రి సురేఖ



సాక్షి, హైదరాబాద్: జగన్మాత దయతో తెలంగాణ రాష్ట్రం అగ్రపథాన కొనసాగాలని అటవీ, దేవాదాయ శాఖల మంత్రి కొండా సురేఖ ఆకాంక్షించారు. దసరా పండుగ ప్రజలకు విజయాలు చేకూర్చాలని, ప్రజలు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని కోరారు.

టీపీసీసీ చీఫ్ దసరా శుభాకాంక్షలు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రజలకు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ దసరా శుభాకాంక్షలు తెలిపారు. విజయానికి సంకేతంగా భావించే దసరా పండుగను.. ప్రజలు సంతోషంగా, ఘనంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

క్రీడల్లోనూ ప్రతిభ చూపాలి

గిరిజన సంక్షేమ కార్యదర్శి డాక్టర్ శరత్

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు.. విద్యతో పాటు వివిధ క్రీడా పోటీల్లో ప్రతిభ చూపాలని గిరిజన సంక్షేమ కార్యదర్శి డాక్టర్ ఎ.శరత్ కోరారు. డ్రాగన్‌బోట్ వరల్డ్ చాంపియన్‌షిప్–2024 పోటీలకు ఎంపికైన బోయినపల్లి ప్రభుత్వ గిరిజన వాటర్ స్పోర్ట్స్ అకాడమి జూనియర్ విద్యార్థులను శుక్రవారం ఆయన కలిశారు. నవంబర్‌లో ఫిలిప్పీన్స్‌లో జరిగే పోటీల్లో గెలిచి దేశం, తెలంగాణ రాష్ట్రం, గిరిజన సంక్షేమశాఖకు మంచి పేరు తేవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ క్రీడా పోటీలకు ఎంపికైన గిరిజన విద్యార్థులు, కోచ్ భూపాల్, క్రీడాధికారి జ్యోతి, ప్రిన్సిపల్ సుధాకర్‌లను అభినందించారు.

‘సమన్వయం’తో ముందుకు!

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపునకు కాంగ్రెస్ వ్యూహం

15వ తేదీలోగా సమన్వయ కమిటీ ఏర్పాటుకు నిర్ణయం

- పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా కూడా ఏర్పాటు
- ముఖ్య నేతలతో సీఎం రేవంత్ జూమ్ కాన్ఫరెన్స్



సాక్షి, హైదరాబాద్: త్వరలో జరగనున్న నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు కోసం సర్వశక్తులూ ఒడ్డాలని అధికార కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. టీపీసీసీ అధ్యక్షుడిగా మహేశ్ కుమార్ గౌడ్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత జరుగుతున్న తొలి ఎన్నికల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ విజయం సాధించేలా వ్యూహాలకు పదును పెడుతోంది. ఇందులో భాగంగా ఈ నెల 15వ తేదీలోగా ఎన్నికల సమన్వయ కమిటీని ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించింది. అదేవిధంగా పార్లమెంటు నియోజకవర్గాల వారీగా కమిటీలు ఏర్పాటు చేసుకుని సీనియర్ నేతల అభిప్రాయాలు తీసుకున్న తర్వాత ఈ నెలాఖరులోగా అభ్యర్థిని ఖరారు చేయాలని భావిస్తోంది. ఎన్నికల వ్యూహాల అమలు కోసం ప్రత్యేకంగా వార్ రూమ్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు ఆయా జిల్లాల మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ముఖ్యనేతలతో సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం రాత్రి జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు ప్రణాళికపై దిశానిర్దేశం చేశారు.

పథకాలు, కార్యక్రమాలపై విస్తృత ప్రచారం

ఎన్నికల్లో విజయం సాధించేందుకు ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టాలని రేవంత్ సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక సంక్షేమ కార్యక్రమాలను యుద్ధ ప్రాతిపదికన చేపడుతోందని, ప్రధానంగా డీఎస్సీ ద్వారా 11 వేల ఉద్యోగాల భర్తీ, ఉద్యోగ నోటిఫికేషన్లు, టీచర్లకు ప్రమోషన్లు, టీచర్ల బదిలీ చేపట్టడంతో పాటు ఒక అద్భుతమైన విద్యా వ్యవస్థను ఏర్పాటు చేస్తోందని తెలిపారు. ఈ అంశాలను పట్టభద్రులైన యువత దృష్టికి ప్రధానంగా తీసుకెళ్లాలని సూచించారు. రుణమాఫీతో సహా ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు, స్కిల్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ, హ్యాండ్లూమ్ టెక్నాలజీ యూనివర్సిటీల ఏర్పాటు లాంటి విప్లవాత్మక కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేయాలని చెప్పారు.

తక్షణమే ఓటర్ల నమోదు

గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన వారిని ఓటర్లుగా నమోదు చేసే ప్రక్రియను పార్టీ పక్షాన వెంటనే ప్రారంభించాలని, ఈ ప్రక్రియలో యూత్ కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యూఐలను భాగస్వాములను చేయాలని రేవంత్‌రెడ్డి కోరారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు ద్వారా రాష్ట్రంలోని యువత కాంగ్రెస్ పార్టీ పక్షాన ఉందనే విషయాన్ని మరోమారు తెలియజేయాలని, ఈ మేరకు ఎన్నికల వ్యూహాలను పకడ్బందీగా అమలు చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ మాట్లాడుతూ గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదును పెద్ద ఎత్తున చేపట్టాలని సూచించారు. మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి మాట్లాడుతూ సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకునేందుకు పార్టీలోని అన్ని స్థాయిల నేతలు, కార్యకర్తలు బాధ్యతగా పనిచేయాలని కోరారు. పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, డీసీసీ అధ్యక్షులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఏఐసీసీ కార్యదర్శులు విశ్వనాథన్, విష్ణునాథ్‌లు కూడా జూమ్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

‘ఇంటిగ్రేటెడ్’లో అంతర్జాతీయ ప్రమాణాలతో విద్య

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

ఖమ్మం రూరల్: బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందించేందుకు ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్మిస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండలం పొన్నేకల్ సమీపంలో 25 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న పాఠశాల నిర్మాణ పనులకు ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డితో కలసి మంత్రి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో 28 పాఠశాలలకు శంకుస్థాపన చేయగా.. పాలేరు నియోజకవర్గానికి స్థానం దక్కడం ఆనందంగా ఉందని అన్నారు. ఇంటిగ్రేటెడ్ పాఠశాలల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన సుమారు 3 వేల మంది పిల్లలకు విద్యతో పాటు క్రీడల్లో శిక్షణ ఉంటుందన్నారు. పది వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టుల భర్తీ, ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణమే.. విద్యారంగంపై తమ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శమని పొంగులేటి తెలిపారు. బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో పెండింగ్‌లో పెట్టిన 22 వేల మంది ఉపాధ్యాయుల పదోన్నతులు, 34 వేల మంది బదిలీలను వివాదాలకు తావు లేకుండా పూర్తి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న మంత్రి పొంగులేటి. చిత్రంలో ఎంపీ రఘురాంరెడ్డి, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తదితరులు

నిత్య విజయాలు కలగాలి

సీఎం రేవంత్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణకు నిత్య విజయాలు కలగాలని, ప్రజలందరికీ సుఖసంతోషాలను ప్రసాదించాలని దుర్గామాతను సీఎం రేవంత్‌రెడ్డి ప్రార్థించారు. దసరా పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సాంస్కృతిక జీవన విధానంలో దసరాకు ప్రత్యేక స్థానం ఉందని స్పష్టం చేశారు. దసరా సంబురాలు జరుపుకోవడం సబ్బండ వర్గాల ఐక్యతకు నిదర్శనంగా నిలుస్తుందన్నారు.

దసరా పండుగకు స్వగ్రామానికి సీఎం

ప్రతియేటా తన స్వగ్రామంలో దసరా పండుగను జరుపుకునే ఆనవాయితీని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి కొనసాగిస్తున్నారు. దసరా వేడుకలను కుటుంబసభ్యులతో కలసి జరుపుకునేందుకుగాను శనివారం ఆయన తన సొంతూరు అచ్చంపేట నియోజకవర్గంలోని కొండారెడ్డిపల్లికి వెళుతున్నారు. ముఖ్యమంత్రి అయిన తర్వాత తొలిసారి దసరా పండుగను తన సొంత గ్రామంలో జరుపుకునేందుకు సీఎం వెళుతున్నారని, అక్కడి నుంచి కొడంగల్ నియోజకవర్గానికి వెళ్లి ఆదివారం తిరిగి హైదరాబాద్‌కు చేరుకుంటారని ముఖ్యమంత్రి కార్యాలయ వర్గాలు శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించాయి.

‘ఇందిరమ్మ’లో కదలిక

▶ మొదటి పేజీ తరువాయి

ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద రాష్ట్రానికి భారీగా నిధులు రాబట్టే ప్రయత్నంలో రాష్ట్రప్రభుత్వం ఉంది. అనర్హులను లబ్ధిదారులుగా గుర్తిస్తే నిధులు ఇవ్వబోమని కేంద్రం తేల్చి చెప్పింది. ఈ నేపథ్యంలోనే లబ్ధిదారుల గుర్తింపులో జాగ్రత్త అవసరమని రాష్ట్రప్రభుత్వం కలెక్టర్లకు స్పష్టం చేసింది. కాగా కమిటీ సభ్యులు లబ్ధిదారుల వివరాలను సేకరించి ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్ల ద్వారా ప్రభుత్వానికి సమర్పిస్తారు.

కొత్త దరఖాస్తులు తీసుకుంటారా?

ప్రజాపాలన పేరుతో రాష్ట్ర ప్రభుత్వం పది నెలల క్రితం సంక్షేమ పథకాల లబ్ధి కోసం ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. అప్పట్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం 80 లక్షలకు పైగా దరఖాస్తులందాయి. వాటిల్లో ప్రాథమిక స్థాయి వడపోత తర్వాత 50 లక్షల దరఖాస్తులు మిగిలాయి. వీటిల్లో అర్హమైనవి ఎన్ననే విషయం క్షేత్రస్థాయిలో పరిశీలించాల్సి ఉంది. కాగా పాత దరఖాస్తులే పరిగణనలోకి తీసుకుంటారా? కొత్తవి కూడా స్వీకరిస్తారా? అనే విషయంలో స్పష్టత రావాల్సి ఉంది.

ఎంపికకు సుదీర్ఘ సమయం!

లబ్ధిదారుల ఎంపికకు చాలా సమయం పట్టే అవకాశం కనిపిస్తోంది. ప్రజాపాలన దరఖాస్తులనే పరిగణనలోకి తీసుకున్నా.. ఒక్కో దరఖాస్తు ఆధారంగా క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించి అర్హతను తేల్చాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత ప్రభుత్వం జాబితాను రూపొందించి కేంద్ర ప్రభుత్వానికి సమర్పిస్తుంది. ఆ తర్వాతే నిధుల విడుదల ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే హడ్కో నుంచి ఇళ్ల కోసం దాదాపు రూ.3 వేల కోట్ల రుణం పొందింది. కేంద్రం నుంచి మరో రూ.8 వేల కోట్లు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తోంది. లబ్ధిదారులకు మొదటి విడత రూ.లక్ష చెల్లించి మిగతా విడతలను వచ్చే ఆర్థిక సంవత్సరంలో చెల్లించనున్నారు. మొదటి విడతలో మంజూరు చేసే ఇళ్లకు రూ.20 వేల కోట్లు అవసరమవుతాయి.

గ్రామస్థాయి కమిటీ

సర్పంచ్/ పంచాయితీ ప్రత్యేక అధికారి చైర్మన్‌గా ఉండే కమిటీలో స్వయం సహాయక బృందాలకు చెందిన ఇద్దరు మహిళలు, గ్రామ పురోగతికి పాటుపడే ముగ్గురు స్థానికులు (వీరిలో ఒకరు బీసీ, మరొకరు ఎస్సీ/ఎస్టీ విధిగా ఉండాలి) సభ్యులుగా, పంచాయితీ కార్యదర్శి కన్వీనర్‌గా ఉంటారు.

పట్టణ స్థాయి కమిటీ

వార్డు కౌన్సిలర్/కార్పొరేటర్ చైర్మన్‌గా ఉండే ఈ కమిటీలో ఇద్దరు స్వయం సహాయక బృంద సభ్యులు, స్థానికంగా అభివృద్ధి పనులకు సహకరించే ముగ్గురు స్థానికులు (వీరిలో ఒకరు బీసీ, మరొకరు ఎస్సీ/ఎస్టీ విధిగా ఉండాలి) సభ్యులుగా, వార్డు అధికారి కన్వీనర్‌గా ఉంటారు.

దీపావళిలోపు కార్పొరేషన్ పదవులు

▶ మొదటి పేజీ తరువాయి

మహేశ్‌కుమార్‌గౌడ్ మీడియాతో మాట్లాడుతూ పలు అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...

- ఎంఐఎంతో స్నేహం వేరు. శాంతిభద్రతల సమస్య వేరు. నాంపల్లి నియోజకవర్గంలో మా పార్టీ నేత ఫిరోజ్‌ఖాన్‌పై జరిగిన దాడిని సీరియస్‌గా తీసుకుంటాం. విషయం సీఎం దృష్టికి వెళ్లింది.
- ఇతర పార్టీల నుంచి ఎమ్మెల్యేలు, నాయకులు కాంగ్రెస్ పార్టీలోకి వచ్చిన నియోజకవర్గాల్లో కొంత ఇబ్బంది అవుతోంది. అందుకే వాటికి తాత్కాలిక బ్రేక్ వేశాం. కానీ బీఆర్‌ఎస్‌కు చెందిన చాలామంది మాతో టచ్‌లో ఉన్నారు. త్వరలోనే చేరికలు ప్రారంభమవుతాయి. ఎమ్మెల్యేలు కూడా వస్తారు.
- సినీనటుడు నాగార్జున కుటుంబాన్ని ఉద్దేశించి మంత్రి కొండా సురేఖ కావాలని మాట్లాడలేదు. కేటీఆర్ వ్యవహారశైలి కారణంగానే అలా మాట్లాడారని అనుకుంటున్నా. అయినా అలా మాట్లాడాల్సింది కాదు. నాగార్జున కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఏం చెబుతుందో చూడాలి. మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తప్పిస్తారన్న ప్రచారంలో వాస్తవం లేదు. కొండా సురేఖ తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నట్టు చెప్పారు.
- పేదలకు ఇబ్బంది లేకుండా మూసీ ప్రక్షాళన చేయాలన్నదే మా ప్రభుత్వ ఉద్దేశం. మూసీ, హైడ్రాలు భావితరాల కోసమే చేపట్టాం.
- బీఆర్‌ఎస్, బీజేపీల మధ్య లోపాయికారి ఒప్పందం ఉంది. మమ్మల్ని ఎదుర్కోవడమే ఆ రెండు పార్టీల టార్గెట్. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్, బీజేపీలు కలిసి పోటీ చేసే అవకాశముంది. అయినా మాకేం నష్టం లేదు.
- సోషల్ మీడియాను ఉపయోగించుకొని బీఆర్‌ఎస్ మా మీద దుష్ప్రచారం చేస్తోంది. దుబాయి నుంచి ఖాతాలు తెరిచి మరీ నడిపిస్తున్నారు. రూ. వందల కోట్లు ఇందుకోసం ఖర్చు చేస్తున్నారు. సోషల్ మీడియాను దుర్వినియోగం చేస్తే చట్టం తన పని తాను చేసుకుపోతుంది.
- ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న బీసీల పక్షాన మాట్లాడుతున్నారు. బీసీల పక్షాన మాట్లాడితే పార్టీ లైన్ తప్పారని అనలేం. అయితే, కాంగ్రెస్ పార్టీ బీసీల పక్షపాతి అని మల్లన్నకు విజ్ఞప్తి చేస్తున్నా.
- కాంగ్రెస్ సెక్యులర్ పార్టీ, బీజేపీ మతతత్వ పార్టీ. రెండు పార్టీలు ఎప్పటికీ ఒక్కటి కావు. ఈ విషయంలో బీఆర్‌ఎస్ ఎంత దుష్ప్రచారం చేసినా ప్రజలు నమ్మరు.
- పార్టీ బలోపేతానికి ప్రణాళికలు ఉన్నాయి. నెలరోజుల్లో కొత్త కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకుంటాం. త్వరలోనే జిల్లాల పర్యటనకు వెళతా.

కేసీఆర్ కట్టింది గడీలు.. మేం కట్టేది బడులు

▶ మొదటి పేజీ తరువాయి

గడుల్లో 40 మంది పిల్లలను కుక్కారు. చదువుకున్నోళ్లకు ఎవరైనా ఆయా రంగాల్లో ఉద్యోగం, ఉపాధి అవకాశాలు కల్పించాలి. కానీ ఆయన మాత్రం తన కొడుకు, అల్లుడికి మంత్రి పదవులు, కూతురుకు ఎమ్మెల్సీ, మరో కొడుక్కి రాజ్యసభ పదవులు కట్టబెట్టాడు. నమ్ముకున్న పేదలకు మాత్రం గొర్రెలు, బర్రెలు, పందులు పంచి పెట్టాడు. నీ కొడుకును, అల్లుడిని, బిడ్డను బర్రెలు, గొర్రెలు కాయడానికి పంపుతావా? పేదోడు చదువుకుంటే ఎక్కడ వారిలో చైతన్యం వస్తుందో అని, ఎక్కడ తన తప్పులను ప్రశ్నిస్తారో అని భయపడి చదువుకు దూరం చేసి, వారిని బానిసలుగా చూశాడు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అంటూ విడదీసి ఒకేచోట కలిసి మెలసి ఉండాల్సిన పిల్లల మెదడులో విషం నింపాడు. సమాజ విచ్ఛిన్నానికి కుట్రపన్నాడు. 10 జిల్లాలను 33 జిల్లాలుగా విభజించాడు. ఆయా జిల్లాల్లో పార్టీ కార్యాలయాల కోసం ప్రభుత్వ భూములను అప్పనంగా కొట్టేసి నిర్మాణాలు చేపట్టాడు. కానీ పేదలకు స్కూళ్లు, ఆస్పత్రులు కట్టేందుకు మాత్రం ఆయనకు మనసు రాలేదు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బీఆర్‌ఎస్‌కు గుండు సున్నా ఇచ్చారు. అయినా ఆ పార్టీ నేతల బుద్ధి మారలేదు..’ అని రేవంత్‌రెడ్డి అన్నారు.

ప్రవీణ్‌కుమార్ కూడా దొరలాగే మాట్లాడుతున్నాడు

‘ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అంటే నాకు గౌరవం ఉంది. అణగారిన కులం నుంచి వచ్చి ఐపీఎస్ అయినందుకు ఆయన్ను మనస్ఫూర్తిగా అభినందించా. బీఎస్పీలో ఉంటారో? బీఆర్‌ఎస్‌లో ఉంటారో ఆయన ఇష్టం. ఆయన గురుకులాలకు కార్యదర్శిగా పని చేశారు. షాద్‌నగర్ బిడ్డలకు రూ.125 కోట్లతో ఇంటిగ్రేటెడ్ గురుకులం నిర్మిస్తుంటే అభినందించాల్సింది పోయి అడ్డుపడుతున్నాడు. కేసీఆర్ చెప్పిందే ఆయన మాట్లాడుతున్నాడు. బీఆర్‌ఎస్‌లో చేరిన తర్వాత ఆయన కూడా పేదలు బర్రెలు, గొర్రెలు, పందులు కాసుకోవాలని దొరలాగే సూచిస్తున్నాడు..’ అని సీఎం ధ్వజమెత్తారు.



సభలో మాట్లాడుతున్న విద్యార్థి మణికంఠ

సమీకృత స్కూళ్లకు పీవీ ఆద్యుడు

‘నిర్వీర్యమైన విద్యా వ్యవస్థను గాడిలో పెట్టే ప్రయత్నం చేస్తున్నా. ఎలాంటి విమర్శలకు తావు లేకుండా ఇప్పటికే 34 వేల మంది ఉపాధ్యాయులను బదిలీ చేశాం. 21 వేల మందికి పదోన్నతులు కల్పించాం. ఇందులో అధికారుల కృషి అభినందనీయం. ఇంటిగ్రేటెడ్ స్కూళ్లకు దివంగత ప్రధాని పీవీ నరసింహారావు ఆద్యుడు. ఆయన సర్వేల్, నాగార్జునసాగర్‌లో ఏర్పాటు చేసిన స్కూళ్లలో చదువుకున్న అనేక మంది ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, డాక్టర్లు, లాయర్లు, పారిశ్రామిక వేత్తలుగా ఎదిగారు. ఒకప్పుడు సర్వేల్ స్కూల్లో చదువుకున్న బుర్ర వెంకటేశం ఐఏఎస్ అయ్యారు. మాజీ డీజీపీ మహేందర్‌రెడ్డి కూడా ఇదే స్కూల్లో చదువుకున్నారు..’అని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకర్, రాంమోహన్‌రెడ్డి, కాలె యాదయ్య, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, కలెక్టర్ శశాంక పాల్గొన్నారు.

విద్యార్థులందరిదీ ఒక్కటే కులం

కొందుర్గు: విద్యాభ్యాసం చేస్తున్న బాలబాలికలందరిదీ ఒక్కటే కులమని, అది విద్యార్థి కులమని కొందుర్గు విద్యార్థి మణికంఠ అన్నాడు. సీఎం పాల్గొన్న సభలో అతను మాట్లాడుతూ.. పేదలు, మధ్య తరగతి విద్యార్థులందరికీ నాణ్యమైన విద్యను అందించడానికి, కుల, మతాలకతీతంగా విద్యార్థులందరూ ఒకేచోట చదువుకునేందుకు వీలుగా ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేయడం సంతోషకరమైన విషయమని అన్నాడు. ‘నేను ప్రమాణం చేసి చెప్తున్నా.. ఈ విషయమై ఎప్పుడూ సీఎం రేవంత్‌రెడ్డికి రుణపడి ఉంటాం..’ అని చెప్పాడు. ఈ సందర్భంగా మణికంఠతో పాటు మరో విద్యార్థి జ్యోతిని సీఎం అభినందించారు.

డీఎస్పీగా క్రికెటర్ సిరాజ్ బాధ్యతల స్వీకారం



క్రికెటర్ సిరాజ్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న డీజీపీ జితేందర్. చిత్రంలో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, అదనపు డీజీ మహేశ్ భగవత్, ఐజీ ఎం.రమేశ్

సాక్షి, హైదరాబాద్: భారత క్రికెటర్ మహ్మద్ సిరాజ్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా బాధ్యతలు స్వీకరించారు. టీ20 ప్రపంచ కప్ గెలిచిన భారత క్రికెట్ బృందంలో సభ్యునిగా టీమ్ విజయంలో కీలకపాత్ర పోషించిన సిరాజ్‌కు గ్రూప్–1 ఆఫీసర్ పోస్టును ఇవ్వనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీ వేదికగా ప్రకటించిన విషయం విదితమే. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు ఆయనను పోలీసు శాఖలో డీఎస్పీగా నియమించారు. శుక్రవారం ఆయన డీజీపీ జితేందర్‌కు రిపోర్ట్ చేసి, డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. సిరాజ్ బాధ్యతల స్వీకార కార్యక్రమంలో రాజ్యసభసభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, తెలంగాణ మైనారిటీస్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ చైర్మన్ ఫహీముద్దీన్ ఖురేషీ పాల్గొన్నారు. తనను డీఎస్పీగా నియమించినందుకు ఈ సందర్భంగా సిరాజ్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీజీ మహేశ్‌భగవత్, ఐజీ ఎం.రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వేకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

- రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల స్థితిగతులపై పరిశీలన
- రాష్ట్ర ప్రణాళికా శాఖకు సర్వే బాధ్యతలు అప్పగింత
- 60 రోజుల్లో పూర్తి చేయాలని స్పష్టీకరణ
- ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్ శాంతికుమారి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల సమగ్ర సర్వేకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ రంగాల్లో ఈ వర్గాల స్థితిగతుల పరిశీలనకు చర్యలు ప్రారంభించింది. రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటి (డోర్ టు డోర్) సర్వే చేయాలని యంత్రాంగాన్ని ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తాజాగా జీవో 18ని జారీ చేశారు. రాష్ట్ర ప్రణాళికా శాఖకు ఈ సర్వే బాధ్యతలను అప్పగిస్తున్నట్లు ఆమె ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అరవై రోజుల్లో సర్వేను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల స్థితిగతులను అధ్యయనం చేయాలని ఈ ఏడాది ఫిబ్రవరి 4వ తేదీన జరిగిన కేబినెట్ సమావేశంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో ఈ వర్గాలకు మెరుగైన అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో మంత్రివర్గం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. మరోవైపు రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలుకు ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం సైతం రాష్ట్ర ప్రభుత్వానికి పలు సూచనలు ఇచ్చింది. రాష్ట్రంలోని బీసీలు, ఎస్సీ, ఎస్టీలతో పాటు ఇతర వెనుకబడిన వర్గాలను ఆయా రంగాల్లో మెరుగుపర్చేలా ఈ సర్వేను చేపడుతున్నట్టు సీఎస్ శాంతికుమారి ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

తెలంగాణపై ఎందుకింత వివక్ష



సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వ నిధుల కేటాయింపులో తెలంగాణ రాష్ట్రంపై ఇంత వివక్ష ఎందుకని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. గోదావరి పుష్కరాల కోసం ఏపీకి రూ.100 కోట్లుఇచ్చి.. తెలంగాణకు గుండు సున్నా మిగిల్చి కేంద్రం మరోసారి మొండి చెయ్యి చూపిందని శుక్రవారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. తెలంగాణ నుంచి 8 మంది బీజేపీ ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులున్నా.. రాష్ట్రానికి రూపాయి కూడా ఎందుకు సాధించలేకపోయారని నిలదీశారు. తెలంగాణకు హక్కుగా రావలసిన నిధుల కోసం పోరాటం చేయడంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు. లోక్‌సభలో బీఆర్‌ఎస్ ఉండి ఉంటే తెలంగాణకు అన్యాయం జరిగేది కాదని స్పష్టం చేశారు.

దక్షిణ డిస్కంలో భారీగా బదిలీలు, పదోన్నతులు

సాక్షి, హైదరాబాద్: దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్)లో భారీ సంఖ్యలో ఇంజనీర్లు, ఇతర కేడర్ ఉద్యోగులకు బదిలీలు, పదోన్నతులు కల్పించారు. ఈ మేరకు సంస్థ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మొత్తం 111 మంది డీఈలు, 263 మంది ఏడీఈలు, 521 మంది ఏఈలు, 231 మంది ఇతర కేడర్ ఉద్యోగులకు స్థానచలనం కలిగింది. ఉమ్మడి మహబూబ్‌నగర్, మెదక్, నల్లగొండ, రంగారెడ్డి, హైదరాబాద్ సర్కిల్ స్థాయిలో చాలామందికి పదోన్నతులు సైతం కల్పించారు. వెబ్ ఆధారిత పోర్టల్ ద్వారా ఆప్షన్స్ స్వీకరించి ఈ ప్రక్రియ నిర్వహించినట్టు సంస్థ యాజమాన్యం తెలిపింది.

జెన్‌కోలో పదోన్నతుల ప్రక్రియ..: తెలంగాణ విద్యుదుత్పత్తికి సంస్థ(జెన్‌కో)లో ఇంజనీర్లు, ఇతర ఓ అండ్ ఎం కేడర్ ఉద్యోగుల పదోన్నతులు, బదిలీలకు శుక్రవారం సంస్థ యాజమాన్యం కసరత్తు ముగించింది. సీఎండీ రోనాల్డ్ రోస్ ఆమోదించిన వెంటనే ఉత్తర్వులు జారీ కానున్నాయి.

సమీకృత గురుకులాలకు అంకురార్పణ

తొలిదశలో భాగంగా 28 స్కూళ్లకు శంకుస్థాపన

- కొందుర్గులో సీఎం రేవంత్, మధిరలో డిప్యూటీ సీఎం భూమిపూజ

సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ సౌకర్యాలతో, అత్యాధునిక డిజైన్లతో రాష్ట్రవ్యాప్తంగా నిర్మించ తలపెట్టిన యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాలలకు అంకురార్పణ జరిగింది. తొలిదశలో భాగంగా రాష్ట్రంలోని 28 నియోజకవర్గాల్లో 28 రెసిడెన్షియల్ పాఠశాలలకు శుక్రవారం శంకుస్థాపనలు జరిగాయి. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గంలోని కొందుర్గులో సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేయగా, ఇతర ప్రాంతాల్లో మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మధిర నియోజకవర్గంలోని బోనకల్లు మండలం గోవిందాపురంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలోని గంధంవారి గూడెంలో రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పెద్దపల్లి జిల్లా మంథని మండలం అడవిసోమన్‌పల్లిలో ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, హుస్నాబాద్ నియోజకవర్గంలోని కోహెడ మండలం తంగళ్లపల్లి, మానకొండూరు నియోజకవర్గం తిమ్మాపూర్ పరిధిలోని యాదవులపల్లిలో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఖమ్మం జిల్లా పొన్నేకల్‌లో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సమీకృత పాఠశాల భవనాలకు భూమిపూజ చేశారు. కొడంగల్, హుజూర్‌నగర్, ములుగు, పాలేరు, ఖమ్మం, వరంగల్, కొల్లాపూర్, ఆందోల్, చాంద్రాయణగుట్ట, మంచిర్యాల, భూపాలపల్లి, అచ్చంపేట, స్టేషన్‌ఘన్‌పూర్, తుంగతుర్తి, మునుగోడు, చెన్నూరు, జడ్చర్ల, పరకాల, నారాయణఖేడ్, దేవరకద్ర, నాగర్‌కర్నూల్, నర్సంపేటల్లో పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ పార్టీ నేతలు శంకుస్థాపనలు నిర్వహించారు. ఈ పాఠశాలల్లో విద్యాబోధన అంతర్జాతీయ ప్రమాణాలతో ఉంటుందని, ఒక్కో స్కూల్ కాంప్లెక్స్‌లో 2,560 మంది చదువుకునే అవకాశముందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ గురుకులాల్లో లైబ్రరీ, డిజిటల్ క్లాస్‌రూంలు, డైనింగ్ హాల్, డార్మిటరీ, బాత్‌రూమ్‌లు, విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకు నివాస సముదాయాలు, ఇండోర్, అవుట్‌డోర్ క్రీడా మైదానాలు, ఆడిటోరియం, హాస్పిటల్ తదితర సౌకర్యాలను ఏర్పాటు చేయనున్నారు. ఐదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఇక్కడ చదువుకోవచ్చు.

వెపన్‌తో వచ్చానని చెప్పండి..

ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి వివాదాస్పద వ్యాఖ్యలు



చెక్కుల పంపిణీ రసాభాసగా మారడంతో సర్దిచెబుతున్న పోలీసులు

ఆర్మూర్: 'వెపన్‌తో వచ్చానని హెచ్చరించండి'.. అంటూ బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి ప్రత్యర్థుల నుద్దేశించి ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డితో వ్యాఖ్యానించడం వివాదాస్పదమైంది. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో శుక్రవారం ఆర్మూర్, ఆలూర్ మండలాలకు కలిపి నిర్వహించిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం రసాభాసగా మారింది. పోలీసులు ముందు జాగ్రత్త చర్యగా కొందరిని ప్రాంగణంలోకి అనుమతించలేదు. కాంగ్రెస్ నేతలను అనుమతించి.. బీజేపీ నేతలను అడ్డుకుంటున్నారంటూ పార్టీ నేతలు ఎమ్మెల్యేకి ఫిర్యాదు చేశారు. వెంటనే ఆయన పోలీసులతో మాట్లాడి ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాజకీయాలు చేయొద్దని, అప్పటికీ వినకపోతే ఎమ్మెల్యే వెపన్‌తోనే వచ్చాడని చెప్పండి.. అంటూ సీఐతో అన్నారు. సభలో షాదీ ముబారక్ చెక్కులు బౌన్స్ అవుతున్నాయని మైనారిటీ నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఈ విషయం తనకు తెలియదని, అధికారులు తన దృష్టికి తీసుకువస్తే సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా వారి మధ్య మాటల యుద్ధం జరిగింది. నడిరోడ్డుపై 50 కేక్‌లు పెట్టి.. తల్వార్‌లతో కట్ చేస్తూ ఆర్మూర్‌ను ఓల్డ్ సిటీగా మారుస్తామంటే ఊరుకొనేది లేదని ఎమ్మెల్యే హెచ్చరించారు.

వాటిల్లో నీటి నిల్వ ప్రమాదకరం

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లపై రాష్ట్రానికి ఎన్డీఎస్‌ఏ స్పష్టీకరణ

- మూడు బరాజ్‌ల్లోనూ సికెంట్ పైల్ ఫౌండేషన్ నిర్మాణమే
- ఇప్పటికిప్పుడు నీటిని నిల్వ చేస్తే దిగువ ప్రాంతాలకు పెనుముప్పు అవకాశాలు
- తుది నివేదిక కోసం డిసెంబర్ వరకు ఆగండి



సాక్షి, న్యూఢిల్లీ: కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ సహా అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల్లో ఇప్పటికిప్పుడు నీటిని నిల్వ చేయడం ప్రమాదకరమని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్‌ఏ) రాష్ట్రానికి స్పష్టం చేసింది. ఈ మూడు బరాజ్‌ల్లోనూ సికెంట్ పైల్ ఫౌండేషన్ నిర్మాణం జరిగినందున నీటిని ఏమాత్రం నిలువచేసినా బరాజ్‌ల మనుగడకే ముప్పని వెల్లడించింది. ప్రస్తుతం దెబ్బతిన్న మేడిగడ్డ బరాజ్‌లో వినియోగించిన సాంకేతికతనే మిగతా బరాజ్‌ల్లోనూ వినియోగించినందున ప్రమాదాలకు ఆస్కారం ఉందని వివరించింది. రాష్ట్ర సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డితో పాటు ఈఎన్సీలు అనిల్, నాగేందర్‌రావు, సుధాకర్ రెడ్డిలు శుక్రవారం ఎన్డీఎస్‌ఏ చైర్మన్ అనిల్ జైన్ తో పాటు చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలోని ఎన్డీఎస్‌ఏ నిపుణుల కమిటీతో సమావేశమయ్యారు. బరాజ్‌లకు సంబంధించి ఎన్డీఎస్‌ఏ సమర్పించాల్సిన తుది నివేదికలపై చర్చించారు.

ప్రత్యామ్నాయ మార్గాలు సూచించండి: మంత్రి ఉత్తమ్



ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. మేడిగడ్డ బరాజ్ నుంచి నీటి ఎత్తిపోసే అవకాశం లేనందున, రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా మేడిగడ్డ మినహా ఇతర బరాజ్‌ల నుంచి ఎల్లంపల్లి, మిడ్ మానేరుకు నీటి ఎత్తిపోతలపై ప్రత్యామ్నాయ మార్గాలు సూచించాలని కోరారు. దీనిపై ఎన్డీఎస్‌ఏ అధికారులు స్పందిస్తూ.. మిగతా బరాజ్‌ల్లోనూ సికెంట్ పైల్ ఫౌండేషన్ సాంకేతికతనే వినియోగించినందున ప్రమాదాలకు అవకాశం ఉందని, దిగువన ఉన్న సమ్మక్క సారక్క బరాజ్ సహా భద్రాచలం ఆలయం వరకు పెను ప్రమాదం సంభవించే అవకాశాలు ఉన్నాయని స్పష్టం చేసినట్టు తెలిసింది. దీనిపై అన్ని అంశాలను విశ్లేషించి డిసెంబర్ లోగా తుది నివేదికను సమర్పిస్తామని, అప్పటిలోగా ఎలాంటి నీటి నిల్వ చేయొద్దని సూచించినట్టు సమాచారం. దీంతో తుది నివేదిక సత్వరమే వచ్చేలా చూడాలని ఉత్తమ్ విజ్ఞప్తి చేశారు. మధ్యంతర నివేదికలో చేసిన సిఫారసుల ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే బరాజ్‌లకు తాత్కాలిక మరమ్మతులు చేసిందని చెప్పారు.

ప్రభుత్వ చిత్తశుద్ధి భేష్: ఎన్డీఎస్‌ఏ

తాత్కాలికంగా కన్నెపల్లి పంప్ హౌస్ వద్ద చిన్న తరహా నిర్మాణాన్ని చేసుకుని రాష్ట్ర రబీ, తాగునీటి అవసరాలకు అక్కడి నుంచి నీటిని తరలించుకునే అవకాశాలు సూచించాలని మంత్రి ఉత్తమ్‌తో పాటు రాష్ట్ర అధికారులు కోరినట్టు తెలిసింది. లక్ష కోట్లతో చేపట్టిన ఈ ప్రాజెక్టును వీలైనంత త్వరగా వినియోగంలోకి తేవాలని ప్రభుత్వం దృఢ సంకల్పంతో ఉందని మంత్రి చెప్పినట్లు సమాచారం. దీనిపై ఎన్డీఎస్‌ఏ స్పందిస్తూ.. గతంలో బరాజ్ నిర్మాణ సంస్థతో పాటు ప్రభుత్వం ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ పూర్తిగా నిర్లక్ష్యం చేయడం కారణంగానే బరాజ్‌లను వినియోగించుకునే పరిస్థితి లేకుండా పోయిందని, తాము తుది అభిప్రాయం వెల్లడించే వరకు ఆగాల్సిందేనని స్పష్టం చేసినట్లు తెలిసింది. ప్రాజెక్టును వీలైనంత త్వరగా వినియోగంలోకి తెచ్చే విషయంలో మంత్రి, ప్రభుత్వ చిత్తశుద్ధిని అభినందించినట్లు సమాచారం.

ఎస్సీ వర్గీకరణకు ఏకసభ్య కమిషన్ ఏర్పాటు

- హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అక్తర్ నియామకం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలు కోసం క్షేత్రస్థాయిలో అధ్యయనం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసింది. రాష్ట్ర హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ షమీమ్ అక్తర్‌ను నియమించింది. రాష్ట్రంలో ఎస్సీ కులాల వర్గీకరణపై క్షేత్రస్థాయిలో అధ్యయనం చేయాలని, ఇందుకు రాష్ట్ర ప్రభుత్వ శాఖలు పూర్తిగా సహకరించి.. ఆయా శాఖల వద్ద ఉన్న నివేదికలు, వివరాలు సమర్పించాలని స్పష్టం చేసింది. అధ్యయన ప్రక్రియను 60 రోజుల్లో పూర్తి చేసి రాష్ట్ర ప్రభుత్వానికి సలహాలు, సూచనలతో కూడిన నివేదికను సమర్పించాలని కమిషన్‌కు సూచించింది. ఈ మేరకు రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీధర్ శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలు కోసం ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చైర్మన్‌గా ఉన్న ఈ ఉపసంఘం పలుమార్లు సమావేశమైన అనంతరం ఎస్సీ వర్గీకరణ కోసం ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వానికి సూచనలు చేసింది. దీనికి అనుగుణంగానే రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

13 నుంచి బీజేపీ సభ్యత్వ నమోదు స్పెషల్ డ్రైవ్

- టార్గెట్ 50 లక్షలు..ఇప్పటి వరకు అయ్యింది 20 లక్షల సభ్యత్వాలే
- సభ్యత్వ నమోదుపై సమీక్షించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: సభ్యత్వ నమోదుపై బీజేపీ ప్రత్యేక దృష్టి సారించింది. వాస్తవానికి ఈ నెల 15వ తేదీతో రాష్ట్రస్థాయిలో సభ్యత్వ నమోదు ముగించాల్సి ఉంది. సభ్యత్వ నమోదు టార్గెట్ 50 లక్షలు కాగా, శుక్రవారం నాటికి రాష్ట్రంలో 20 లక్షల మంది (5 లక్షల దాకా మిస్డ్‌కాల్‌తో నమోదు, అసంపూర్తి వివరాలు) పార్టీ సభ్యులుగా చేరినట్టుగా బీజేపీ వర్గాలు తెలిపాయి. ఈ సభ్యుల్లో 15 లక్షల మంది పూర్తి వివరాలు నమోదు చేయగా, మిగతా వారికి సంబంధించి పూర్తి సమాచారాన్ని క్రోడీకరించాల్సి ఉన్నట్టుగా తేలింది. దీంతో దసరా పండుగ తర్వాతి మూడురోజులు 'స్పెషల్ డ్రైవ్'పేరుతో సభ్యత్వ నమోదు ఉధృతంగా చేపట్టాలని బీజేపీ ముఖ్యనేతలు నిర్ణయించారు. ఈ డ్రైవ్‌లో భాగంగా రాష్ట్రంలోని 36 వేల పోలింగ్ బూత్‌లలో ఒక్కోదాంట్లో కనీసం వంద మంది సభ్యులను చేర్పించడం ద్వారా మరో పది లక్షలకు చేరే అవకాశాలున్నాయని అంచనా వేస్తున్నారు. ఈ నెల 15 తర్వాత వంద మంది సభ్యులను చేర్పించిన వారితో క్రియాశీల సభ్యత్వాలు నమోదు చేస్తారు. క్రియాశీల సభ్యులుగా ఉన్నవారే పార్టీ బూత్, మండల, జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకునే అవకాశం ఉంటుంది. నవంబర్ 15 నాటికి 'యాక్టివ్ మెంబర్‌షిప్'పూర్తయ్యాక, ఆ తర్వాత బూత్ కమిటీల ఎన్నిక, ఆపై మండల అధ్యక్షులు, మళ్లీ వారు జిల్లా అధ్యక్షులను, ఆ తర్వాత వారంతా రాష్ట్ర అధ్యక్షుడిని ఎన్నుకుంటారు. మొన్నటి పార్లమెంట్ ఎన్నికల్లో 17 ఎంపీ సీట్లలో పోటీ చేసిన బీజేపీ అభ్యర్థులకు 77 లక్షల మంది ఓటు వేయగా, ఈ ఓట్లలో 75 శాతం అంటే 50 లక్షల దాకానైనా సభ్యులుగా చేర్పించేలా ప్రయత్నించాలని బీజేపీ హైకమాండ్ టార్గెట్ పెట్టింది. సభ్యత్వ నమోదు జరుగుతున్న తీరుపై శుక్రవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, తెలంగాణ సభ్యత్వ ఇన్‌చార్జ్ అభయ్ పాటిల్, రాష్ట్ర పార్టీ సభ్యత్వ కార్యక్రమ కన్వీనర్ ఎన్.రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మహారథోత్సవం

- రాత్రి అశ్వవాహనంపై విహరించిన ఆనందనిలయుడు
- నేడు చక్రస్నానం



రథోత్సవంలో భక్తజనం

తిరుమల: తిరుమలేశుని బ్రహ్మోత్సవాల్లో ఎనిమిదో రోజు శుక్రవారం శ్రీవేంకటేశ్వర స్వామి మహారథం (తేరు)పై భక్తులను అనుగ్రహించాడు. ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఈ రథోత్సవం వేడుకగా సాగింది. అనంతరం సుమారు గంట పాటు పండితులు నిర్వహించిన వేదగోష్ఠితో తిరుమల సప్తగిరులు పులకించాయి. టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, జేఈవో వీరబ్రహ్మం రథాన్ని లాగారు.

అశ్వవాహనంపై ఆనంద నిలయుడి దర్శనం

రాత్రి మలయప్ప స్వామి అశ్వ వాహనంపై భక్తులను పరవశింపజేశారు. బంగారు, వజ్ర, వైఢూర్య ఆభరణాలు, విశేష పుష్పాలంకరణానంతరం స్వామి వారు ఆలయ నాలుగు మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. బ్రహ్మరథం, గజ, అశ్వ, తురగ, చతురంగ బలాలు ముందుకు సాగగా జానపద కళాకారులు, భజన బృందాలు సాంస్కృతిక కార్యక్రమాల మధ్య వాహన సేవ అత్యంత వైభవంగా జరిగింది.

నేడు చక్రస్నానం

శనివారం ఉదయం 3 గంటల నుంచి పల్లకీ ఉత్సవం, తిరుచ్చి ఉత్సవం, అనంతరం స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. ఇది ముగిసాక శ్రీవారి శంఖు, చక్రాలను పుష్కర జలాల్లో ముంచి లేపుతారు. ఈ కార్యక్రమం ఉదయం 3 నుంచి ప్రారంభమై 9 గంటలకు ముగుస్తుంది. రాత్రి 9 నుంచి 10 గంటల మధ్యలో ధ్వజావరోహణం నిర్వహిస్తారు. దీంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

ముందు ఎంజీబీఎస్, మెట్రో పిల్లర్లు కూల్చండి

▶ మొదటి పేజీ తరువాయి

బీఆర్ఎస్ నేతలెవరూ టచ్‌లో లేరని స్పష్టం చేశారు. తెలంగాణను లూటీ చేసిన ఆ పార్టీతో ఎలాంటి రాజీ లేదని, ఆ పార్టీ అవినీతిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. వికారాబాద్ జిల్లా దామగుండంలో నేవీ రాడార్ స్టేషన్ ఏర్పాటుతో పర్యావరణానికి ఎలాంటి నష్టం జరగదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఎలాంటి ప్రాజెక్ట్ పెట్టదని, అక్కడ ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు.

హైడ్రా, మూసీపై నేను చెప్పేదే పార్టీ పాలసీ..

'హైడ్రా ద్వారా దుందుడుకు చర్యలు తీసుకోవడం సరికాదు. హైడ్రా అనేది రేవంత్‌రెడ్డి పెట్టుకున్న పేరు. అక్రమ నిర్మాణాల కూల్చివేతలకు జీహెచ్ఎంసీలో ఓ వ్యవస్థ ఉంది. హైడ్రా వెనుక సీఎం రేవంత్‌రెడ్డికి వేరే ఉద్దేశాలు ఉన్నాయి'అని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. బీజేపీలో హైడ్రాపై భిన్నస్వరాలు వినిపించడంపై ఏమంటారని ఓ విలేకరి ప్రశ్నించగా.. 'పేదల ఇళ్లు కూల్చమని మా ఎంపీ, ఎమ్మెల్యేలు ఎవరైనా చెప్పారా'అని కిషన్‌రెడ్డి తిరిగి ప్రశ్నించారు. హైడ్రా, మూసీపై తాను చెప్పేదే పార్టీ పాలసీ అని స్పష్టంచేశారు.

ఉగ్రవాదాన్ని ఉపేక్షించం

జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదాన్ని ఉపేక్షించమని కిషన్‌రెడ్డి చెప్పారు. దేశంలోని ఏ రాష్ట్రంలోనైనా శాంతిభద్రతలు క్షీణిస్తే కేంద్రం జోక్యానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ విషయంలో కేంద్రం కఠినంగా వ్యవహరిస్తుందని తెలిపారు. 'కశ్మీర్‌లో బీజేపీ వంద శాతం లక్ష్యం చేరుకుంది. అంతర్జాతీయంగా పాకిస్తాన్‌ను ఏకాకి చేయగలిగాం. భారత్‌కు వ్యతిరేకం కాబట్టి ఆ దేశానికి చైనా అన్నిరకాలుగా సహాయపడుతోంది'అని తెలిపారు. ఆర్టికల్ 370 పునరుద్ధరణ అసాధ్యమని, అది ముగిసిన అధ్యాయమని అన్నారు. జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా కల్పనపై తగిన సమయంలో కేంద్రం నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు.

మావోయిస్టు ఏరియా కమిటీ సభ్యుడు అరెస్టు

- ఐదు కిలోల మందుపాతర అమర్చేందుకు వచ్చి పట్టుబడిన కోసయ్య
- కోసయ్యపై 50 కేసులు.. రూ.4 లక్షల రివార్డు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ రోహిత్‌రాజు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెంటౌన్: నిషేధిత మావోయిస్టు పార్టీకి చెందిన బీకే – ఏఎస్ఆర్ డివిజన్ ఏరియా కమిటీ సభ్యుడు మడకం కోసయ్య అలియాస్ సుక్రామ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు.ఆయనపై రూ.4 లక్షల రివార్డు ఉండగా... భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల, 141 బెటాలియన్ పోలీసుల తనిఖీల్లో పట్టుబడగా అరెస్ట్ ప్రకటించారు. ఈ మేరకు వివరాలను కొత్తగూడెంలో ఎస్పీ రోహిత్‌రాజ్ శుక్రవారం వెల్లడించారు.

2018లో మావోయిస్టుల్లోకి..

చర్ల పోలీసుస్టేషన్ పరిధి పుసుగుప్ప–చర్ల మార్గంలో శుక్రవారం పోలీసులు తనిఖీ చేస్తుండగా ఓ వ్యక్తి పారిపోయేందుకు యత్నించాడు. దీంతో ఆయనను వెంబడించి పట్టుకుని విచారించగా చర్ల మండలం కొండవాయికి చెందిన మడకం కోసయ్యగా తేలింది. ఆయన నుంచి ఐదు కేజీల బరువైన ల్యాండ్‌మైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో దామోదర్, ఆజాద్, చంద్రన్న ఆదేశాలతో భద్రతాదళాలపై ప్రతీకారం తీర్చుకునేందుకు చర్ల–పుసుగుప్ప మధ్య లెనిన్‌కాలనీ శివారులో కల్వర్టు కింద మందుపాతర అమర్చేందుకు వచ్చి పట్టుబడ్డాడని ఎస్పీ తెలిపారు. ఆయన వెంట ఉన్న మరో వ్యక్తి పరారయ్యాడని వెల్లడించారు. మావోయిస్టు పార్టీ చర్ల మిలీషియా కమాండర్ సోడి జోగయ్య సమక్షంలో కోసయ్య 2018లో చేరాడు. ఈ ఏడాది జనవరిలో మావోయిస్టు అగ్ర నాయకులతో కలసి ధర్మారం సమీపాన చింతవాగు పక్కన నూతనంగా నిర్మిస్తున్న సీఆర్‌పీఎఫ్ క్యాంపును చుట్టుముట్టి కాల్పులు జరిపిన ఘటనతో సహా కోసయ్యపై 50 కేసులున్నాయని ఎస్పీ వివరించారు.

ఎవరైనా కర్మ ఆచరించక ఒక్క క్షణం కూడా ఊరక ఉండలేరు. ప్రకృతి జనితములైన గుణములకు చిక్కినవారై, కర్మములు వశులై పనులు చేయుచుందురు.

– హిందూ ధర్మం

వినబడలేదా ప్రమాద ఘంటిక?

జనతంత్రం



వర్ధెల్లి మురళి



భారతదేశంలో తొలితరం సెఫాలజిస్టుల్లో అగ్రగణ్యుడు ప్రణయ్‌రాయ్. తొలి 24 గంటల జాతీయ ఛానల్ (ఎన్‌డీటీవీ) వ్యవస్థాపకుడు కూడా ఆయనే! ఇప్పుడా ఛానల్ ఆయన చేతిలో లేదు. నరేంద్ర మోదీ జిగ్రీ దోస్త్ ఆధీనంలో ఉన్నది. ఎందుకలా జరిగిందో విజ్ఞులైన దేశవాసులందరికీ తెలుసు. సొంత ఛానల్ లేదు కనుక ఓ వెబ్ ఛానల్ కోసం మొన్నటి హరియాణా, జమ్ము–కశ్మీర్ ఫలితాలను ఆయన విశ్లేషించారు.

హరియాణాలో విజేతగా అవతరించిన బీజేపీకి కాంగ్రెస్ కంటే కేవలం పాయింట్ ఆరు శాతం (0.6) ఓట్లు మాత్రమే ఎక్కువ వచ్చాయి. కానీ సీట్లు మాత్రం 30 శాతం ఎక్కు వొచ్చాయి. ఇది తన సెఫాలజిస్టు అనుభవంలో ఒక అసాధారణ విషయంగా ఆయన ప్రకటించారు. అయితే ఈ ఫలితాన్ని సాధారణ మెజారిటీ ఎన్నికల విధానానికి (first-past-the-post system) ఆయన ఆపాదించారు. ఉత్తర అమెరికా, దక్షిణాసియా, తూర్పు ఆఫ్రికాల్లోని కొన్ని దేశాల్లో మాత్రమే ఈ విధానం అమల్లో ఉన్నది. ఈ అంశం ఇక్కడ చర్చనీయాంశం కాదు. ప్రణయ్‌రాయ్ వ్యాఖ్యానంలో నర్మగర్భత ఏమైనా ఉన్నదా అనేదే ఆసక్తికరమైన మీమాంస.

సెంట్రల్ హరియాణాలో బీజేపీ కంటే కాంగ్రెస్‌కు ఐదు శాతం ఎక్కువ ఓట్లు వచ్చాయి. కానీ సీట్లు మాత్రం చెరో ఇరవై చొప్పున వచ్చాయి. ఉత్తర, దక్షిణ ప్రాంతాల్లో బీజేపీకి కాంగ్రెస్ కంటే ఐదు శాతం ఓట్ల ఆధిక్యత లభించింది. ఆ తేడాతో వారు 28 సీట్లు గెలిస్తే కాంగ్రెస్ మాత్రం 11 సీట్లకే పరిమితమైంది. 2019 లోక్‌సభ ఎన్నికలతో పోలిస్తే మొన్నటి లోక్‌సభ ఎన్నికల నాటికి హరియాణాలో బీజేపీకే రమారమి 12 శాతం ఓట్లు తగ్గాయి. ఆ ఎన్నికల తర్వాత కూడా ఈ డౌన్ ట్రెండ్ కొనసాగింది. అసెంబ్లీ ఎన్నికల్లో లోక్‌సభ (2024) ఎన్నికల కంటే మరో 6.2 శాతం ఓట్లను బీజేపీ కోల్పోయింది. ఈ రకమైన గాలి వీస్తున్నప్పుడు అది కొన్ని ప్రాంతాలకే పరిమితం కావడం అసాధ్యం. పైగా హరియాణా వంటి భౌగోళికంగా చిన్న రాష్ట్రాల్లో అది అసంభవం.

కాంగ్రెస్ పార్టీ గెలిచిన సీట్లలో మంచి మెజారిటీలు వచ్చాయి. దాదాపు డజన్ సీట్లలో బీజేపీకి అతి స్వల్ప మెజారిటీలు వచ్చాయి. ఫిరోజ్‌పూర్‌లో కాంగ్రెస్ అభ్యర్థికి అత్యధికంగా 98 వేల మెజారిటీ వస్తే అత్యల్పంగా కేవలం 32 ఓట్ల తేడాతో బీజేపీ అభ్యర్థి దేవేందర్ చతుర్భుజ్ గెలిచాడు. ఈ గణాంకాలు ఏరకమైన ట్రెండ్‌ను సూచిస్తున్నాయో అర్థం చేసుకోవడం పెద్ద కష్టం కాదు. నూటికి నూరు శాతం ఎగ్జిట్ పోల్స్ కూడా కాంగ్రెస్ గెలుపునే సూచించాయి. వాటి అంచనాల సగటు ప్రకారం కాంగ్రెస్ 55 చోట్ల, బీజేపీ 27 చోట్ల గెలవాలి. ఈ అంచనాలు తప్పడం వెనుక ఎంపిక చేసిన కొన్ని నియోజకవర్గాల్లో ఈవీఎంల హ్యాకింగ్ జరిగిందని కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నారు.

ఈవీఎమ్‌లను హ్యాక్ చేయడమనే ఆరోపణ కొత్తదేమీ కాదు. 2019లో తొలిదశ పోలింగ్ ముగిసిన తర్వాత అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ఇదే ఆరోపణ చేశారు. ఢిల్లీలో ప్రతిపక్ష నాయకులతో కలిసి మీడియాను అడ్రస్ చేస్తూ ఈవీఎమ్‌లను హ్యాక్ చేయడం సాధ్యమైన పనేనని ఆయన వెల్లడించారు. ఎలా చేయవచ్చో మీడియాకు వివరిస్తూ ఆయన అనుచరుడు వేమూరి హరిప్రసాద్ మరో సందర్భంలో ఒక ఈవీఎమ్‌ను ప్రదర్శించి చూపెట్టారు. హరిప్రసాద్ ఈవీఎమ్‌ను ఎత్తుకొచ్చాడని ఆయనపై కేసు కూడా నమోదైంది. చంద్రబాబు మరో అడుగు ముందుకు వేసి మన ఈవీఎమ్‌ల హ్యాకింగ్‌లో రష్యన్ హ్యాకర్ల పాత్ర ఉన్నదని కూడా సెలవిచ్చారు. ముంబైలో జరిగిన మీడియా సమావేశంలో సుశీల్‌కుమార్ షిండే, శరద్ పవార్‌ల సమక్షంలోనే ఆయన ఈ ఆరోపణ చేశారు.

> హరియాణాలోని పలు పోలింగ్ కేంద్రాల్లో తాము ఎంత విజ్ఞప్తి చేసినా వీవీ ప్యాట్ స్లిప్పులను లెక్కించలేదని కాంగ్రెస్ పార్టీ ఆరోపిస్తున్నది. ఎన్నికల సంఘానికి మొత్తం 20 ఫిర్యాదులను ఆ పార్టీ బృందం అందజేసింది. పోస్టల్ బ్యాలెట్లు లెక్కించినప్పుడు 65 చోట్ల ఆధిక్యతలో ఉన్న పార్టీ ఈవీఎమ్‌ల లెక్కింపులో 37 స్థానాలకు ఎలా పడిపోయిందని మాజీ సీఎం భూపిందర్ సింగ్ హుడా ప్రశ్నించారు. పోలింగ్ ముగిసినా కూడా ఈవీఎమ్‌ల బ్యాటరీలు కొన్నిచోట్ల 99 శాతం ఛార్జింగ్‌తో ఉన్నాయని రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు ఆరోపించారు. ఈవీఎమ్‌లు 90 శాతానికి పైగా బ్యాటరీ ఛార్జింగ్‌తో ఉన్న ప్రతిచోటా బీజేపీ గెలిచిందనీ, 60 నుంచి 70 శాతానికి ఛార్జింగ్ పడిపోయిన ప్రాంతాల్లో కాంగ్రెస్ గెలిచిందని ఆ పార్టీ ఆధారాలతో సహా ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. ఈ ఆధారాలతోనే ఎంపిక చేసిన కొన్ని నియోజకవర్గాల్లో ఈవీఎమ్‌ల హ్యాకింగ్ జరిగిందని కాంగ్రెస్ ఆరోపిస్తున్నది.
>
> హరియాణా ఎన్నికల తర్వాతనే కాంగ్రెస్ పార్టీకి జ్ఞానోదయం కలిగినట్టున్నది. కానీ ఏప్రిల్, మే మాసాల్లో జరిగిన లోక్‌సభ ఎన్నికలే పెద్ద ప్రహసనంలా జరిగాయని కొన్ని స్వతంత్ర సంస్థలు నెత్తీనోరూ బాదుకొని గత మూడు నెలలుగా ఘోషిస్తున్నా ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ కిమ్మన్నాస్తిగా మిన్నకుండిపోయింది. స్వచ్ఛంద సంస్థలైన 'వోట్ ఫర్ డెమోక్రసీ' (వీఎఫ్‌డీ), 'అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్' (ఏడీఆర్) వంటి సంస్థలు ఎన్నికల ఫార్సును విడమర్చి చెప్పాయి. దేశవ్యాప్తంగా అన్ని లోక్‌సభ నియోజకవర్గాలపై సమగ్ర పరిశీలన చేసిన వీఎఫ్‌డీ 200కు పైగా పేజీలతో ఒక రిపోర్టును విడుదల చేసింది. ఈ ఎన్నికల తతంగంపై ఒక షాకింగ్ పరిశీలనను అది దేశం ముందుకు తెచ్చింది.

ఈవీఎమ్‌ల హ్యాకింగ్ ఎలా చేయవచ్చో ఆయనకు ఐదేళ్ల కిందటే తెలుసనుకోవాలి. అంతేకాదు, ఈ హ్యాకింగ్ చేసి పెట్టే కిరాయి మనుషులెవరో, వారు ఏ దేశాల్లో ఉంటారో కూడా ఆయనకు అప్పటికే తెలుసు. హరియాణాలో అటూ ఇటుగా పదిహేను నియోజకవర్గాల్లో ఈవీఎమ్‌ల హ్యాకింగ్ జరిగిందని కాంగ్రెస్ పార్టీ బలంగా నమ్ముతున్నది. ఈమేరకు ఆ పార్టీ ప్రతినిధి బృందం గురువారం నాడు ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు కూడా చేసింది. ఈ తతంగంపై సిటింగ్ జడ్జి చేత విచారణ జరిపించాలని ఆ పార్టీ డిమాండ్ చేస్తున్నది.

పలు పోలింగ్ కేంద్రాల్లో తాము ఎంత విజ్ఞప్తి చేసినా వీవీ ప్యాట్ స్లిప్పులను లెక్కించలేదని కాంగ్రెస్ పార్టీ ఆరోపిస్తున్నది. ఎన్నికల సంఘానికి మొత్తం 20 ఫిర్యాదులను ఆ పార్టీ బృందం అందజేసింది. పోస్టల్ బ్యాలెట్లు లెక్కించినప్పుడు 65 చోట్ల ఆధిక్యతలో ఉన్న పార్టీ ఈవీఎమ్‌ల లెక్కింపులో 37 స్థానాలకు ఎలా పడిపోయిందని మాజీ ముఖ్యమంత్రి భూపిందర్ సింగ్ హుడా ప్రశ్నించారు. పోలింగ్ ముగిసినా కూడా ఈవీఎమ్‌ల బ్యాటరీలు కొన్నిచోట్ల 99 శాతం ఛార్జింగ్‌తో ఉన్నాయని రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు ఆరోపించారు. ఈవీఎమ్‌లు 90 శాతానికి పైగా బ్యాటరీ ఛార్జింగ్‌తో ఉన్న ప్రతిచోటా బీజేపీ గెలిచిందనీ, 60 నుంచి 70 శాతానికి ఛార్జింగ్ పడిపోయిన ప్రాంతాల్లో కాంగ్రెస్ గెలిచిందని ఆ పార్టీ ఆధారాలతో సహా ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. ఈ ఆధారాలతోనే ఎంపిక చేసిన కొన్ని నియోజకవర్గాల్లో ఈవీఎమ్‌ల హ్యాకింగ్ జరిగిందని కాంగ్రెస్ ఆరోపిస్తున్నది.

హరియాణా ఎన్నికల తర్వాతనే కాంగ్రెస్ పార్టీకి జ్ఞానోదయం కలిగినట్టున్నది. కానీ ఏప్రిల్, మే మాసాల్లో జరిగిన లోక్‌సభ ఎన్నికలే పెద్ద ప్రహసనంలా జరిగాయని కొన్ని స్వతంత్ర సంస్థలు నెత్తీనోరూ బాదుకొని గత మూడు నెలలుగా ఘోషిస్తున్నా ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ కిమ్మన్నాస్తిగా మిన్నకుండిపోయింది. స్వచ్ఛంద సంస్థలైన 'వోట్ ఫర్ డెమోక్రసీ' (వీఎఫ్‌డీ), 'అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్' (ఏడీఆర్) వంటి సంస్థలు ఎన్నికల ఫార్సును విడమర్చి చెప్పాయి. దేశవ్యాప్తంగా అన్ని లోక్‌సభ నియోజకవర్గాలపై సమగ్ర పరిశీలన చేసిన వీఎఫ్‌డీ 200కు పైగా పేజీలతో ఒక రిపోర్టును విడుదల చేసింది. ఈ ఎన్నికల తతంగంపై ఒక షాకింగ్ పరిశీలనను అది దేశం ముందుకు తెచ్చింది.

ఎప్పుడు ఎన్నికలు జరిగినా సాయంత్రం 5 గంటలకో, 6 గంటలకో పోలింగ్ సమయం ముగియగానే పోలింగ్ శాతంపై ఎన్నికల సంఘం ఒక ప్రకటన విడుదల చేస్తుంది. తర్వాత పూర్తి వివరాలను క్రోడీకరించి రాత్రి 8 లేదా 9 గంటలకల్లా తుది గణాంకాలను విడుదల చేస్తుంది. పోలింగ్ శాతంపై ఇదే ఫైనల్! అరుదుగా మాత్రం మరుసటిరోజున సవరించిన శాతాన్ని ప్రకటిస్తుంది. ఈ సవరణ గతంలో ఎన్నడూ కూడా ఒక శాతం ఓట్ల పెరుగుదల లేదా తరుగుదలను దాటలేదని వీఎఫ్‌డీ ప్రకటించింది. కానీ ఈసారి మాత్రం ఎన్నికల శాతంపై వెలువడిన తుది ప్రకటనలను సవరిస్తూ వారం రోజుల తర్వాత ఎన్నికల సంఘం పోలింగ్ శాతాలను విడుదల చేసింది. ఈ సవరణకు ఇంత సమయం తీసుకోవడమే అసాధారణ విషయమైతే, పెరిగినట్లు చెప్పిన పోలింగ్ శాతాలు మరింత అసాధారణం.

ఏడు దశల్లో జరిగిన పోలింగ్‌లో 3.2 శాతం నుంచి 6.32 శాతం వరకు పెరిగినట్లు ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్‌లోనైతే ఈ పెరిగిన ఓట్లు 12.54 శాతం. ఒడిషాలో 12.48 శాతం. ఆంధ్రప్రదేశ్‌లో పోలింగ్ ముగిసిన రాత్రి చేసిన తుది ప్రకటన ప్రకారం 68 శాతం ఓట్లు పోలయ్యాయి. వారం రోజుల తర్వాత దాన్ని 81 శాతంగా ఈసీ ప్రకటించింది. ఈ భూప్రపంచంలో ఎక్కడైనా ఇలా జరుగుతుందా? జరగదు కనుకనే ఈ 'పెరిగిన' ఓట్లను డంపింగ్ ఓట్లుగా వీఎఫ్‌డీ అభివర్ణించింది. డంపింగ్ ఓట్లు లేనట్లయితే అధికార ఎన్డీఏ కూటమి 79 లోక్‌సభ సీట్లను కోల్పోయి ఉండేదని లెక్క కట్టింది. దేశవ్యాప్తంగా ఈ డంపింగ్ ఓట్లు 4 కోట్ల 65 లక్షలయితే ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే అవి 49 లక్షల పైచిలుకున్నట్టు వీఎఫ్‌డీ తేల్చింది.

ఈవీఎమ్‌లను హ్యాకింగ్ చేయడం, లేదా ట్యాంపరింగ్ చేయడం ఎలానో బాగా తెలిసిన వ్యక్తి, ఆ పనులు చేసే నిపుణులు ఏయే దేశాల్లో ఉంటారో ఆనుపానులు తెలిసిన వ్యక్తి ఏపీలో కూటమి నేతగా ఉన్నందువల్ల మిగతా రాష్ట్రాలకు భిన్నంగా విస్తృత స్థాయిలో ఈవీఎమ్‌ల ట్యాంపరింగ్ లేదా హ్యాకింగ్ జరిగి ఉండొచ్చని ఒక అభిప్రాయం. వ్యూహాత్మకంగా ఎంపిక చేసిన కొన్ని ప్రాంతాల్లో మాత్రమే ట్యాంపరింగ్ జరిగినట్లయితే పెద్దగా అనుమానాలు రాకుండానే బయటపడిపోవచ్చు. మొదటి మూడు దశల పోలింగ్‌లో ఈ మార్గాన్నే అనుసరించినట్టు వీఎఫ్‌డీ నివేదిక ద్వారా అర్థమవుతున్నది. కానీ, ఆ తర్వాత టార్గెట్‌పై అనుమానం రావడంతో నాలుగో దశలో ఉన్న ఏపీలో 'నిపుణుడైన' చంద్రబాబు సహకారంతో ఏపీతోపాటు ఒడిషాలో కూడా ఈవీఎమ్‌ల ఆపరేషన్‌ను విస్తృతంగా చేసి ఉండవచ్చు. ఇందుకు పూర్వరంగంలో కూటమి నేతల కోరిక మేరకు అధికార యంత్రాంగంలో భారీ మార్పులు చేసి ఎన్నికల సంఘం సహకరించింది.

వీఎఫ్‌డీ నివేదిక ఆధారంగా ఏడీఆర్ ప్రెస్‌మీట్ పెట్టి అనేక కీలక ప్రశ్నలను సంధించింది. ఈ సంస్థల సందేహాలకు ఇప్పటివరకూ స్పందించకుండా ఉండిపోవడం ఒక రాజ్యాంగబద్ధ సంస్థకు గౌరవప్రదమేనా? ఈవిధంగా ఎన్నికల సంఘాన్ని దొడ్లో కట్టేసుకొని వోటింగ్ యంత్రాలతో మాయాజూదం గెలవడానికి అలవాటు పడితే ఇక ముందు అధికార పార్టీ ఓడిపోవడం జరిగే పనేనా? ఈ ధోరణి నియంతృత్వానికి దారి తీయదా? ...అటువంటి నిరంకుశ అధికారులనే బీజేపీ అధినాయత్వం కోరుకుంటుండవచ్చు. దాని రహస్య ఎజెండాను అమలు చేయడానికి ఇప్పుడున్న పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, దాన్ని ప్రసాదించిన భారత రాజ్యాంగం అడ్డంకిగా ఉన్న సంగతి జగద్విదితం. వీటిని మార్చడానికి ఇప్పుడున్న బలం సరిపోదు. అందుకే జమిలి ఎన్నికల నినాదాన్ని బలంగా ముందుకు తోస్తున్నారు.

ఇంకో ఏడాదిన్నరలోగా నియోజకవర్గాల పునర్విభజనను ముగించి రెండేళ్లలోగా జమిలి ఎన్నికలు జరపాలనే ఆలోచన ఢిల్లీ అధికార వర్గాల్లో ఉన్నట్టు సమాచారం. ఇతర పార్టీల సహకారానికి సామ దాన భేద దండోపాయ వ్యూహాన్ని రచిస్తున్నట్టు తెలుస్తున్నది. ఈవీఎమ్‌ల సహకారంతో ఒక్కసారి జమిలి ఎన్నికల్లో గట్టెక్కితే అది చాలు. భవిష్యత్తు అధ్యక్ష తరహా పాలనకు అదే తొలిమెట్టని అధికార పరివారం ఆలోచన. ఇక దాని వెన్నంటే ఆ పరివారం రహస్య ఎజెండా ముందుకు వస్తుంది. అప్పుడిక మనం ఏం తినాలి? ఏం చదవాలి? ఏం రాయాలి? ఏం ఆలోచించాలి? ఏం చేయాలి? ఏం చేయకూడదు? వగైరా దైనందిన జీవితాన్ని గైడ్ చేయడం కోసం వీధివీధిన మోరల్ పోలీసింగ్‌ను ఎదుర్కోవలసి రావచ్చు.

> ఈ విధంగా ఎన్నికల సంఘాన్ని దొడ్లో కట్టేసుకొని వోటింగ్ యంత్రాలతో మాయాజూదం గెలవడానికి అలవాటు పడితే ఇక ముందు అధికార పార్టీ ఓడిపోవడం జరిగే పనేనా? ఈ ధోరణి నియంతృత్వానికి దారి తీయదా? ...అటువంటి నిరంకుశ అధికారులనే బీజేపీ అధినాయత్వం కోరుకుంటుండవచ్చు. దాని రహస్య ఎజెండాను అమలు చేయడానికి ఇప్పుడున్న పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, దాన్ని ప్రసాదించిన భారత రాజ్యాంగం అడ్డంకిగా ఉన్న సంగతి జగద్విదితం. వీటిని మార్చడానికి ఇప్పుడున్న బలం సరిపోదు. అందుకే జమిలి ఎన్నికల నినాదాన్ని బలంగా ముందుకు తోస్తున్నారు.
>
> ఇంకో ఏడాదిన్నరలోగా నియోజకవర్గాల పునర్విభజనను ముగించి రెండేళ్లలోగా జమిలి ఎన్నికలు జరపాలనే ఆలోచన ఢిల్లీ అధికార వర్గాల్లో ఉన్నట్టు సమాచారం. ఇతర పార్టీల సహకారానికి సామ దాన భేద దండోపాయ వ్యూహాన్ని రచిస్తున్నట్టు తెలుస్తున్నది. ఈవీఎమ్‌ల సహకారంతో ఒక్కసారి జమిలి ఎన్నికల్లో గట్టెక్కితే అది చాలు. భవిష్యత్తు అధ్యక్ష తరహా పాలనకు అదే తొలిమెట్టని అధికార పరివారం ఆలోచన. ఇక దాని వెన్నంటే ఆ పరివారం రహస్య ఎజెండా ముందుకు వస్తుంది. అప్పుడిక మనం ఏం తినాలి? ఏం చదవాలి? ఏం రాయాలి? ఏం ఆలోచించాలి? ఏం చేయాలి? ఏం చేయకూడదు? వగైరా దైనందిన జీవితాన్ని గైడ్ చేయడం కోసం వీధివీధిన మోరల్ పోలీసింగ్‌ను ఎదుర్కోవలసి రావచ్చు.

తొంభయ్యేళ్ల పోరాట ఫలితం మన స్వాతంత్ర్యం. లక్షలాదిమంది త్యాగధనుల బలిదానం మన స్వాతంత్ర్యం. అటువంటి స్వాతంత్ర్యం ఈ దేశంలో పుట్టబోయే ప్రతి బిడ్డనూ సాధికార శక్తిగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో మన తొలి తరం జాతీయ నేతలు ఒక ప్రజాస్వామ్య రాజ్యాంగాన్ని మనకు ప్రసాదించారు. స్వాతంత్ర్య పోరాట వారసత్వం లేని శక్తులు ఇప్పుడు మత విద్వేషాలతో, మాయోపాయాలతో ఆ ప్రజాస్వామ్య వ్యవస్థను కబళించాలని చూస్తే మిన్నకుండటం ఆత్మహత్యా సదృశం.

ఏమాత్రం పారదర్శకత లేని, ఎంతమాత్రం జవాబుదారీతనం లేని 'ఈవీఎమ్ ఎలక్షన్' స్థానంలో ప్రపంచ వ్యాప్తంగా విశ్వాసం చూరగొన్న 'బ్యాలెట్ పద్ధతి'ని మళ్లీ తెచ్చుకోవడం ప్రజాస్వామ్య ప్రియుల కర్తవ్యం. అభివృద్ధి చెందిన అన్ని దేశాల్లో, జనాభా సంపూర్ణంగా విద్యావంతులైన ప్రతి దేశంలోనూ బ్యాలెట్ పత్రాల ఓటింగ్ పద్ధతి మాత్రమే అమలులో ఉన్నది. ప్రస్తుతం భారత్‌తోపాటు వెనిజులా, ఫిలిప్పీన్స్, శ్రీలంక వగైరా నాలుగైదు దేశాల్లోనే సంపూర్ణంగా ఈవీఎమ్‌లను ఉపయోగిస్తున్నారు. బ్రెజిల్, మెక్సికో, పాకిస్తాన్ వంటి దేశాల్లో పాక్షికంగా ఉపయోగిస్తున్నారు. ఇవన్నీ కలిపినా ఇరవై కంటే ఎక్కువ దేశాలు లేవు. జర్మనీలో ఈవీఎమ్‌ల వినియోగాన్ని ఆ దేశ న్యాయస్థానం రద్దు చేసింది. ఈ విధానంలో పారదర్శకత లేదని కోర్టు అభిప్రాయపడింది. నెదర్లాండ్స్, ఐర్లండ్, కెనడా వగైరా దేశాలు కొంతకాలం ఈవీఎమ్‌లను ఉపయోగించిన తర్వాత ఇందులో విశ్వసనీయత లేదనే నిర్ధారణకు వచ్చి రద్దు చేసుకున్నాయి. ఇప్పుడు అదే బాటలో పయనించవలసిన అవసరం సెక్యులర్, సోషలిస్టు భారత రిపబ్లిక్‌కు ఉన్నది. లేకపోతే ఈవీఎమ్‌ల బాటలోనే పయనిస్తే మనకు తెలియని మరో భారత్‌లో మనం ప్రవేశించవలసి రావచ్చు.

vardhelli1959@gmail.com

భారతీయ జీవన దర్శిని

హైందవాన్ని ఒక మతంగా కాక ఒక జీవన విధానంగా, భారత ప్రజలను భారతమాత రూపంగా భావించి, భారతదేశాన్ని తమ మాతృభూమిగా భావించే ప్రజల ప్రయోజనాలను రక్షించటం ఆశయంగా డాక్టర్ కేశవ బలిరాం హెడ్గేవార్ (డాక్టర్ జీ) 1925లో విజయ దశమి రోజున రాష్ట్రీయ స్వయం సేవక సంఘ్ (ఆరెస్సెస్)ను నాగపూర్‌లో స్థాపించారు. ఆ సంస్థ ఈ విజయదశమి రోజున 100వ ఏట ప్రవేశిస్తోంది. ఎటువంటి సభ్యత్వ నమోదు, ఐడెంటిటీ కార్డులు వంటివి లేకుండా ఒక సంస్థను వందేళ్ల దిగ్విజయంగా నడపడం మాటలు కాదు. దాదాపు 80 లక్షల మంది స్వయం సేవకులు కలిగిన 45 లక్షల సంఘ స్థాన్ శాఖలు నడుపుతూ ఎటువంటి అంతర్గత కలహాలకూ తావు లేకుండా కొనసాగుతోంది ఆరెస్సెస్.



నాటి బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న డాక్టర్ హెడ్గేవార్‌ని 1921లో విదర్భలోని అకోలా జైలులో ఒక సంవత్సరం రోజులు నిర్బంధించారు. నాడు జైలులోని దేశభక్తుల మధ్య జరిగిన చర్చోపచర్చలలో డాక్టర్ హెడ్గేవార్ మదిలో పురుడు పోసుకున్నదే ఆరెస్సెస్. 1925 నుంచి 1940 వరకు డాక్టర్ హెడ్గేవార్, 1940 నుండి 1973 వరకు మాధవ సదాశివ గోల్వాల్కర్ (గురూజీ), 1973 నుంచి 1993 వరకు మధుకర్ దత్తాత్రేయ దేవరస్‌లు సర్ సంఘ చాలకులుగా పనిచేసి ఆర్ఎస్ఎస్‌ను ఒక మహా వృక్షం మాదిరిగా యావత్ భారతదేశం అంతటా విస్తరించడానికి తమ జీవితాలను ధారపోశారు. ఆరెస్సెస్ సంఘ శాఖలలో మొదటగా ధ్వజారోహణము, ఆసనములు, యోగ, క్రీడలు, ఆటలు, కర్ర సాము, సమాజ హిత సూచనలు, భారతీయ చరిత్ర–సంస్కృతి–సంప్రదాయాలను తెలియజేసే ప్రసంగాలు, ఒకరితో ఒకరు సత్సంబంధాలు పెంచుకోవడం వంటి కార్యక్రమాలు ఉంటాయి. చివరగా ప్రార్థన వంటి విషయాలు నిత్యం జరుగుతూ ఉంటాయి.

సమాజంలోని రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, కార్మికులు, న్యాయవాదులు, డాక్టర్లు, వెనుకబడిన, అణగారిన వర్గాలకు ప్రాతినిధ్యం వహించే విధంగా భారతీయ మజ్దూర్ సంఘ్, భారతీయ కిసాన్ సంఘ్, అఖిల భారతీయ విద్యార్థి పరిషత్, అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహాసంఘ్, ఆరోగ్య భారతి, విద్యా భారతి, స్వదేశీ జాగరణ మంచ్, వనవాసి కళ్యాణ ఆశ్రమం, సంస్కార భారతి, భారతీయ జనతా పార్టీ, విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్, రాష్ట్రీయ సేవికా సమితి వంటి అనుబంధ సంస్థలను కలిపి 'సంఘ్ పరివార్'గా భావిస్తారు. ఈ సంస్థలు అన్నీ కూడా స్వయం ప్రతిపత్తి కలిగి ఆ యా రంగాలలో అవి పని చేసుకుని పోతున్నప్పటికీ అవసరమైన సందర్భాలలో ఆర్ఎస్ఎస్ నుంచి సలహాలు, సూచనలు ప్రేరణ అందుతాయి.

1947– 48 మధ్య దేశ విభజన సమయంలో, 1962లో భారత్ – చైనా యుద్ధ సమయంలో, 1972లో భారత్ – పాకిస్తాన్ యుద్ధ సమయంలో, భూకంపం, తుపానులు, కరోనా వంటి విపత్తులు, రైలు ప్రమాదాలు, కరవు కాటకాలు, కరోనా వంటి విపత్తుల సమయంలో ఆరెస్సెస్ చేపట్టిన సేవా కార్యక్రమాలు దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకున్నాయి. భారత్ – చైనా యుద్ధ సమయంలో ఆరెస్సెస్ సేవలను గుర్తించిన నాటి ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ 1963లో రిపబ్లిక్ డే కవాతులో ఆరెస్సెస్‌ను పాల్గొనమని ఆహ్వానించడం గమనార్హం.

దాదాపు 4 వేల మంది ఆరెస్సెస్ ప్రచారకులుగా (పూర్తి సమయ కార్యకర్తలుగా) కుటుంబ బంధాలకు దూరంగా దేశ, విదేశాల్లో పనిచేస్తూ తమ త్యాగ నిరతిని చాటుతున్నారు.

– ఆచార్య వై.వి. రామిరెడ్డి
శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి

(నేడు ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు ప్రారంభం)

హైదరాబాద్‌కు ఆక్సిజన్ ఆగనున్నదా?

దామగుండం... గత పక్షం రోజులుగా తెలంగాణలో ఈ పేరు కలకలం రేపుతోంది. విశ్వనగరం హైదరాబాద్‌కు 75 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ రక్షిత అటవీ ప్రాంతం ఇప్పుడు ప్రమాదంలో పడింది. దేశ రక్షణ శాఖ ఆధ్వర్యంలో భారత నావికాదళానికి సంబంధించి 'లో ఫ్రీక్వెన్సీ నేవీ రాడార్ స్టేషన్'ను నిర్మించడానికి 2900 ఎకరాలలో విస్తరించి ఉన్న ఈ అటవీభూమిని రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది. మూసీ నది పరివాహక ప్రాంతంలో ఉన్న ఈ అడవిలో ఇప్పుడు ఈ రాడార్ కేంద్రం నిర్మాణానికి 12 లక్షల అద్భుతమైన వృక్షాలను నేలమట్టం చేయబోతున్నారు.

2007లోనే రాడార్ స్టేషన్ నిర్మాణం కోసం భారత నావికాదళం అధికారులు వచ్చి సర్వే చేసుకొని వెళ్లారు. అయితే అటవీ భూముల బదలాయింపులకు కావలసిన గ్రామ సభలు, పంచాయతీ తీర్మానాలు వంటి ప్రక్రియలన్నీ గత పదేళ్ల ప్రభుత్వ హయాంలోనే పూర్తయ్యాయని అంటున్నారు. అయితే పర్యావరణ ప్రేమికులు వేసిన ప్రజావాజ్యాలతో కోర్టులో స్టే ఉండడంతో భూమి బదలాయింపు మాత్రం జరగలేదు. కాగా గత జనవరి 24న రాష్ట్ర ప్రభుత్వం, నావికాదళానికి భూమి బదలాయింపు ప్రక్రియ పూర్తి చేయడంతో ఇప్పుడు నిర్మాణ కార్యక్రమాలు ఊపందుకొంటున్నాయి. ఈ విషయాన్ని స్వతంత్ర జర్నలిస్టు తులసీ చందు వెలుగులోకి తేవడంతో మళ్లీ ప్రకృతి ప్రేమికులు, పర్యావరణవాదులు సంఘటితం అవుతున్నారు.



దామగుండం సముద్ర తీరప్రాంతానికి దాదాపు 700 కిలోమీటర్ల దూరంలో, సముద్ర మట్టానికి 400 మీటర్ల ఎత్తులో ఉంది. కాగా ఇంతకంటే దగ్గర, ఇంతకంటే మెరుగైన ప్రాంతాలు సముద్ర తీరప్రాంతానికి దగ్గరగా దేశంలో చాలా ప్రాంతాలు ఉన్నాయి. అంతేకాకుండా ఇదే వికారాబాద్ జిల్లాలో ఎన్నో ఎకరాల ఖాళీ భూములు అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వాలు వీటిని పరిశీలించకుండా ఈ పచ్చని అటవీభూమిని నావికాదళానికి అప్పజెప్పడంలో ఆంతర్యం ఏమిటో అర్థం కావడం లేదు.

అటవీప్రాంతాన్ని పెనవేసుకొని ఉన్న 20 గ్రామాలు, దాదాపు 60 వేల మంది ప్రజలు అడవిని కోల్పోతున్నందుకు, పశువులకు మేత భూములు పోతున్నందుకు బాధపడుతున్నారు.

దాదాపు వెయ్యి సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ అడవిలో 500 రకాల వైవిధ్యమైన చెట్లు, 150 రకాల ఔషధ వృక్షాలు నేలకూలుతున్నాయి. వీటితో పాటు ఎంతో అరుదైన చుక్కల జింకలు, తోడేళ్లు, ఆసియాలోనే అతిపెద్ద జింక అయిన నీల్ గాయ్, అడవి పందులు, పెద్ద కొమ్ముల సాంబార్ జింకలు, చింకారా జాతి జింకల వంటి జంతువులతో పాటు వేల రకాల పక్షులు తమ ఆవాసాన్ని కోల్పోతున్నాయి. దీనితో పాటు ఈ రాడార్ స్టేషన్ వలన వెలువడే రేడియేషన్ ప్రభావంతో చుట్టుప్రక్కల ప్రజలకు కంటి చూపు సమస్యలు, సొమాటిక్ లక్షణాలు, ఆందోళన, నిద్రలేమి, మానసిక రుగ్మతలు, సంతానలేమి, వంధత్వం, చర్మ సమస్యలు, అవయవాల పనితీరుపై ప్రభావం, ఎలక్ట్రికల్ షాక్ వంటి సమస్యలు పొంచివున్నాయి.

దామగుండం అడవిని ఆనుకునే ఉన్న వికారాబాద్ అనంతగిరి అడవులే మూసీ నదికి జన్మస్థలం. ఈ నది ఇక్కడి నుంచే మొదలై విశ్వనగరం హైదరాబాద్ మీదుగా దాదాపు 240 కిలోమీటర్లు ప్రవహించి, నల్లగొండ జిల్లా వజీరాబాద్ సమీపంలో కృష్ణానదిలో కలుస్తుంది. ఈ రాడార్ స్టేషన్ నిర్మాణం వల్ల మూసీ నదీ పరివాహక ప్రాంతానికి, ఆ నదితో పాటు పుట్టిన ఈసా, కాగ్నా నదుల అస్తిత్వం కూడా ప్రమాదంలో పడింది.

ఈ దామగుండం అటవీప్రాంతం విశ్వనగరం హైదరాబాద్‌కు కేవలం 75 కిలోమీటర్ల దూరంలో ఉంది. రాజధాని నగరానికి ప్రధాన ఆక్సిజన్ వనరులు కూడా ఇక్కడ విస్తరించి ఉన్న అడవులే. ఇప్పుడు 2,900 ఎకరాలలో పచ్చదనం కోల్పోవడం అంటే విశ్వనగరానికి ఆక్సిజన్ సిలిండర్ తీసివేస్తున్నట్లే! ఇలాంటి ప్రాజెక్టుల విషయంలో సమగ్ర పరిజ్ఞానం తెలియని గ్రామీణ ప్రజలను, ఆ యా పంచాయతీ పెద్దలను గ్రామ సభలు, తీర్మా నాల పేరుతో తాము ఎన్నుకున్న ప్రజాప్రతినిధులే మోసం చేస్తుంటే వారు ఎవరికి చెప్పుకోగలరు? ఇప్పుడీ దామగుండం పరిరక్షణ పర్యావరణ బాధ్యత స్థానిక ప్రజలే తేల్చుకోవాలి. వారికి సరియైన దిశానిర్దేశం చేయాల్సిన బాధ్యత పర్యావరణ పరిరక్షకులు, ప్రజాస్వామ్యవాదులపై ఎంతైనా ఉంది.

– మోతె రవికాంత్ । సేఫ్ ఎర్త్ ఫౌండేషన్ అధ్యక్షులు

దేనికైనా మంచిరోజే!

శమీ వృక్షానికీ, విజయ దశమి పండుగకూ సన్నిహిత సంబంధం. శమీ వృక్షం అంటే జమ్మి చెట్టు. 'శమీ' అంటే అగ్ని అని కూడా అర్థం . అగ్ని అదృశ్యంగా శమీ వృక్షంలో నిక్షిప్తమై ఉంటుందని శాస్త్రాలు చెప్తాయి. యజ్ఞాల లాంటి పవిత్ర కార్యాలలో జమ్మి కర్రలు మథించి, అగ్ని పుట్టించి, హోమాలు చేస్తారు. శమీ వృక్షం ప్రస్తావన రుగ్వేదంలో, అథర్వ వేదంలో కనిపిస్తుంది. ఇక పురాణ ఇతిహాసాలలో సరేసరి. అంటే, అతి ప్రాచీన కాలం నుంచి భారతీయులు శమీ వృక్షాన్ని పవిత్రమైన వృక్షాలలో ఒకటిగా భావిస్తూ వస్తున్నారు.



ఇక, 'విజయ' అంటే శ్రవణా నక్షత్రంలో కలిసివచ్చే దశమి తిథి. ఇలా కలవటం ఆశ్వయుజ మాసం, శుక్ల పక్షంలో జరుగుతుంది. ఆ 'విజయ' దశమి రోజు సర్వదా శుభదినం. అంటే, మీనమేషాలూ, గోచార, గ్రహచారాలతో నిమిత్తం లేకుండా, ఎలాంటి శుభకార్యాలకైనా విజయ దశమి మంచి రోజే!

విజయ దశమి దసరా నవరాత్రులలో ఆఖరి రోజు. చండముండులూ, మహిషాసురుడూ వంటి రాక్షసులందరినీ 9 రోజుల భీషణ యుద్ధంలో సంహరించిన దుర్గాదేవి, విజయ దశమి నాడు విజయిగా, అపరాజితగా నిలిచింది. ఈ అపరాజిత రాజాధిరాజులను కూడా శాసించే శ్రీమహారాజ్ఞి కనుక, విజయదశమినాడు దుర్గాదేవిని రాజరాజేశ్వరిగా అలంకరించడం ఆనవాయితీ. విజయ దశమినాడు అపరాజితా పూజ చేయడం ఇక్ష్వాకుల కాలం నుంచి వస్తున్న సంప్రదాయం. శ్రీరాముడు జమ్మి చెట్టును అపరాజితా దేవి ప్రత్యక్ష స్వరూపంగా భావించి, శమీపూజ ద్వారా దేవి అనుగ్రహం పొంది రావణ సంహారం చేశాడని దేవీ భాగవతం చెబుతోంది. రాజులకు యుద్ధ జయమూ, ఇతరులకు కార్య విజయమూ ఇవ్వగలదు గనక జమ్మి చెట్టు 'విజయద–శమీ' వృక్షం. అందుకే ఆబాలగోపాలం విజయ దశమి నాడు శమీ పూజ చేసే ఆచారం కొనసాగుతూ వస్తున్నది.

పూజ తరవాత అపరాజితా ప్రసాదంగా జమ్మి ఆకులను కోసి తెచ్చుకొని, వాటిని 'బంగారం'లా దాచుకోవటం, కొన్ని ఆకులను పెద్దల చేతిలో ఉంచి, నమస్కరించి, వాళ్ళ ఆశీర్వాదాలు తీసుకోవటం, దసరా పూజల సందడిలో భాగం. పనిలో పనిగా, ఆ పరిసరాలలోనే ఎగురుతుండే పాలపిట్టను చూసి, దాని నిసర్గ సౌందర్యాన్ని మెచ్చుకోవటం కూడా శుభకరం అని ఆస్తికుల నమ్మకం.

విజయ దశమి సందర్భంగా అపరాజితా దేవి ఆశీస్సులు అందరికీ అంది, ఆనందం కలిగించాలని ఆకాంక్షలు!!

– ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజ మాసం, తిథి: శు.దశమి తె.4.21 వరకు (తెల్లవారితే ఆదివారం), తదుపరి ఏకాదశి, నక్షత్రం: శ్రవణం రా.12.53 వరకు, తదుపరి ధనిష్ఠ, వర్జ్యం: తె.4.43 నుండి 6.11 వరకు (తెల్లవారితే ఆదివారం). దుర్ముహూర్తం: ఉ.5.44 నుండి 7.30 వరకు, అమృతఘడియలు: ప.2.39 నుండి 4.10 వరకు, విజయదశమి; రాహుకాలం: ఉ.9.00 నుండి 10.30 వరకు, యమగండం: ప.1.30 నుండి 3.00 వరకు, సూర్యోదయం: 5.55, సూర్యాస్తమయం: 5.39.

ఉచిత ఇసుకకు 'టెండర్'

గుట్టుచప్పుడు కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా 108 ఇసుక రీచ్‌లకు టెండర్లు ఖరారు

పండుగ వేళ ఇసుక దోపిడీకి సర్కారు పెద్దల 'పచ్చ' జెండా

బిడ్లు దాఖలు చేసేందుకు దేశంలో ఎక్కడా లేని విధంగా కేవలం రెండు రోజులే గడువు

ఓ వైపు మద్యం మాఫియాను ప్రోత్సహిస్తూ.. మరోవైపు ఇసుక మాఫియాకు గ్రీన్‌సిగ్నల్

అసలు ఇసుక పాలసీనే ప్రకటించకుండా రీచ్‌లలో తవ్వకాలు జరుపుతారా?

ప్రభుత్వ పెద్దలకు కావాల్సిన వారికి, టీడీపీ నేతలకు మాత్రమే అవకాశం

రహస్యంగా వారితోనే దాఖలు చేయించి.. వారికే ఖరారు చేసిన అధికారులు

టెండర్లు వేయడానికి వెళ్లిన వారిని అడ్డుకున్న స్థానిక టీడీపీ నేతలు

ఏకపక్షంగా వ్యవహరించిన కలెక్టర్ల నేతృత్వంలోని జిల్లా స్థాయి ఇసుక కమిటీలు

16వ తేదీ నుంచి తవ్వకాలు

సాక్షి, అమరావతి: ఓ వైపు మద్యం మాఫియాను ప్రోత్సహిస్తున్న చంద్రబాబు ప్రభుత్వం.. మరోవైపు గుట్టు చప్పుడు కాకుండా ఇసుక మాఫియాకు గేట్లు ఎత్తేసింది. ఉచితం పేరుతో ఇసుకను బంగారంలా మార్చింది చాలదన్నట్లు.. మరింతగా దోపిడీ చేసేందుకు రహస్యంగా పెద్ద స్కెచ్చే వేసింది. జనమంతా పండుగ సందడిలో ఉంటే.. సందట్లో సడేమియాలా ఇసుక రీచ్‌లను తను అనుకున్న వారికి హస్తగతం చేసింది. ఎటువంటి ఇసుక పాలసీ లేకుండానే 70 లక్షల టన్నులకంటూ 108 ఇసుక రీచ్‌లకు టెండర్లు పిలిచి ఆగమేఘాల మీద వాటిని ఖరారు చేసేసింది. సీఎంవోలో ముఖ్య నేత నుంచి వచ్చిన ఆదేశాల ప్రకారం జిల్లా కలెక్టర్ల నేతృత్వంలోని జిల్లా స్థాయి ఇసుక కమిటీలు పూర్తి ఏకపక్షంగా వ్యవహరించి అధికార పార్టీ వారికి రీచ్‌లను కట్టబెట్టేశాయి. ఇందుకోసం గుట్టు చప్పుడు కాకుండా, ఎవరికీ తెలియనీయకుండా అత్యంత రహస్యంగా జిల్లాల్లో టెండర్ల ప్రక్రియను నిర్వహించాయి. లక్షల రూపాయల విలువ ఉండే చిన్న టెండర్లకే వారం రోజుల వ్యవధి ఇవ్వాల్సివుండగా, రూ.వందల కోట్ల విలువైన ఇసుక టెండర్లను ఎటువంటి ప్రచారం లేకుండా, ఎవరికీ సమాచారం కూడా ఇవ్వకుండా రెండు రోజుల్లోనే గోప్యంగా తన వాళ్లకు కట్టబెట్టడం పట్ల అందరూ ఆశ్చర్యపోతున్నారు. రెండు రోజుల్లోనే టెండర్లు పిలవడం, ఖరారు చేసేయడం భారత దేశ టెండర్ల చరిత్రలోనే ఎప్పుడూ జరిగి ఉండదని నిపుణులు సైతం విస్తుపోతున్నారు. అసలు ఇసుక రీచ్‌లకు టెండర్లు పిలుస్తున్న విషయమే ఎవరికీ తెలియకుండా ఎలా మేనేజ్ చేశారనే చర్చ విస్తృతంగా జరుగుతోంది. ఇసుకను ఉచితంగా ఇస్తామన్న ప్రభుత్వం దానికి టెండర్లు పిలవాల్సిన అవసరం ఏమిటి? అది కూడా షార్ట్ టెండర్లు ఎందుకు పిలవాల్సివచ్చింది? ఎవరికీ తెలియకుండా ఆగమేఘాల మీద వాటిని ఎందుకు ఖరారు చేశారు? అన్న ప్రశ్నలకు సమాధానం లేదు.

పాలసీ లేకుండానే తవ్వకాలకు రెడీ

మూడు నెలల క్రితం టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పారదర్శకంగా అమలవుతున్న ఇసుక విధానాన్ని రద్దు చేసింది. త్వరలో పూర్తి స్థాయి ఇసుక విధానాన్ని ప్రకటించి రీచ్‌ల్లో తవ్వకాలు చేపడతామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఈలోపు స్టాక్ యార్డుల్లో ఉన్న ఇసుకను ఉచితంగా ప్రజలకు సరఫరా చేస్తామని ఆర్భాటంగా ప్రచారం చేసుకున్నారు. అయితే గత ప్రభుత్వం వర్షాకాలం కోసం స్టాక్ యార్డుల్లో నిల్వ చేసిన 80 లక్షల టన్నుల ఇసుకను టీడీపీ నేతలు సగానికి సగం వారం రోజుల్లోనే మాయం చేశారు. మిగిలిన 40 లక్షల టన్నుల ఇసుకను ఎక్కడికక్కడ భారీ రేట్లకు ప్రభుత్వం విక్రయించడంతో ప్రజల్లో ఆగ్రహం వెల్లువెత్తింది. ఉచిత ఇసుక పేరుతో జనాన్ని నిండా ముంచిందే కాక, ఇప్పుడు



అడ్డగోలు తవ్వకాలకు గ్రీన్ సిగ్నల్ ఇస్తూ మరో భారీ దోపిడీకి తెరలేపింది.

2, 3 రోజులే సమయం.. అంతా రహస్యం

సరికొత్త దోపిడీలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 108 మాన్యువల్ ఇసుక రీచ్‌ల్లో (యంత్రాలు ఉపయోగించకుండా) తవ్వకాలకు ఉన్నట్టుండి ప్రభుత్వం పచ్చజెండా ఊపేసింది. ఎటువంటి ఇసుక విధానం లేకుండా, మార్గదర్శకాలు చెప్పకుండా అన్ని జిల్లాల్లో ఈ రీచ్‌ల్లో తవ్వకాలకు కలెక్టర్ల నేతృత్వంలోని జిల్లా స్థాయి ఇసుక కమిటీల ద్వారా షార్ట్ టెండర్లు పిలిచింది. ఇసుక తవ్వకాల గురించి ప్రజలకు ఎటువంటి సమాచారం లేకుండా, టెండర్లలో తమ వారు తప్ప బయట వారు పాల్గొనే అవకాశం లేకుండా చేసేందుకే గుట్టు చప్పుడు కాకుండా వ్యవహారం చక్కబెట్టింది. షార్ట్ టెండర్‌కు కనీసం వారం రోజుల సమయం ఇవ్వాలి. కానీ దాదాపు అన్ని జిల్లాల్లో రెండు, మూడు రోజుల సమయం మాత్రమే ఇచ్చారు. ఆ జిల్లా మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలు సూచించిన వారు మాత్రమే టెండర్లు వేయడానికి ముందుగానే సిద్ధం చేశారు. ఆ తర్వాత టెండర్లు పిలిచి వారితో దగ్గరుండి దాఖలు చేయించి, వారికే ఖరారు చేయించినట్లు తెలుస్తోంది. ఇంత పెద్ద నిర్ణయాన్ని పాలసీ ప్రకటించకుండా ఎలా చేశారనే దానికి అధికారులు సమాధానం చెప్పలేకపోతున్నారు.

అడ్డగోలుగా తవ్వేయచ్చనే అతి తక్కువ ధరకు..


టన్ను ఇసుక ఇసుక తవ్వడానికి రూ.90 నుంచి రూ.120 వరకు వివిధ జిల్లాల్లో బేస్ ధరగా నిర్ణయించారు. చాలా జిల్లాల్లో టన్ను ఇసుకను రూ.50 నుంచి రూ.60కే తవ్వుతామని బిడ్లు దాఖలవ్వడం గమనార్హం. అధికారం ఉండడంతో ఎలాగైనా టెండర్ దక్కించుకుని, ఆ తర్వాత అడ్డగోలుగా తవ్వేయొచ్చనే ఉద్దేశంతో అతి తక్కువకు కోట్ చేసి రీచ్‌లు దక్కించుకున్నట్లు స్పష్టమవుతోంది. ఇందుకోసం జిల్లా కలెక్టర్లు ఛైర్మన్‌లుగా ఉన్న జిల్లా స్థాయి ఇసుక కమిటీలు ప్రభుత్వం చెప్పిన వారికి ఏకపక్షంగా టెండర్లు కట్టబెట్టాయి. ఎవరైనా అభ్యంతరాలు వ్యక్తం చేసినా, ప్రశ్నించినా వారిని దబాయించి, బెదిరించి పంపించేశారు. రెండు, మూడు జిల్లాలు మినహా అన్ని జిల్లాల్లోనూ ఇసుక టెండర్లు ఖరారైపోయాయి. ఈ నెల 16వ తేదీ నుంచి అక్కడ తవ్వకాలు ప్రారంభించనున్నారు.

తూ.గోలో అడ్డగోలుగా టెండర్ల ప్రక్రియ

- తూర్పుగోదావరి జిల్లాలోని 17 రీచ్‌లకు 7వ తేదీన టెండరు పిలిచి 9వ తేదీ సాయంత్రం లోపు బిడ్లు దాఖలు చేయాలని నిర్దేశించారు. 48 గంటల్లోనే అప్పటికే సిద్ధంగా ఉన్న టీడీపీ వారి నుంచి బిడ్లు స్వీకరించి 9వ తేదీ రాత్రికల్లా ఖరారు చేశారు. ఆఖరి నిమిషంలో విషయం తెలుసుకుని కొందరు టెండర్లు వేయడానికి వస్తే వారిని బెదిరించి కలెక్టరేట్ లోపలికి సైతం వెళ్లనీయలేదు. మరికొందరు ఎలాగోలా టెండరు దాఖలు చేసినా, బిడ్లు ఓపెన్ చేసే సమయంలో వారిని కలెక్టరేట్ ప్రాంగణంలోనే ఉండనీయకుండా పంపేశారు. వారంతా గురువారం రాత్రి అధికారులతో వాగ్వాదానికి దిగడంతో పోలీసుల సాయంతో వారిని బయటకు పంపి, టెండర్లు ఖరారు చేశారు. తూర్పుగోదావరి జిల్లాలో ఒక ఎమ్మెల్యే స్వయంగా తన కంపెనీ పేరుతో సీతానగరం మండలంలోని ఒక రీచ్‌కు టెండర్ వేసి దక్కించుకున్నట్లు తెలిసింది.

కర్నూలులో నోటిఫికేషన్ ఇవ్వకుండానే..

- కర్నూలు జిల్లాలో ఇసుక టెండర్ల నోటిఫికేషన్ ఇవ్వకుండానే టెండర్‌ను ఖరారు చేశారు. కేవలం మైనింగ్ శాఖ వెబ్‌సైట్‌లో మాత్రమే ప్రకటన ఇచ్చారు. టెండర్ గురించి ఎవరికీ తెలియకుండా మంత్రాలయం నియోజకవర్గానికి చెందిన టీడీపీ నేత బంగారయ్య అనే వ్యక్తితో మాత్రమే టెండర్ దాఖలు చేయించారు. ఎవరినీ రానీయకుండా ఒకే టెండర్ వచ్చేలా చేయడంతో అతనికే రీచ్ తవ్వకాల కాంట్రాక్టు ఖరారైంది. ఒకే టెండర్ దాఖలైతే టెండర్ రద్దు చేసి మళ్లీ టెండర్లు పిలవాలన్న నిబంధనకు నీళ్లొదిలారు. పల్నాడు జిల్లాలో 8వ తేదీన టెండర్ పిలిచి 10వ తేదీన ఖరారు చేశారు. బాపట్ల జిల్లాలో 7న పిలిచి 8న టెండర్లు ఫైనల్ చేశారు. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో 7వ తేదీన టెండర్ పిలిచి 11వ తేదీన ఖరారు చేశారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో గొట్టిముక్కల గ్రామానికి చెందిన ఒక వ్యక్తి టెండర్ వేసేందుకు వెళ్లగా వెనక్కి పంపించారు. మీ వాహనాలకు జీపీఎస్ సిస్టం (డివైస్) బాగా లేదని, టెండర్ వేసేందు వీలు లేదని నిరాకరించడంతో ఆయన వెనుదిగిరారు.



మబ్బు, నేల మమేకం!

మబ్బులు దిగొచ్చి నేలను ముద్దాడుతున్నట్టుగా ఉన్న ఈ సుందర దృశ్యం సందర్శకులను సమ్మోహనపర్చింది. అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట మండలంలోని హార్సిలీహిల్స్‌పై నుంచి చూసిన వారిని ఈ అద్భుత దృశ్యం అబ్బురపరిచింది. - బి.కొత్తకోట

అణ్వాయుధ వ్యతిరేక పోరాటానికి

నోబెల్ శాంతి బహుమతి

జపాన్ సంస్థ 'నిహాన్ హిడాన్‌క్యో'కు ప్రతిష్టాత్మక గుర్తింపు

ఓస్లో: అణ్వాయుధాలకు తావులేని శాంతియుత ప్రపంచమే లక్ష్యంగా అవిశ్రాంత పోరాటం కొనసాగిస్తున్న జపాన్ సంస్థ 'నిహాన్ హిడాన్‌క్యో'కు 2024 సంవత్సరానికి గాను ప్రతిష్టాత్మక నోబెల్ శాంతి బహుమతి లభించింది. నార్వే నోబెల్ కమిటీ చైర్మన్ వాట్నే ఫ్రైడ్నెస్ శుక్రవారం ఈ విషయం ప్రకటించారు. అణ్వాయుధాల ప్రయోగాన్ని నిషేధించాలన్న నినాదం ప్రస్తుతం తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోందని చెప్పారు. మానవాళి సంక్షేమం కోసం అణ్వాయుధాలకు వ్యతిరేకంగా ప్రపంచం మొత్తం గళం విప్పాలని సూచించారు. 1945లో జపాన్‌లోని హిరోషిమా, నాగసాకిపై అమెరికా చేపట్టిన అణుబాంబు దాడిలో ప్రాణాలతో బయటపడిన పౌరులు 'నిహాన్ హిడాన్‌క్యో'ను స్థాపించారు. అణ్వాయుధాలకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు. అమెరికా దాడిలో క్షతగాత్రులు మారిపోయి, బాధాకరమైన జ్ఞాపకాలతో జీవిస్తున్నప్పటికీ శాంతి కోసం కృషి చేస్తున్నారని నిహాన్ హిడాన్‌క్యో సభ్యులను వాట్నే ఫ్రైడ్నెస్ ప్రశంసించారు. తమ సంస్థకు నోబెల్ శాంతి బహుమతిని ప్రకటించడం పట్ల నిహాన్ హిడాన్‌క్యో హిరోషిమా శాఖ చైర్‌పర్సన్ తొమొయుకి మిమాకీ ఆశ్చర్యం వ్యక్తంచేశారు. ''ఇది నిజమేనా? నమ్మలేకపోతున్నాం' అని వ్యాఖ్యానించారు.



నిహాన్ హిడాన్‌క్యో లోగో

ఏమిటీ నిహాన్ హిడాన్‌క్యో?

రెండో ప్రపంచ యుద్ధంలో అమెరికా సైన్యం 1945 ఆగస్టు 9న జపాన్‌లోని నాగసాకి పట్టణంపై అణుబాంబు ప్రయోగించింది. ఈ దాడిలో ఏకంగా 70 వేల మంది మరణించారు. మూడు రోజుల తర్వాత హిరోషిమా పట్టణంపై మరో బాంబును అమెరికా ప్రయోగించింది. ఈ ఘటనలో 1.40 లక్షల మంది ప్రజలు బలయ్యారు. దాంతో 1945 ఆగస్టు 15న పశ్చిమ దేశాల సైన్యం ఎదుట జపాన్ లొంగిపోయింది. రెండో ప్రపంచ యుద్ధం ముగిసింది. నాగసాకి, హిరోషిమాపై జరిగిన అణుబాంబు దాడుల్లో వేలాది మంది క్షతగాత్రులయ్యారు. అవయవాలు కోల్పోయి దివ్యాంగులుగా మారారు. బాధితులంతా(హిబకుషా) తమకు ఎదురైన అనుభవాలతో అణ్వాయుధాలకు వ్యతిరేకంగా ఉద్యమం ప్రారంభించారు. ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని, తమ భవిష్యత్తు తరాలను కూడా ఆదుకోవాలని, అణ్వాయుధాలను పూర్తిగా నిర్మూలించాలని డిమాండ్ చేస్తూ 1956లో నిహాన్ హిడాన్‌క్యో సంస్థను స్థాపించారు. పసిఫిక్ ప్రాంతంలో అణ్వాయుధ ప్రయోగాలతో బాధితులుగా మారినవారు సైతం ఈ ఉద్యమంలో భాగస్వాములయ్యారు. ఈ ఉద్యమం క్రమంగా ప్రపంచమంతటా వ్యాప్తిచెందింది.



చెల్లాచెదురుగా పడిపోయిన భాగమతి ఎక్స్‌ప్రెస్ రైలు బోగీలు

చెన్నై శివారులో

ఘోర రైలు ప్రమాదం

- పట్టాలు తప్పిన 13 కోచ్‌లు
- ఐదుగురు ప్రయాణికులకు తీవ్ర గాయాలు
- కొనసాగుతున్న సహాయక చర్యలు

గూడ్స్‌ను ఢీ కొన్న మైసూర్- దర్భంగా భాగమతి ఎక్స్‌ప్రెస్ • రెండు బోగీల్లో మంటలు

సాక్షి, చెన్నై: చెన్నై వైపు వస్తున్న మైసూరు–దర్భంగా భాగమతి ఎక్స్‌ప్రెస్ తిరువళ్లూరు జిల్లా కవరపేట స్టేషన్ వద్ద శుక్రవారం రాత్రి 8.30 గంటల సమయంలో ఆగి ఉన్న గూడ్స్ రైలును ఢీ కొంది. ఈ ప్రమాదంలో రెండు బోగీలు పాక్షికంగా అగ్నికి ఆహుతయ్యాయి. మొత్తం 15 బోగీలు పట్టాలు తప్పాయి. రైలు వేగం తక్కువగా ఉండడంతో అదృష్టవశాత్తు ప్రాణనష్టం సంభవించలేదు. అయితే, ఐదుగురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. పలువురు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. కర్ణాటక రాష్ట్రం మైసూర్ నుంచి చెన్నై శివారులోని అరక్కోణం, పెరంబూరు, గుమ్మిడిపూండి మార్గం మీదుగా బిహార్ వైపు ప్రయాణించే దర్భంగా భాగమతి ఎక్స్‌ప్రెస్ శుక్రవారం ఉదయం 10.30 గంటలకు బయలుదేరింది. ఈ రైలు రాత్రి 8.30 గంటల సమయంలో పొన్నేరి రైల్వేస్టేషన్ దాటి గుమ్మడిపూండి సమీపంలోని కవరపేట వద్ద భారీ కుదుపులకు లోనై లూప్ లైన్‌లో ఆగి ఉన్న గూడ్స్‌ను ఢీకొంది. ప్రమాదం జరిగిన క్షణాలలో మంటలు వ్యాపించడంతో కలకలం రేగింది. మొత్తం 13 బోగీలు పట్టాలు తప్పడంతో ఒక్కసారిగా ప్రయాణికుల హాహాకారాలతో ఆ ప్రాంతం మార్మోగింది.

చిమ్మ చీకటి కావడంతో ఉద్రిక్తత

ప్రమాదం జరిగిన పరిసరాలు చిమ్మచీకటిగా ఉండడంతో రైలు ప్రయాణికులకు తీవ్ర ఆందోళనతో భీతావహులయ్యారు. ప్రమాద సమాచారంతో గుమ్మిడిపూండి ఎమ్మెల్యే గోవిందరాజ్ సంఘటనా స్థలానికి చేరుకుని అక్కడి ప్రజలతో సహాయక చర్యలు ముమ్మరం చేశారు. తిరువళ్లూరు కలెక్టర్ ప్రభుశంకర్,ఎస్పీ శ్రీనివాస పెరుమాల్, రైల్వే పోలీసు ఉన్నతాధికారి ఈశ్వరన్ నేతృత్వంలో బృందం సహాయక చర్యలకు పూనుకుంది. అప్పటికే గ్రామస్తులు రైలు బోగీలలో చిక్కుకున్న వారిని బయటకు తీశారు. అరక్కోణం నుంచి వచ్చిన ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు మంటలు ఇతర బోగీలకు వ్యాపించకుండా కట్టడి చేశారు. ప్రమాదంలో ఐదుగురికి తీవ్రగాయాలయ్యాయి. వీరిని చెన్నైకు తరలించారు. మరికొందరు స్వల్పంగా గాయపడ్డారు.



బోగీల నుంచి వస్తున్న మంటలు

సిగ్నల్ సమస్యే కారణమా?

రైలు 109 కిలోమీటర్ల వేగంతో వెళుతూ భారీ కుదుపులకు లోనై లూప్ లైన్‌లోకి మళ్లింది. గార్డ్ సకాలంలో స్పందించి వేగాన్ని క్రమంగా 90 కి.మీ.కి తగ్గించారు. అప్పటికే ఆగి ఉన్న గూడ్స్‌ను ఢీకొంది. ఘటనలో 13 బోగీలు పట్టాలు తప్పాయి. ఏసీ బోగీలలో స్వల్పంగా మంటలు చెలరేగినా సకాలంలో ఆర్పి వేయడంతో ప్రమాదం తప్పినట్టైంది. ప్రమాదంలో ఎవ్వరికీ ప్రాణహాని కలగలేదని దక్షిణ రైల్వే ప్రకటించింది. ఘటన కారణంగా ఆంధ్రప్రదేశ్ వైపు చెన్నై నుంచి వెళ్లాల్సిన పలు రైళ్లు మధ్యలోనే ఆగాయి. అలాగే, గుమ్మిడిపూండి మీదుగా చెన్నైకు రావాల్సిన రైళ్లు ఎక్కడికక్కడ ఆగడంతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు తప్పలేదు. దక్షిణ రైల్వే యంత్రాంగం 044 25354151, 2435499, అదేవిధంగా దక్షిణ మధ్య రైల్వే విజయవాడ హెల్ప్ లైన్ 0866–2571244 నంబర్‌ను ప్రకటించింది. తిరుచ్చి–హౌరా, ఎర్నాకులం–టాటా నగర్, కాకినాడ–దర్భంగా భాగమతి ప్రత్యేక రైలు సేవలను గూడూరు మార్గంలో నిలుపుదల చేశారు. వీటిని ప్రత్యామ్నయ మార్గంలో నడిపేందుకు చర్యలు తీసుకున్నారు.

రెండున్నర గంటలు

టెన్షన్.. టెన్షన్

- ప్రాణాలరచేత బట్టుకున్న 141 మంది ప్రయాణికులు
- తిరుచ్చిలో సురక్షితంగా ల్యాండైన ఎయిర్ ఇండియా విమానం



సురక్షితంగా ల్యాండ్ అయిన విమానం

సాక్షి, చెన్నై: తమిళనాడులోని తిరుచ్చి విమానాశ్రయం పరిసరాల్లో శుక్రవారం సాయంత్రం తీవ్ర ఉత్కంఠ వాతావరణం నెలకొంది. సాయంత్రం 5.30 గంటలప్పుడు టేకాఫ్ అయిన ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానం రెండున్నర గంటలపాటు అందరినీ హడలెత్తించింది. షార్జాకు వెళ్లాల్సిన ఈ విమానంలో ఆరుగురు సిబ్బంది, ఆరుగురు చిన్నారులు సహా 141 మంది ప్రయాణికులున్నారు. టేకాఫ్ అయిన కొద్దిసేపటికే హైడ్రాలిక్ వ్యవస్థలతోపాటు ల్యాండింగ్ గేర్‌లో సమస్యను పైలట్ గుర్తించారు. గ్రౌండ్‌కు ఈ మేరకు సమాచారం అందించారు. సురక్షిత ల్యాండింగ్ కష్టమని అధికారులు భావించారు. ల్యాండింగ్ సమయంలో ఏదైనా జరిగితే ఇంధనం అంతా మండిపోతుందని ప్రమాద తీవ్రత పెరుగుతుందనే ఆందోళన వ్యక్తమైంది. దీంతో ఇంధన ట్యాంకును ఖాళీ చేసేందుకు విమానాన్ని గాల్లోనే తిరుచ్చి చుట్టూ రెండున్నర గంటలపాటు సుమారు 16 సార్లు చక్కర్లు కొట్టించారు. ఈలోగా 6.05 గంటలకు ఎయిర్‌పోర్టు పరిసరాల్లో అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. భారీ సంఖ్యలో పోలీసులను మోహరించారు. సుమారు 25 అంబులెన్స్‌లు, వందలాదిగా వైద్య సిబ్బందిని, పదుల సంఖ్యలో అగ్నిమాపక వాహనాలను సిద్ధంగా ఉంచారు. విమానాశ్రయానికి పక్కనే ఉన్న తిరుచ్చి–పుదుక్కొట్టై జాతీయ రహదారిపై రాకపోకలను నిలిపివేశారు. ఏం జరిగిందో తెలియక జనం పెద్దసంఖ్యలో ఆ పరిసరాలలోకి తరలిరావడంతో వారిని కట్టడి చేయడానికి పోలీసులు శ్రమించాల్సి వచ్చింది. చివరికి ఏటీఎస్ ఓకే చెప్పడంతో పైలట్, రాత్రి 8.15 గంటలకు తిరిగి తిరుచ్చి విమానాశ్రయంలో విమానాన్ని సురక్షితంగా ల్యాండ్ చేశారు. దీంతో, అందరూ ఊపిరి పీల్చుకున్నారు. గంటలపాటు కొనసాగిన ఉత్కంఠకు తెరపడింది. సింగపూర్‌నుంచి వచ్చిన మరో విమానంలో ప్రయాణికులను షార్జాకు అర్ధరాత్రి సమయంలో పంపించారు. కాగా, ఈ ఘటనపై కూలంకషంగా దర్యాప్తు చేపట్టనున్నట్లు కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. హైడ్రాలిక్ వ్యవస్థలో తలెత్తిన లోపంపై విచారణ జరుగుతుందన్నారు.

హరియాణా సీఎం ప్రమాణస్వీకారం 15న!

రెండోసారి బాధ్యతలు చేపట్టనున్న నాయబ్ సింగ్ సైనీ



సాక్షి, న్యూఢిల్లీ: హరియాణా రాష్ట్ర ముఖ్యమంత్రిగా నాయబ్ సింగ్ సైనీ ఈనెల 15న ప్రమాణస్వీకారం చేయనున్నారు. సీఎంగా ఆయన రెండోసారి బాధ్యతలు చేపట్టబోతున్నారు. ప్రమాణస్వీకారానికి పంచకులలో ఏర్పాట్లు జరుగుతున్నట్లు డిప్యూటీ కమిషనర్ డాక్టర్ యష్ గార్గ్ శుక్రవారం తెలిపారు. ప్రమాణస్వీకారోత్సవానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహా.. బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, అగ్రనేతలు హాజరవుతారని తెలుస్తోంది. ప్రధాని షెడ్యూల్ కుదిరితే 15న, కుదరకపోతే 16న సైనీ ప్రమాణం చేసే అవకాశముంది.

ఎథిక్స్ కమిటీ చైర్మన్‌గా ఘన్‌శ్యామ్ తివారీ

సభ్యుడిగా వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయి రెడ్డి



న్యూఢిల్లీ: రాజ్యసభ ఎథిక్స్ (నైతిక విలువల) కమిటీ చైర్మన్‌గా బీజేపీకి చెందిన ఘన్‌శ్యామ్ తివారీ నియమితులయ్యారు. అక్టోబర్ 10 నుంచి ఈ కమిటీ మనుగడలోకి వస్తుందని రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ తెలిపారు. ఎథిక్స్ కమిటీలో వైఎస్సార్‌సీపీ ఎంపీ వై.విజయసాయి రెడ్డి సభ్యులుగా నియమితులయ్యారు. ప్రమోద్ తివారీ (కాంగ్రెస్), డెరెక్ ఒబ్రియాన్ (తృణమూల్ కాంగ్రెస్), తిరుచ్చి శివ (డీఎంకే), సంజయ్ సింగ్ (ఆప్), శస్మిత్ పాత్రా (బీజేడీ), ప్రేమ్‌చంద్ గుప్తా (ఆర్జేడీ), మేధా విశ్రామ్ కులకర్ణి, దర్శనా సింగ్ (బీజేపీ)లు కమిటీలోని ఇతర సభ్యులు. రాజ్యసభలో ఎంపీల ప్రవర్తనకు సంబంధించిన ఫిర్యాదులు వస్తే ఎథిక్స్ కమిటీ పరిశీలించి నిర్ణయాలు వెలువరిస్తుంది. అలాగే విజయసాయి రెడ్డిని రవాణా, పర్యాటక, సాంస్కృతిక స్టాండింగ్ కమిటీ నుంచి గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖల స్టాండింగ్ కమిటీకి మారుస్తూ ధన్‌ఖడ్ ఆదేశాలు జారీచేశారు.

ఇకపై మాది ఒంటరిపోరే: మాయావతి



సాక్షి, న్యూఢిల్లీ: అనుకున్నదొక్కటి... అయినదొక్కటిలా తయారైంది మాయావతి నేతృత్వంలోని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) పరిస్థితి. హరియాణా అసెంబ్లీ ఎన్నికలలో ఐఎన్ఎల్‌డీతో బీఎస్పీ పొత్తు చేదు అనుభవం మిగల్చడంతో, మున్ముందు జరిగే ఎన్నికల్లో ఎక్కడా ప్రాంతీయ పార్టీలతో పొత్తు పెట్టుకోరాదని మాయావతి నిర్ణయించారు. యూపీ సహా ఇతర రాష్ట్రాల ఎన్నికల్లో బీఎస్పీ ఓట్లు కూటమి పార్టీకి బదలాయించినా.. వారి సంప్రదాయ ఓట్లను బీఎస్పీకి బదలాయించే సామర్థ్యం మిత్రపక్షానికి లేకపోవడంతో ఆశించిన ఫలితం దక్కలేదని మాయావతి పేర్కొన్నారు. ఈ కారణంగానే బీఎస్పీ కేడర్ తీవ్ర నిరాశకు గురైందని శుక్రవారం ఆమె 'ఎక్స్'లో అభిప్రాయపడ్డారు.

కాళీమాతకు మోదీ బహూకరించిన కిరీటం చోరీ

బంగ్లాదేశ్‌లోని యశోరేశ్వరీ ఆలయంలో ఘటన



ఢాకా: బంగ్లాదేశ్‌లోని ఓ ఆలయంలో కాళీమాతకు ప్రధాని మోదీ కానుకగా ఇచ్చిన కిరీటం చోరీకి గురైంది. 2021లో ప్రధాని మోదీ బంగ్లాదేశ్ పర్యటన సందర్భంగా సత్‌ఖిరాలో ఉన్న యశోరేశ్వరీ ఆలయంలో కాళీమాతకు బంగారు పూత పూసిన వెండి కిరీటాన్ని సమర్పించారు. ఆ కిరీటం గురువారం నుంచి కనిపించడం లేదని ఆలయ సిబ్బంది తెలిపారు. గురువారం మధ్యాహ్నం పూజ అనంతరం ఆలయ పూజారి వెళ్లిపోయిన కొద్దిసేపటికే కిరీటం చోరీకి గురైందన్నారు. యశోరేశ్వరీ మనదేశంతోపాటు పొరుగు దేశాలలో విస్తరించి ఉన్న 51 శక్తి పీఠాలలో ఒకటి.



శుక్రవారం వీయెంటియాన్‌లో ఆసియాన్ నేతలతో ప్రధాని మోదీ

కెనడా ప్రధాని ట్రూడోతో మోదీ భేటీ

ప్రధాని మోదీ లావోస్‌లో కెనడా ప్రధానమంత్రి జస్టిన్ ట్రూడోతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వారు ఏం మాట్లాడుకున్నారన్నది తెలియరాలేదు. ఇది స్వల్పకాలం జరిగిన సమావేశమని ట్రూడో పేర్కొన్నట్లు కెనడా వార్త సంస్థ వెల్లడించింది. ఖలిస్తాన్ ఉగ్రవాది నిజ్జర్ హత్య వెనుక భారత్ హస్తం ఉందంటూ ట్రూడో ఆరోపించడంతో గతేడాది భారత్–కెనడా మధ్య సంబంధాలు కొంత బలహీనపడిన సంగతి తెలిసిందే. మోదీతో సమావేశం అనంతరం ట్రూడో మీడియాతో మాట్లాడారు. కెనడా పౌరుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. చేపట్టాల్సిన కార్యాచరణపై భారత ప్రధానితో చర్చించానని అన్నారు. మరోవైపు థాయ్‌లాండ్ ప్రధానమంత్రి షినవత్రా, అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్, లావోస్ ప్రధానమంత్రి సోనెక్సే సిఫాండోన్‌తోనూ నరేంద్ర మోదీ సమావేశమయ్యారు. ఆయా దేశాలతో భారత్ సంబంధాల పురోగతిని సమీక్షించారు. వ్యాపార, వాణిజ్యపరమైన అంశాలపై చర్చించారు.

భారత హస్త కళాకృతుల బహూకరణ

ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం లావోస్, థాయ్‌లాండ్, న్యూజిలాండ్ దేశాల అధినేతలకు భారత హస్తకళాకృతులను, విలువైన వస్తువులను బహూకరించారు. మహారాష్ట్రలో తయారు చేసిన వెండి ప్రమిదలను న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టోఫర్ లక్సన్‌కు అందజేశారు. లావోస్ అధ్యక్షుడు సిసోలిత్‌కు బుద్ధుడి విగ్రహాన్ని బహూకరించారు. లద్దాఖ్‌లో తయారు చేసిన బల్లను థాయ్‌లాండ్ ప్రధానికి, పశ్చిమబెంగాల్‌లో రూపొందించిన వెండి నెమలి బొమ్మను జపాన్ ప్రధానమంత్రికి అందజేశారు.

సమస్యలకు పరిష్కారాలు యుద్ధక్షేత్రంలో కాదు

సంక్షోభాలు సమసిపోవాలంటే శాంతి చర్చలు, దౌత్య మార్గాలే శరణ్యం

తూర్పు ఆసియా శిఖరాగ్ర సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టీకరణ

వీయెంటియాన్: ప్రపంచంలో పలుచోట్ల కొనసాగుతున్న సంఘర్షణలు, ఉద్రిక్త పరిస్థితులతో గ్లోబల్ సౌత్ దేశాలపై తీవ్ర ప్రభావం పడుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆందోళన వ్యక్తంచేశారు. యూరేషియా, పశ్చిమాసియాలో సాధ్యమైంత త్వరగా శాంతి నెలకొనాలని ఆకాంక్షించారు. చర్చలు, దౌత్య మార్గాల్లో శాంతియుత వాతావరణాన్ని పునరుద్ధరించాలని సూచించారు. లావోస్ రాజధాని వీయెంటియాన్‌లో శుక్రవారం 19వ తూర్పు ఆసియా శిఖరాగ్ర సదస్సులో ప్రధాని మోదీ ప్రసంగించారు. ఇండో–పసిఫిక్ ప్రాంతంలో సంపూర్ణ శాంతిని, అభివృద్ధిని కోరుకుంటున్నామని చెప్పారు. ఇందుకోసం స్వేచ్ఛాయుత, సమగ్ర, సౌభాగ్యవంతమైన, నిబంధనల ఆధారిత ఇండో–పసిఫిక్ అవసరమని తేల్చిచెప్పారు. ఇండో–పసిఫిక్‌లో డ్రాగన్ దేశం చైనా విస్తరణవాదాన్ని మోదీ పరోక్షంగా తప్పుపట్టారు. భారత్ ప్రతిపాదించిన తూర్పు కార్యాచరణ(యాక్ట్ ఈస్ట్) విధానానికి తూర్పు ఆసియా సదస్సు ఒక మూలస్తంభమని ఉద్ఘాటించారు. ప్రధానమంత్రి ఇంకా ఏం మాట్లాడారంటే...

విశ్వబంధుగా బాధ్యతలు నిర్వర్తిస్తాం

''గౌతమ బుద్ధుడు జన్మించిన దేశం నుంచి వచ్చా. ఇది యుద్ధాల యుగం కాదని పదేపదే చెబుతున్నా. సమస్యలకు పరిష్కారాలు యుద్ధక్షేత్రం నుంచి రావు. మానవతా దృక్పథంతో వ్యవహరించాలి. సంక్షోభాలు సమసిపోవాలంటే శాంతి చర్చలు, దౌత్య మార్గాల్లో సంప్రదింపులపై తప్పనిసరిగా దృష్టి పెట్టాలి. విశ్వబంధుగా మా బాధ్యతలు నిర్వర్తిస్తాం. ప్రపంచంలో శాంతి కోసం అన్ని ప్రయత్నాలూ చేస్తూనే ఉంటాం. మనమంతా ఒక్కటై పోరాడితే ఉగ్రవాదం నామరూపాల్లేకుండాపోవడం ఖాయం. అలాగే సైబర్ భద్రత, అంతరిక్షం తదితర రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవాలి.

మన దృష్టి అభివృద్ధి పైనే ఉండాలి

మొత్తం ఇండో–పసిఫిక్ ప్రాంత ప్రయోజనాల కోసం దక్షిణ చైనా సముద్రంలో శాంతి, భద్రత, స్థిరత్వం అత్యవసరం. ఈ ప్రాంతంలో వివిధ దేశాల నౌకలు, విమానాలు స్వేచ్ఛగా రాకపోకలు సాగించే వాతావరణం ఉండాలి. సముద్ర చట్టంపై ఐక్యరాజ్య సమితి తీర్మానం (అన్‌క్లోస్) తరహాలో దక్షిణచైనా సముద్రంలోనూ కార్యకలాపాల కోసం ఒక స్పష్టమైన విధానం అవసరం. ప్రభావవంతమైన ప్రవర్తనా నియమావళిని అభివృద్ధి చేయాలి. మన దృష్టి ఎప్పుడూ అభివృద్ధిపైనే ఉండాలి తప్ప విస్తరణవాదంపై కాదు'' అని ప్రధాని మోదీ స్పష్టంచేశారు.

ఈవీఎంలలో అవకతవకలపై ఈసీకి కాంగ్రెస్ ఫిర్యాదులు

న్యూఢిల్లీ: హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల్లో(ఈవీఎంలు) అవకతవకలు చోటుచేసుకున్నాయని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ శుక్రవారం ఎన్నికల సంఘానికి మరిన్ని ఫిర్యాదులు చేసింది. దాదాపు 20 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ టికెట్లపై పోటీ చేసిన అభ్యర్థులు లిఖితపూర్వకంగా ఫిర్యాదులు అందించారు. ఈ నెల 8న జరిగిన ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా కొన్ని ఈవీఎంల బ్యాటరీలు 99 శాతం చార్జింగ్‌తో ఉన్నట్లు తేలిందని పేర్కొన్నారు. అది ఎలా సాధ్యమని ప్రశ్నించారు. మిగతా ఈవీఎంల బ్యాటరీల్లో 80 శాతం కంటే తక్కువ చార్జింగ్ ఉందన్నారు. 99 శాతం చార్జింగ్ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరపాలని ఎన్నికల సంఘాన్ని కోరారు. తమ పార్టీ ఫిర్యాదులపై ఈసీ తగిన చర్యలు తీసుకుంటుందని భావిస్తున్నామని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ పేర్కొన్నారు. ఈసీకి ఫిర్యాదు చేసిన 20 మంది కాంగ్రెస్ అభ్యర్థులు అసెంబ్లీ ఎన్నికల్లో తక్కువ ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఈవీఎంలను తారుమారు చేశారని వారు అనుమానిస్తున్నారు. అందుకే న్యాయం కోసం ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించారు.

పాకిస్తాన్‌లో కాల్పులు

20 మంది మైనర్లు మృతి, ఏడుగురికి గాయాలు

ఇస్లామాబాద్: పాకిస్తాన్‌లోని దుకీ జిల్లాలో ఉన్న బొగ్గు గనిలోని వసతి గృహంలో గుర్తు తెలియని వ్యక్తులు కాల్పులు జరిపారు. గురువారం అర్ధరాత్రి దాటిన తరువాత జరిగిన ఈ ఘటనలో 20 మంది మైనర్లు మృతి చెందారు. ఏడుగురు గాయపడ్డారు. మృతుల్లో ముగ్గురు, గాయపడిన వారిలో నలుగురు అఫ్గాన్లు ఉన్నారు. ఈ దాడికి తామే బాధ్యులమని ఇప్పటివరకు ఏ సంస్థా ప్రకటించలేదు. ఇస్లామాబాద్‌లో జరిగే షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్ సీవో) సదస్సుకు కొద్ది రోజుల ముందే ఈ దాడి జరగడం గమనార్హం. దాడి చేసినవారిలో ఎక్కువమంది బలూచిస్తాన్‌లోని పష్తూన్ మాట్లాడే ప్రాంతాలకు చెందినవారని నివేదిక తెలిపింది. గత వారం కరాచీ విమానాశ్రయం సమీపంలో కాన్వాయ్‌ను లక్ష్యంగా చేసుకుని జరిగిన ఆత్మాహుతి దాడిలో ఇద్దరు చైనా పౌరులు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ దాడికి తామే బాధ్యులమని తీవ్రవాద సంస్థ బలూచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) ప్రకటించింది. బలూచ్ మిలిటెంట్లు చైనా పౌరులను, చైనా నిధులతో నడుస్తున్న పాకిస్తాన్ ప్రాజెక్టులను లక్ష్యంగా చేసుకోవడం ఇదే మొదటిసారి కాదు. పాకిస్తాన్ ప్రభుత్వంతో కలిసి చైనా తమ సహజ వనరులను దోచుకుంటోందనే ఆగ్రహంతో బలూచిస్తాన్ ఉంది.

బీరుట్‌పై దాడులు.. 22కు చేరిన మృతులు

- 117 మంది గాయపడ్డారని ప్రకటించిన లెబనాన్ ప్రభుత్వం
- తమ నేతపై ఇజ్రాయెల్ హత్యాయత్నం విఫలమైందన్న హెజ్‌బొల్లా

బీరుట్/న్యూఢిల్లీ: లెబనాన్ రాజధాని బీరుట్‌పై గురువారం రాత్రి ఇజ్రాయెల్ చేపట్టిన వైమానిక దాడుల్లో మరణాల సంఖ్య 22కు చేరుకుంది. తాజా ఘటనలో 117 మంది క్షతగాత్రులుగా మారారని లెబనాన్ ఆరోగ్య శాఖ తెలిపింది. బాధితుల వివరాలను మాత్రం వెల్లడించలేదు. సెంట్రల్ బీరుట్‌లోని రస్ అల్–నబా, బుర్జ్ అబి హైదర్‌లపై ఏకకాలంలో జరిగిన ఈ దాడుల్లో ఒక చోట ఎనిమిదంతస్తుల భవనం నేలమట్టం కాగా, మరో చోట ఓ భవన సముదాయంలోని దిగువ అంతస్తులు ధ్వంసమయ్యాయి. తమ ముఖ్య అధికారి వఫిక్ సఫాను చంపేందుకు ఇజ్రాయెల్ చేసిన ప్రయత్నం విఫలమైందని హెజ్‌బొల్లాకు చెందిన అల్ మనార్ టీవీ అనంతరం పేర్కొంది. దాడులు జరిగిన సమయంలో వఫిక్ ఆ రెండు భవనాల్లోనూ లేరని స్పష్టం చేసింది. తాజా దాడి, 2006 తర్వాత బీరుట్‌పై ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో అత్యంత తీవ్రమైందని పరిశీలకులు అంటున్నారు. ఇటీవల బీరుట్ చుట్టుపక్కల ప్రాంతాల్లో ఇజ్రాయెల్ నిర్వహించిన భీకర దాడుల్లో హెజ్‌బొల్లా నేత హస్సన్ నస్రల్లా సహా పలువురు కమాండర్లు ప్రాణాలు కోల్పోవడం తెలిసిందే. హెజ్‌బొల్లా గురు వారం ఇజ్రాయెల్ ఉత్తర ప్రాంతంపై రాకెట్లు, డ్రోన్లను ప్రయోగించింది. డ్రోన్లను మధ్యలోనే అడ్డుకున్నట్లు ఇజ్రాయెల్ ఆర్మీ తెలిపింది. మరో వైపు, భూతల, వైమానిక, క్షిపణి దాడులతో హెజ్‌బొల్లా లక్ష్యాలపై ఇప్పటికే విరుచు కుపడుతున్న ఇజ్రాయెల్ సముద్రంపై నుంచి కూడా దాడులకు పాల్పడుతుందని సమాచారం.

ఇద్దరు లెబనాన్ సైనికులు మృతి

లెబనాన్‌లోని బింట్ జబెయిల్ ప్రావిన్స్ కఫ్రాలోని ఆర్మీ చెక్ పాయింట్‌లోని భవనంపై శుక్రవారం ఇజ్రాయెల్ వైమానిక దాడిలో ఇద్దరు సైనికులు చనిపోగా ముగ్గురు గాయపడ్డారు.

ఐరాస బలగాలపై మళ్లీ కాల్పులు

లెబనాన్‌లో ఐరాస శాంతి పరిరక్షక దళాల (యూఎన్ఐఎఫ్ఐఎల్)పై ఇజ్రాయెల్ బలగాలు శుక్రవారం మరోసారి దాడులకు పాల్పడ్డాయి. నఖౌరా పట్టణంలోని యూఎన్ఐఎఫ్ఐఎల్ ప్రధాన కార్యాలయం అబ్జర్వేషన్ పోస్ట్‌పై జరిగిన కాల్పుల్లో ఇద్దరు సభ్యులు గాయపడ్డారు. ఒకరు టైర్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని ఐరాస తెలిపింది. అదేవిధంగా, దక్షిణ లెబనాన్‌లో ఐరాస గుర్తించిన 120 కిలోమీటర్ల బ్లూలైన్‌ను దాటి ఇజ్రాయెల్ ఆర్మీ బుల్డోజర్లు, యుద్ధ ట్యాంకులు చొచ్చుకువచ్చాయని ఐరాస శుక్రవారం తెలిపింది.

ఫైరింగ్ శిక్షణలో అపశ్రుతి

- ఇద్దరు అగ్నివీర్‌లు మృత్యువాత
- కోర్ట్ ఆఫ్ ఎంక్వైరీకి ఆర్మీ ఆదేశం

నాసిక్: మహారాష్ట్రలోని దేవ్‌లాలీ ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్‌లో శిక్షణ సమయంలో చోటుచేసుకున్న ఘటనలో ఇద్దరు అగ్నివీర్‌లు ప్రాణాలు కోల్పోయారు. మృతులను హైదరాబాద్‌లోని ఆర్టిలరీ సెంటర్‌కు చెందిన వారిగా గుర్తించారు. నాసిక్ జిల్లాలోని దేవ్‌లాలీ ఫైరింగ్ రేంజ్‌లో శుక్రవారం అగ్నివీర్‌లకు ఫీల్డ్ గన్ ఫైరింగ్ శిక్షణ ఇస్తున్నారు. అనుకోకుండా పేలి తూటాలు తగలడంతో గన్నర్ గోహిల్ విశ్వరాజ్ సిన్హ్(20), గన్నర్ సైకత్(21) తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే వీరిని దేవ్‌లాలీలోని ఆస్పత్రికి తరలించారు. వారు అప్పటికే చనిపో యినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ మేరకు హవల్దార్ అజిత్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రమాదవశాత్తు చోటుచేసుకున్న మరణాలుగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు దేవ్‌లాలీ క్యాంప్ పోలీసులు తెలిపారు. ఘటనపై ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటనపై కోర్ట్ ఆఫ్ ఎంక్వైరీకి ఆదేశించారు.


57 ఏళ్ల నమ్మకం | 144 షోరూమ్స్ | 20 నగరాలలో
విజయ్ సేల్స్
Shop On www.vijaysales.com
ఉచిత డెలివరీ
₹1* డౌన్ పేమెంట్
ఎలక్ట్రానిక్స్‌కు సరికొత్త చిరునామా
విజయ్ సేల్స్ ఇప్పుడు
పంజాగుట్టలో
దసరా శుభాకాంక్షలు
నేడే ప్రారంభం
ఉదయం 11.30 ని
దిగువ గ్రౌండ్ ఫ్లోర్
జీవీకే సెంటర్ పాయింట్
(హైదరాబాద్ సెంట్రల్)
HDFC BANK
INSTANT DISCOUNT UPTO ₹4,500*
WITH EASYEMI ON HDFC BANK DEBIT / CREDIT CARDS
Buy a Television & Get upto ₹5,000 Flight Voucher*
No Cost EMI
Valid on BRAND Full Swipe & EMI on TVs above ₹ 30,000
Upto ₹22,500/- Cashback Instant Discount & Cashback on Credit Card / Debit Card & Paper Finance
RBL BANK HSBC YES BANK IDFC FIRST Bank BOBCARD DBS pnb IndusInd Bank HDFC BANK FEDERAL BANK kotak AMERICAN EXPRESS HDB FINANCIAL SERVICES
WE ACCEPT EMI CARDS
Pre Book Offer
SANSUI
FOUNDED IN JAPAN | MADE FOR INDIA
100 (254 cm)
4K QLED
Price ₹4,99,900
Pre Book Price
₹2,75,000
CASHBACK UPTO ₹10,000
DOWN PAYMENT ₹91,666 | EMI ₹22,917 x 8 months
Pre Book Offer Valid From 12th to 15th October and Limited Stocks Delivery Starts From 21st October
CHOOSE FROM WIDE RANGE OF TELEVISIONS
RANGE AVAILABLE FROM 32 (80cm) ONWARDS
UPTO 26% CASHBACK UPTO ₹26,000
OLED | QLED | QNED | Neo QLED | NanoCell | Google TV | webOS | TIZEN | XR Mini LED
REDMI NOTE 13 PRO 5G 8GB | 128GB
VSP ₹22,999
CASHBACK ₹3,000*
EFFECTIVE PRICE (AFTER ABOVE CASHBACK) ₹19,999
CMF by NOTHING
NOTHING PHONE 1 5G 8GB | 128GB
VSP ₹16,499
CASHBACK ₹2,000*
EFFECTIVE PRICE (AFTER ABOVE CASHBACK) ₹14,499
ONEPLUS
NORD CE4 LITE 5G 8GB | 256GB
VSP ₹20,999
CASHBACK ₹1,000*
OFFER PRICE ₹19,999
FREE ONEPLUS BULLETS WIRELESS Z2
iPhone
Product | Vijay Sales Price* | Effective Price*
iPhone 16 | ₹ 79,900 | ₹ 74,900
iPhone 16 Plus | ₹ 89,900 | ₹ 84,900
iPhone 15 | ₹ 66,500 | ₹ 62,500
iPhone 15 Plus | ₹ 75,900 | ₹ 71,900
iPhone 13 | ₹ 47,500 | ₹ 45,500
0 Down Payment & Upto 24 Months No Cost EMI | Cashback Upto ₹5,000 | SBI card
Exchange Bonus Upto ₹8,000 CASHIFY
ASUS
ROG, STRIX, ZENBOOK TUF GAMING, ZEPHYRUS DUO
• Cash Back Upto ₹ 4,000/-*
• Upto 18 Months EMI Options
• Asus Wireless Silent Mouse MW103 @ ₹ 99*
• Asus CW101 Keyboard+Mouse @ ₹ 999*
• Asus KW100 Marshmallow Keyboard @ ₹ 1,599*
Lenovo
LENOVO GAMING, YOGA SERIES, SLIM 5 & FLEX 5, LOQ
• YOGA 9, Yoga Pro, Yoga Slim 7X and Legion: 10% upto ₹ 10,000/- Cash Back
• Yoga 7/ Slim 7 (Ultra 7) and IP Pro 5: 10% upto ₹ 8,000/- Cash Back
• Yoga (others), Slim 5, Flex 5 and LOQ: 5% upto ₹ 5,000/-
• Exchange Bonus upto ₹ 25,000/-*
DELL Technologies
INSPIRON, INSPIRON GAMING, XPS, ALIENWARE
• Cash Back Upto ₹ 10,000/-*
• Upto 9 Months No Cost EMI Option*
• 1 Year Additional Dell Warranty @ ₹ 499/-*
• 1st Year ADP @ ₹ 99/-*
• Dell Wireless Keyboard and Mouse Combo @ ₹ 199/-*
hp
PAVILION, VICTUS, SPECTRE, OMEN, ENVY
• Cash Back Upto ₹ 8,000/- (Terms & Conditions Apply)
• Exchange Bonus Upto ₹ 10,000/-
• Extended Warranty on select SKU @ ₹ 365 /-
acer
ASPIRE, SWIFT, SPIN, NITRO, PREDATOR
• Upto ₹ 5,000/-* Cash Back (On Select Cards/ Paper Finance)
• No Cost / Low Cost EMI
• 2 Year Acer Gaming Warranty Starting @ ₹ 1,999/-
WIDE RANGE OF REFRIGERATORS
UPTO 20% Cashback* UPTO ₹20,000* on Side by Side
UPTO 20% Cashback* UPTO ₹15,000* on Frost Free
UPTO 10% Cashback* UPTO ₹2,500* on Direct Cool
WIDE RANGE OF WASHING MACHINES
UPTO 20% Cashback* UPTO ₹8,000* on Top Load
UPTO 20% Cashback* UPTO ₹9,000* on Front Load
UPTO 5% Cashback* UPTO ₹2,000* on Semi Automatic
WIDE RANGE OF KITCHEN APPLIANCES
WIDE RANGE OF ACCESSORIES & SMART WATCHES
PLAYSTATION 5 DEALS
₹49,990/-
JBL HARMAN
2.1 Channel SOUNDBAR CINEMA SB190
UPTO 45% OFF*
CONVECTION MICROWAVE OVENS
STARTING FROM ₹9,490
LED TVs | Large Appliances | Air Conditioners
Mobiles | Laptops | Accessories
Kitchen Appliances
విజయ్ సేల్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్
హైదరాబాద్ | వరంగల్ | విజయవాడ | విశాఖపట్నం | రాజమండ్రి | తిరుపతి | కాకినాడ | ముంబై | ఢిల్లీ | థానే | నవీ ముంబై | పూనే | సూరత్ | వడోదర | అహ్మదాబాద్ | గురుగ్రామ్ | ఫరీదాబాద్ | నోయిడా | ఇందిరాపురం
ఎస్ఆర్ రావు నగర్ | అత్తాపూర్ | బిహెచ్ఇఎల్ | చంపాపేట్ | చాంద్రాయణగుట్ట (హాఫీజ్ బాబా నగర్ మెయిన్ రోడ్డు) | హస్తినాపురం | హయాత్‌నగర్ | కర్మాన్‌ఘాట్ | కొత్తపేట | కొండాపూర్ | కూకట్‌పల్లి | మలక్‌పేట్ | మదీనాగూడ | మెహిదీపట్నం | మైలార్‌దేవ్‌పల్లి | నాగారం | నాగోల్ | నల్లకుంట | నాచారం | పీర్జాదిగూడ (బోడుప్పల్) | షా అలీ బండ | సుచిత్ర క్రాస్ రోడ్స్ | సన్ సిటీ | టోలిచౌకి | వనస్థలిపురం | వరంగల్ | హనమకొండ
SCAN FOR STORES
Scan to Shop Online www.vijaysales.com
*Conditions apply. This offer includes all other discounts also. No other offer can be clubbed with this offer. Images shown are for illustrative purpose only. Offer till stocks last. Finance offer applicable at the sole discretion of Financier. #Processing Fees and other charges is applicable as per Financier. For Paper Finance: Please bring Aadhaar Card, Pan Card, Electric Bill & Cancelled Cheque. Offer is based on minimum transactions slabs defined by Finance company. Kindly speak to our store sales staff for the "Terms and Conditions" of all the bank offers, and for the respective Instant Discount/Cashback amounts applicable on each Bank. No Cibil means new to credit. Valid on BRAND FULL SWIPE / EMI & Bank EMI on Purchase of Television above ₹ 30,000. For corporate bookings or bulk orders, please mail us at corporatesales@vijaysales.com.

ఎంఐఎం నాయకులపై కేసుల ఉపసంహరణ

హుబ్బళ్లి అల్లర్ల ఘటనపై కర్ణాటక ప్రభుత్వం నిర్ణయం

బెంగళూరు: హుబ్బళ్లి పట్టణంలో పోలీసుస్టేషన్‌పై దాడి, అల్లర్లలో క్రిమినల్ కేసులను ఉపసంహరించుకోవాలని కర్ణాటక ప్రభుత్వం నిర్ణయించింది. అల్లరి మూకలను ప్రేరేపించినందుకు ఎంఐఎం నాయకుడు మొహమ్మద్ ఆరిఫ్‌తో పాటు మరో 138 మందిపై ఉన్న 43 కేసులను ఉపసంహరించుకోవాలని కర్ణాటక కేబినెట్ గురువారం నిర్ణయించింది. కేసులను విరమించుకోవాలని హోంమంత్రి జి.పరమేశ్వరను అంజుమన్-ఇ-ఇస్లామ్ అభ్యర్థించడంతో సర్కారు ఈ నిర్ణయం తీసుకుంది. ఏప్రిల్ 16, 2022లో ఒక సోషల్ మీడియా పోస్టుతో ఉద్రిక్తతలు తలెత్తాయి. మసీదుపై కాషాయజెండా రెపరెపలాడుతున్నట్లు ఒకరు పోస్టు పెట్టడంతో స్థానిక ముస్లింలు కోపోద్రిక్తులయ్యారు. ఓల్డ్ హుబ్బళ్లి పోలీసుస్టేషన్‌ను చుట్టుముట్టి.. నిందితుడిని తమకు అప్పగించాలని డిమాండ్ చేశారు. అక్కడికక్కడే అతన్ని చంపేస్తామని పట్టుబట్టారు. అతనికి రక్షణ కల్పిస్తున్న పోలీసులను కూడా వదలబోమని హెచ్చరించారు. పోలీసుస్టేషన్‌లోకి చొరబడే ప్రయత్నం చేశారు. దుడ్డుకర్రలు, రాళ్లతో పోలీసులపై దాడికి దిగారు. విషయం వేగంగా వ్యాప్తిచెంది వేలాదిగా ముస్లింలు రోడ్డెక్కారు. విధ్వంసానికి పాల్పడ్డారు. ఈ అల్లర్లలో ప్రభుత్వ ఆస్తులకు నష్టం వాటిల్లడంతో పాటు నలుగురు పోలీసులు గాయపడ్డారు. పలు వాహనాలను దహనం చేశారు. హత్యాయత్నం, అల్లర్లకు పాల్పడటం, ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులను ధ్వంసం చేయడం తదితర కేసులు నమోదయ్యాయి.

బుజ్జగింపునకు పరాకాష్ట: ప్రహ్లాద్ జోషి

'దురదృష్టవశాత్తు కాంగ్రెస్ పార్టీ బుజ్జగింపు రాజకీయాలను పరాకాష్టకు తీసుకెళ్లింది. ఉపా చట్టం కింద నమోదై, ఎన్ఐఏ కోర్టులో విచారణ జరుగుతున్న కేసులను ఉపసంహరించుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇలాంటి కేసులను ఉపసంహరించలేదు. అయినా బుజ్జగించడానికి ఈ నిర్ణయం తీసుకున్నారు'అని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఉపసంహరణ అధికారాలు ఉన్నాయని, హోంమంత్రి నాయకత్వంలోని కేబినెట్ సబ్‌కమిటీ విచక్షణాధికారాల మేరకు తీసుకున్న నిర్ణయాన్ని మంత్రివర్గం ఆమోదించిందని ముఖ్యమంత్రి సిద్దరామయ్య సమర్థించుకున్నారు.

మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికల్లోనూ క్లీన్‌స్వీప్

కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా

బిలాస్‌పూర్: హరియాణాలో మాదిరిగానే మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీలకు త్వరలో జరిగే ఎన్నికల్లోనూ బీజేపీ క్లీన్‌స్వీప్ సాధించడం ఖాయమని ఆ పార్టీ చీఫ్, కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా నొక్కి చెప్పారు. శుక్రవారం ఆయన హిమాచల్ ప్రదేశ్‌లోని బిలాస్‌పూర్‌లో ఉన్న ప్రఖ్యాత శ్రీ నైనాదేవి ఆలయంలో కంజక్ పూజల్లో పాల్గొన్నారు. అనంతరం పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సారథ్యంలోని బీజేపీ ప్రభుత్వ పాలనపై ప్రజలు సంతోషంతో ఉన్నారని చెప్పారు. హరియాణా, జమ్మూకశ్మీర్‌లలో బీజేపీ ఎంతో సాధించిందని, ఇందుకు ప్రజల సహకారమే కారణమన్నారు. హరియాణాలో అసెంబ్లీ ఎన్నికల వేళ క్షేత్ర స్థాయి పరిస్థితులకు విరుద్ధంగా కొందరు భ్రమలు కల్పించారని ఆయన ఆరోపించారు. చివరికి బీజేపీయే విజయం సాధించిందని చెప్పారు. రాష్ట్ర యువత, రైతులు, మహిళలు, ఇతర వర్గాల ప్రజలు ప్రతిపక్ష పార్టీలకు తగిన రీతిలో బుద్ధి చెప్పారని నడ్డా అన్నారు. జమ్మూకశ్మీర్‌లో కూడా బీజేపీ 29 సీట్లు గెలుచుకోవడంతోపాటు ఓటింగ్ శాతం సైతం పెంచుకుందని వివరించారు. ఆర్టికల్ 370 రద్దు, ప్రజాస్వామ్య ప్రక్రియకు ప్రజలు మద్దతిస్తున్నారనేందుకు జమ్మూకశ్మీర్‌లో నమోదైన 60 శాతం పైగా ఓటింగే నిదర్శనమని నడ్డా తెలిపారు. బీజేపీ హయాంలో ఉగ్రవాదాన్ని కేవలం అదుపులోకి ఉంచడమే కాదు, పూర్తిగా నిర్మూలిస్తుందని కూడా ఆయన స్పష్టం చేశారు.

మహిళ దుస్తులు నచ్చలేదని 'యాసిడ్ దాడి' బెదిరింపు

యువకుడిని ఉద్యోగం నుంచి తొలగించిన యాజమాన్యం

బెంగళూరు: ఓ మహిళ తనకు నచ్చిన దుస్తులు వేసుకున్నందుకు.. యాసిడ్ పోస్తానని సోషల్ మీడియాలో బెదిరించిన ఓ వ్యక్తిని అతని యాజమాన్యం ఉద్యోగం నుంచి తొలగించింది. పోలీసులకు ఫిర్యాదు కూడా చేసింది. ''అతనికి నచ్చని దుస్తులు వేసుకున్నందుకు యాసిడ్ పోస్తానని నా భార్యను నికిత్‌శెట్టి అనే వ్యక్తి బెదిరిస్తున్నాడు, వెంటనే ఈ వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి''అని జర్నలిస్ట్ షాబాజ్ అన్సార్ ఎక్స్‌లో పోస్టు చేశారు. దీనికి కర్ణాటక అధికారులను ట్యాగ్ చేశారు. దీంతో నెటిజన్స్ మహిళకు మద్దతుగా నిలిచారు. నికిత్ శెట్టిపై చర్యలు తీసుకోవాలని అతడు ఉద్యోగం చేస్తున్న సంస్థ ఎటియోస్ డిజిటల్ సర్వీసెస్‌కు విజ్ఞప్తి చేశారు. దీనిపై నికిత్ శెట్టి యాజమాన్యం స్పందించింది. అతడిని ఉద్యోగం నుంచి తొలగించింది. ''మా ఉద్యోగి మరో వ్యక్తి దుస్తుల ఎంపిక గురించి బెదిరించడం మాకు బాధ కలిగించింది. ఈ ప్రవర్తన ఆమోదయోగ్యం కాదు. ఇది మా విలువలకు విరుద్ధం. మేం నికిత్ శెట్టిని తొలగిస్తున్నాం. అతనిపై ఫిర్యాదు చేశాం. కేసు నమోదు అయ్యింది''అని ఎటియోస్ డిజిటల్ సర్వీసెస్ తెలిపింది. అయితే తన భార్యను బెదిరించిన వ్యక్తిపై చర్యలు తీసుకున్న కంపెనీకి, అందుకు మద్దతు తెలిపిన పలువురు నెటిజన్స్‌కు అన్సార్ కృతజ్ఞతలు తెలిపారు.

సిండికేట్ కైవశం!

ఏపీ మద్యం టెండర్లలో టీడీపీ నేతలదే మొత్తం హవా

- ముగిసిన దరఖాస్తుల ప్రక్రియ
- 3,396 దుకాణాలకు 87,116 మాత్రమే దరఖాస్తుల దాఖలు
- తెలంగాణలో గత ఏడాది 2,620 షాపులకే 1.50లక్షలకు పైగా దరఖాస్తులు



సాక్షి, అమరావతి/సాక్షి నెట్‌వర్క్: రాష్ట్రంలో టీడీపీ మద్యం సిండికేటే పైచేయి సాధించింది. ప్రైవేటు మద్యం దుకాణాలకు లైసెన్సుల ప్రక్రియను ఆ 'పచ్చ'ముఠా పూర్తిగా హైజాక్ చేసేసింది. ప్రభుత్వ ముఖ్య నేత పన్నాగం.. మంత్రులు, అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు టెండర్ల వైపు ఇతరులెవ్వరూ కన్నెత్తి చూడకుండా ఎప్పటికప్పుడు వారిని అడుగడుగునా అడ్డుకుంటూ హడలెత్తించారు. తద్వారా.. రాష్ట్రంలో మద్యం వ్యాపారం ద్వారా భారీ దోపిడీకి మొదటి అంకాన్ని అనుకున్నది అనుకున్నట్లుగా పూర్తిచేశారు. దీంతో రాష్ట్రంలో 3,396 మద్యం దుకాణాల లైసెన్సుల కోసం దరఖాస్తుల ప్రక్రియ శుక్రవారం సాయంత్రంతో ముగిసింది. మొత్తం 87,116 దరఖాస్తులు రాగా.. వాటిలో దాదాపు 99 శాతం టీడీపీ మద్యం సిండికేట్‌వే. సాధారణ వ్యాపారులు దరఖాస్తులు దాఖలు చేయకుండా.. అదే సమయంలో తమలో తామే పోటీపడినట్లు బిల్డప్ ఇస్తూ మద్యం దుకాణాలకు దరఖాస్తుల ప్రక్రియను ఏకపక్షంగా పూర్తిచేశారు. ఇక లాటరీ ద్వారా టీడీపీ సిండికేట్ ఏకపక్షంగా మొత్తం 3,396 దుకాణాలను దక్కించుకోవడం.. ఆ తర్వాత యథేచ్ఛగా మద్యం ఏరులను పారిస్తూ భారీ దోపిడీకి తెగబడటమే తరువాయి.

టీడీపీ మంత్రులు, ఎమ్మెల్యేల దందా..

2014–19 కంటే రెట్టింపు స్థాయిలో మద్యం వ్యాపారం ద్వారా దోపిడీయే లక్ష్యంగా అధికార టీడీపీ కూటమి మద్యం దుకాణాల టెండర్ల ప్రక్రియను శాసించింది. ఎందుకంటే ఏకంగా ముఖ్యనేతే ఇందుకు పచ్చజెండా ఊపడంతో ఇక మంత్రులు, ఎమ్మెల్యేలు అడ్డూ అదుపులేకుండా చెలరేగిపోయారు. శ్రీకాకుళం నుంచి అనంతపురం జిల్లా వరకు టీడీపీ మద్యం సిండికేట్‌ను ఏర్పాటుచేశారు. మంత్రులు, ఎమ్మెల్యేలు చెప్పినవారు తప్ప ఇతరులెవరూ దరఖాస్తులు చేయడానికి వీల్లేదని హెచ్చరికలు జారీచేశారు. కాదని ఎవరైనా దరఖాస్తు చేసినా వారికి మద్యం దుకాణాల ఏర్పాటుకు ఎవరూ షాపులు అద్దెకు ఇవ్వకూడదని బహిరంగంగానే ప్రకటించారు. ఇక ఇతరులు తమ సొంత దుకాణాల్లో ఏర్పాటుచేసుకుంటే ఎక్సైజ్ శాఖ అధికారులతో తరచూ తనిఖీలు, దాడులతో వేధిస్తామని అల్టిమేటం జారీచేశారు. అయినా కొందరు దరఖాస్తులు దాఖలు చేసేందుకు ప్రయత్నించగా టీడీపీ నేతలు, కార్యకర్తలు వారిపై దాడులు, దౌర్జన్యాలకు తెగబడి బెదరగొట్టారు. దీంతో అసలు టెండర్లు దాఖలు చేసేందుకు సాధారణ వ్యాపారులెవరూ సాహసించలేదు. నిజానికి.. టెండర్ల ప్రక్రియలో మొదటి వారం రోజులు ఒక్కో దుకాణానికి సగటున 10 కూడా దరఖాస్తులు రాలేదు. దీంతో టీడీపీ సిండికేట్ వ్యవహారం బహిరంగ దందాగా మారింది. ఆ తర్వాత ప్రజల్ని మభ్యపెట్టేందుకు ప్రభుత్వ ముఖ్యనేత కొత్త ఎత్తుగడ వేశారు. దరఖాస్తుల సంఖ్య కొంత పెంచాలని.. కానీ, అవి కూడా టీడీపీ సిండికేట్ సభ్యులవే ఉండేలా చూడాలన్నారు. తద్వారా ఒక్కో మద్యం దరఖాస్తుకు రూ.2 లక్షల వరకు నాన్ రిఫండబుల్ డిపాజిట్ భరించాలన్నారు. ఎలాగూ మద్యం దందా ద్వారా విచ్చలవిడి దోపిడీకి పచ్చజెండా ఊపాం కదా అని అసలు లోగుట్టు చెప్పారు. ఫలితంగా.. టీడీపీ సిండికేట్ సభ్యులే ఒక్కొక్కరు వేర్వేరు పేర్లతో దరఖాస్తులు దాఖలు చేశారు.

దాచినా దాగని దందా..

ఇక టీడీపీ మద్యం సిండికేట్ దందాకు ఎంతగా కనికట్టు చేయాలని చూసినా కుదరలేదు. తెలంగాణతో పోల్చిచూస్తే రాష్ట్రంలో ఈ దరఖాస్తుల ప్రక్రియ ఎంత ఏకపక్షంగా సాగిందన్నది స్పష్టమవుతోంది. విస్తీర్ణపరంగా ఆంధ్రప్రదేశ్ కంటే చిన్నదైన తెలంగాణలో మద్యం దుకాణాల సంఖ్య కూడా తక్కువే. తెలంగాణలో గత ఏడాది మొత్తం 2,620 మద్యం దుకాణాలకు టెండర్లు పిలవగా ఏకంగా 1.50 లక్షలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. అంటే.. ఒక్కో మద్యం దుకాణానికి సగటున 57 దరఖాస్తులు దాఖలయ్యాయి. కానీ, ఆంధ్రప్రదేశ్‌లో అంతేకంటే అధికంగా 3,396 మద్యం దుకాణాల లైసెన్సులకు దరఖాస్తులు పిలిచారు. కానీ, దరఖాస్తులు మాత్రం కేవలం 87,116 మాత్రమే రావడం గమనార్హం. అంటే సగటున ఒక మద్యం దుకాణానికి 25 మాత్రమే వచ్చాయి. చివరికి.. ఆ దరఖాస్తులు కూడా టీడీపీ సిండికేట్‌వే.



జిల్లాల వారీగా మద్యం షాపుల సంఖ్య, వచ్చిన దరఖాస్తులు

జిల్లా	మద్యం దుకాణాలు	దరఖాస్తులు
శ్రీ సత్యసాయి	87	1,399
తిరుపతి	227	3,659
బాపట్ల	117	2,064
అన్నమయ్య	111	2,106
ప్రకాశం	171	3,397
పల్నాడు	129	2,577
నంద్యాల	105	2,155
కాకినాడ	155	3,204
ఎస్పీఎస్ఆర్ నెల్లూరు	182	3,791
చిత్తూరు	104	2,242
అనంతపురం	136	3,022
వైఎస్సార్	139	3,169
కృష్ణా	123	2,810
అనకాపల్లి	136	3,178
విశాఖపట్నం	155	3,890
పార్వతీపురం మన్యం	52	1,375
శ్రీకాకుళం	158	4,551
అల్లూరి సీతారామరాజు	40	1,179
బీఆర్ అంబేడ్కర్ కోనసీమ	133	3,980
కర్నూలు	99	3,007
పశ్చిమ గోదావరి	175	5,362
విజయనగరం	153	5,235
తూర్పు గోదావరి	125	4,289
గుంటూరు	127	4,372
ఏలూరు	144	5,339
ఎన్టీఆర్	113	5,764
మొత్తం	3,396	87,116

'బెల్టు'లూ బార్లా..

ఇదిలా ఉంటే.. రాష్ట్రవ్యాప్తంగా ఒక్కో పంచాయతీలో రెండు నుంచి ఆరు వరకు బెల్టుషాపులను ఏర్పాటుచేసేందుకు కసరత్తు జరుగుతోంది. పట్టణాల్లో వీటి సంఖ్య మరింత పెరగనుంది. ఇప్పటికే గత టీడీపీ హయాంలోని బెల్టు షాపుల నిర్వాహకులతో సిండికేట్ సభ్యులు మంతనాలు మొదలుపెట్టారు. గతంలో టీడీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు బలంగా ఉన్న మద్యం సిండికేట్లే ఇప్పుడూ కీలకపాత్ర పోషిస్తున్నాయి. చాలాచోట్ల ఎమ్మెల్యేలు, వారి కుటుంబ సభ్యులు ఈ సిండికేట్లను వెనకుండి నడిపిస్తున్నారు. ఒకవేళ లాటరీలో బయటివారికి షాపులు దక్కినా వారి వ్యాపారం సజావుగా సాగాలంటే తమ సిండికేట్లలో కలవాల్సిందేనని సంకేతాలిస్తున్నారు. ఇక ఒక్కో బెల్టుషాపు ఏర్పాటుకు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు డిపాజిట్లు చెల్లించాలని చెబుతున్నట్లు తెలిసింది. డిపాజిట్ చేసిన వారికే తమ షాపుల పరిధిలో బెల్టుషాపు ఏర్పాటుకు అనుమతించి అందుకు అవసరమైన సరుకు ఇస్తామంటున్నారు. లేనిపక్షంలో దాడులు చేయించి కేసులు పెట్టిస్తామని హెచ్చరిస్తున్నట్లు సమాచారం. కాగా.. షాపుల నిర్వహణ తగ్గించుకునేందుకే సిండికేట్లు బెల్టుషాపుల ఎత్తుగడలు వేస్తున్నట్లు తెలుస్తోంది. సాధారణంగా ఒక్కో మద్యం షాపు నిర్వహణకు నెలనెలా అన్ని రకాల ఖర్చులకు లక్షకు పైగానే వ్యయమవుతుందని వారి అంచనా. ఈ భారాన్ని తగ్గించుకునేందుకే వారు 'బెల్టు' వైపు మొగ్గుచూపుతున్నారు.

చివరిరోజూ అరాచకమే..

టెండర్ల చివరిరోజైన శుక్రవారం కూడా రాష్ట్రవ్యాప్తంగా బెదిరింపుల పర్వం యథేచ్ఛగా కొనసాగింది. టెండరు కేంద్రాల వద్ద సినీఫక్కీ మాదిరిగా ఎమ్మెల్యేలు, మంత్రుల అనుచరులు మాటు వేశారు. ఉదయం నుంచి సాయంత్రం గడువు ముగిసే వరకూ అడుగడుగునా నిఘా ఏర్పాటుచేశారు. వేరే వ్యక్తి ఎవరైనా ఎక్సైజ్ కార్యాలయానికి వెళ్లినా.. టెండరు వేసేందుకు దరఖాస్తు తీసుకున్నా.. క్షణాల్లో వారిపై బెదిరింపులకు పాల్పడేలా మందీమార్బలాన్ని మోహరించారు. 'ఏం మిస్టర్.. ఎక్సైజ్ ఆఫీస్‌కి వెళ్లావట. దరఖాస్తు చేద్దామనా? అప్లై చేసి చూడు.. మా వాళ్లను కాదని టెండరు వేస్తే తాటతీస్తా'.. అంటూ కృష్ణాజిల్లాలోని ఓ ఎమ్మెల్యే మద్యం షాపు దరఖాస్తు కోసం వెళ్లిన వ్యక్తిని బెదిరించారంటే అధికార పార్టీ సిండికేట్ల అరాచకం ఏ స్థాయిలో ఉందో అర్థంచేసుకోవచ్చు. అలాగే.. ఇదే జిల్లా గన్నవరం, గుడివాడ, పామర్రు నియోజకవర్గాల్లో గతంలో షాపులు నిర్వహించుకున్న వారు లేదా స్థానికులు లేదా ఇతర పార్టీల వారు దరఖాస్తుకు వెళ్తే స్థానిక ఎమ్మెల్యేల అనుచరులు వార్నింగ్‌లు ఇచ్చి వెనక్కి పంపేశారు. ఇలాంటి ఘటనలు రాష్ట్రవ్యాప్తంగా చోటుచేసుకున్నాయి. ఒకవైపు అధికార పార్టీ ప్రజాప్రతినిధులు ఇలా యథేచ్ఛగా దౌర్జన్యాలకు పాల్పడుతుండగా మరోవైపు.. సామ, దాన, భేద దండోపాయాలనూ పోలీసుల ద్వారా కూటమి ప్రభుత్వం ప్రయోగించింది. చివరికి.. అధికార పార్టీ నేతలకూ ఈ హెచ్చరికలు తప్పలేదని భోగట్టా.

యూటర్న్ బాబూ.. సిగ్గు చేటు

- ఈవీఎంలపై ఎన్నిసార్లు మాట మారుస్తావ్?
- చంద్రబాబుపై మాజీ మంత్రి మేరుగు నాగార్జున ఆగ్రహం




సాక్షి, అమరావతి: ఎన్నికల్లో ఈవీఎంల వినియోగంపై లెక్కలేనన్ని సార్లు యూటర్న్ తీసుకున్న చంద్రబాబు.. ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతుండటం సిగ్గు చేటని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి మేరుగు నాగార్జున మండిపడ్డారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 2024 ఎన్నికల తర్వాత చాలా పార్టీలు, మేధావులతో పాటు, ప్రజల్లో కూడా ఈవీఎంలపై అనేక సందేహాలు వచ్చాయని ఆయన గుర్తు చేశారు. ప్రజల్లో వచ్చిన అనుమానాలు తీర్చే క్రమంలో అటు ప్రకాశం, ఇటు విజయనగరం జిల్లాల్లో తమ పార్టీ వీవీప్యాట్‌ల లెక్కింపు కోరిందన్నారు. ఎన్నికలు జరిగి నెలలు గడిచినా, ఆయా జిల్లాల్లో కొన్ని ఈవీఎంలు ఫుల్ ఛార్జింగ్‌తో ఉండడం.. పోల్ అయిన ఓట్లు, లెక్కించిన ఓట్ల మధ్య వ్యత్యాసాలు భారీగా ఉండటం అనుమానాలు మరింత బలపడేలా చేసిందని చెప్పారు. తాజాగా హరియాణ ఎన్నికల ఫలితాలు కూడా యావత్ దేశాన్ని ఆశ్చర్య చకితులను చేశాయంటూ వైఎస్ జగన్ ట్వీట్ చేశారని తెలిపారు. బ్యాలెట్ విధానంలో ఎన్నికలు జరిగితేనే ప్రజాస్వామ్యం విరాజిల్లుతుందని ఆకాంక్షించారని చెప్పారు. ఇటీవల 543 ఎంపీ స్థానాలకు ఎన్నికలు జరిగితే 530 సీట్లలో వీవీప్యాట్‌లకు, పోలైన ఓట్లకు మధ్య వ్యత్యాసం ఉందని ఏడీఆర్ అనే సంస్థ అధ్యయనంలో స్పష్టమైందని తెలిపారు. 362 నియోజకవర్గాల్లో 5 లక్షలకు పైగా ఓట్ల తేడా వచ్చిందని, 175 స్థానాల్లో 35,093 ఓట్లు అదనంగా లెక్కించారని తేలిందని చెప్పారు. మన రాష్ట్రంలో పోలైన ఓట్ల ప్రకారం ఎంపీ సీట్లలో 14 కూటమికి, 11 వైఎస్సార్‌సీపీకి రావాలని ఏడీఆర్ సంస్థ స్పష్టం చేస్తూ ఈసీకి నివేదికను పంపిందని తెలిపారు. ఇన్ని స్పష్టమైన ఆధారాలతో నివేదించినా ఈసీ నోరు మెదపక పోవడం అనుమానాలను కలిగిస్తోందని చెప్పారు. ఈవీఎంలపై చంద్రబాబు మాట్లాడిన మాటల వీడియోలను ఈ సందర్భంగా ప్రదర్శించారు.

సచివాలయం, ఆర్‌బీకే, ఆస్పత్రికి తాళమేసిన టీడీపీ నేతలు!

పలమనేరు: టీడీపీ నేతల అరాచకాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయనేందుకు గ్రామంలోని సచివాలయం, రైతు భరోసా కేంద్రం, ఆస్పత్రి సిబ్బందిని బయటకు పంపి.. ఆయా కార్యాలయాలకు తాళాలు వేసిన ఘటన అద్దం పడుతోంది. ఈ ఘటన చిత్తూరు జిల్లా పలమనేరు మండలంలోని జగమర్లలో గురువారం సాయంత్రం చోటుచేసుకోగా.. శుక్రవారం వెలుగుచూసింది. వివరాలిలా ఉన్నాయి. గ్రామంలోని ప్రజల సౌకర్యార్థం రచ్చబండ వద్ద వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ భవనాలను నిర్మించింది. ఈ కార్యాలయాల్లో మొత్తం 16మంది ఉద్యోగులు ఉన్నారు. గతంలో ఈ కార్యాలయాలకు దారితోపాటు.. సీసీ రోడ్డును సైతం గత ప్రభుత్వమే నిర్మించింది. గ్రామానికి చెందిన టీడీపీ నేతలు పక్కనే ఉన్న వైఎస్సార్‌సీపీకి చెందిన రెడ్డెప్పరెడ్డి సోదరుల పట్టా భూమిలో నుంచి దారి ఇవ్వాలంటూ గురువారం వాగ్వాదానికి దిగారు. ఇప్పటికే దారి ఉన్నప్పటికీ తన పట్టా భూమిలో ఎందుకు దారి వదలాలని సంబంధిత రైతు ప్రశ్నించారు. దీంతో పచ్చనేతలు దుర్భాషలాడుతూ.. సిబ్బందిని బయటకు పంపి.. సచివాలయం, రైతు భరోసా కేంద్రం, ఆస్పత్రికి తాళాలు వేశారు.

సిద్ధిదాయినిగా శ్రీశైల భ్రామరీ



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో జరుగుతున్న దసరా మహోత్సవాల్లో తొమ్మిదో రోజు శుక్రవారం సిద్ధిదాయిని స్వరూపంలో భ్రమరాంబాదేవిని అలంకరించారు. ఆలయం ముందుభాగంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై సిద్ధిదాయిని అమ్మవారిని కొలువుంచి అర్చకులు, వేదపండితులు ప్రత్యేక పూజలు చేసి, హారతులిచ్చారు. అలాగే స్వామి అమ్మవార్లను అశ్వవాహన సేవలో అలంకరించారు. అనంతరం అమ్మవారిని అశ్వవాహనంపై కొలువుంచి స్వామి అమ్మవార్లకు ఆలయ ఉత్సవం నిర్వహించి గ్రామోత్సవానికి తరలించారు.

తాను కన్నుమూస్తూ... మరో ఐదుగురికి ప్రాణదానం

ఆరిలోవ (విశాఖ జిల్లా): అతను మరణిస్తున్నా.. మరో ఐదుగురికి ప్రాణదానం చేశాడు. ఒడిశా రాష్ట్రం పర్లాకిమిడి జిల్లాకు చెందిన నరేష్ పట్నాయక్ (32) రెండు రోజుల క్రితం కళ్లు తిరిగి పడిపోయాడు. వెంటనే బంధువులు పర్లాకిమిడిలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. పరీక్షలు చేసిన వైద్యులు... నరేష్ పట్నాయక్ బ్రెయిన్‌లో తీవ్ర రక్తస్రావమైందని, మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం తీసుకువెళ్లాలని సూచించారు. ఈ మేరకు విశాఖపట్నంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా, ఇక్కడ వైద్యులు రెండు రోజులు చికిత్స అందించినా ప్రయోజనం లేకపోవడంతో బ్రెయిన్ డెడ్ అయినట్లు గుర్తించారు. జీవన్‌దాన్ ప్రతినిధులు నరేష్ కుటుంబ సభ్యులను సంప్రదించి అవయవదానంపై అవగాహన కల్పించారు. బాధను దిగమింగుకుని నరేష్ కుటుంబ సభ్యులు అవయవదానానికి అంగీకరించారు. ఆస్పత్రిలో వైద్యులు శుక్రవారం నరేష్ దేహం నుంచి ఊపిరితిత్తులు, గుండె, కిడ్నీలు, లివర్ తొలగించారు. వాటిని జీవన్‌దాన్ ప్రొటోకాల్ ప్రకారం ఐదుగురికి కేటాయించారు. గ్రీన్ చానెల్ ద్వారా వాటిని అవసరమైనవారికి వెంటనే తరలించారు.

పర్యావరణ హితం..

భారతీయ ఆహారం



ఇండియన్ ఫుడ్ ప్లేట్ ప్రపంచంలోనే అత్యుత్తమ ఆహారం

- ఇతర దేశాల ఆహార పద్ధతులు పర్యావరణానికి హానికరం
- భారత ఆహార పద్ధతులతో 2050 నాటికి పర్యావరణ హానిని తగ్గించొచ్చు
- భారత్ తర్వాత ఇండొనేసియా, చైనా ఆహార పద్ధతులకు మద్దతు

సాక్షి, అమరావతి: భారతీయ ఆహారం పర్యావరణ హితకారిణిగా ప్రపంచ గుర్తింపు పొందింది. ప్రపంచంలోని ప్రధాన దేశాల్లో (జీ 20 దేశాలు) పర్యావరణహిత పోషకాహార వినియోగంలో అగ్రగామిగా నిలిచింది. ఇండియన్ ఫుడ్ ప్లేట్ (భారతీయ ఆహారం) పర్యావరణ సమతౌల్యాన్ని కాపాడటంతో కీలక పాత్ర పోషిస్తోందని స్విట్జర్లాండ్‌కు చెందిన స్వచ్ఛంద సంస్థ ప్రపంచ వన్యప్రాణి ఫౌండేషన్ (డబ్ల్యూడబ్ల్యూఎఫ్) తన లివింగ్ ప్లానెట్ పరిశోధనలో తాజాగా వెల్లడించింది. భారత్‌లోని ఆహార పద్ధతులు, ఉత్పత్తి విధానాన్ని అన్ని దేశాలు అనుసరిస్తే భూమికి, భూ వాతావరణ రక్షణకు వేగంగా బాటలు పడతాయని తెలిపింది. తద్వారా 2050 నాటికి వాతావరణ మార్పులకు అడ్డుకట్ట వేయడంలో సహాయపడుతుందని సూచించింది. భారత్ తర్వాత ఇండొనేసియా, చైనాలో ఆహార పద్ధతులు పర్యావరణహితంతో కూడిన సుస్థిరమైనవని పేర్కొంది. వీటికి పూర్తి విరుద్ధంగా అమెరికా, అర్జెంటీనా, ఆస్ట్రేలియాల్లో అస్థిర ఆహార వినియోగ పద్ధతులు ఉన్నట్టు నివేదిక హెచ్చరించింది. 'పెరుగుతున్న ప్రపంచ జనాభాకు తగినంత పోషకాలతో కూడిన, ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించడం సాధ్యమే. కానీ, ప్రస్తుత ఆహార ఉత్పత్తుల వినియోగంలో మార్పులు రావాలంటే ఆహారపు అలవాట్లు మారాలి. మొక్కల ఆధారిత ఆహారాలు ఎక్కువగా, మాంసాహారాలు (జంతు ఆధారిత) తక్కువగా ఉండాలి'అని నివేదిక సూచించింది.

మొక్కల ఆధారిత ఆహారంతో మేలు!

ప్రస్తుతం బలమైన ఆర్థిక వ్యవస్థల్లోని ఆహార విధానాలు మిగిలిన దేశాలకు పాకితే పెను ప్రమాదం తప్పదని ఆ నివేదిక హెచ్చరించింది. ఆహార ఉత్పత్తుల ద్వారా వచ్చే ఉద్గారాలు గ్లోబల్ వార్మింగ్ పెరుగుదలను 1.5 డిగ్రీల సెల్సియస్‌కు పరిమితం చేయడంలో అవరోధంగా మారతాయని అభిప్రాయపడింది. భారతదేశంలో సంప్రదాయ ఆహారం ప్రోత్సాహంలో నేషనల్ మిల్లెట్ క్యాంపెయిన్ ఎంతగానో ఉపయోగపడిందని ప్రశంసించింది. వీటి వినియోగం ప్రజల ఆరోగ్య ప్రయోజనాలు, వాతావరణ సవాళ్లను ఎదుర్కోవడానికి అనుకూలంగా ఉన్నట్టు చెప్పింది. భారత్‌లోని శాకాహార, మాంసాహార సమ్మేళనంతో కూడిన విభిన్న ఆహార పద్ధతులు పర్యావరణాన్ని కాపాడుతున్నట్టు తెలిపింది. ఉత్తర భారత దేశంలో తృణ ధాన్యాలు, గోధుమ ఆధారిత రోటీలు, అప్పుడప్పుడు మాంసం వంటకాలు, దక్షిణాదిలో ప్రధానంగా అన్నం, ఇడ్లీ, దోస వంటి బియ్యం ఆధారిత ఆహారం, పశ్చిమ, తూర్పు, ఈశాన్య ప్రాంతాల్లో రకరకాల చేపలతో పాటు జొన్న, సజ్జలు, రాగి, గోధుమలు వంటి పురాతన మిల్లెట్లను స్వీకరించడం సుస్థిర ఆహార వినియోగాన్ని ప్రతిబింబిస్తోందని వివరించింది. అయితే ప్రపంచవ్యాప్తంగా కొవ్వు, చక్కెర పదార్థాల అధిక వినియోగంపై నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది. వాటి వినియోగం ద్వారా భూమిపై స్థూలకాయం పెను ప్రమాదంగా మారుతుందని హెచ్చరించింది. ప్రస్తుతం 250 కోట్ల మంది పెద్దలు ఉండాల్సిన బరువుకంటే ఎక్కువగా ఉన్నారని, 89 కోట్ల మంది ఊబకాయులు ఉన్నారని తెలిపింది.

తక్కువ భూమి వినియోగించాలి..

సుస్థిర ఆహార పద్ధతులతో పంటల ఉత్పత్తికి అవసరమైన భూమిని గణనీయంగా తగ్గించవచ్చని నివేదిక బలంగా చెబుతోంది. ఇది ప్రకృతి పునరుద్ధరణ, సహజ వనరుల రక్షణ, కర్బన ఉద్గారాల నియంత్రణ తదితర ప్రయోజనాలు కలుగుతాయని అభిప్రాయపడింది. భారత ఆహార పద్ధతులను ఇతర దేశాలు అనుసరిస్తే 2050 నాటికి ప్రపంచ ఆహార ఉత్పత్తికి ఒక భూమి (ఎర్త్)లో 0.84 కంటే తక్కువ అవసరం ఉంటుందని వివరించింది. అలా కాకుండా ఇతర దేశాల్లోని ఆహార ఉత్పత్తులు వినియోగానికి మన భూగ్రహం సరిపోదని, ఒకటి కంటే ఎక్కువే అవసరమవుతాయని హెచ్చరించింది. ఉదాహరణకు అర్జెంటీనా ఆహార పద్ధతులను అవలంభిస్తే ఆహార ఉత్పత్తులకు ఏడు భూగ్రహాలు కూడా సరిపోవు. అందుకే పప్పుధాన్యాలు, తృణధాన్యాలు, మొక్కల ఆధారిత ఆహారం, మాంసానికి ప్రత్యామ్నాయంగా అధిక పోషక విలువలు ఉండే ఆల్గే(నీటిలో పెరిగే మొక్కలు)లు ఆహారంలో వినియోగించాలని కోరుతోంది. ముఖ్యంగా వాతావరణాన్ని తట్టుకుని నిలబడే మిల్లెట్ పంటలను ప్రోత్సహించాలని సూచిస్తోంది. ప్రపంచంలో మిల్లెట్ల ఉత్పత్తిలో భారత్ వాటా 41శాతంగా ఉండటం విశేషం.

వివిధ దేశాల ఆహార పద్ధతులు ఇలానే కొనసాగితే 2050 నాటికి ఆహారం ఉత్పత్తికి అవసరమైన భూమి

దేశం	భూమి
భారత్	0.84 (ఒక భూమికంటే తక్కువ)
ఇండోనేసియా	0.90 (ఒక భూమి కంటే తక్కువ)
చైనా	1.77
జపాన్	1.86
సౌదీ అరేబియా	2.08
టర్కీ	2.11
సౌత్‌కొరియా	2.30
దక్షిణాఫ్రికా	2.94
మెక్సికో	3.03
జర్మనీ	3.03
రష్యా	3.42
యూరోపియన్ యూనియన్	3.52
యూకే	3.98
కెనడా	4.50
ఇటలీ	4.64
ఫ్రాన్స్	5.02
బ్రెజిల్	5.21
యూఎస్ఏ	5.55
ఆస్ట్రేలియా	6.83
అర్జెంటీనా	7.42

భూమి అంటే భూగ్రహం (ఎర్త్)

వైస్ కెప్టెన్‌గా బుమ్రా

కివీస్‌తో టెస్టు సిరీస్‌కు భారత జట్టు



ముంబై: సొంతగడ్డపై న్యూజిలాండ్‌తో జరిగే మూడు టెస్టుల సిరీస్‌లో పాల్గొనే భారత జట్టును శుక్రవారం ప్రకటించారు. 15 మంది సభ్యుల ఈ టీమ్‌కు రోహిత్ శర్మ కెప్టెన్ కాగా...పేస్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రాను వైస్ కెప్టెన్‌గా ఎంపిక చేశారు. సాధారణంగా భారత్‌లో జరిగే సిరీస్‌లకు వైస్ కెప్టెన్‌ను ప్రకటించే సాంప్రదాయం లేదు. ఇటీవల బంగ్లాదేశ్‌తో ముగిసిన టెస్టు సిరీస్‌కు కూడా వైస్ కెప్టెన్ ఎవరూ లేరు. అయితే ఈ సిరీస్ తర్వాత జరిగే ఆస్ట్రేలియా పర్యటనలో పెర్త్‌లో జరిగే తొలి టెస్టుకు రోహిత్ శర్మ వ్యక్తిగత కారణాలతో దూరం కానున్నాడని సమాచారం. ఈ నేపథ్యంలో కాస్త ముందుగా సన్నద్ధత కోసం అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ కివీస్‌తో పోరుకు బుమ్రాను ఎంపిక చేసింది. గతంలో ఒకే ఒక టెస్టులో భారత్‌కు సారథిగా వ్యవహరించిన బుమ్రా...శ్రీలంక, దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్‌లతో జరిగిన సిరీస్‌లలో వైస్ కెప్టెన్‌గా బాధ్యతలు నిర్వర్తించాడు. బంగ్లాతో సిరీస్‌లో ఉన్న 16 మంది సభ్యుల జట్టునుంచి ఒకే ఒక మార్పుతో కివీస్‌తో సిరీస్‌కు జట్టును ప్రకటించారు. పేసర్ యశ్ దయాళ్‌ను జట్టునుంచి తప్పించారు. ఇది మినహా మిగతా 15 మందిలో ఎలాంటి మార్పూ లేదు. సీనియర్ పేసర్ మొహమ్మద్ షమీ గాయం నుంచి ఇంకా పూర్తిగా కోలుకోలేదని తాజా జట్టు ప్రకటనతో అర్థమైంది. ఇరు జట్ల మధ్య ఈ నెల 16 నుంచి బెంగళూరులో తొలి టెస్టు జరుగుతుంది.

జట్టు వివరాలు: రోహిత్ శర్మ (కెప్టెన్), బుమ్రా (వైస్ కెప్టెన్), జైస్వాల్, గిల్, కోహ్లి, రాహుల్, సర్ఫరాజ్, పంత్, జురేల్, అశ్విన్, జడేజా, అక్షర్, కుల్దీప్, సిరాజ్, ఆకాశ్‌దీప్.

ట్రావెలింగ్ రిజర్వ్ ఆటగాళ్లు: నితీశ్ కుమార్ రెడ్డి, ప్రసిధ్ కృష్ణ, మయాంక్ యాదవ్, హర్షిత్ రాణా.

లాంఛనం ముగిసింది..!

- తొలి టెస్టులో ఇంగ్లండ్ విజయం
- ఇన్నింగ్స్, 47 పరుగులతో పాకిస్తాన్ చిత్తు
- బుధవారం నుంచి రెండో టెస్టు



ముల్తాన్: సొంతగడ్డపై తొలి టెస్టు మొదటి ఇన్నింగ్స్‌లో 556 పరుగులు చేసిన తర్వాత కూడా పాకిస్తాన్‌కు పరాయం తప్పలేదు. ఇంగ్లండ్‌తో తొలి టెస్టు నాలుగో రోజే రెండో ఇన్నింగ్స్‌లో 6 వికెట్లు కోల్పోయి దాదాపుగా మ్యాచ్‌ను చేజార్చుకున్న పాక్ ఆట చివరి రోజు లంచ్ లోపే ముగిసింది. శుక్రవారం మరో 68 పరుగులు జోడించిన పాక్ తర్వాతి 3 వికెట్లు చేజార్చుకుంది. జ్వరంతో ఆఖరి వరుస బ్యాటర్ అబ్రార్ అహ్మద్ బ్యాటింగ్‌కు దిగలేదు. దాంతో ఇన్నింగ్స్, 47 పరుగుల తేడాతో ఇంగ్లండ్ ఘన విజయం సాధించింది. మూడు టెస్టుల ద్వైపాక్షిక సిరీస్‌లో 1–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. శుక్రవారం 152/6 ఓవర్‌నైట్ స్కోరుతో ఆఖరి రోజు రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన పాకిస్తాన్ 54.5 ఓవర్లలో 220 పరుగులకే ఆలౌటైంది. ఓవర్‌నైట్ బ్యాటర్లు సల్మాన్ ఆగా (84 బంతుల్లో 63; 7 ఫోర్లు), ఆమిర్ జమాల్ (104 బంతుల్లో 55 నాటౌట్; 5 ఫోర్లు) అర్ధ సెంచరీలు పూర్తిచేసుకున్నారు. జట్టు స్కోరు 191 పరుగుల వద్ద సల్మాన్‌ను స్పిన్నర్ లీచ్ వికెట్ల ముందు దొరకబుచ్చుకోవడంతో ఏడో వికెట్‌కు 109 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. తర్వాత లీచ్... షాహిన్ షా అఫ్రిది (10), నసీమ్ షా (6)లను స్వల్ప వ్యవధిలో అవుట్ చేయడంతో పాక్ రెండో ఇన్నింగ్స్ ముగిసేందుకు ఎంతోసేపు పట్టలేదు. చివరి రోజు పడిన మూడు వికెట్లు జాక్ లీచ్ (4/30) ఖాతాలోకే వెళ్లాయి. షాన్ మసూద్ పగ్గాలు చేపట్టాక పాక్ వరుసగా ఆరు టెస్టుల్లో ఓడింది. సొంతగడ్డపై గత 11 టెస్టుల్లో ఇది ఏడో ఓటమి. చివరిసారిగా 2021 ఫిబ్రవరిలో దక్షిణాఫ్రికాపై పాక్ గెలిచింది.

1 టెస్టు చరిత్రలో తొలి ఇన్నింగ్స్‌లో 500 పైచిలుకు పరుగులు చేసి కూడా ఇన్నింగ్స్ తేడాతో ఓడిపోయిన తొలి జట్టుగా పాక్ రికార్డుల్లోకెక్కింది.

2 ఉపఖండంలో ఇంగ్లండ్‌తో ఇది రెండో ఇన్నింగ్స్ విజయం మాత్రమే. 1976లో తొలిసారి ఆ జట్టు భారత్‌ను ఇన్నింగ్స్ తేడాతో ఓడించింది.

హైదరాబాద్‌లో ధనాధన్‌కు సై





తొలి టి20లో సులువైన విజయం... రెండో టి20లో మరీ ఎదురు లేని ఆధిపత్యం... సిరీస్ గెలుచుకున్న తర్వాత ఇక మూడో టి20లో భారత్ చేయాల్సిందేముంది... అదే జోరు కొనసాగించి అభిమానులకు మరింత ఆనందం పంచడం... గత రెండు మ్యాచ్‌లు ఆడని ప్లేయర్లకు అవకాశం ఇవ్వడం... బంగ్లాదేశ్‌తో చివరి టి20కి ముందు భారత టీమ్ మేనేజ్‌మెంట్ ఆలోచన ఇది... మరో వైపు బంగ్లాదేశ్ పరిస్థితి మరీ పేలవం... టెస్టు సిరీస్‌ను 0–2తో కోల్పోయిన తర్వాత టి20 సిరీస్ కూడా చేజారిపోయింది... ఇక మిగిలింది ఏకైక మ్యాచ్‌లో ఎంతో కొంత మెరుగ్గా రాణించి పరువు కాపాడుకోవడం... ఈ నేపథ్యంలో హైదరాబాద్ అభిమానుల కోసం ధనాధన్ పోరుకు రంగం సిద్ధమైంది.

నేడు భారత్, బంగ్లాదేశ్ చివరి టి20

- దూకుడు మీదున్న టీమిండియా
- పరువు కాపాడుకునేందుకు బంగ్లా
- రా.గం.7:00 నుంచి స్పోర్ట్స్ 18, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

సాక్షి, హైదరాబాద్: ఏడాది ఆరంభంలో భారత్, ఇంగ్లండ్ మధ్య టెస్టు మ్యాచ్ వినోదాన్ని ఆస్వాదించిన నగర అభిమానులకు ఇప్పుడు దసరా రోజున టి20 ఆనందానికి సమయం ఆసన్నమైంది. ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ స్టేడియంలో నేడు భారత్, బంగ్లాదేశ్ జట్లు మూడో టి20 మ్యాచ్‌లో తలపడనున్నాయి. ఇప్పటికే సిరీస్ గెలుచుకున్న సూర్యకుమార్ బృందం క్లీన్‌స్వీప్‌పై దృష్టి పెట్టగా...ఒక్క మ్యాచ్‌లోనైనా నెగ్గి స్వదేశం వెళ్లాలని బంగ్లా భావిస్తోంది. అయితే టీమిండియా జోరు చూస్తే జట్టును నిలువరించడం ప్రత్యర్థికి దాదాపు అసాధ్యం కావచ్చు.

సూర్యకుమార్

హర్షిత్ రాణాకు చోటు!

సిరీస్‌లో తొలి రెండు మ్యాచ్‌లలో అవకాశం దక్కని ఆటగాళ్లు నలుగురు ఉన్నారు. వీరిలో ఇక్కడ ఎవరు ఆడతారనేది ఆసక్తికరం. మయాంక్ స్థానంలో మరో కొత్త ఆటగాడు హర్షిత్ రాణాను ఎంపిక చేయడం దాదాపు ఖాయంగా అనిపిస్తోంది. 2024 ఐపీఎల్‌లో కోల్‌కతా విజేతగా నిలవడంలో కీలక పాత్ర పోషించిన పేసర్ హర్షిత్‌కు తొలి అవకాశం ఇవ్వాలని కోచ్ గంభీర్ భావిస్తున్నాడు. స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి స్థానంలో లెగ్‌స్పిన్నర్ రవి బిష్ణోయ్‌ను కూడా ఆడించవచ్చు. ప్రస్తుత పరిస్థితిలో కీపర్ జితేశ్ శర్మకు చాన్స్ కష్టమే. అయితే హైదరాబాదీ ఆటగాడు తిలక్ వర్మను తుది జట్టులోకి ఎంచుకుంటారా చూడాలి. సామ్సన్, సూర్యకుమార్, రింకూ, పాండ్యా, పరాగ్‌లతో కూడిన బ్యాటింగ్ ఆర్డర్ మళ్లీ చెలరేగితే భారీ స్కోరు ఖాయం. సన్‌రైజర్స్ ప్లేయర్ అభిషేక్ శర్మకు ఈ మైదానంలో విధ్వంసకర బ్యాటింగ్ ప్రదర్శన చూపించిన రికార్డు ఉంది. అతడిని ఆపడం కూడా బంగ్లాకు కష్టమే.

గెలిపించేదెవరు?

బంగ్లాదేశ్ టి20 టీమ్ చాలా కాలంగా వైఫల్యాల్లోనే ఉంది. ఈ సిరీస్‌లో కూడా అది కొనసాగింది. ఏ ఒక్కరిలో కూడా జట్టును గెలిపించే సామర్థ్యం కనిపించడం లేదు. ఆటగాళ్లు మారినా జట్టు పరిస్థితి మారడం లేదు. అంతా సమష్టిగా విఫలమవుతున్నారు. ఢిల్లీ మ్యాచ్‌లో బౌలర్లలో పదును లేక భారత్ భారీ స్కోరు చేసే అవకాశం కల్పించగా, బ్యాటర్లెవరూ కనీస స్థాయి ప్రదర్శన ఇవ్వలేదు. పర్వేజ్, లిటన్ దాస్, కెప్టెన్ నజ్ముల్, తౌహీద్...ఎవరూ ఆడటం లేదు. ఈ సారి జాకీర్ స్థానంలో మహేదీకి అవకాశం దక్కవచ్చు. జట్టులో అందరికంటే సీనియర్ అయిన మహ్మదుల్లా ఈ మ్యాచ్‌తో అంతర్జాతీయ టి20లనుంచి రిటైర్ అవుతున్నాడు. చివరిదైన తన 141వ మ్యాచ్‌లోనైనా అతను చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ ఆడి జట్టును గెలిపిస్తాడా చూడాలి. మిరాజ్, తస్కిన్, తన్‌జీమ్‌లతో పాటు అనుభవజ్ఞుడైన ముస్తఫిజుర్ కూడా ప్రభావం చూపలేకపోతున్నాడు.



చెలరేగుతారా!

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆటగాడిగా నితీశ్ రెడ్డి ఇదే మైదానంలో చూపించిన దూకుడు అతనికి భారత జట్టులో చోటు కల్పించింది. ఇప్పుడు టీమిండియా ప్లేయర్‌గా అతను తొలిసారి ఉప్పల్ మైదానంలో బరిలోకి దిగబోతున్నాడు. ఈ ఆంధ్ర క్రికెటర్ బంగ్లాపై గత మ్యాచ్‌లో విధ్వంసం సృష్టించాడు. ఇక్కడా అదే ధాటిని ప్రదర్శించాలని అభిమానులు కోరుకుంటున్నారు. ఐపీఎల్‌లో ముంబైకి ఆడే మరో హైదరాబాదీ తిలక్ వర్మ కూడా సొంత గడ్డపై బరిలోకి దిగాలని ఆశిస్తున్నాడు. వీరిద్దరూ బాగా ఆడితే దసరా రోజు అభిమానులకు పరుగుల పండగే.

తుది జట్ల వివరాలు (అంచనా)

భారత్: సూర్యకుమార్ (కెప్టెన్), సామ్సన్, అభిషేక్, నితీశ్ రెడ్డి, రింకూ, పాండ్యా, పరాగ్/ తిలక్, సుందర్, వరుణ్, అర్ష్‌దీప్, హర్షిత్.

బంగ్లాదేశ్: నజ్ముల్ (కెప్టెన్), పర్వేజ్, లిటన్‌దాస్, తౌహీద్, మహ్మదుల్లా, మిరాజ్, మహేదీ, రిషాద్, తన్‌జీమ్, తస్కిన్, ముస్తఫిజుర్.

పిచ్, వాతావరణం

ఉప్పల్ పిచ్ సాధారణంగా బ్యాటింగ్‌కు అనుకూలం. భారీ స్కోర్లు నమోదు కావచ్చు. శుక్రవారం సాయంత్రం ఇక్కడ వర్షం కురిసింది. మ్యాచ్ రోజున కూడా వాన పడే అవకాశం ఉంది. అయితే కొద్ది సేపు అంతరాయం మినహా పూర్తిగా మ్యాచ్‌కు ఆటంకం కలగకపోవచ్చు.

మరిన్ని క్రీడా వార్తలు
సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

ఆస్ట్రేలియా మహిళల ఘన విజయం

- పాక్‌పై 9 వికెట్లతో జయభేరి
- మహిళల టి20 ప్రపంచకప్



దుబాయ్: డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియా జట్టు మహిళల టి20 ప్రపంచకప్‌లో తమ జైత్రయాత్ర కొనసాగిస్తోంది. గ్రూప్ 'ఎ'లో వరుసగా 'హ్యాట్రిక్' విజయాన్ని నమోదు చేసింది. శుక్రవారం జరిగిన పోరులో ఆసీస్ అమ్మాయిల జట్టు 9 వికెట్ల తేడాతో పాకిస్తాన్‌పై ఏకపక్ష విజయం సాధించింది. టాస్ నెగ్గిన ఆస్ట్రేలియా ఫీల్డింగ్ ఎంచుకోగా... ముందుగా బ్యాటింగ్ చేపట్టిన పాకిస్తాన్ 19.5 ఓవర్లలో 82 పరుగులకే కుప్పకూలింది. ఆలియా రియాజ్ (32 బంతుల్లో 26; 3 ఫోర్లు) టాప్‌స్కోరర్ కాగా, మిగతా ఎవరూ కూడా కనీసం 15 పరుగులైనా చేయలేక పోయారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఆష్లే గార్డ్‌నెర్ 4, అనాబెల్ సదర్లాండ్, జార్జియా చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం సులువైన లక్ష్యాన్ని ఆస్ట్రేలియా కేవలం 11 ఓవర్లలో వికెట్ మాత్రమే కోల్పోయి 83 పరుగులు చేసి గెలిచింది. ఈ గ్రూపులో మూడు విజయాలతో ఆసీస్ (6 పాయింట్లు) అగ్ర స్థానంలో ఉంది.

ఆంధ్రప్రదేశ్

బాల్య వివాహాలు


ఇంకా...



ఎన్ని చట్టాలు చేస్తున్నా.. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా.. దేశంలో బాల్య వివాహాలు జరుగుతూనే ఉన్నాయి. 2022లో 1,002 బాల్య వివాహాలు జరిగాయని బాలల హక్కుల పరిరక్షణ జాతీయ కమిషన్ తెలిపింది. ఇందులో అత్యధికంగా 215 బాల్య వివాహాలు కర్ణాటకలో జరిగాయి.

వివిధ రాష్ట్రాల్లో బాల్య వివాహాల సంఖ్య

రాష్ట్రం	సంఖ్య
కర్ణాటక	215
అస్సాం	163
పశ్చిమ బెంగాల్	121
మహారాష్ట్ర	99
తెలంగాణ	53
ఒడిశా	46
హరియాణా	37
ఏపీ	26
ఉత్తరప్రదేశ్	17
బిహార్	13
జమ్ము కశ్మీర్	2
ఢిల్లీ	1





దేశంలో విస్తరిస్తున్న మెడికల్ టూరిజం

తక్కువ ఖర్చు.. అత్యాధునిక సౌకర్యాలు.., చికిత్స పద్ధతులు, సుశిక్షితులైన వైద్యులు, నాణ్యమైన వైద్యానికి భారత దేశం కేరాఫ్ అడ్రస్. అత్యంత క్లిష్టమైన చికిత్సలు కూడా ఇక్కడ లభిస్తున్నాయి. అందుకే దేశంలో వైద్య పర్యాటకం (మెడికల్ టూరిజం) ఏటేటా పెరుగుతోంది. ఏటా లక్షలాది మంది విదేశీయులు భారత దేశానికి వచ్చి వైద్యం పొంది వెళ్తున్నారు. గత పదేళ్లలో ఏటా వచ్చే మెడికల్ టూరిస్టుల సంఖ్య దాదాపు ఐదింతలు పెరిగింది. ఇదిలాగే కొనసాగి, 2034 నాటికి 50,671 బిలియన్ డాలర్లకు భారత దేశ మెడికల్ టూరిజం పరిశ్రమ విస్తరిస్తుందన్న అంచనాలున్నాయి. వివిధ రకాల వ్యాధులకు చికిత్స కోసం 2014లో 1.39 లక్షల మంది విదేశీయులు భారత్‌కు రాగా, ఆ సంఖ్య గత ఏడాది (2023) 6.35 లక్షలకు పెరిగింది. అదే విధంగా బ్యూరో ఆఫ్ ఇమిగ్రేషన్ డేటా ప్రకారం 2017-19 మధ్య రెండేళ్లలో మెడికల్ టూరిజంలో వృద్ధి 34.5 శాతంగా నమోదైంది. కరోనా కారణంగా 2020లో కొంత తగ్గినప్పటికీ, ఆ తర్వాత మళ్లీ మెడికల్ టూరిజం గణనీయంగా పుంజుకుంది. గుండె సంబంధిత సర్జరీలు, జాయింట్ రీప్లేస్‌మెంట్, క్యాన్సర్ వైద్యం, ఇతర చికిత్సలకు విదేశీయులు తెలంగాణాలోని హైదరాబాద్, ఏపీలోని గుంటూరు, విజయవాడల్లోని ఆస్పత్రులకు కూడా వస్తున్నారు. - సాక్షి, అమరావతి

కేంద్ర పర్యాటక శాఖ లెక్కల ప్రకారం 2020 నుంచి విదేశాల నుంచి భారత్‌కు వైద్యం కోసం వచ్చిన వారి సంఖ్య

సంవత్సరం	మెడికల్ టూరిస్టులు
2020	1,83,000
2021	3,04,000
2022	4,75,000
2023	6,34,520
2024 (జనవరి నుంచి జూన్)	3,72,713



- ఏటేటా పెరుగుతున్న మెడికల్ టూరిస్టులు
- విదేశాలతో పోలిస్తే భారత్‌లో తక్కువ ఖర్చుతో నాణ్యమైన వైద్యం
- అందుబాటులో అత్యాధునిక సౌకర్యాలు, చికిత్స పద్ధతులు
- 2014లో వైద్యం కోసం దేశానికి 1.39 లక్షల మంది విదేశీయులు
- 2023లో 6.35 లక్షలకు చేరిక
- మెడికల్ టూరిజాన్ని ప్రోత్సహించడానికి ఆయుష్ వీసా
- 2034కి 50,671 బిలియన్ డాలర్లకు పరిశ్రమ విస్తరిస్తుందని అంచనా

మెడికల్ టూరిస్టుల కోసం ఆయుష్ వీసా

దేశంలో మెడికల్ టూరిజాన్ని ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఆయుష్ వీసాను ప్రవేశపెట్టింది. వివిధ జబ్బులతో బాధపడే విదేశీయులు చికిత్స కోసం భారత్‌కు రావడానికి సరళమైన నిబంధనలతో దీనిని రూపొందించింది. ఈ వీసాతో భారత వైద్య పర్యాటకం చాలా వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఫలితంగా దేశ ఆరోగ్య సంరక్షణ ఆర్థిక వ్యవస్థ 2025 నాటికి 70 బిలియన్ డాలర్లకు పెరుగుతుందని గతంలో మోదీ ప్రభుత్వం విశ్వాసం వ్యక్తం చేసింది. గతేడాది 8.7 బిలియన్ డాలర్ల మార్కెట్ ఉంది. ఈ ఏడాది (2024)లో 10.4 బిలియన్ డాలర్ల మేర మెడికల్ టూరిజంలో పెరుగుదల ఉంటుందని ఫార్చ్యూన్ మార్కెట్ ఇంటెలిజెన్స్ అంచనా వేసింది. 17.2 శాతం సమ్మిళిత వార్షిక వృద్ధి రేటుతో 2034 నాటికి 50,671 బిలియన్ డాలర్‌లకు పరిశ్రమ విస్తరిస్తుందన్న అంచనాలున్నాయి.

అపోలో 2023-24 వార్షిక నివేదిక ప్రకారం పలు దేశాల్లో వివిధ రకాల చికిత్సలకు అయ్యే ఖర్చు (డాలర్లలో)

చికిత్స	అమెరికా	కొరియా	సింగపూర్	థాయ్‌లాండ్	భారత్
ఆంజియోప్లాస్టీ	57,000	15,200	13,000	3,788	3,300
డెంటల్ ఇంప్లాంట్స్	2,800	4,200	1,500	3,636	1,000
హార్ట్ బైపాస్	1,44,000	28,900	18,500	15,121	5,200
హార్ట్ వాల్వ్ రిప్లేస్‌మెంట్	1,70,000	43,500	12,500	21,212	5,500
హిప్ రిప్లేస్‌మెంట్	50,000	14,120	12,000	7,879	7,000
నీ రిప్లేస్‌మెంట్	50,000	19,800	13,000	12,297	6,200

ఇక కల్యాణ వైభోగమే..!

నేటి నుంచి దేశవ్యాప్తంగా పెళ్లి సందడే..

డిసెంబర్ ఆఖరు వరకు 23 ముహూర్తాలు

సాక్షి, అమరావతి: జూన్ నెలాఖరు నుంచి సరైన ముహూర్తాలు లేవు. వివాహాలు, శుభకార్యాలు వాయిదా పడుతూ వస్తున్నాయి. ఎట్టకేలకు ఇక ముహూర్తం కుదిరింది. వధూవరులు ఒక్కటయ్యే తరుణం వచ్చేసింది. దేశవ్యాప్తంగా శనివారం నుంచి పెళ్లి సందడి అంబరాన్ని తాకనుంది. ఈ ఏడాది చివరి వరకు ఇదే కోలాహలం కొనసాగనుంది. అక్టోబర్ 12 నుంచి డిసెంబర్ 31 మధ్య 23 శుభ ముహూర్తాలు ఉన్నాయి. ఈ శుభ ఘడియల్లో దాదాపు 48లక్షల వివాహాలు జరిగే అవకాశం ఉంది. ఈ విషయాన్ని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ (సీఏఐటీ) తాజాగా విడుదల చేసిన సర్వే నివేదిలో వెల్లడించింది. ఈ నివేదిక ప్రకారం... దేశవ్యాప్తంగా 2023వ సంవత్సరంలో చివరి మూడు నెలల్లో దాదాపు 35 లక్షల పెళ్లిళ్లు జరిగాయి. సుమారు రూ.4.25లక్షల కోట్ల వ్యాపారం జరిగింది. ఈ ఏడాది అక్టోబర్ 12 నుంచి డిసెంబర్ ఆఖరు వరకు ఉన్న ముహూర్తాల్లో దేశవ్యాప్తంగా మొత్తం 48లక్షలకు పైగా వివాహాలు జరిగే అవకాశం ఉంది. ఒక్కొక్క పెళ్లి వేడుకకు సగటున రూ.12 లక్షలు ఖర్చు పెడతారని అంచనా. ఈ లెక్కన ప్రస్తుత పెళ్లిళ్ల సీజన్‌లో దాదాపు రూ.5.76లక్షల కోట్లు ఖర్చు అవుతుందని ప్రాథమికంగా లెక్క తేల్చారు.

ఇవీ ముహూర్తాలు...: అక్టోబర్ 12, 13, 16, 20, 27వ తేదీల్లో ముహూర్తాలు ఉన్నాయి. నవంబర్‌లో 3, 7, 8, 9, 10, 13, 14, 16, 17, డిసెంబర్‌లో 5, 6, 7, 8, 11, 12, 14, 15, 26వ తేదీల్లో శుభ ముహూర్తాలు ఉన్నాయి. ఆ తర్వాత సంక్రాంతి మాసం ప్రారంభం కావడంతో మళ్లీ వచ్చే ఏడాది ఫిబ్రవరి, మార్చి నెలల వరకు శుభ ముహూర్తాల కోసం ఆగాల్సి వస్తుంది. అందువల్ల ఈ ఏడాది దీపావళి తర్వాత పెద్ద సంఖ్యలో పెళ్లిళ్లు జరిగే అవకాశం ఉంది. అదే సమయంలో ఉపనయనాలు, గృహప్రవేశాలు కూడా ఎక్కువగా జరుగుతాయని అంచనా.



షాపింగ్ సందడి షురూ...

దసరా పండుగతోపాటు పెళ్లిళ్ల షాపింగ్ కూడా కొందరు ప్రారంభించారు. దీంతో మార్కెట్‌లో సైతం సందడి నెలకొంది. భోజనాలు, క్యాటరింగ్, కళ్యాణ మండపాలు, ఫంక్షన్ హాళ్లు, హోటళ్లు, డెకరేషన్‌లకు ముందస్తు ఒప్పందాలు చేసుకుంటున్నారు. శుభలేఖల ప్రింటింగ్ ప్రెస్, ఫ్లెక్సీ ప్రింటర్స్, ఫొటోగ్రాఫర్లు, టెంట్ హౌస్, వంటమేస్త్రీలు, వంట పనివాళ్లు, క్యాటరింగ్ బాయ్స్, బ్యూటీషియన్లు, మెహందీ ఆర్టిస్టులు, పూలు అమ్మేవాళ్లు, మంగళ వాయిద్య కళాకారులు, డీజే మ్యూజిక్ నిర్వాహకులు... ఇలా పెళ్లి వేడుకతో ముడిపడిన ప్రతి ఒక్కరిని ముందుగానే ఎంపిక చేసుకుని అడ్వాన్సులు ఇచ్చే పనిలో నిమగ్నమయ్యారు. దేశంలో సాధారణ, మధ్య తరగతి ప్రజల నుంచి సంపన్నుల వరకు పెళ్లి వేడుకల్లో తగ్గేదేలే... అన్నట్లుగా ఖర్చు చేస్తున్నారు. ఎంగేజ్‌మెంట్, ప్రీ వెడ్డింగ్, హల్దీ, రిసెప్షన్, పోస్ట్ వెడ్డింగ్... ఇలా అనేక దశలుగా పెళ్లి వేడుకను రాజీపడకుండా నిర్వహిస్తున్నారు. అందువల్ల ఈ ఏడాది చివరి వరకు దేశవ్యాప్తంగా పెళ్లి సందడి ఉంటుందని సీఏఐటీ వెల్లడించింది.

రాష్ట్ర సర్వీసులోకి అకున్ సబర్వాల్

సాక్షి, హైదరాబాద్: కేంద్ర సర్వీసులో ఉన్న ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు అకున్ సబర్వాల్ తిరిగి రాష్ట్ర సర్వీసులోకి వస్తున్నారు. ఆయన డిప్యుటేషన్‌పై కేంద్ర సర్వీసుల్లో ఇండో–టిబెటన్ బోర్డర్ పోలీసులో ఐజీగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన డిప్యుటేషన్ గడువు పూర్తికాక ముందే...రాష్ట్ర ప్రభుత్వం ఆయనను తిరిగి రాష్ట్ర సర్వీసులోకి పంపించాలని కోరింది. దీంతో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ అండర్ సెక్రెటరీ సంజీవ్‌కుమార్ ఆయనను తక్షణమే పేరెంట్ కేడర్‌కు వెళ్లాలని, రిలీవ్ అయిన విషయాన్ని తెలియజేయాలని గురువారం జారీ చేసిన ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నవంబర్ 8 నుంచి డీఏవో అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

సాక్షి, హైదరాబాద్: డివిజినల్ అకౌంట్స్ ఆఫీసర్ (గ్రేడ్–2) ఉద్యోగాలకు ప్రాథమికంగా అర్హత సాధించిన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన నవంబర్ 8వ తేదీ నుంచి 12వ తేదీ వరకు నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆవరణలో నిర్వహిస్తామని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యదర్శి ఇ.నవీన్‌నికోలస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ధ్రువపత్రాల పరిశీలన కోసం అభ్యర్థులను 1:2 నిష్పత్తిలో ఎంపిక చేశామని, వికలాంగ కేటగిరీలో 1:5 నిష్పత్తిలో ఎంపిక జరిగిందని వివరించారు. మరిన్ని వివరాలకు కమిషన్ వెబ్‌సైట్ చూడాలని సూచించారు.

కాలేజీలు బంద్ చేస్తే చర్యలు

ప్రైవేటు కాలేజీలకు ఓయూ రిజిస్ట్రార్ హెచ్చరిక

ఉస్మానియా యూనివర్సిటీ: ప్రైవేటు డిగ్రీ, పీజీ కాలేజీలను నిరవధికంగా బంద్ చేస్తే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ తెలిపారు. ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల కాలేదని కాలేజీలను నిరవధికంగా బంద్ చేస్తామని ప్రైవేటు డిగ్రీ, పీజీ కాలేజీల యాజమానులు ఈ నెల 9న నోటీసు ఇచ్చారని చెప్పారు. డిగ్రీ, పీజీ అకాడమిక్ సెమిస్టర్ పరీక్షలతో గ్రూప్–1, 2, 3 ఉద్యోగాలు, ఇతర ఉద్యోగాల రాత పరీక్షలు ఉన్నందున కాలేజీలను బంద్‌చేస్తే విద్యార్థులు, నిరుద్యోగులు నష్టపోతారని పేర్కొన్నారు. కాలేజీలను బంద్ చేయకుండా ప్రభుత్వంతో చర్చలు జరిపి సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు.

వైద్య, ఆరోగ్యశాఖలో మరో 371 పోస్టులకు నోటిఫికేషన్

272 నర్సింగ్ ఆఫీసర్, 99 ఫార్మసిస్ట్ పోస్టులు • మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు ప్రకటన

సాక్షి, హైదరాబాద్: వైద్య, ఆరోగ్యశాఖలో కొలువుల జాతర కొనసాగుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఇప్పటికే 7,300 పోస్టులను భర్తీ చేయగా...మరో 6,500 పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోంది. తాజాగా మరో 272 నర్సింగ్ ఆఫీసర్ (స్టాఫ్ నర్స్) పోస్టులు, 99 ఫార్మసిస్ట్ (గ్రేడ్ 2) పోస్టుల భర్తీకి మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నోటిఫికేషన్ విడుదల చేసింది. గత నెల 18న విడుదల చేసిన 2,050 నర్సింగ్ ఆఫీసర్ పోస్టులకు, ఈ 272 పోస్టులు అదనం అని నోటిఫికేషన్‌లో పేర్కొంది. దీంతో మొత్తం నర్సింగ్ ఖాళీల సంఖ్య 2,322కు పెరిగింది. ఇప్పటికే దరఖాస్తుల ప్రక్రియ మొదలవగా, ఈ నెల 14వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులకు చివరి గడువుగా పేర్కొంది. నవంబర్ 23న ఆన్‌లైన్‌లో (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) రాత పరీక్ష నిర్వహించనున్నారు.

మొత్తంగా 732 ఫార్మసిస్ట్ పోస్టులు: గత నెల 24న 633 ఫార్మసిస్ట్(గ్రేడ్ 2) పోస్టులకు మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇప్పటికే దరఖాస్తుల ప్రక్రియ మొదలైంది. ఇదే నోటిఫికేషన్‌కు అదనంగా మరో 99 పోస్టులను జత చేస్తున్నామని, మొత్తం పోస్టుల సంఖ్య 732కు పెరిగిందని తెలుపుతూ శుక్రవారం బోర్డు ప్రకటించింది. ఈ పోస్టులకు అక్టోబర్ 21వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకోవడానికి గడువు ఇచ్చింది. నవంబర్ 30న ఆన్‌లైన్‌లో రాత పరీక్ష నిర్వహించనున్నారు. జోన్లు, కేటగిరీలవారీగా ఖాళీల సంఖ్యను బోర్డు వెబ్‌సైట్ https://mhsrb.telangana.gov.in/MHSRB/home.htmlలో అందుబాటులో ఉంచారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.


'ఎన్ని కరువులనైనా ఎదుర్కోగలగాలి
దీని కోసం ఆర్థికంగా ఎదగాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 12+12 వెల: ₹ 5.50
సంపుటి: 17
సంచిక: 202

శనివారం 12-10-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ప్రతి అమ్మా దుర్గమ్మే

విజయ దశమి సందర్భంగా ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, ప్రవచనకర్త డాక్టర్ మైలవరపు శ్రీనివాసరావు సాక్షి ఫ్యామిలీకి ప్రత్యేకంగా చెప్పిన ముఖ్య విశేషాలు..

- వివరాలు 11లో



బ్యాంక్ షేర్లలో అమ్మకాలు

పారిశ్రామికోత్పత్తి వృద్ధి గణాంకాల వెల్లడికి ముందు అప్రమత్తత వహించడంతో స్టాక్ సూచీలు శుక్రవారం నష్టాల్లో ముగిశాయి.

- వివరాలు 3లో▶



రతన్ వారసుడు నోయెల్

టాటా ట్రస్ట్స్ పగ్గాలు రతన్ టాటా సవతి సోదరుడు నోయెల్ టాటా చేతికి లభించాయి. ట్రస్టీలంతా నోయెల్‌ను చైర్మన్‌గా ఎన్నుకున్నారు.

- వివరాలు 3లో▶



ఖాన్‌లు చేస్తున్న రావణ బొమ్మ

ఉత్తరప్రదేశ్ రాంపూర్‌లోని ఒక ముస్లిం కుటుంబం దసరాకు రావణాసురుడి దిష్టి బొమ్మలను తయారు చేస్తోంది.

- వివరాలు 11లో▶



డాక్టర్.. డాటర్స్!

సాధారణంగా ఒక కుటుంబంలో ఒకరిద్దరు డాక్టర్లు ఉండటం సహజం. కానీ ఈ కుటుంబంలో నలుగురు కూతుళ్లూ డాక్టర్లయ్యారు.

- వివరాలు 4లో▶

టీనేజీలోనే గంజాయి!

15-19 ఏళ్ల వయస్సులోనే మద్యం, సిగరెట్, డ్రగ్స్‌కూ బానిసలు

- గంజాయికి బానిసలుగా 5.5% మంది.. మద్యం తాగేవారు 22%
- మానసిక రుగ్మతలూ పిల్లల్లోనే అధికం..14 ఏళ్లలోపే మొదలు
- టీనేజీలోని ప్రతి ఏడుగురిలో ఒకరు మానసిక వ్యాధిగ్రస్తులు
- ప్రపంచ ఆరోగ్య సంస్థ, యూనిసెఫ్ తాజా నివేదిక వెల్లడి
- సరైన చట్టాలు, సామాజిక భద్రత, ఆర్థిక భరోసా అవసరమని స్పష్టీకరణ



సాక్షి, హైదరాబాద్: గంజాయి, మద్యం, సిగరెట్, డ్రగ్స్ వినియోగం, వాటికి బానిసలై పోవడం సాధారణంగా యువకులు, పెద్దల్లోనే చూస్తుంటాం . కానీ టీనేజ్ పిల్లలు కూడా ఈ చెడు అలవాట్లకు ఎక్కువగా లోనవుతున్నారట. ఆ మాటకొస్తే పిల్లల్లో ఎక్కువ శాతం గంజాయి సేవిస్తుండటం విస్మయం కలిగిస్తోంది. ఇంకో విచిత్రమైన విషయం ఏమిటంటే మానసిక రుగ్మతల కారణంగా టీనేజీ పిల్లలు ఈ వ్యసనాల బారిన పడుతుండటం. మానసిక సమస్యలు కూడా పెద్దవారికే అధికంగా ఉంటాయని అనుకుంటాం. కానీ పెద్ద వయస్సు వారి కంటే యువతీ యువకుల్లోనే మానసిక రుగ్మతలు అధికంగా ఉంటున్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ), యూనిసెఫ్ (ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ పిల్లల అత్యవసర నిధి)లు తేల్చిచెప్పాయి. 'యువకులు, చిన్న పిల్లల మానసిక ఆరోగ్యంపై మార్గదర్శకత్వం'పేరుతో డబ్ల్యూహెచ్ఓ, యూనిసెఫ్ తాజాగా ఓ నివేదిక విడుదల చేశాయి. ఐదేళ్ల నుంచి 24 ఏళ్లలోపు వారికి సంబంధించిన మానసిక సమస్యలపై పలు ఆసక్తికర అంశాలను పొందుపరిచాయి. మానసిక రుగ్మతల నుంచి టీనేజీ పిల్లలను రక్షించాలంటే చట్టాలు సరిగా ఉండాలని, సామాజిక భద్రత..ఆర్థిక భరోసా ఉండాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించాయి. నివేదికలో ఏముందంటే..

పెద్దలు తట్టుకుంటారు.. పిల్లలు కుంగిపోతారు

మూడో వంతు మానసిక సమస్యలు 14 ఏళ్లలోపే మొదలవుతాయి. అందులో సగం 10 ఏళ్లలోపే ప్రారంభం అవుతాయి. 15–19 ఏళ్ల వయస్సు బాలబాలికల్లో మద్యం తాగేవారు 22 శాతం ఉన్నారు. అలాగే పెద్దల కంటే టీనేజీ పిల్లల్లోనే గంజాయి వాడకం ఎక్కువగా ఉంది. ఆ వయస్సు వారిలో 5.5 శాతం మంది టీనేజీ పిల్లలు గంజాయి

మిగతా 2వ పేజీలో ▶

నివేదికలోని ఇతర ముఖ్యాంశాలు..

- టీనేజీ పిల్లలు బయటి పరిస్థితులు, ఇంటి పరిస్థితులకు మధ్య ఘర్షణతో మానసికంగా ఇబ్బంది పడుతుంటారు.
- 5–9 ఏళ్ల పిల్లలపై స్నేహితులు, తల్లిదండ్రులు పెంచే విధానం, స్కూలు, పరిసరాల ప్రభావం ఉంటుంది.
- ఆర్థిక, సామాజిక, లింగపరమైన అసమానత్వం, సామాజిక బహిష్కరణ వంటి వాటి వల్ల పిల్లలు మానసికంగా కుంగిపోతారు.
- పేదరికం, యుద్ధ వాతావరణంలో ఉండే పిల్లల్లో మానసిక సమస్యలు పెరుగుతాయి. కుటుంబంలో తల్లి మద్యానికి బానిసైతే పుట్టే పిల్లల్లో మానసిక సమస్యలు రావొచ్చు.
- తల్లిదండ్రులకు మానసిక సమస్యలుండటం, తల్లిదండ్రులు..కుటుంబ కలహాలు, తల్లిదండ్రులు విడిపోవడం, పిల్లలను హాస్టళ్లలో చేర్పడం వంటివి కూడా ప్రభావితం చేస్తున్నాయి.
- మానసిక రుగ్మతకు గురైన వారికి త్వరగా చికిత్స చేస్తే పెద్దయ్యేసరికి మొండిజబ్బుగా మారకుండా చూసుకోవచ్చు.
- కరోనా సమయంలో అన్ని వయస్సుల వారిలో మానసిక వ్యాధులు 25 శాతం పెరిగాయి. ఉద్యోగాలు పోవడం, చదువు మధ్యలో ఆపేయడం, అప్పుల్ని కోల్పోవడం, ఆసుపత్రుల పాలు కావడం లాంటి అనేక కారణాలతో మానసిక సమస్యలు పెరిగాయి.

కార్పొరేషన్లు.. కాసుల కహానీ

పలువురు చైర్మన్ల ఇష్టారాజ్యం.. నీళ్లలా సంస్థల నిధుల ఖర్చు

- నూనె విక్రయాల్లో ఆయిల్‌ఫెడ్ వెనుకబాటు
- ఎరువులున్నా సప్లై చేయలేని స్థితిలో మార్క్‌ఫెడ్
- వ్యవసాయ యాంత్రీకరణ లేక కునారిల్లుతున్న ఆగ్రోస్
- ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల గుప్పెట్లో కూరుకుపోయిన వేర్ హౌసింగ్



సాక్షి, హైదరాబాద్: వ్యవసాయశాఖ పరిధిలోని కొన్ని కార్పొరేషన్ల పనితీరుపై తీవ్ర అసంతృప్తి నెలకొంది. ఇందులో పనిచేస్తున్న కొందరు అధికారులు కాంట్రాక్టర్లు, వ్యాపారులతో కలిసిపోయి కమీషన్లు దండుకుంటున్నారన్న విమర్శలున్నాయి. కార్పొరేషన్ బోర్డు సమావేశాల్లో ఆమోదం పొందాయని చెప్పుకుంటూ, వ్యాపారులు, కాంట్రాక్టర్లకు అనుగుణంగా అధికారులు అనేక నిర్ణయాలు తీసుకుంటున్నారు. దీంతో కొన్ని నిర్ణయాలు వివాదాస్పదమవుతున్నాయి. కొన్ని నిర్ణయాలు ఆయా కార్పొరేషన్లకు తీవ్రమైన నష్టాన్ని మిగుల్చుతున్నాయి. కొందరు చైర్మన్లు, అధికారులకు రూ.కోట్లలో జేబులు నిండుతున్నాయి. కొన్ని కార్పొరేషన్లు వ్యాపారులు, కాంట్రాక్టర్ల చేతుల్లోకి వెళ్లిపోయాయన్న విమర్శలూ ఉన్నాయి.అంతేకాదు కొందరు చైర్మన్లు, అధికారుల ఇళ్లలో జరిగే ఫంక్షన్లు, టూర్లకు వ్యాపారులు, కాంట్రాక్టర్లే అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నారు. కొన్ని కార్పొరేషన్ల చైర్మన్లు ఆయా సంస్థలను నిర్వీర్యం చేస్తున్నారన్న వాదనలూ ఉన్నాయి.

విచారణకే పరిమితమయ్యారు..

ఆయా కార్పొరేషన్లపై విచారణ చేపట్టాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గతంలోనే ఆదేశించిన సంగతి తెలిసిందే. దీంతో రైతుబంధు సమితి, విత్తన, సేంద్రీయ ధ్రువీకరణ అథారిటీ, ఆగ్రోస్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్, వేర్ హౌసింగ్ కార్పొరేషన్, హైదరాబాద్ అగ్రికల్చర్ కోఆపరేటివ్ అసోసియేషన్ (హాకా), తెలంగాణ రాష్ట్ర కోఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ లిమిటెడ్, విత్తన అభివృద్ధి కార్పొరేషన్, కోఆపరేటివ్ రూరల్ ఇరిగేషన్ కార్పొరేషన్, కోఆపరేటివ్ యూనియన్, కోఆపరేటివ్ హౌసింగ్ ఫెడరేషన్, హార్టికల్చర్ అభివృద్ధి కార్పొరేషన్, తెలంగాణ కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంకు లిమిటెడ్ (టెస్కాబ్) సంస్థలపై ఐఏఎస్ అధికారులు విచారణ చేశారు. వాటి ఆస్తులు,

మిగతా 2వ పేజీలో ▶

న్యూస్‌రీల్

ధూంధాం.. దసరా



దసరా పండుగ ఈసారి రాష్ట్రంలో ధూంధాంగా జరుగుతోందని మద్యం విక్రయ గణాంకాలు చెప్పకనే చెబుతున్నాయి. సాధారణ రోజులతో పోలిస్తే గత 5 రోజుల్లో 25% అమ్మకాలు పెరిగాయి. గతేడాది దసరాతో పోలిస్తే..ఈ 5 రోజుల్లో 15% మేర అమ్మకాలు పెరగ్గా, ప్రతిరోజు రాష్ట్రంలో సగటున రూ.124 కోట్ల మద్యం అమ్ముడవుతోంది.

- వివరాలు 2లో▶

బీఆర్ఎస్‌లో ఎమ్మెల్సీ సందడి



ఉపాధ్యాయ కోటాలో ఇద్దరు ఎమ్మెల్సీలు, పట్టభద్రుల కోటాలో ఒక ఎమ్మెల్సీ ఆరేళ్ల పదవీకాలం వచ్చే ఏడాది మార్చిలో ముగియనుండటంతో బీఆర్ఎస్ నుంచి బరిలో నిలిచేందుకు ఆశావహులు ఇప్పటి నుంచే ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. సోషల్ మీడియా, ఇతర మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం చేస్తున్నారు.

- వివరాలు 10లో▶

స్లీపర్ వందేభారత్ జిగేల్!



భారతీయ రైల్వే గతిని మార్చిన 'వందేభారత్' సిరీస్‌లో స్లీపర్ బెర్తులతో కూడిన రైలు త్వరలో పట్టాలెక్కేందుకు సిద్ధమైంది. పరిమిత దూరంలో ఉన్న నగరాల మధ్య 160 కి.మీ. గరిష్ట వేగంతో దూసుకుపోతున్న వందేభారత్ రైళ్లు.. ఇక వేయి కిలోమీటర్లను మించిన దూరంలో ఉన్న ప్రాంతాల మధ్య తిరిగేందుకు సిద్ధమయ్యాయి. ఇందుకుగాను తొలిసారి స్లీపర్ బెర్తులతో కూడిన వందేభారత్ రైలు పూర్తిస్థాయిలో సిద్ధమై తొలి పరుగుకు సన్నద్ధమైంది.

- వివరాలు 10లో▶

• దసరా కాంతులు



విజయదశమిని పురస్కరించుకుని ఐదో శక్తిపీఠంగా ప్రసిద్ధిగాంచిన అలంపూర్‌లోని జోగులాంబ బాలబ్రహ్మేశ్వర ఆలయం కొత్త కాంతులు సంతరించుకుంది. పండుగ నేపథ్యంలో శుక్రవారం ఆలయ సముదాయాన్ని రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. - జోగులాంబ శక్తిపీఠం



పట్టణ-గ్రామీణ ప్రాంతాల మధ్య | తగ్గుతున్న 'డిజిటల్ డివైడ్'

అందరికీ అందుబాటులో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానమే కారణం

- భారత్‌లో 95.1 శాతం కుటుంబాలకు టెలిఫోన్/ మొబైల్
- ఇంటర్నెట్ వాడేస్తున్న పట్టణ యువత 92, గ్రామీణ యువత 82 శాతం
- ఎన్ఎస్ఎస్ సర్వేలో వెల్లడి



సాక్షి, హైదరాబాద్: భారత్‌లో పట్టణ-గ్రామీణ ప్రాంతాల మధ్య ఉన్న 'డిజిటల్ డివైడ్ 'అనేది క్రమంగా తగ్గుతోంది. రోజువారీ జీవన విధానం , అలవాట్లలో వచ్చిన మార్పులుచేర్పులతోపాటు అందరికీ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడమే దీనికి ప్రధాన కారణం. డిజిటల్ విప్లవం అనేది వివిధ రూపాల్లో విస్తరించడంతో అందరికీ అన్ని అవకాశాలు అందుబాటులోకి వస్తున్నాయి. మరీ ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోనూ ఇంటర్నెట్ సౌకర్యాలు మెరుగుపడడంతోపాటు స్మార్ట్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ గాడ్జెట్లు అందుబాటులోకి వచ్చాయి. దీంతో ఆధునిక సాంకేతికతను పట్టణ, గ్రామీణ తేడాలు లేకుండా ఉపయోగించుకోగలుగుతున్నారు. 95.1 శాతం కుటుంబాలు (గ్రామీణ ప్రాంతాల్లో 94.2 శాతం, పట్టణాల్లో 97.1 శాతం) టెలిఫోన్/ మొబైల్ సౌకర్యాలు కలిగి ఉన్నట్టుగా స్పష్టమవుతోంది. గతంతో పోల్చితే..ఇది మెరుగైన పరిస్థితి కాగా, మొబైల్ టెక్నాలజీ వినియోగంలో రాబోయే రోజుల్లో గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్యఉన్న చిన్న వ్యత్యాసం కూడా చెరిగిపోతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

79వ రౌండ్ నేషనల్ నేషనల్ శాంపిల్ సర్వే

తాజాగా 79వ రౌండ్ నేషనల్ నేషనల్ శాంపిల్ సర్వే (ఎన్ఎస్ఎస్)లో భాగంగా 2022 జూలై నుంచి 2023 జూన్

మిగతా 2వ పేజీలో ▶

సర్వేలోని ముఖ్యాంశాలు

- 15–24 ఏజ్ గ్రూప్‌లో 78.4 శాతం యువత అటాచ్డ్‌ఫైల్స్‌తో మెసేజ్ పంపగలుగుతున్నారు. ఈ వయసులోని వారే 96.9 శాతం (వీరితో పురుషులు 97.8%, మహిళలు 95.9%) చదవడం, రాయడంతో పాటు సాధారణ గణాంకాలు చేస్తున్నారు. 71.2 శాతం మంది కాపీ అండ్ పేస్ట్ టూల్స్ వినియోగిస్తున్నారు. 26.8 శాతం మాత్రమే ఆన్‌లైన్ సెర్చ్, ఈ-మెయిల్స్ పంపడం, ఆన్‌లైన్ బ్యాంక్ నిర్వహణ చేయగలుగుతున్నారు. దేశంలో 9.9 శాతం కుటుంబాలకు (పట్టణ ప్రాంతాల్లో 21.6 శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 4.2 శాతం) డెస్క్‌టాప్‌లు, ల్యాప్‌టాప్‌లు, ఇతర పరికరాలు కలిగి ఉన్నారు.
- 18 ఏళ్లకు పైబడిన వారిలో 94.6 శాతం మందికి వ్యక్తిగత, ఉమ్మడి బ్యాంక్ ఖాతా, ఫైనాన్షియల్ ఇనిస్టిట్యూట్స్‌లో అకౌంట్, మొబైల్ మనీ సర్వీస్ ప్రొవైడర్ ఖాతా కలిగి ఉన్నారు.
- తాము నివసిస్తున్న ప్రాంతాల నుంచి 500 మీటర్లలోపు దూరంలోనే లోకపాసిటీ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ (బస్సు,కారు, టాక్సీ, ఆటో వంటివి) సౌకర్యాలు 93.7 శాతం పట్టణ ప్రాంత జనాభాకు అందుబాటులో ఉన్నాయి.



ఊరికి పోదాం... పండుగ చేద్దాం చలో చలో..

హైవేపై బారులు తీరిన వాహనాలు..

చౌటుప్పల్: హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై శుక్రవారం భారీగా వాహనాల రద్దీ నెలకొంది. దసరా పండుగను పురస్కరించుకుని ప్రజానీకం పెద్ద సంఖ్యలో సొంతూర్లకు ప్రయాణాలు సాగిస్తున్న నేపథ్యంలో రద్దీ ఏర్పడింది. ఉదయం నుంచే రద్దీ విపరీతంగా ఉండటంతో వాహనాలు నెమ్మదిగా ముందుకుసాగాయి. రద్దీ కారణంగా యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని ప్రజలు, వాహనదారులు ట్రాఫిక్ సమస్యతో ఇబ్బంది పడ్డారు.

చౌటుప్పల్ వద్ద జాతీయ రహదారిపై నెలకొన్న వాహనాల రద్దీ

త్రిశంకు స్వర్గంలో ఓపీఎస్‌లు

- నాలుగేళ్ల సర్వీస్ పూర్తిచేసినా రెగ్యులరైజ్ చేయకపోవడంపై ఆందోళన
- తాజాగా ఔట్‌సోర్సింగ్‌లోనే మరో ఏడాది పనిచేయాలని సర్కార్ ఉత్తర్వులు
- వారిని జేపీఎస్‌లుగా మార్చడానికి రూల్స్ ఒప్పుకోవంటున్న ఆర్థిక శాఖ
- గతంలో కొన్ని జిల్లాల్లో దాదాపు 2 వేల మందిని జేపీఎస్‌లుగా మార్చిన కలెక్టర్లు
- తమను కూడా ఇలాగే మార్చాలని కోరుతున్న మరో 1,109 మంది ఓపీఎస్‌లు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పలువురు ఔట్‌సోర్సింగ్ పంచాయతీ (ఓపీఎస్) సెక్రటరీలు త్రిశంకు స్వర్గంలో కొట్టుమిట్టాడుతున్నారు. నాలుగేళ్ల సర్వీస్ పూర్తిచేసినా రెగ్యులరైజ్ కాకపోవడంపై వారిలో ఆందోళన వ్యక్తమవుతోంది. తమను జూనియర్ పంచాయతీ సెక్రటరీలుగా (జేపీఎస్) మార్చి సర్వీసులు రెగ్యులరైజ్ చేస్తారని వారు ఆశిస్తుండగా.. తాజాగా ఔట్‌సోర్సింగ్ పద్ధతుల్లోనే మరో ఏడాది పనిచేయాలంటూ పంచాయతీరాజ్ శాఖ ఉత్తర్వులు జారీచేసింది. గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న 1,109 మంది ఓపీఎస్‌లను ఔట్‌సోర్సింగ్ విధానంలోనే పనిచేసేలా ఏడాది పొడిగిస్తూ ఆదేశాలిచ్చింది. 2021 సంవత్సరంలో పంచాయతీరాజ్ శాఖలో పోటీపరీక్ష ద్వారా 9వేల మంది శాశ్వత జేపీఎస్‌ల నియామకాలు చేశారు. అయితే వారిలో కొందరు విధుల్లో చేరకపోగా, కొందరు చేరి మానేశారు. దీంతో ఇదే పరీక్ష రాసి తక్కువ మార్కులు సాధించిన వారికి.. ఆయా జిల్లాల్లో ఓపీఎస్‌లుగా కలెక్టర్లు పోస్టింగ్ ఇచ్చారు. ఇది జిల్లాస్థాయిలోని పోస్టు కాబట్టి ఆ స్థాయిలోనే పరిష్కరించి ఉంటే సరిపోయేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇప్పటిదాకా వారి నెల వేతనం రూ.15 వేలు ఉండగా... తాజా ఏడాది పొగిడింపు ఉత్తర్వులతో పాటు జీతాన్ని కూడా రూ.19.500 పెంచుతున్నట్టు పేర్కొన్నారు. గతంలో కొన్నిజిల్లాల



కలెక్టర్లు తమ స్థాయిలోనే ఓపీఎస్‌లను, జేపీఎస్‌లుగా మార్పు చేయడంతో, నాలుగేళ్లు పూర్తిచేసిన వారి సర్వీసులు రెగ్యులరైజ్ అయ్యాయి. ఐతే ఇప్పుడు మిగతా ఓపీఎస్‌లను జేపీఎస్‌లుగా మార్పు చేయాలంటూ పంచాయతీరాజ్ శాఖ పంపించిన ప్రతిపాదనలకు ఆర్థిక శాఖ అభ్యంతరాలు తెలిపినట్టు తెలుస్తోంది. అప్పుడు జిల్లాల్లో కలెక్టర్లు చేశారు కాబట్టి ఇప్పుడు రాష్ట్రస్థాయిలో ప్రభుత్వం చేయాలంటే ఎలా సాధ్యమని ప్రశ్నించినట్టు సమాచారం. వారిని జేపీఎస్‌లుగా ఏ నిబంధన ప్రకారం కన్వర్ట్ చేస్తారనే ప్రశ్నలను ముందుకు తెచ్చినట్టు తెలిసింది. ఓపీఎస్‌లను జేపీఎస్‌లుగా మార్చి.. పర్మినెంట్ ఎలా చేయొచ్చనే దానిపై పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి ద్వారా మళ్లీ ప్రతిపాదనలు పంపిస్తే పరిశీలించి తగిన చర్యలు తీసుకునే అవకాశం ఉందనే వర్తమానం పంపించినట్టు సమాచారం. అదేవిధంగా జేపీఎస్‌ల సర్వీస్ రెగ్యులరైజేషన్‌కు సంబంధించి కటాఫ్ డేట్ (నాలుగేళ్ల సర్వీసు పూర్తితో ఎప్పటి నుంచి రెగ్యులరైజ్ చేయాలి అనే అంశం)పై కూడా పంచాయతీరాజ్ శాఖ నిర్ణయం తీసుకోవాల్సి ఉందని అంటున్నారు.

ఇదీ నేపథ్యం..

2018లో రాష్ట్రవ్యాప్తంగా 9,335 జేపీఎస్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చింది. నెగెటివ్‌మార్కుల విధానంలో పరీక్ష నిర్వహించి 2019లో పోస్టులను భర్తీ చేసింది. అయితే అప్పుడు జాయిన్ అయిన వారిలో కొందరు పని ఒత్తిడి, ఇతరత్రా కారణాలతో ఉద్యోగాలకు రాజీనామా చేశారు. కొందరు సీనియర్ పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతి లభించడంతో ఆ స్థానాలు ఖాళీ అయ్యాయి. దీంతో పోస్టులను ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేశారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా 1,109 మంది పనిచేస్తున్నారు. జేపీఎస్‌లతో సమానంగా ఓపీఎస్‌లు అన్ని రకాల విధుల నిర్వహిస్తున్నా ఇప్పటిదాకా అందుతున్న వేతనం రూ.15 వేలు మాత్రమే. తొలుత ఔట్‌సోర్సింగ్ విధానంలో మొత్తం 3 వేల మంది సెక్రటరీలను నియమిస్తే, అందులో ఇప్పటికే రెండు వేల మందిని జేపీఎస్‌గా మార్చారు. మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, కామారెడ్డి, రంగారెడ్డి, జోగులంబ తదితర జిల్లాలో పనిచేస్తున్న ఓపీఎస్‌లను జేపీఎస్‌లుగా మార్చి రూ.28,719 జీతం చెల్లిస్తున్నారు. కాగా, కొమురం భీమ్, ములుగు, ఆదిలాబాద్, నిర్మల్, వనపర్తి.. ఇలా కొన్ని జిల్లాల్లో ఇంకా వీరు ఓపీఎస్‌లుగానే కొనసాగుతున్నారు. దీంతో మిగిలిన 1,109 మంది కూడా తమను జేపీఎస్‌లుగా మార్చాలని కోరుతున్నారు.

జాతీయ రహదారిపై లారీ దగ్ధం

గంటల తరబడి నిలిచిపోయిన ట్రాఫిక్ ● ట్రాఫిక్‌లో చిక్కుకున్న మంత్రి కోమటిరెడ్డి కాన్వాయ్

చిట్యాల: నల్లగొండ జిల్లా చిట్యాల పట్టణ శివారులో హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై శుక్రవారం సిమెంట్‌లోడుతో వెళుతున్న లారీ ప్రమాదవశాత్తు కల్వర్టును ఢీకొట్టడంతో మంటలు అంటుకుని పూర్తిగా దగ్ధమైంది. హైదరాబాద్ వైపు వెళ్తున్న సిమెంటులోడు లారీ శుక్రవారం ఉదయం చిట్యాల పట్టణ శివారులో రైల్వేస్టేషన్ ఎక్స్ రోడ్డు వద్ద కల్వర్టు గోడలను ఢీకొట్టింది. దీంతో లారీ డీజిల్ ట్యాంకర్ కల్వర్టు గోడలను ఢీకొట్టడంతో పగిలిపోయి మంటలు అంటుకున్నాయి. దీంతో లారీ పూర్తిగా అగ్నికి ఆహుతైంది. డ్రైవర్ వెంటనే దిగిపోవటంతో ప్రాణాపాయం తప్పింది.

గంటల తరబడి ట్రాఫిక్ జాం..

రహదారిపై లారీ తగులబడిపోవడంతో వాహనాలు పెద్ద సంఖ్యలో నిలిచిపోయాయి. పైగా దసరా రద్దీ కూడా తోడుకావడంతో హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్లే వాహనాలు రెండో కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి. ఇదే సమయంలో హైదరాబాద్ నుంచి నల్లగొండకు వెళ్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి క్యాన్వాయ్ సైతం ట్రాఫిక్‌లో చిక్కుకుంది. దీంతో పోలీసులు వెంటనే వాహనాలను వన్‌వేలో పంపించటంతో వాహనాలు ముందుకు సాగాయి. అనంతరం మధ్యాహ్నం 12గంటల వరకు వాహనదారులు ట్రాఫిక్ ఇబ్బందులను ఎదుర్కొన్నారు. అనంతరం జాతీయ రహదారికి అడ్డంగా పడిన లారీని పోలీసులు జేసీబీల సాయంతో పక్కకు తీశారు. ఆ తర్వాత కూడా జాతీయ రహదారిపై వాహనాలను ఒకదానితో ఒకటి ఢీకొనడంతో పలు వాహనాలు ధ్వంసమయ్యాయి.



చిట్యాలలో జాతీయ రహదారిపై దగ్ధమవుతున్న లారీ

దేశాన్ని ఆకర్షించనున్న సిరిపురం

- వీలైనంత త్వరగా సోలార్ విద్యుత్ పనులు పూర్తి చేస్తాం
- రైతులపై భారం పడకుండా ఆదాయం కల్పించడమే సంకల్పం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి



మధిర: సంపూర్ణ సోలార్ విద్యుత్ గ్రామంగా తీర్చిదిద్దేలా పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన ఖమ్మం జిల్లాలోని సిరిపురంగ్రామంలో పనులు పూర్తయితే ఆ గ్రామం దేశాన్నే ఆకర్షిస్తుందని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. మధిర మండలం సిరిపురంలోని శ్రీ నరేంద్ర స్వామి ఆలయంలో ఆయన శుక్రవారం రాత్రి రైతులు, గ్రామస్తులతో ముఖాముఖిగా మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడిన ఆయన వ్యవసాయ పంపుసెట్లతో ప్రతీ ఇంటికి సోలార్ విద్యుత్ ఏర్పాటు చేస్తామని..తద్వారా ఎలా సాధ్యమైందో చూసేందుకు దేశవ్యాప్తంగా మంత్రులు, అధికారులు వస్తారని తెలిపారు. రైతులు, ప్రజలపై భారం పడకుండానే యూనిట్లు ఏర్పాట్లు చేయడంతో పాటు మిగులు విద్యుత్‌ను గ్రిడ్‌కు అమ్మడం ద్వారా ఆదాయం సమకూరుస్తామని వెల్లడించారు. సీఎం రేవంత్‌రెడ్డి స్వగ్రామమైన కొండారెడ్డిపల్లితో పాటు తాను ప్రాతినిధ్యం వహిస్తున్న మధిర నియోజకవర్గంలోని సిరిపురాన్ని సోలార్ విద్యుత్ గ్రామంగా మార్చడానికి పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశామన్నారు. ప్రాజెక్టు త్వరగా పూర్తయ్యేలా ప్రజలు సహకరించాలని డిప్యూటీ సీఎం కోరారు.

ధూంధాం... దసరా

- రాష్ట్రంలో కేవలం ఐదు రోజుల్లో 25 శాతం పెరిగిన అమ్మకాలు
- రూ.620 కోట్ల మేర సరుకు డిపోల నుంచి షాపులకు
- పదో తేదీన ఏకంగా రూ.139 కోట్ల విలువైన మద్యం అమ్మకాలు
- అదే రోజున రికార్డు స్థాయిలో 2.35 లక్షల కేసుల బీర్లు తీసుకెళ్లిన వ్యాపారులు

సాక్షి, హైదరాబాద్: దసరా పండుగ ఈసారి రాష్ట్రంలో ధూంధాంగా జరుగుతోందని మద్యం విక్రయ గణాంకాలు చెప్పకనే చెబుతున్నాయి. సాధారణ రోజులతో పోలిస్తే గత ఐదు రోజుల్లో 25 శాతం అమ్మకాలు పెరిగాయి. గత ఏడాది దసరాతో పోలిస్తే..ఈ ఐదు రోజుల్లో 15 శాతం మేర అమ్మకాలు పెరగ్గా, ప్రతిరోజు రాష్ట్రంలో సగటున రూ.124 కోట్ల మద్యం అమ్ముడవుతోంది. రికార్డు స్థాయిలో ఈనెల 10వ తేదీన ఏకంగా రూ.139 కోట్ల విలువైన మద్యాన్ని డిపోల నుంచి వైన్‌షాపులకు తరలించారు. అదే రోజున ఏకంగా 2.35 లక్షల కేసుల బీర్లు వైన్‌షాపులకు చేరడం గమనార్హం . ఈ స్థాయిలో బీర్ అమ్మకాలు ఏడాది కాలంలోనే రికార్డు అని ఎక్సైజ్ వర్గాలు చెబుతున్నాయి. వాస్తవానికి, సాధారణ రోజుల్లో సగటున రోజుకు రూ.100 కోట్ల విలువైన మద్యం అమ్మకాలు జరుగుతుంటాయి. లక్ష కేసుల వరకు లిక్కర్ అమ్ముడవుతుంది. కానీ, దసరా సందర్భంగా ఈ అమ్మకాల జోరు పెరిగింది. ఐదు రోజుల సగటు చూస్తే రోజుకు 1.20 లక్షల కేసుల లిక్కర్, 2 లక్షల కేసుల బీర్లు అమ్ముడుపోయాయి. ఇక, ఈనెల 1వ తేదీ నుంచి గణాంకాలను పరిశీలిస్తే 8 రోజుల్లో రూ.852.38 కోట్ల విలువైన మద్యం అమ్ముడుపోయింది. ఇందులో 8.37లక్షల కేసుల లిక్కర్ ఉండగా, 14.53 లక్షల కేసుల బీర్లు ఉన్నాయి. అదే గత ఏడాది అక్టోబర్1 నుంచి 10వ తేదీ వరకు రూ. 800 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరిగాయి. గత ఏడాదితో పోలిస్తే పది రోజుల్లో కూడా 6.55 శాతం మేర మందుబాబులు ఫుల్లుగా లాగించేశారని ఈ గణాంకాలు చెబుతున్నాయి.

గత ఐదు రోజులుగా రాష్ట్రంలో జరిగిన మద్యం విక్రయాలు ఇలా...

తేదీ	లిక్కర్ కేసులు(లక్షల్లో)	బీర్‌కేసులు(లక్షల్లో)	విలువ(రూ.కోట్లలో)
అక్టోబర్ 5	1.27	2.09	127.18
అక్టోబర్ 7	1.28	2.13	129.39
అక్టోబర్ 8	0.97	1.89	102.93
అక్టోబర్ 9	1.19	1.90	120.16
అక్టోబర్ 10	1.33	2.35	139.16
మొత్తం	6.04	10.36	618.82



కార్పొరేషన్లు.. కాసుల కహానీ

▶ మొదటి పేజీ తరువాయి

ఆదాయాలు, అప్పులు వంటి సమాచారం అందజేశారు. విచారణ చేశారే కానీ ఇప్పటివరకు బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.

కొన్ని కార్పొరేషన్ల తీరు ఇలా...

- ఆయిల్‌ఫెడ్ ఆయిల్‌పామ్‌పైనే దృష్టి సారించింది. కానీ అది కూడా పూర్తిస్థాయిలో విజయవంతం చేయలేకపోయింది. సీజన్లలో అవసరమైన ఆయిల్ సీడ్స్‌ను సరఫరా చేయాల్సిన బాధ్యత ఉన్నా, నిర్వహించడం లేదన్న విమర్శలూ ఉన్నాయి. ఇక మిగిలిన కీలకమైన అనేక విషయాలను పక్కన పెట్టేసింది. మార్కెట్‌లో విజయ నూనె వాటాలను పెంచుకోవడంలో విఫలమైంది. ప్రైవేట్ కంపెనీలు దూసుకుపోతున్నా, తన షేర్‌ను పెంచుకోలేకపోతోంది. అందుకు అవసరమైన ప్రచారం చేసుకోవడంలో వైఫల్యం కనిపిస్తున్నది. విజయ బ్రాండ్‌తో మినరల్ వాటర్ ప్లాంట్‌ను రూ.కోట్లు ఖర్చు చేసి ఏర్పాటు చేశారు. అయితే దానికి మార్కెటింగ్ కల్పించలేదు. దీంతో ఆయిల్‌ఫెడ్‌కు భారీ నష్టం వాటిల్లుతోంది.
- మార్క్‌ఫెడ్ మరింత దిగజారిపోయింది. అక్కడ పుష్కలంగా ఎరువులు ఉన్నా, వాటిని రైతులకు అందించ లేకపోతున్న విమర్శలున్నాయి. 60 శాతం మార్క్‌ఫెడ్ ద్వారా సహకార సంఘాలు, 40 శాతం ప్రైవేట్ డీలర్లకు ఇస్తారు. అయితే సహకార సంఘాలకు అడ్వాన్సుగా ఎరువులు ఇవ్వకపోవడంతో రైతులకు సకాలంలో అందడం లేదు. మరోవైపు ఎరువుల రవాణా టెండర్లను రెండుమూడుసార్లు రద్దు చేసి ఇప్పటికీ కొలిక్కి తీసుకురాలేదు.
- ఆగ్రోస్ కార్పొరేషన్ వ్యవసాయ యంత్రాలను సరఫరా చేయడంలో కీలకంగా ఉండాలి. యంత్రాల ధరలను ఖరారు చేయాలి. కానీ వ్యవసాయ యాంత్రీకరణ పథకమే అమలుకాకపోవడంతో ఆ సంస్థ నిర్వీర్యమై పోతున్నది.
- వేర్ హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా గోదాములు నిర్వహించాలి. కానీ చాలాసార్లు ప్రైవేట్ గోదాములకు లబ్ధి చేకూర్చే విధంగా కొందరు అధికారులు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు ఈ కార్పొరేషన్ జిల్లా మేనేజర్లుగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులే ఉండటం విశేషం. రెగ్యులర్ పద్ధతిలో నియమించకపోవడంపై విమర్శలు ఉన్నాయి.
- కొన్ని కార్పొరేషన్ల చైర్మన్లు విలాసం కోసం ఆయా సంస్థల సొమ్మును నీళ్లలా ఖర్చు చేస్తున్నారు. తమ చాంబర్లు అంతా బాగానే ఉన్నా, తాము కోరుకున్నట్టు రూ.లక్షలకు లక్షలు ఖర్చు చేసి తీర్చిదిద్దుకున్నారు. అవసరం లేకపోయినా ఫర్నిచర్ కొనుగోలు చేశారు. ఇక ఆయా సంస్థలకు ఇప్పటికే కార్లున్నా, కొత్త కార్లు కావాలని పేచీ పెడుతున్నారు. దీంతో ఆయా కార్పొరేషన్ల చైర్మన్లు, ఎండీల మధ్య తీవ్ర అగాధం నెలకొంది.

పట్టణ–గ్రామీణ ప్రాంతాల మధ్య తగ్గుతున్న ‘డిజిటల్ డివైడ్’


▶ మొదటి పేజీ తరువాయి

మధ్య కాలంలో మినిస్ట్రీ ఆఫ్ స్టాటిస్టిక్స్ అండ్ ప్రోగ్రామ్ నిర్వహించిన కాంప్రహెన్సివ్ అన్యూవల్ మాడ్యువల్ సర్వేలో అనేక అంశాలు, కొత్త విషయాలు వెలుగులోకి వచ్చాయి. అండమాన్, నికోబార్‌లోని కొన్ని గ్రామాల్లో మినహా దేశవ్యాప్తంగా సర్వే చేశారు. ఈ సర్వేలో భాగంగా మొత్తం 3,02,086 కుటుంబాలను (గ్రామీణ ప్రాంతాల్లో 1,73,096, పట్టణ ప్రాంతాల్లో 1,28,990) కలిశారు. మొత్తంగా 12,99,988 (గ్రామాల్లో 7,85,246 మంది, పట్టణాల్లో 5,14,742 మంది) మంది నుంచి వివరాలు సేకరించారు. మొబైల్, ఇంటర్నెట్ వినియోగం, ఐసీటీ స్కిల్స్, ఔట్ ఆఫ్ ప్యాకెట్ మెడికల్ ఎక్స్‌పెండీచర్, విద్య తదితర అంశాలపై ఈ సర్వే జరిగింది. గ్రామీణ ప్రాంతాల్లోనూ ఇంటర్నెట్ వినియోగం గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో మొత్తంగా 95.7 శాతం గ్రామీణ యువత (పట్టణాల్లో 97 శాతం) మొబైల్ ఫోన్లు వినియోగిస్తున్నట్టు వెల్లడైంది. 15–25 ఏళ్ల మధ్యనున్న గ్రామీణ యువత 82 శాతం (పట్టణాల్లో 92 శాతం) ఇంటర్నెట్ ఉపయోగిస్తున్నారు.

టీనేజీలోనే గంజాయి!

▶ మొదటి పేజీ తరువాయి

తాగుతున్నారు. ఆ వయస్సులోనే మద్యం, డ్రగ్స్‌కు బానిసలుగా మారుతున్నారు. 13–19 ఏళ్ల మధ్య వయస్సులోని టీనేజీ పిల్లల్లో ప్రతి ఏడుగురిలో ఒకరికి మానసిక రుగ్మత ఉంది. పెద్ద వారు మానసిక సమస్యలను తట్టుకోగలరు. కానీ చిన్న పిల్లలు తట్టుకోలేరు. చదువు, కెరీర్ వంటివి వారిపై తీవ్రమైన ప్రభావం చూపుతాయి. 15–19 మధ్య వయస్సు వారిలో మానసిక సమస్యలు అత్యధికంగా 15 శాతం ఉండటం గమనార్హం. ఆ వయస్సులో చదువు కీలకమైన దశలో ఉంటుంది. కెరీర్‌ను నిర్ణయించుకునే దశ, ప్రేమలు, ఆకర్షణలు వంటివి వారిని ఉక్కిరి బిక్కిరి చేస్తాయి. ఆ వయస్సువారే వివిధ మానసిక కారణాల వల్ల నేరస్తులుగా మారుతున్నారు. ఆత్మహత్యలూ 15–24 ఏళ్లలోపు వారిలోనే అధికంగా ఉంటున్నాయి. అందులో ఎక్కువగా పురుషులే ఉంటున్నారు. బాలికలు ఎక్కువగా భావోద్వేగపరమైన ఒత్తిడికి (ఎమోషనల్ డిస్ట్రెస్స్) గురవుతుంటారు. పిల్లల్లో కడుపునొప్పి, వాంతులు, తలనొప్పి వంటివి కూడా మానసిక రుగ్మతకు సంబంధించిన అంశాలే. పెద్దవారిలో డిప్రెషన్, యాంగ్జయిటీ వంటివి కీలకంగా ఉంటాయి. అతిగా తినడమూ, తక్కువ తినడమూ మానసిక వ్యాధి లక్షణాలే. 40 ఏళ్లలోపు వరకు మానసిక సమస్యలు ఎక్కువగా వస్తాయి. 70 ఏళ్లు పైబడిన వారిలో మతిమరుపు వస్తుంది.



ప్రాథమిక ఆరోగ్యంలో ఇది భాగం కావాలి

లింగ భేదాలు కూడా మానసిక సమస్యలకు కారణంగా ఉంటున్నాయని ఆ నివేదిక తేలింది. పురుషులు కుటుంబ బాధ్యతలు, అనేక ఇతర సమస్యలతో మద్యానికి బానిసలవుతున్నారు. అలాగే బయటకు చెప్పలేని పరిస్థితులూ ఉంటున్నాయి. ఉద్యోగం, ఉపాధి, ఆర్థికంగా నిలదొక్కుకోవడం వంటివి ఇబ్బందికి గురిచేస్తాయి. మానసిక రుగ్మతలకు వైద్యం చేసే పరిస్థితులు తక్కువగా ఉన్నాయి. మానసిక ఆరోగ్యాన్ని ప్రాథమిక ఆరోగ్యంలో కలపాలి. ప్రస్తుతం ప్రాథమిక, జిల్లా ఆసుపత్రుల్లో మానసిక సమస్యలకు సంబంధించిన వైద్యులు లేకపోవడాన్ని నివేదిక ఎత్తి చూపింది. ప్రపంచవ్యాప్తంగా చిన్నపిల్లలు, యువకుల మానసిక ఆరోగ్యంపై ఆయా దేశాల బడ్జెట్లలో కేవలం 0.1 శాతం నిధులు మాత్రమే ఖర్చు చేస్తున్నారు. 80 శాతం దేశాల్లో మానసిక ఆరోగ్యంపై ఒక ప్రత్యేక వ్యవస్థ అనేది లేనేలేదు.

– డాక్టర్ కిరణ్ మాదల, ప్రొఫెసర్ అనెస్తీషియా, గాంధీ మెడికల్ కాలేజీ, హైదరాబాద్

సాక్షి బిజినెస్
శనివారం
12-10-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
230	34
81,381	24,964

విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	18,318	△ 37
డోజోన్స్	42,713	△ 259
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,254	△ 16
డాక్స్	19,374	△ 163
షాంఘై	3,218	▽ 84
నికాయ్	36,606	△ 225

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.ల్లో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	75,623 △	785
బంగారం (99.5 స్వచ్ఛత)	75,320 △	782
వెండి (కిలో)	89,963 △	1,610

ఫారెక్స్ రేట్లు రూ.ల్లో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బిఐ	83.58	84.62
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బిఐ	108.72	111.44
€	యూరో	ఎస్‌బిఐ	91.34	93.58
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బిఐ	56.21	57.52
AUS$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బిఐ	55.65	57.68
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	62.09	66.79
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.53	23.02
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.82	23.79
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.05	12.89

రతన్ వారసుడు నోయెల్

టాటా ట్రస్ట్స్ చైర్మన్‌గా పగ్గాలు • ఏకగ్రీవంగా ఎన్నుకున్న ట్రస్టీలు • నియామకం తక్షణం అమల్లోకి...



ముంబై: అంతా ఊహించినట్లే టాటా ట్రస్ట్స్ పగ్గాలు రతన్ టాటా సవతి సోదరుడు నోయెల్ టాటా (67) చేతికే లభించాయి. టాటా ట్రస్ట్స్‌తో పాటు అందులో భాగమైన మిగతా ట్రస్టులన్నింటికీ కూడా చైర్మన్‌గా ట్రస్టీలు శుక్రవారం జరిగిన సమావేశంలో నోయెల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టాటా గ్రూప్‌తో పాటు జాతి నిర్మాణంలోనూ దివంగత రతన్ టాటా కీలక పాత్ర పోషించారని, ఎనలేని సేవలందించారని ట్రస్టీలు నివాళులర్పించారు. టాటా ట్రస్ట్స్ ఒక ప్రకటనలో ఈ విషయాలు వెల్లడించింది. నోయెల్ నియామకం తక్షణం అమల్లోకి వస్తుందని పేర్కొంది. 'రతన్ టాటా, అలాగే టాటా గ్రూప్ వ్యవస్థాపకులు అందించిన ఘన వారసత్వాన్ని ఇకపైనా కొనసాగిస్తాము. అభివృద్ధి, దాతృత్వ కార్యకలాపాలను కొనసాగిస్తూ జాతి నిర్మాణంలో మా వంతు పాత్రను పోషించడానికి పునరంకితమవుతాము' అని ఈ సందర్భంగా నోయెల్ తెలిపారు.

పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటా బుధవారం కన్నుమూసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన వారసుడిని ఎన్నుకునేందుకు టాటా ట్రస్ట్స్ ట్రస్టీలు సమావేశమయ్యారు. 165 బిలియన్ డాలర్ల టాటా గ్రూప్ వ్యాపార సామ్రాజ్యం పరోక్షంగా టాటా ట్రస్ట్స్ నియంత్రణలో ఉంటుంది. టాటా ట్రస్ట్స్ కింద సర్ రతన్ టాటా ట్రస్ట్.. దాని అనుబంధ ట్రస్టులు, సర్ దొరాబ్జీ టాటా ట్రస్ట్.. దాని అనుబంధ ట్రస్టులు ఉన్నాయి. వీటన్నింటికీ టాటా గ్రూప్ కంపెనీలకు హోల్డింగ్ సంస్థ, ప్రమోటర్ అయిన టాటా సన్స్‌లో 66 శాతం వాటాలు ఉన్నాయి. ఇప్పటివరకు రతన్ టాటా నీడలో ఉన్న నోయెల్ టాటా ఇకపై సొంతంగా వీటి బాధ్యతలను చేపట్టనున్నారు.


మాయా


నెవిల్


లియా

ముగ్గురు సంతానం..

టాటా సన్స్‌లో 18.4 శాతం వాటా ఉన్న షాపూర్‌జీ పల్లోంజీ కుటుంబానికి చెందిన ఆలూ మిస్త్రీని నోయెల్ వివాహం చేసుకున్నారు. ఆమె టాటా సన్స్ మాజీ చైర్మన్, దివంగత సైరస్ మిస్త్రీ సోదరి. నోయెల్, ఆలూకి ఇద్దరు కుమార్తెలు (లియా, మాయా), ఒక కుమారుడు (నెవిల్) ఉన్నారు. పెద్ద కుమార్తె లియా టాటా ప్రస్తుతం ఇండియన్ హోటల్స్‌కి వైస్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. చిన్న కుమార్తె మాయా తన ప్రొఫెషనల్ కెరియర్‌ను టాటా ఆపర్చూనిటీస్ ఫండ్‌తో ప్రారంభించారు. తర్వాత టాటా డిజిటల్‌కి మారారు. టాటా న్యూ యాప్ రూపకల్పనలో కీలకంగా వ్యవహరించారు. నెవిల్ టాటా తన వ్యాపార నైపుణ్యాలతో జుడియో బ్రాండ్‌ను విజయవంతం చేశారు. ట్రెంట్, స్టార్ బజార్‌లను పర్యవేక్షిస్తున్నారు. వ్యాపార దిగ్గజం విక్రమ్ కిర్లోస్కర్ కుమార్తె మానసి కిర్లోస్కర్‌ను వివాహం చేసుకున్నారు.

నాలుగు దశాబ్దాలుగా టాటా గ్రూప్‌లో...

ఐరిష్ పౌరసత్వం ఉన్న నోయెల్ టాటా గత నాలుగు దశాబ్దాలుగా టాటా గ్రూప్‌లో ఉన్నారు. ఆయన అంతగా బైటికి కనిపించరు. రతన్ టాటా తండ్రి నావల్ టాటాకు సూనూ, సిమోన్ అని ఇద్దరు భార్యలు. వారిలో సూనూ టాటా కుమారులు రతన్ టాటా, జిమ్మీ టాటా కాగా మరో భార్య సిమోన్ కుమారుడే నోయెల్ టాటా. ఆయన ససెక్స్ యూనివర్సిటీలో (యూకే) గ్రాడ్యుయేషన్ చేశారు. ఇన్సీడ్‌లో (ఫ్రాన్స్) ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రాం చేశారు. టాటా ఇంటర్నేషనల్‌లో కెరియర్ ప్రారంభించిన నోయెల్ 1999లో రిటైల్ వ్యాపారం ట్రెంట్‌కి మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. అప్పటికి ఒకటే స్టోర్ ఉన్న ట్రెంట్.. ఆయన సారథ్యంలోకి వచ్చాక గణనీయంగా వృద్ధి చెంది 700 పైచిలుకు స్టోర్స్‌కి విస్తరించింది. ముఖ్యంగా వెస్ట్‌సైడ్ రిటైల్ చెయిన్‌ను కొనుగోలు చేసిన తర్వాత ఇది మరింత వేగవంతమైంది. 2003లో వోల్టాస్, టైటాన్ ఇండస్ట్రీస్ డైరెక్టర్‌గా ఆయన కొత్త బాధ్యతలు చేపట్టారు. టాటా ఇంటర్నేషనల్ ఆయన సారథ్యంలో 500 మిలియన్ డాలర్ల టర్నోవర్ నుండి 3 బిలియన్ డాలర్ల స్థాయికి ఎదిగింది. ప్రస్తుతం ట్రెంట్, టాటా ఇంటర్నేషనల్, వోల్టాస్ అండ్ టాటా ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్లకు చైర్మన్‌గా, టాటా స్టీల్, టైటాన్‌లకు వైస్ చైర్మన్‌గా నోయెల్ వ్యవహరిస్తున్నారు. అలాగే 2019 నుంచి టాటా ట్రస్టుల్లో ట్రస్టీగా కూడా ఉన్నారు. స్మిత్స్ పీఎల్‌సీ, కాన్సాయ్ నెరోలాక్ పెయింట్స్ కంపెనీల బోర్డుల్లోనూ నోయెల్ ఉన్నారు.

బ్యాంక్ షేర్లలో అమ్మకాలు



- గణాంకాల వెల్లడికి ముందు అప్రమత్తత
- సెన్సెక్స్ 230 పాయింట్ల డౌన్
- 34 పాయింట్లు నష్టపోయిన నిఫ్టీ

ముంబై: పారిశ్రామికోత్పత్తి వృద్ధి గణాంకాల వెల్లడికి ముందు అప్రమత్తత వహించడంతో స్టాక్ సూచీలు శుక్రవారం నష్టాల్లో ముగిశాయి. బ్యాంకులు, యుటిలిటీ, ఫైనాన్స్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లలోని బలహీనతలు, విదేశీ ఇన్వెస్టర్ల విక్రయాలు సెంటిమెంట్‌పై ఒత్తిడి పెంచాయి. సెన్సెక్స్ 230 పాయింట్లు నష్టపోయి 81,381 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 34 పాయింట్లు కోల్పోయి 24,964 వద్ద నిలిచింది. ఉదయం నష్టాల్లో మొదలైన సూచీలు రోజంతా బలహీనంగానే కదలాడాయి. ఒక దశలో సెన్సెక్స్ 307 పాయింట్లు కోల్పోయి 81,304 వద్ద, నిఫ్టీ 78 పాయింట్లు పతనమై 24920 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది. రియల్టీ, యుటిలిటీ, బ్యాంకులు, ఆటో, ఫైనాన్సియల్ సర్వీసెస్, విద్యుత్ రంగాల షేర్లు రాణించాయి. చైనా వృద్ధి ఊతానికి తన ఆర్థిక వ్యవస్థలో 283 బిలియన్ డాలర్లపైగా ద్రవ్యసరఫరా పెంచేందుకు సిద్ధమైనట్లు వార్తలు వెలువడటంతో మెటల్ షేర్లకు డిమాండ్ లభించింది. నాల్కో 3.50%, ఎన్‌ఎండీసీ 3%, సెయిల్ 2.50%, హిందాల్కో, జిందాల్ స్టీల్ 2%, వేదాంత షేర్లు ఒకటిన్నర శాతం లాభపడ్డాయి.

ఆల్‌టైమ్ కనిష్టానికి రూపాయి పతనం

డాలర్‌తో 84.10కు క్షీణత



ముంబై: స్టాక్ మార్కెట్ నుంచి విదేశీ పెట్టుబడులు క్రమంగా బయటకు వెళుతుండడం రూపాయిపై ప్రభావం చూపిస్తోంది. శుక్రవారం ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 84.10 వద్ద ముగిసి సరికొత్త ఆల్‌టైమ్ కనిష్టాన్ని నమోదు చేసింది. నికరంగా 12 పైసలు నష్టపోయింది. ట్రేడింగ్ ఆరంభంలో డాలర్‌తో రూపాయి 83.97 వద్ద మొదలైంది. ఇంట్రాడేలో 83.96 గరిష్ట స్థాయికి చేరింది. అక్కడి నుంచి 84.10కి పడిపోయింది.

పరిశ్రమలు రివర్స్‌గేర్!



- ఆగస్టులో పారిశ్రామికోత్పత్తి మైనస్ 0.1%
- జూలైలో ఇది 4.7 శాతం
- మైనింగ్, విద్యుత్ ఉత్పత్తిలో క్షీణత

న్యూఢిల్లీ: దేశ పారిశ్రామిక ఉత్పత్తి వృద్ధి రేటు రెండేళ్ల విరామం తర్వాత ఆగస్టు నెలలో ప్రతికూలానికి పడిపోయింది. మైనస్ 0.1 శాతంగా నమోదైంది. పరిశ్రమల ఉత్పత్తిని ప్రతిబింబించే పారిశ్రామిక ఉత్పాదక సూచీ (ఐఐపీ) వృద్ధి జూలై నెలకు 4.7 శాతంగా ఉండడం గమనార్హం. క్రితం ఏడాది ఆగస్టు నెలలోనూ ఐఐపీ 10.9 వృద్ధిని నమోదు చేసింది. ప్రధానంగా మైనింగ్, విద్యుదుత్పత్తి రంగంలో క్షీణత ఐఐపీ పడిపోవడంలో కీలకంగా పనిచేసింది. అదే సమయంలో తయారీ రంగంలోనూ ఉత్పాదకత పుంజుకోలేదు. జాతీయ గణాంక కార్యాలయం (ఎన్‌ఎస్‌వో) ఈ వివరాలను విడుదల చేసింది. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు (ఐదు నెలల్లో) ఐఐపీ వృద్ధి 4.2 శాతంగా ఉంది. క్రితం ఏడాది ఇదే కాలానికి నమోదైన 6.2 శాతం కంటే తక్కువ. వృద్ధి రేటు మైనింగ్ రంగంలో మైనస్ 4.3 శాతానికి పడిపోయింది. విద్యుదుత్పత్తి రంగంలో మైనస్ 3.7 శాతంగా నమోదైంది. తయారీలో 0.1 శాతంగా ఉంది. ఆగస్ట్ నెలలో అధిక వర్షాలు మైనింగ్ రంగంలో వృద్ధి క్షీణతకు కారణమని ఎన్‌ఎస్‌వో తెలిపింది. చివరిగా 2022 అక్టోబర్ నెలలో ఐఐపీ వృద్ధి ప్రతికూలంగా నమోదు కావడం గమనార్హం.

రిలయన్స్ డిజిటల్ 'ఎలక్ట్రానిక్స్ పండుగ'

హైదరాబాద్: దసరా పండుగ సందర్భంగా రిలయన్స్ డిజిటల్ 'ఎలక్ట్రానిక్స్ పండుగ' పేరుతో ఆఫర్లు ప్రకటించింది. స్మార్ట్ టీవీలు, స్మార్ట్ వాచీలు, స్మార్ట్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, హోమ్ అప్లయెన్స్, ఎయిర్ పాడ్స్, ఏసీలు తదితర ఎలక్ట్రానిక్స్ ఉపకరణాలపై తగ్గింపు ధరలు ఉన్నాయని తెలిపింది. వీటి కొనుగోలుపై రూ.25వేల వరకు బెనిఫిట్స్‌తో పాటు అనేక ఫైనాన్స్ ఎంపికలున్నట్లు వివరించింది. ప్రముఖ బ్యాంకుల కార్డులతో చేసే కొనుగోళ్లపై రూ.10వేల వరకు తక్షణ డిస్కౌంట్ అందిస్తుంది. ఈ ఆఫర్లన్నీ రిలయన్స్ డిజిటల్, మై జియో స్టోర్లలో ఈ నవంబర్ 3 వరకు చెల్లుతాయని కంపెనీ తెలిపింది.

సుదర్శన్ కెమ్ చేతికి హ్యూబక్ పిగ్మెంట్

డీల్ విలువ రూ. 1,180 కోట్లు



న్యూఢిల్లీ: స్పెషాలిటీ కెమికల్స్ కంపెనీ సుదర్శన్ కెమికల్ తాజాగా జర్మన్ దిగ్గజం హ్యూబక్ గ్రూప్‌నకు చెందిన గ్లోబల్ పిగ్మెంట్ బిజినెస్‌ను కొనుగోలు చేస్తోంది. ఇందుకు నెదర్లాండ్స్‌లోని సొంత అనుబంధ సంస్థ ద్వారా తప్పనిసరి ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు తెలియజేసింది. మొత్తం గ్లోబల్ పిగ్మెంట్ కార్యకలాపాల కొనుగోలుకి నగదు రూపేణా 12.75 కోట్ల యూరోలు(రూ. 1,180 కోట్లు) చెల్లించనున్నట్లు వెల్లడించింది. దీనిలో భాగంగా ఇండియా, యూఎస్‌ఏ కంపెనీలలో సైతం 100 శాతం హ్యూబక్ హోల్డింగ్స్‌ను సొంతం చేసుకోనున్నట్లు వివరించింది. మూడు నాలుగు నెలల్లో కొనుగోలు పూర్తికానున్నట్లు సుదర్శన్ అంచనా వేస్తోంది. స్పెషాలిటీ కెమికల్ పరిశ్రమలోని ఆర్గానిక్, ఇనార్గానిక్ పిగ్మెంట్స్, డైస్, డిస్పెర్షన్స్ తదితరాల తయారీలో హ్యూబక్ కీలక కంపెనీగా నిలుస్తోంది.

ఈ వార్తల నేపథ్యంలో సుదర్శన్ కెమ్ షేరు బీఎస్‌ఈలో 19 శాతం దూసుకెళ్లి రూ. 1,208 వద్ద నిలిచింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
టెస్లా నుంచి రోబో ట్యాక్సీలు..
క్యూ2లో ఇరెడా లాభం 36% జూమ్

కుటుంబంలో ఒకరు డాక్టర్ అవడం సాధారణంగా చూస్తుంటాం. ఇద్దరు డాక్టర్లు ఉండటమూ మనకు తెలుసు. ఆ ఇంట్లో మాత్రం నలుగురు కుమార్తెలూ డాక్టర్లే! టైలరింగ్ చేస్తూ కూతుళ్లను డాక్టర్లు చేయడానికి తపించారు రామచంద్రం - శారద దంపతులు. వారి కలలు నిజమై ఇప్పుడు ఆ ఇల్లే వైద్యుల నిలయంగా మారిపోయింది.



డాక్టర్.. డాటర్స్ !

● ఆ ఇల్లే వైద్యుల నిలయం ● నలుగురు కుమార్తెలు సరస్వతీ పుత్రికలే

సిద్దిపేట పట్టణంలో నర్సాపూర్‌కు చెందిన కొంక రామచంద్రం (శేఖర్), శారద దంపతులకు నలుగురు కుమార్తెలు. రామచంద్రం – శారద టైలరింగ్ చేస్తు జీవనం కొనసాగిస్తున్నారు. ఇదంతా సాధారణమే! కానీ వీరి నలుగురు కుమార్తెలు డాక్టర్లే కావడమే విశేషం. ఒకరు వైద్యవిద్య పూర్తిచేయగా, మరొకరు ఫైనల్ ఇయర్‌లో ఉన్నారు. ఇంకో ఇద్దరు కుమార్తెలు ఈ ఏడాది మెడిసిన్‌లో సీట్లు సాధించారు. 'నలుగురు కూతుళ్లేనా..' అని హేళనలు ఎదుర్కొన్న ఆ తల్లిదండ్రులు ఇప్పుడు తమ పిల్లల ఎదుగుదలను చూసి గర్వపడుతున్నారు.



ఒక్కరైనా డాక్టర్ కావాలని..

రామచంద్రం, శారద ఇద్దరూ కలిసి రోజంతా కష్టపడితే రూ.800 వస్తుంది. దీంతో వారి కుటుంబం గడవడమే కష్టమైనా నలుగురు పిల్లలను చక్కగా చదివించాలని తపించారు. రామచంద్రం సోదరుడు రాజు 1992లో ఫిట్స్‌తో మృతిచెందగా, రామచంద్రం 14 ఏళ్ల వయసులో ఆయన తల్లి మల్లవ్వ గొంతు కేన్సర్‌తో మరణించింది. సరైన సమయంలో తాము గుర్తించకపోవడంతోనే సోదరుడు, తల్లిని కోల్పోవాల్సి వచ్చిందని... కుటుంబంలో ఒక్కరికైనా డాక్టర్ అయి ఉంటే వాళ్లు బతికేవారని అనుకునేవాడు. నలుగురు కూతుళ్లలో పెద్ద కూతురు మమత ఎంబీబీఎస్ సీటు సాధించింది. ఆ తర్వాత ఆమె చెల్లెళ్లు అదే బాట పట్టారు.





చదువులోనూ కవలలే..

రోహిణి, రోషిణి ఇద్దరు కవలలు... 2023 నీట్ రాసిన రోహిణి 443(పెద్ద కూతురు), రోషిణి 425(చిన్న కూతురు) మార్కులు సాధించారు. రోహిణికి ఓ ప్రైవేట్ మెడికల్ కళాశాలలో సీటు వచ్చినా చెల్లి రోషిణికి సీటు రాకపోవడంతో ఒత్తిడికి గురవుతుందని అక్క సీటు వదులుకుంది. ఆపై ఇద్దరు లాంగ్‌టర్మ్ శిక్షణతో ప్రిపేర్ అయ్యారు. దీంతో 2024 నీట్‌లో రోహిణి 536 మార్కులు, రోషిణి 587 మార్కులు సాధించారు. ఇప్పుడు రోషిణికి(చెల్లి) సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీటు వచ్చే అవకాశం ఉన్నప్పటికీ ఇద్దరూ ఒకేదగ్గర చదువుకోవాలని అక్క కోసం జగిత్యాల మెడికల్ కళాశాలలో సీట్లు తీసుకున్నారు.

– గజవెల్లి షణ్ముఖరాజు, సాక్షి, సిద్దిపేట
ఫొటోలు: కె సతీష్,

ఈ సరస్వతీ పుత్రికలకు అండగా నిలవాలనుకునే వారు 98499 54604 ను సంప్రదించవచ్చు.

నాన్న కల నాకు లక్ష్యమైంది

డాక్టర్ చదవాలన్నది మా నాన్న కల. ఆ కల నాకు లక్ష్యం అయ్యింది. 2018-2024లో ఎంబీబీఎస్ విజయవాడలోని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో పూర్తిచేశా. గైనిక్ లేదా జనరల్ మెడిసిన్ పీజీ చేయాలని అనుకుంటున్నా. మా అమ్మనాన్నలు ఎన్ని ఇబ్బందులు పడినా మాకు ఏనాడూ లోటు రాకుండా చూసుకున్నారు.

– డాక్టర్ మమత, ఎంబీబీఎస్(7009)



అక్క చూపిన దారి

ఇంటర్‌మీడియెట్‌లో ఆరోగ్య సమస్యలు తలెత్తడంతో ఎంబీబీఎస్ చదవలేనేమో అని, డిప్రెషన్‌కు లోనయ్యాను. హైదరాబాద్‌లో చదువుతున్నప్పటికీ ఇంటి నుంచే వెళ్లి పరీక్షలు రాసి వచ్చేదాన్ని. ఇప్పుడు కరీంనగర్‌లోని చెల్మెడ ఆనందరావు మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ ఫైనల్ ఇయర్ చేస్తున్నాను. అక్క నా ముందున్న దారిని క్లియర్ చేయడంతో మేం సాఫీగా నడుస్తున్నాం. జనరల్ మెడిసిన్ పూర్తి చేసి పేదలకు సేవలు అందిస్తాను.

– మాధురి, ఎంబీబీఎస్ ఫైనల్ ఇయర్(7012)



హేళనలను లెక్కచేయలేదు

నలుగురు ఆడపిల్లలని, వారిని హైదరాబాద్‌లో చదివిస్తున్నామని చాలామంది సూటిపోటీ మాటలు అనేవారు. అయినా కుంగిపోకుండా పిల్లలను ఉన్నత స్థానంలో చూడాలనుకున్నాం. టైలరింగ్ చేస్తూ వచ్చే కొద్ది డబ్బుతోనే పిల్లలను లోటు లేకుండా పెంచాం. అప్పుడు హేళన చేసిన వారే ఇప్పుడు మా నలుగురు కూతుర్లు మెడిసిన్ చేస్తుంటే సరస్వతీ పుత్రికలు అని మెచ్చుకోవడంతో మా బాధ, కష్టమంతా మర్చిపోతున్నాం. మాది పేద కుటుంబం. పిల్లల చదువు నిమిత్తం ఎవరైనా దాతలు సాయం చేస్తే వారు ఉన్నత చదువులకు మార్గం ఏర్పడుతుంది.

– రామచంద్రం, శారద

ఒకే కళాశాలలో సీటు ఆనందం..

మేం ఇద్దరం ఒకే కళాశాలలో ఎంబీబీఎస్ సీట్లు సాధించడం సంతోషంగా ఉంది. మా అక్కలే మాకు రోల్ మోడల్. అమ్మానాన్న ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నా చదువుపై మాకు ఉన్న ఇష్టాన్ని గుర్తించి కాదనలేదు. అక్కలిద్దరూ మాకు సరైన గైడెన్స్ ఇచ్చారు.

– రోహిణి, రోషిణి, ఎంబీబీఎస్, మొదటి సంవత్సరం(7011)



అలా తెల్లబోకండి



తెల్లజుట్టు వృద్ధాప్యానికి సూచిక. కాని, వయసుతో సంబంధం లేకుండా ఇప్పుడు 20 దాటి 30లోకి అడుగుపెట్టేలోపే జుట్టు పండిపోతోంది. ఇటీవలి కాలంలో యువతరంలో ఈ సమస్య వేగంగా పెరుగుతోందంటున్నారు నిపుణులు. అకాలంలో జుట్టు నెరిసిపోవడాన్ని 'కానిటీస్' అని అంటారు. దీనికి ఆహారపు అలవాట్లు, పర్యావరణ మార్పులతోపాటు ఇంకా చాలా కారణాలే ఉన్నాయి. తలలో పేనుకొరుకుడు సమస్య తీవ్రమవుతున్నప్పుడు, థైరాయిడ్ ఎక్కువవుతున్నప్పుడు కూడా తెల్లజుట్టు వచ్చే అవకాశం ఉంటుంది. ధూమపానం, మద్యపానం వంటి వ్యసనాలు జుట్టు కుదుళ్లకు రక్త ప్రసరణను తగ్గిస్తాయి. నలుపు రంగునిచ్చే మెలనిన్ ఉత్పత్తికి అంతరాయం కలిగిస్తాయి. దాంతో చిన్న వయసులోనే తల నెరిసిపోతుందని నిపుణులు చెబుతున్నారు. పోషకాహార లోపం, పట్టణ జీవనశైలి కూడా ఈ పరిస్థితి కారణమవుతున్నాయని వారు చెబుతున్నారు. ఐరన్, కాపర్, విటమిన్ బి12 లోపంతో తెల్లజుట్టు విపరీతంగా పెరుగుతుంది. మరి యుక్తవయసులో వచ్చిన తెల్లజుట్టు తగ్గుతుందా? ఇదే ప్రశ్న నిపుణులను అడిగితే తగ్గుతుందనే అంటున్నారు. థైరాయిడ్ సమస్యలను తగ్గించుకోవడం, సక్రమంగా సమయానికి పోషకాహారం తీసుకోవడం ముఖ్యమంటున్నారు.

ఇమ్యూన్ బూస్టర్

వాతావరణం మారుతోంది. ఇప్పుడే ఎండ... అంతలోనే చిటపట చినుకులు... రాత్రి అయేసరికి చలి.. ఈ పరిస్థితులలో దగ్గు, జలుబు, జ్వరం, ఒళ్లునొప్పులు వంటివి చాలామందికి సర్వసాధారణం. మన రోగ నిరోధక వ్యవస్థ సక్రమంగా ఉన్నంత వరకు మనల్ని ఏ రుగ్మతా ఏమీ బాధ పెట్టలేదు. అయితే అలా మన ఇమ్యూన్ వ్యవస్థను బలోపేతం చేసుకోవాలంటే ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకుంటూ కొన్ని చిట్కాలు పాటించడం అవసరం. అవి మన వంటింట్లో సులువుగా దొరికే సహజసిద్ధమైనవైతే మరీ మంచిది. అలాంటి చిట్కాలేమిటో చూద్దాం...



పొద్దున్నే లేచి బ్రష్ చేసుకోగానే ఆమ్లా, చియా సీడ్స్ వాటర్ తాగితే చాలామంచిది. ఈ జ్యూస్ తాగితే జీవక్రియలు



సక్రమంగా జరగడంతోపాటు ఒంటికి సరిపడా సీ విటమిన్, మినరల్స్, యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా లభిస్తాయి. క్రమం తప్పకుండా ఈ డ్రింక్ తాగుతుంటే కొద్దిరోజుల తర్వాత చర్మం పట్టులా నిగారించడంతోపాటు వాపులు, నొప్పులు తగ్గి, శరీరం తేలిక పడుతుంది. తిన్న ఆహారం చక్కగా ఒంటికి పడుతుంది. జుట్టు బాగా పెరుగుతుంది. కంటి ఆరోగ్యం మెరుగుపడుతుంది. సుగర్ స్థాయులు అదుపులో ఉంటాయి. లివర్ పనితీరు బాగుంటుంది. కండరాలు దృఢపడతాయి.

ఈ జ్యూస్ తయారీకి కావలసిందల్లా ముందుగా రెండు టీస్పూన్ల చియాసీడ్స్‌ను రాత్రి పూట నానబెట్టుకుని ఉంచుకోవాలి. పొద్దున లేవగానే చక్కగా కడిగి తరిగిన రెండు ఉసిరి కాయలను గింజలు తీసి రోటిలో వేసి దంచండి లేదా జ్యూసర్ లో అరగ్లాసు నీళ్లు కలుపుకుని రసం తీసి, వడ కట్టుకుని పెట్టుకోవాలి. ఇప్పుడు ఇందులో మనం ముందుగా నానబెట్టి ఉంచుకున్న చియా సీడ్స్‌ను కలుపుకుంటే సరి! డ్రింక్ రెడీ!!

బ్రష్ మార్చి ఎంత కాలం అయింది?



మనలో చాలా మంది టూత్‌బ్రష్‌ను ఏళ్ల తరబడి వాడేస్తుంటారు. మరీ ఏళ్లు కాకపోయినా బ్రిజిల్స్ అంటే మనం పళ్లు తోముకునే భాగం బాగుంటే కనక కనీసం ఏడాదికి తగ్గకుండా వాడతారు. అయితే టూత్‌బ్రష్‌ను అంతకాలం పాటు వాడటం అంత మంచిది కాదంటున్నారు ఆరోగ్యనిపుణులు. టూత్‌బ్రష్‌ను ఇంతకాలం లోపు మార్చాలనే విషయంలో నిర్దిష్టమైన మార్గదర్శకం అంటూ ఏమీ లేకపోయినప్పటికీ మూడు నాలుగు నెలలకోసారి మార్చడం మంచిదంటున్నారు వైద్యులు. అదేవిధంగా బ్రిజిల్స్ వంగిపోయినప్పుడు, లేదా కొన్ని బ్రిజిల్స్ ఊడిపోయినప్పుడు... ఊడుతున్నట్లుగా ఉన్నప్పుడు వెంటనే బ్రష్ మార్చడం మంచిది. బ్రష్‌ను, టంగ్‌క్లీనర్‌ను బాత్‌రూమ్‌లో కాకుండా బయట ఎక్కడైనా పెట్టుకోవాలి.

మరో ముఖ్యవిషయం... ఏదైనా జబ్బు పడి కోలుకున్న తర్వాత అప్పటివరకు వాడుతున్న బ్రష్ కొత్తదైనా సరే, దానిని పారేసి, కొత్త బ్రష్ కొనుక్కోవడం మంచిది. ఎందుకంటే జబ్బుపడ్డప్పుడు ... అంటే వైరల్ ఫీవర్స్, డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్... మరీ ముఖ్యంగా దంత వ్యాధులతో బాధపడుతున్నప్పుడు తప్పనిసరిగా బ్రష్ మార్చడం అవసరం. ఇంటిల్లిపాదీ ఒకే బాక్స్‌లో బ్రష్‌లు పెట్టుకోవడం సాధారణం.. అటువంటప్పుడు రోజూ బ్రష్ చేసుకునే ముందు శుభ్రంగా కడుక్కోవడం మంచిది.

సినిమా



● ఎన్టీఆర్

యుద్ధానికి సిద్ధం

'వార్'కి సిద్ధం అవుతున్నారు ఎన్టీఆర్. హృతిక్ రోషన్‌తో ఆయన యుద్ధం చేయనున్నారు. ఇక ఎన్టీఆర్, జాన్వీ కపూర్ జంటగా నటించిన 'దేవర: పార్ట్ 1' గత నెల 27న విడుదలైన విషయం తెలిసిందే. కొరటాల శివ దర్శకత్వంలో నందమూరి కల్యాణ్‌రామ్ సమర్పణలో మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ .కె నిర్మించిన ఈ సినిమా సూపర్ హిట్‌గా నిలిచింది. తొలి భాగం సూపర్ హిట్ కావడంతో 'దేవర' రెండో భాగంపై అంచనాలు భారీగా ఉన్నాయి. ఒక నెల విరామం తీసుకుని రెండో భాగం పనులు మొదలు పెట్టమని కొరటాల శివకి ఎన్టీఆర్ సూచించారట. ఇక ఎన్టీఆర్ మాత్రం 'వార్ 2' చిత్రం షూట్‌లో పాల్గొనడానికి రెడీ అవుతున్నారు. ఎన్టీఆర్ బాలీవుడ్‌లో ఎంట్రీ ఇస్తున్న సినిమా 'వార్ 2'. హృతిక్ రోషన్ హీరోగా నటిస్తున్న ఈ సినిమాకి అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తున్నారు. జాన్ అబ్రహాం, కియారా అద్వానీ తదితరుల కాంబినేషన్‌లో 'వార్ 2'ని యశ్ రాజ్ ఫిలింస్ సంస్థ నిర్మిస్తోంది. స్పై థ్రిల్లర్‌గా రూపొందుతోన్న ఈ మూవీలో నెగటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో ఎన్టీఆర్ కనిపించనున్నారని టాక్. ఇప్పటికే అటు ముంబై ఇటు హైదరాబాద్ షెడ్యూల్స్‌లో హృతిక్–ఎన్టీఆర్‌లపై కాంబినేషన్ సీన్స్ చిత్రీకరించారు మేకర్స్. అయితే 'దేవర: పార్ట్ 1' సినిమా ప్రమోషన్స్‌తో బిజీగా ఉన్న ఎన్టీఆర్ 'వార్ 2' షూట్‌కి కాస్త గ్యాప్ ఇచ్చారు. దసరా పండగ తర్వాత ఈ సినిమా కొత్త షెడ్యూల్‌ను ప్లాన్ చేసింది యూనిట్. ఈ షెడ్యూల్‌లో హృతిక్ రోషన్, ఎన్టీఆర్‌ల మధ్య క్లైమాక్స్ ఫైట్‌ని చిత్రీకరించనున్నారట. 2025 ఆగస్టు 14న ఈ సినిమా విడుదల కానుంది.

ముక్కోణపు ప్రేమకథ

నిఖిల్ సిద్ధార్థ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో'. సుధీర్ వర్మ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా ద్వారా కన్నడ హీరోయిన్ రుక్మిణీ వసంత్ తెలుగులోకి ఎంట్రీ ఇస్తున్నారు. దివ్యాంశా కౌశిక్ కీలక పాత్రలో, హర్ష చెముడు ముఖ్య పాత్రలో నటిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర ఎల్‌ఎల్‌పీ బ్యానర్‌పై బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్న ఈ సినిమా నవంబరు 8న విడుదల కానుంది. కాగా దసరా పండగని పురస్కరించుకుని ఈ చిత్రం టీజర్‌ని రిలీజ్ చేశారు. ''ముక్కోణపు ప్రేమకథగా రూపొందుతోన్న చిత్రమిది. ఇందులో రిషి అనే పాత్రలో నిఖిల్ కనిపించనున్నారు. యాక్షన్ ఎలిమెంట్, చేజింగ్ సన్నివేశాలు, కథలోని కొన్ని కీలక మలుపులతో టీజర్‌ని విడుదల చేశాం. థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో పాటు చక్కటి వినోదం, రొమాన్స్ వంటి అంశాలు కూడా ఈ చిత్రంలో ఉంటాయి. 'స్వామి రారా, కేశవ' వంటి చిత్రాల తర్వాత నిఖిల్, సుధీర్ వర్మ కాంబినేషన్‌లో వస్తున్న ఈ చిత్రంపై భారీ అంచనాలున్నాయి'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: కార్తీక్, నేపథ్య సంగీతం: సన్నీ ఎం.ఆర్, కెమెరా: రిచర్డ్ ప్రసాద్.



● నిఖిల్

అప్పుడే నటన తెలుస్తుంది!



● నితిన్ ప్రసన్న, శివకుమార్

శివకుమార్ రామచంద్రవరపు, నితిన్ ప్రసన్న ప్రధాన పాత్రల్లో రూపొందిన చిత్రం 'నరుడి బ్రతుకు నటన'. రిషికేశ్వర్ యోగి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో శ్రుతి జయన్, ఐశ్వర్య అనిల్ కుమార్, వైవా రాఘవ్ ఇతర పాత్రలు పోషించారు. టీజీ విశ్వప్రసాద్, సుకుమార్ బోరెడ్డి, డా. సింధు రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 25న విడుదలవుతోంది. ఈ సినిమా ట్రైలర్‌ని నటి, నిర్మాత నిహారిక కొణిదెల రిలీజ్ చేశారు. ''నటుడు కావాలని ఆడిషన్స్ ఇస్తూ ఫెయిల్ అవుతుంటాడు శివకుమార్. అందరూ అతణ్ని నిరుత్సాహపరుస్తూనే ఉంటారు. జీవితం అంటే ఏంటో తెలిస్తేనే నటన తెలుస్తుందని చెప్పడంతో తెలియని ఊరికి వెళ్తాడు. అలా హైదరాబాద్ నుంచి కేరళకు కథ షిఫ్ట్ అవుతుంది. ఆ తర్వాత ఏం జరిగింది? అన్నది ఆసక్తిగా ఉంటుంది'' అని మేకర్స్ పేర్కొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: ఫహద్ అబ్దుల్ మజీద్, సంగీతం: ఎన్ఐఎక్స్ లోపెజ్.

ఆ నమ్మకంతోనే ప్రీమియర్ షోలు వేస్తున్నాం

– సూర్యదేవర నాగవంశీ



● వెంకీ అట్లూరి, నాగవంశీ

''లక్కీ భాస్కర్' చిత్రం విజయం పట్ల చాలా నమ్మకంగా ఉన్నాం. అందుకే సినిమా విడుదలకు ఒక రోజు ముందు (అక్టోబర్ 30) నుంచే తెలుగు రాష్ట్రాల్లో ప్రీమియర్ షోలు వేస్తున్నాం'' అని నిర్మాత సూర్యదేవర నాగవంశీ తెలిపారు. దుల్కర్ సల్మాన్ హీరోగా నటించిన తాజా చిత్రం 'లక్కీ భాస్కర్'. వెంకీ అట్లూరి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో మీనాక్షీ చౌదరి కథానాయికగా నటించారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ సినిమా ఈ నెల 31న రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ– ''ఈ మధ్య కాలంలో రూపొందిన గొప్ప తెలుగు సినిమాల్లో 'లక్కీ భాస్కర్' ఒకటని చెప్పగలను. కథ కొత్తగా ఉంటుంది'' అన్నారు. వెంకీ అట్లూరి మాట్లాడుతూ– ''నాకు తెలిసి బ్యాంకింగ్ విభాగంపై మన దేశంలో ఇప్పటివరకూ సరైన సినిమా రాలేదు. ఆ నేపథ్యంలో ఒక బలమైన కథతో 'లక్కీ భాస్కర్' చేశాం. 1980–1990 కాలంలో జరిగే కథ ఇది. వాస్తవ ఘటనలను ఆధారంగా తీసుకొని రాసుకున్న కల్పిత కథ. తెలుగు ప్రేక్షకులకు మాత్రమే కాకుండా దేశవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులకు ఈ చిత్రం కొత్త అనుభూతిని ఇస్తుంది. ఈ సినిమాకి జీవీ ప్రకాశ్ ఇచ్చిన సంగీతం, నేపథ్య సంగీతం అద్భుతంగా ఉంటాయి'' అని చెప్పారు.

అమ్మవారి ఆశీస్సుల కోసం...



● రణ్‌బీర్, రాణీ ముఖర్జీ



● కాజోల్, జయా బచ్చన్

దసరా నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్న విషయం తెలిసిందే. అటు బాలీవుడ్‌కి వెళితే కొన్నేళ్లుగా దాదాపు ప్రతి ఏడాదీ కాజోల్, రాణీ ముఖర్జీ దుర్గా పూజలను నిర్వహిస్తున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి వీరు నిర్వహించే పూజల్లో పలువురు ప్రముఖులు పాల్గొంటుంటారు. ఈసారి జయా బచ్చన్, ఆలియా భట్, రణ్‌బీర్ కపూర్, అదా శర్మ వంటి స్టార్స్ కాజోల్, రాణీ ముఖర్జీ ఏర్పాటు చేసిన మండపానికి వెళ్లి, దుర్గా మాతను పూజించారు. హీరో, కాజోల్ భర్త అజయ్ దేవగన్ తమ కుమారుడు యుగ్‌తో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ ప్రముఖుల ఫొటోలు వైరల్‌గా మారాయి.



● సోదరి షహీన్‌తో ఆలియా



● భర్త అజయ్ దేవగన్, కుమారుడు యుగ్‌తో కాజోల్

రావణ దహనానికి సై



● అజయ్ దేవగన్

అజయ్ దేవగన్, కరీనా కపూర్, రోహిత్ శెట్టి రావణ దహనానికి సై అన్నారు. ఈ రోజు సాయంత్రం ఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్‌లో 'లవ్ కుశ్ రామ్ లీలా'లో భాగంగా 'రావణ్ దహన్' జరగనుంది. 50 ఏళ్లుగా ప్రతిష్ఠాత్మకంగా జరుగుతున్న ఈ కార్యక్రమంలో సినిమా స్టార్స్ కూడా పాల్గొంటుంటారు. ఈ ఏడాది 'సింగమ్ ఎగైన్' సినిమా టీమ్‌ని ఆహ్వానించింది లవ్ కుశ్ రామ్‌లీలా కమిటీ. ఈ ఆహ్వానాన్ని అజయ్ దేవగన్, కరీనా కపూర్, రోహిత్ శెట్టి అంగీకరించారని కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. ఇక 'సింగమ్' సిరీస్‌లో రానున్న మూడో భాగం 'సింగమ్ ఎగైన్' అని తెలిసిందే. రోహిత్ శెట్టి దర్శకత్వంలోనే రూపొందిన రెండు భాగాల్లో అజయ్ దేవగన్ హీరోగా నటించగా, తొలి భాగంలో కాజల్ అగర్వాల్, మలి భాగంలో కరీనా కపూర్ హీరోయిన్లుగా నటించారు. మూడో భాగంలోనూ అజయ్ దేవగన్, కరీనా జంటగా నటించగా, ఇతర కీలక పాత్రల్లో అక్షయ్ కుమార్, రణ్‌వీర్ సింగ్, దీపికా పదుకోన్ తదితరులు నటించారు. కాగా, ఈ మూడో భాగం కథలో రామాయణం ఛాయలు ఉంటాయట. తన భార్య అవ్నీ (కరీనా)ని ఓ తీవ్రవాది కిడ్నాప్ చేసి, భయంకరమైన లంకలో పెడితే, భర్త బాజీరావ్ సింగమ్ (అజయ్ దేవగన్) ఎలా కాపాడుకున్నాడన్నది 'సింగమ్ ఎగైన్' ప్రధాన ఇతివృత్తం. సినిమాలో రావణుడు లాంటి ఆ తీవ్రవాదిని సింగమ్ ఎలా అంతం చేశాడన్నది ఆసక్తికరంగా ఉంటుందని చిత్రయూనిట్ అంటోంది. ఆ విధంగా ఈ కథలో రామాయణం తరహా ప్రస్తావన ఉంది కాబట్టి 'రావణ్ దహన్' కార్యక్రమంలో పాల్గొనడానికి సై అన్నారట ఈ చిత్రదర్శకుడు రోహిత్ శెట్టి, హీరో హీరోయిన్లు అజయ్ దేవగన్, కరీనా కపూర్. కాగా అజయ్ దేవగన్‌కి ఇది తొలిసారి కాదు... 2016లో 'లవ్ కుశ్ రామ్‌లీలా'లో పాల్గొన్నారు. ఇక 'సింగమ్ ఎగైన్' నవంబరు 1న విడుదల కానుంది.



● రోహిత్ శెట్టి



● కరీనా కపూర్

సాక్షి హైదరాబాద్

శనివారం । 12 । అక్టోబర్ । 2024



అమ్మలా.. అపు'రూపం'
చదువుల సరస్వతి.. అన్నం పెట్టే అన్నపూర్ణ.. ఇష్టులను ఆదరించే అమ్మ.. దుష్టులను దునుమాడే ఆదిశక్తి.. అమ్మవారి దశావతారాల ప్రతి రూపాలెన్నో మన చుట్టూ ఉన్న మహిళల్లోనూ కనిపిస్తుంటాయి. - సిటీప్లస్‌లో



హైదరాబాదీ ఎడ్‌టెకీ
ఇంజినీరింగ్ చేసే సమయంలోనే.. బయట జాబ్ మార్కెట్‌కు అనుగుణంగా విద్యార్థులకు స్కిల్స్ నేర్పించాల్సిన అవసరముంది. ఈ చిన్న ఆలోచన నుంచి పుట్టుకొచ్చిందే బైట్‌ఎక్స్‌ఎల్ స్టార్టప్. - సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
29.0/22.0

వాతావరణం
నగరంలో శనివారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలికపాటి వర్షం కురిసే అవకాశముంది. గరిష్టంగా 29, కనిష్టంగా 22 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.



శుక్రవారం ఉప్పల్ స్టేడియంలో సాధన చేస్తున్న భారత జట్టు

ఉప్పల్‌లో గెలుపెవరిదో!

- భారత్- బంగ్లాదేశ్ మధ్య నేడు టీ20 మ్యాచ్
- భారీ భద్రతను ఏర్పాటు చేసిన పోలీసులు

ఉప్పల్:

ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో శనివారం జరగనున్న భారత్- బంగ్లాదేశ్ టీ20 క్రికెట్ మ్యాచ్‌కు భారీ భద్రతను ఏర్పాటు చేసినట్లు రాచకొండ సీపీ సుధీర్ బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2,600 మంది బలగాలతో పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. స్టేడియం పరిసర ప్రాంతాల్లో 300 సీసీ కెమెరాలతో నిఘా ఉంచినట్లు చెప్పారు. ఇప్పటికే ఉప్పల్ స్టేడియం, పరిసర ప్రాంతాలను తమ అధీనంలోకి తీసుకున్నామన్నారు. సీసీ కెమెరాలను కమాండ్ కంట్రోల్ గదికి అనుసంధానం చేసినట్లు తెలిపారు.

3 గంటల ముందే అనుమతి..

సాయంత్రం 7 గంటలకు ప్రారంభమయ్యే మ్యాచ్‌కు 3 గంటల ముందుగానే స్టేడియంలోకి అనుమతిస్తారు. ఈవ్‌టీజింగ్‌లను అరికట్టేందుకు ప్రత్యేకంగా షీ టీం బృందాలు అందుబాటులో ఉంటాయి. స్టేడియంలోకి బయటి వస్తువులు, తినుబండారాలను తీసుకురావద్దు. కారు పాస్ ఉన్న వారు రామంతాపూర్ నుంచి వచ్చి గేట్ నంబర్ 1, 2 ద్వారా తమ వాహనాలను పార్కింగ్ చేసుకోవచ్చు. దివ్యాంగులు రామంతాపూర్ గేట్- 3 ద్వారా వెళ్లాల్సి ఉంటుంది. గేట్ నంబర్ -4 నుంచి 10కి వచ్చే వారు తమ వాహనాలను ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ స్కూల్ వద్ద, రామంతాపూర్ చర్చి గ్రౌండ్‌లో పార్క్ చేసుకోవాలి. క్రికెట్ మ్యాచ్ సందర్భంగా మెట్రో, ఆర్టీసీ సేవలను రాత్రి ఒంటి గంట వరకు పొడిగించనున్నారు.

ట్రాఫిక్ మళ్లింపు ఇలా..

మ్యాచ్ జరిగే సమయాల్లో ఉప్పల్ నుంచి స్టేడియం వైపు, సికింద్రాబాద్ నుంచి స్టేడియం వైపు వచ్చే అన్ని దారులను మళ్లించనున్నారు. వరంగల్ నుంచి ఉప్పల్ వైపు వచ్చే భారీ వాహనాలు చెంగిచర్ల ఎక్స్ రోడ్డు, చర్లపల్లి ఐఓసీ కేంద్రం, ఎన్ఎఫ్‌సీ నుంచి వెళ్లాలి. ఎల్‌బీనగర్ నుంచి వచ్చే వాహనాలు నాగోల్ మెట్రో స్టేషన్, ఉప్పల్ భగాయత్ నుంచి చెంగిచర్ల మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. సికింద్రాబాద్ నుంచి వచ్చే వాహనాలు సైతం నాచారం పారిశ్రామిక వాడ ద్వారా చెంగిచర్ల మీదుగా వరంగల్ వైపు వెళ్లాల్సి ఉంటుంది.

మనసారా.. దసరా

విభిన్న జీవన సంస్కృతుల సమాహారం భాగ్యనగరం. అనేక భాషలు, ఆచారాలు, అలవాట్లతో కూడిన వైవిధ్య నగరం. వందల ఏళ్ల క్రితమే నగరానికి వచ్చి స్థిరపడిన వివిధ వర్గాల ప్రజలు దసరా ఉత్సవాలను ఎంతో ఘనంగా నిర్వహిస్తున్నారు. విశాలమైన తెలుగు ప్రజలతో పాటు బెంగాలీలు, కన్నడిగులు, మలయాళీలు తదితర అన్ని వర్గాలకు చెందిన వారు తమ ఆచార సంప్రదాయాలకు అనుగుణంగా దుర్గామాత వేడుకలను జరుపుకొంటున్నారు. భాగ్య నగరంలో ఈ సంబరాలు అంబరాన్నంటే స్థాయిలో జరుగుతాయనే విషయం అందరికీ తెలిసిందే.. దసరా నేపథ్యంలో ఆ విశేషాల సమాహారం.. 'సాక్షి' కథనం..

– సాక్షి, సిటీబ్యూరో

- సకల సంస్కృతుల సమ్మేళనం..
- శతాబ్దాలుగా వైవిధ్యభరిత వేడుకలు
- బెంగాలీల దుర్గామాత పూజలు
- కన్నడిగుల అఖండజ్యోతి
- మలయాళీల సరస్వతి పూజ
- తెలుగువారి నవరాత్రి ఉత్సవాలు

నగరంలో | విజయదశమి.. విభిన్నం



తెలంగాణలో దసరా అతి పెద్ద పండగ. ఇంటిల్లిపాదీ నూతన దుస్తులు ధరించి రకరకాల పిండి వంటలతో పాటు, నాన్‌వెజ్ వంటకాలతో ఆనందంగా గడిపేస్తారు. అంతా కలిసి బ్యాండు మేళాలతో వెళ్లి పాలపిట్టను చూసి విజయోత్సాహంతో కేరింతలు కొడతారు. అక్కడి నుంచి నేరుగా జమ్మి చెట్టు దగ్గరకు వెళ్లి పూజలు చేస్తారు. పాపాలన్నీ తొలగిపోవాలని కోరుకుంటారు. జమ్మి ఆకు, జొన్న కంకి, మారేడు పత్రిని (దీనిని బంగారంగా భావిస్తారు) దేవతలకు సమర్పించి ఆ తర్వాత ఒకరికొకరు జమ్మి ఆకు చేతిలో పెట్టుకొని అలయ్ బలయ్ (ఆలింగనం) తీసుకొంటారు. పిల్లలైతే పెద్దల చేతుల్లో జమ్మి ఆకును పెట్టి పాదాభివందనం చేస్తారు. మనుషుల మధ్య కల్మషాలన్నింటినీ కడిగి పారేసి ప్రేమ, ఆత్మీయత, అనురాగాలను పంచిపెట్టే పండగ దసరా. గుండెల నిండా ఆర్తిని నింపుకొని ఒకరినొకరు ఆలింగనం చేసుకొనే క్షణాలు మధురానుభూతులు.

జమ్మి చెట్టు సందర్శన..

- దసరా వేడుకల్లో భాగంగా నగరవాసులు జమ్మి చెట్టును సందర్శించి పూజలు చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తారు. ప్రతి సంవత్సరం నగరంలోని వివిధ ప్రాంతాల్లో జమ్మిచెట్టును సందర్శించవచ్చు.
- నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్, ఖైరతాబాద్ చింతల్ బస్తీ రాంలీలా గ్రౌండ్స్, అంబర్‌పేట్ పోలీస్ గ్రౌండ్స్, గోల్కొండ కోట ప్రాంగణం, సీతారాం బాగ్ దేవాలయం, ఆర్‌కే పురం అష్టలక్ష్మి దేవాలయం, జిల్లేల గూడ వెంకటేశ్వర దేవాలయం, సైదాబాద్ పూసలబస్తీ, ఓల్డ్ మలక్‌పేట్, అక్బర్‌బాగ్, తదితర ప్రాంతాల్లో జమ్మి కొమ్మలను ఏర్పాటు చేస్తారు.
- ప్రధాన దేవాలయాల్లో, ప్రధాన కూడళ్లలో జమ్మి చెట్టు కొమ్మలను ఏర్పాటు చేసుకొని పూజలు నిర్వహించనున్నారు.

బెంగాలీల సంధి పూజ..

దసరా ఉత్సవాల్లో భాగంగా బెంగాలీలు అయిదు రోజుల పాటు దుర్గామాత ఉత్సవాలను ఎంతో ఘనంగా నిర్వహిస్తారు. పంచమి, సప్తమి, అష్టమి, నవమి, దశమి రోజుల్లో దుర్గామాతకు ఘనంగా పూజలు చేస్తారు. బెంగాలీల ఆచారం ప్రకారం దుర్గామాతను తమ ఇంటి ఇలవేల్పుగా భావిస్తారు. ఇంటి ఆడపడచును సాదరంగా ఆహ్వానించినట్లుగానే దుర్గామాతను ఆహ్వానిస్తారు. దుర్గామాతతో పాటు ఆమె సంతానమైన సరస్వతి, లక్ష్మి, వినాయకుడు, కార్తికేయుడికి కూడా ఘనంగా పూజలు చేస్తారు.

కన్నడిగుల దసరా ఆచరణ..

దేశంలోని మిగతా అన్ని భాగాల మాదిరిగానే కన్నడిగులు కూడా దసరా పండుగలోని నవరాత్రులు దేవీ ఆరాధన చేస్తారు. కర్ణాటకలోని వివిధ ప్రాంతాల్లో నవరాత్రులను అక్కడి ఆచారాలకు అనుగుణంగా ఇక్కడ ఆచరిస్తున్నారు. ప్రతి ఇంట్లోనూ అఖండ దీపాన్ని వెలిగిస్తారు. కొందరు 10 రోజులు వెలిగిస్తే, మరికొందరు ఏడు రోజులు, ఇంకొందరు 5 రోజుల చొప్పున అఖండదీపం వెలిగిస్తారు. కనీసం మూడు రోజులైనా వెలిగించడం తప్పనిసరి. అలాగే చాలా మంది ఇళ్లలో బొమ్మల కొలువును పెడతారు. తొమ్మిది రోజులు ఉపవాసాలు ఆచరిస్తారు. మూల నక్షత్రం రోజున సరస్వతి అమ్మవారి ఆవాహన, మరుసటి రోజు సరస్వతి పూజ చేస్తారు. దుర్గాష్టమి రోజు ఆయుధ పూజను ఆచరిస్తారు. 10వ రోజున విజయదశమి రోజు శమీ వృక్ష పూజ ఉంటుంది. తెలంగాణ సంప్రదాయం ప్రకారంగానే శమీపత్రాన్ని ఇచ్చి పుచ్చుకుంటారు. 'బన్ని తొగొండు బంగారద హాగె మాతాడ్డి' 'ఈ పత్రిని తీసుకుని మంచిగా మాట్లాడండి) అంటూ శమీ పత్రిని ఇచ్చి పుచ్చుకుంటారు.

అందంగా.. సుందరంగా..



సీఎస్సార్ నిధులతో డివైడర్లకు సొబగులు

- సిటీ ఫ్లై ఓవర్లకు థీమ్ పెయింటింగ్‌లు

సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీ పరిధిలో రహదారులు, జంక్షన్లకు సంబంధించి వివిధ పనులకు సిద్ధమైన ప్రభుత్వం.. మరోవైపు వాటి అందంపైనా ప్రత్యేక దృష్టి సారించింది. నగరంలో ప్రయాణించే వారికి.. ముఖ్యంగా ఇతర ప్రాంతాల నుంచి వచ్చే టూరిస్టులను ఆకట్టుకునేలా నగర రహదారులు, జంక్షన్లు, ఫ్లై ఓవర్లు ఉండాలని ప్రభుత్వం భావిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు కావడంతో నగరంలో తమదైన ముద్ర కనపడాలని ఆశిస్తోంది. అందులో భాగంగా రహదారులు, ఫ్లై ఓవర్లను చూపరులను ఆకట్టుకునేలా వివిధ థీమ్‌లతో తీర్చిదిద్దాలని ఆదేశించడంతో జీహెచ్‌ఎంసీ అందుకు సిద్ధమైంది. అందులో భాగంగా ఫుట్‌పాత్‌లు, రోడ్ల మధ్య డివైడర్లు సైతం సుందరంగా తీర్చిదిద్దాలని భావిస్తోంది. డివైడర్లను సుందరీకరించే వారికి గతంలో మాదిరిగా వ్యాపార ప్రకటనలకు (లాలీపాప్స్) అవకాశం ఇవ్వకుండా.. సీఎస్సార్ నిధులతో వాటిని సుందరీకరించాలని నిర్ణయించింది. సీఎస్సార్ కింద నిధులిచ్చేవారికి డివైడర్ నిర్వహిస్తున్న సంస్థ అని తెలిసేలా చిన్న బోర్డు తప్ప ఎలాంటి వ్యాపార ప్రకటనలకు అవకాశం ఇవ్వరాదనే తలంపులో ఉన్నట్లు సంబంధిత అధికారి ఒకరు తెలిపారు.

ఆకట్టుకునే చిత్రాలు..

ఇప్పటికే కొన్ని ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లను, జంక్షన్లను వివిధ థీమ్‌లతో, శిలాకృతులతో సుందరంగా తీర్చిదిద్దారు. అన్ని ప్రాంతాల్లోనూ అలాంటి పనులు చేసేందుకు జీహెచ్‌ఎంసీ అధికారులు సిద్ధమయ్యారు. కళలు, సంస్కృతిని తెలియజేసేందుకు ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌ల గోడలనూ కాన్వాస్‌లుగా మలిచి ఆయా థీమ్‌లతో అందమైన చిత్రాలు వేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో పనులకు టెండర్లు పిలుస్తున్నప్పటికీ కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో పనుల్లో జాప్యం జరుగుతోంది. బంజారాహిల్స్, ఎల్‌బీనగర్ తదితర ప్రాంతాల్లోని ఫ్లై ఓవర్లను ప్రత్యేక పెయింటింగ్‌లతో అందంగా తీర్చిదిద్దారు. మలక్‌పేట, చాంద్రాయణగుట్ట, ఆరాంఘర్ వంటి ప్రాంతాల్లో ప్రత్యేక థీమ్‌లతో ఫ్లై ఓవర్ల సుందరీకరణల పనులకు టెండర్లు పిలిచినప్పటికీ కాంట్రాక్టు ఏజెన్సీలు ముందుకు రాకపోవడంతో రీ టెండర్లు పిలుస్తున్నారు.

స్పోర్ట్స్ జోన్లుగానూ..

ఫ్లై ఓవర్లను సుందరీకరించడంతో పాటు అవకాశం ఉన్న ప్రాంతాల్లో స్పోర్ట్స్ జోన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే కూకట్‌పల్లిలో ఒక స్పోర్ట్స్ జోన్ పూర్తికాగా, మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని ఆర్‌కేపురం ఫ్లై ఓవర్ కింద మరో స్పోర్ట్స్ జోన్ ఏర్పాటుకు జీహెచ్‌ఎంసీ సిద్ధమైంది. అందుకుగాను దాదాపు రూ.30 లక్షల అంచనా వ్యయంతో టెండర్లు పిలిచింది. మరికొన్ని ఫ్లై ఓవర్ల కింద సైతం స్పోర్ట్స్‌జోన్స్ ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.



రూ. 25 వేలు ఎక్కడ?

మూసీ నిర్వాసితులకు చేయూతలో ఆలస్యం

- డబుల్ బెడ్రూం ఇళ్లకు తరలించేముందు బాధితులకు హామీ
- 15 రోజులు గడిచినా అమలు చేయని అధికార యంత్రాంగం



సాక్షి, సిటీబ్యూరో: మూసీ నిర్వాసితులకు రూ.25 వేలు ఆర్థిక చేయూత అందని ద్రాక్షగానే మారింది. మూసీ ప్రక్షాళనలో భాగంగా నదీ గర్భంలోని నివాసాలు ఖాళీ చేసి పునరావాసం కింద డబుల్ బెడ్రూం ఇళ్లకు తరలి వెళ్లే కుటుంబానికి రూ.25 వేలు అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఒక అడుగు ముందుకు వేసి పత్రిక ప్రకటన కూడా విడుదల చేశారు. మూసీ పరీవాహక పరిధిలోని సైదాబాద్, హిమాయత్‌నగర్, నాంపల్లి మండలాల్లోని వివిధ బస్తీలకు చెందిన సుమారు 193 కుటుంబాలను మలక్‌పేటలోని పిల్లిగుడిసెలు, జియాగూడ, ప్రతాప సింగారం డబుల్ బెడ్రూం గృహ సముదాయాలకు తరలించారు. నిర్వాసితులు ఇళ్లు ఖాళీ చేసి సామగ్రిని డబుల్ బెడ్రూం ఇళ్లకు తరలించేందుకు వాహనాలను సైతం అధికార యంత్రాంగమే ఏర్పాటు చేసింది. అయితే.. నిర్వాసితులను మరింత ప్రోత్సహించే విధంగా తక్షణ ఆర్థిక చేయూత కింద రూ. 25 వేలు అందిస్తామని ప్రకటించింది. కానీ.. 15 రోజులు గడిచినా ఇప్పటి వరకు ఒక్కరికి కూడా ఆర్థిక చేయూత అందించకపోవడం విస్మయానికి గురిచేస్తోంది.

నిర్వాసితుల కోసం హెల్ప్ డెస్కులు

మూసీ పునరావాస కుటుంబాల ఆరేళ్ల పిల్లలకు సమీపంలోని అంగన్ వాడీల్లో ప్రవేశాలు కల్పించడం, మహిళా స్వయం సహాయ సంఘాలకు వడ్డీ లేని రుణాలు ఇప్పించడం కోసం ప్రత్యేక అధికారుల బృందాలు ఏర్పాటు చేసినా వీటి పనితీరు అంతంత మాత్రంగా తయారైంది. జీహెచ్‌ఎంసీలోని యూసీడీ విభాగం ద్వారా జీవనోపాధి కోసం సర్వే చేయడం, మెప్మా ద్వారా బ్యాంకు లింకేజీలు సులభతరం చేయడం, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ల సహకారంతో వివిధ సంక్షేమ పథకాల కోసం అర్హులైన వారిని గుర్తించడం, విద్యార్థులకు వారి సమీపంలోని పాఠశాలలు, రెసిడెన్షియల్ సంక్షేమ పాఠశాలల్లో ప్రవేశాలు కల్పించేలా చూడటం బృందాల బాధ్యతలుగా ప్రభుత్వం ఆదేశించింది. నిర్వాసితులకు సహాయంగా ఉండేందుకు హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేయడం, పౌర సమాజంతో కమిటీ సంప్రదింపులు జరుపుతుండటం చేయాలని ప్రభుత్వం సూచించింది.

జీవనోపాధి కమిటీ ఏర్పాటు..

నదీ గర్భంలో నివాసాలు కోల్పోయిన బాధిత కుటుంబాల కోసం ప్రభుత్వం, విద్య, ఉపాధి కల్పన కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. సెర్ప్ సీఈఓ చైర్మన్‌గా, జీహెచ్‌ఎంసీ కమిషనర్ వైస్ చైర్మన్‌గా 14 మంది సభ్యులతో జీవనోపాధి కమిటీని ఏర్పాటు చేశారు. మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎండీ దాన కిషోర్ మెంబర్ కన్వీనర్‌గా ఉన్న ఈ కమిటీలో మైనార్టీ, మహిళా శిశు సంక్షేమ శాఖ, ఎస్సీ, బీసీ సంక్షేమ శాఖతోపాటు పాఠశాల విద్య కమిషనర్, తెలంగాణ గురుకుల పాఠశాలల కార్యదర్శులు సభ్యులుగా ఉన్నారు.

దుర్గమ్మా.. దీవించమ్మా..



లక్డీకాపూల్: విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్‌ఎంసీ) ప్రధాన కార్యాలయంలో ఘనంగా వేడుకలు జరిగాయి. శుక్రవారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దుర్గామాత ఆశీస్సులతో నగరం సుభిక్షంగా, శాంతియుతంగా ఉండాలని మేయర్ అభిలషించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విజయదశమి ధైర్యం, న్యాయం, సత్యం, ధర్మం, విజయాన్ని సూచిస్తుందన్నారు. దుర్గామాత కృపతో నగరం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

మేయర్, కమిషనర్ విజయదశమి శుభాకాంక్షలు

లక్డీకాపూల్: విజయదశమి సందర్భంగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కమిషనర్ ఆమ్రపాలి నగర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు ఐకమత్యంతో శాంతియుతంగా పండగ జరుపుకోవాలని సూచించారు. నగర అభివృద్ధి, పరిశుభ్రత, సుందరీకరణలో భాగస్వాములు కావాలని కోరారు. విజయదశమి అందరికీ సుఖసంతోషాలను, శాంతిని, సుభిక్షాన్ని అందించాలని ఆకాంక్షించారు.

నేనూ టాటా 'ఉప్పు' తిన్నా!

ఏడాది పాటు ఆ సంస్థలో పని చేశా

- 'సాక్షి'తో అదనపు డీజీ మహేష్ భగవత్



సాక్షి, సిటీబ్యూరో: టాటా 'ఉప్పు' తిన్న ప్రముఖుల్లో రాష్ట్ర అదనపు డీజీ (శాంతిభద్రతలు) మహేష్ మురళీధర్ భగవత్ కూడా ఉన్నారు. అదెలా అనే అంశాన్ని ఆయన శుక్రవారం 'సాక్షి'తో పంచుకున్నారు. మహారాష్ట్రలోని అహ్మద్‌నగర్ జిల్లాకు చెందిన భగవత్ ఇంజినీరింగ్ పూర్తి చేశారు. అనంతరం పుణెలోని టాటా మోటార్స్‌లో 1993–94లలో ఉద్యోగిగా పని చేశారు. ఆ తర్వాత 1995లో ఐపీఎస్‌కు ఎంపిక కావడంతో ఆ ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఉద్యోగిగా ఉన్నప్పుడు, ఆ తర్వాత రతన్ టాటాను కలిసే అవకాశం మహేష్ భగవత్‌కు రాలేదు. అయితే.. టాటా ఏరోస్పేస్ సెంటర్‌ను ప్రారంభించడానికి 2018లో టాటా ఆదిభట్లకు వచ్చారు. ఆ సమయంలో మహేష్ భగవత్ రాచకొండ పోలీసు కమిషనరేట్‌కు కమిషనర్‌గా వ్యవహరిస్తున్నారు. ఆదిభట్ల రాచకొండ పరిధిలోకే రావడంతో తన విధి నిర్వహణలో భాగంగా ప్రారంభోత్సవ కార్యక్రమానికి వెళ్లారు. అక్కడ రతన్ టాటాను కలిసిన మహేష్ భగవత్ వాణిజ్య ప్రకటనను ఉటంకిస్తూ 'హమ్నే భీ టాటా కా నమక్ ఖాయా హై' (నేను కూడా టాటా ఉప్పు తిన్నాను.. వారిచ్చిన జీతం) అంటూ వ్యాఖ్యానించారు. అదేంటని టాటా ఆరా తీయగా... అసలు విషయం ఆయనకు వివరించారు. దీంతో నవ్వుతూ భగవత్ భుజం తట్టిన రతన్ టాటా.. ఇప్పుడు నాకు భద్రత కల్పిస్తున్నావు అని పేర్కొన్నారని మహేష్ భగవత్ తెలిపారు.

పోలీస్ అనుమతులన్నీ ఇక ఆన్‌లైన్‌లోనే..

- అందుబాటులోకి సీపీపీఎంఎస్ వెబ్‌సైట్
- ఆవిష్కరించిన సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి

సాక్షి, సిటీబ్యూరో: సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో ఇక నుంచి ఎలాంటి పోలీసు అనుమతులు కావాలన్నా ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాలి. ఈమేరకు సైబరాబాద్ పోలీస్ పర్మిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (సీపీపీఎంఎస్) వెబ్‌సైట్‌ను సైబరాబాద్ కమిషనర్ అవినాశ్ మహంతి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కమిషనరేట్ పరిధిలో జరిగే అన్ని రకాల ఈవెంట్లకు అనుమతులతో పాటు బ్లాస్టింగ్ ఎన్‌ఓసీలకు కూడా సీపీపీఎంఎస్ పోర్టల్ ద్వారానే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దీంతో అనుమతుల్లో పారదర్శకతతో పాటు వేగవంతమవుతాయని తెలిపారు. నిర్దేశించిన గడువులోగా అనుమతులు జారీ చేస్తామని చెప్పారు. అనుమతులు తీసుకోకుండా కార్యక్రమాలు నిర్వహించే నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.



విజిలెన్స్ పేరుతో నగదు వసూలు

నిందితుడిపై కేసు నమోదు

సాక్షి,సిటీబ్యూరో: జలమండలి పరిధిలో పనిచేసే ట్యాంకర్ డ్రైవర్ నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేసిన వ్యక్తిపై క్రిమినల్ కేసు నమోదైంది. జలమండలి ఓ అండ్ ఎం డివిజన్ నం.6 జూబ్లీహిల్స్ సెక్షన్ పరిధిలో ఎస్.వంశీకృష్ణ అనే వ్యక్తి ప్రైవేట్ ట్యాంకర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. సాయికుమార్ అలియాస్ సాయిరామ్ అనే వ్యక్తి అతడికి ఫోన్‌చేసి తాను జలమండలి విజిలెన్స్ విభాగంలో పని చేస్తున్నానని, బోర్డు నిబంధనలకు విరుద్ధంగా ట్యాంకర్ పనిచేస్తోందంటూ రూ.20 వేలు డిమాండ్ చేశారు. అనంతరం అతడి నుంచి రూ.3 వేలు వసూలు చేశాడు. బోర్డు విజిలెన్స్ అధికారుల దృష్టికి రావడంతో విచారణ చేపట్టారు. బోర్డుతో సాయికుమార్‌కు సంబంధం లేదని, కేవలం బోర్డు పేరు చెప్పుకుని అక్రమంగా నగదు వసూలు చేస్తున్నట్లు విచారణలో తేలింది. వంశీకృష్ణ ఫిర్యాదు మేరకు ఖైరతాబాద్ పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఎవరైనా జలమండలి ప్రతిష్ఠకు భంగం కలిగించేలా, బోర్డుకు చెడ్డ పేరు తీసుకువచ్చేలా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

● ట్రాక్టర్‌ను ఢీ కొట్టిన వింగర్ ● మరో ఇద్దరికి గాయాలు



ట్రాక్టర్‌ను ఢీ కొట్టిన వ్యాన్



ఏవీలైన్ (ఫైల్)

శామీర్‌పేట్: ట్రాక్టర్ ట్రాలీని వింగర్ వ్యాన్ ఢీ కొట్టిన ఘటనలో ఒక మహిళ మృతి చెందగా మరో ఇద్దరు వ్యక్తులు గాయపడిన సంఘటన శుక్రవారం జినోమ్‌వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తుర్కపల్లి జినోమ్‌వ్యాలీ ఫేస్ 1లోని యూనిక్యూ బయోటెక్ ఫార్మా కంపెనీకి చెందిన ఉద్యోగులు శుక్రవారం ఉదయం వ్యాన్‌లో హైదరాబాద్ నుంచి కంపెనీకి వస్తున్నారు. వారి వాహనం మజీద్‌పూర్- తుర్కపల్లి వద్ద ముందు వెళుతున్న ట్రాక్టర్ ట్రాలీని ఢీ కొట్టింది. దీంతో ట్రాక్టర్ ట్రాలీ వింగర్ వ్యాన్ లోపలికి దూసుకెళ్ళింది. ఈ ఘటనలో వ్యాన్‌లో ముందు సీట్‌లో కూర్చున్న ఏవీలైన్(31), అనే మహిళ అక్కడికక్కడే మృతిచెందగా మరో ఇద్దరికి గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న జినోమ్‌వ్యాలీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

స్కామ్ కోసం సంస్థను తెరిచాడు!

- ఈవీ వాహనాల 'క్రయ విక్రయం' కుంభకోణం
- ఫైనాన్స్ సంస్థల్ని మోసం చేస్తూ 50 వాహనాల కొనుగోలు
- తక్కువ ధరకు అమ్మి సొమ్ము చేసుకున్న ముఠా
- ప్రభుత్వ సబ్సిడీ స్వాహా
- కొందరి ఏజెంట్ల పాత్రపై ఆధారాలు లభ్యం
- దర్యాప్తు ముమ్మరం చేసిన నగర పోలీసులు



సాక్షి, సిటీబ్యూరో: ఎలక్ట్రిక్ వాహనాలను (ఈవీ) ఆధారంగా చేసుకుని ఇటు ఫైనాన్స్ సంస్థల్ని, అటు ప్రభుత్వాన్ని మోసం చేసిన గ్యాంగ్ కేసు దర్యాప్తులో కీలకాంశాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ స్కామ్ కోసం ఓ ముఠా సభ్యుడు ఏకంగా సంస్థను తెరిచినట్లు నగర పోలీసులు గుర్తించారు. ఈ వ్యవహారంలో కొన్ని ఫైనాన్స్ సంస్థలకు చెందిన ఏజెంట్ల పాత్రను అనుమానిస్తున్న అధికారులు ఆ కోణంలోనూ ఆరా తీస్తున్నారు. ఐదుగురు సభ్యుల్లో నలుగురిని మూడు రోజుల క్రితం అరెస్టు చేసిన సౌత్-ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు వీరి నుంచి 28 ఎలక్ట్రిక్ వాహనాలు స్వాధీనం చేసుకున్న విషయం విదితమే. ఈ కేసును దర్యాప్తు నిమిత్తం మలక్‌పేట పోలీసులకు అప్పగించారు. డబీర్‌పురకు చెందిన మీర్జా బాఖుర్ అలీ బేగ్ తన స్నేహితుడైన జఫ్వార్ అలీ మూసీ్వతో కలిసి సెకండ్ హ్యాండ్ వాహనాల క్రయవిక్రయాలు చేసే వాడు. తన స్నేహితుడైన సయ్యద్ తన్వీర్ హుస్సేన్‌తో కలిసి భారీ స్కామ్‌కు పథక రచన చేశారు. తమ బంధువులు, స్నేహితులు, పరిచయస్తుల్లో పేదలను గుర్తించి వారికి రూ.10 వేల నుంచి నుంచి రూ.20 వేలు చెల్లించేలా ఒప్పందం చేసుకుని గుర్తింపుకార్డులు తీసుకునే వారు. వీటి ఆధారంగా ఈవీ వాహనాలకు చెందిన షోరూమ్స్‌లో ఉండే ఫైనాన్స్ సంస్థల సహకారంతో వాహనాలను కొనుగోలు చేసే వారు. ఒక్కో వాహనం ఖరీదు రూ.1.6 లక్షలు ఉండగా... డౌన్ పేమెంట్‌గా రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు చెల్లించే వారు. వాహనాలు డెలివరీ తీసుకునేప్పుడు గుర్తింపుకార్డులు ఇచ్చిన వారినే తీసుకువచ్చి సంతకాలు చేయించడం, ఫొటోలు దింపడం చేసే వారు. ఆపై వాహనాన్ని తీసుకుని వారికి కొంత మొత్తం చెల్లించేవారు. అదే సమయంలో ఈవీ వాహనాలకు ప్రభుత్వం చెల్లించే సబ్సిడీ రూ.27 వేల కోసం దరఖాస్తు సైతం చేయించే వారు. ఈ వాహనాలను సెకండ్ హ్యాండ్ మార్కెట్‌లో విక్రయించడానికి తమ స్నేహితుడైన బహదూర్‌పుర వాసి సయ్యద్ తన్వీర్‌కు అప్పగించే వారు. స్టేషనరీ దుకాణం నిర్వహించే అతను ఈ దందా కోసం ఏకంగా రజ్వీ మోటర్స్ పేరుతో డబీర్‌పురలో ఓ దుకాణమే తెరిచాడు. ఫైనాన్స్ చెల్లించని వారి నుంచి సీజ్ చేసినవి అంటూ ఈ వాహనాలకు పలువురికి గరిష్ఠంగా రూ.లక్షకు విక్రయించే వారు. ఆర్సీ సహా ఇతర పత్రాలు రావడానికి సమయం పడుతుందంటూ నమ్మబలికే వాళ్లు. ఇందులో కొన్ని వాహనాలను మలక్‌పేటకు చెందిన సచిన్ ద్వారా విక్రయించారు. అలా వచ్చిన మొత్తాన్ని అందరూ పంచుకునే వారు. గరిష్ఠంగా ఆరు నెలలకు సబ్సిడీ మొత్తం గుర్తింపుకార్డులు ఇవ్వడం ద్వారా వాహనం యజమానిగా వ్యవహరిస్తున్న వ్యక్తి ఖాతాల్లోకి వెళ్లేవి. అందులో రూ.5 వేలు వారికి ఇచ్చే మీర్జా, జాఫర్ మిగిలిన మొత్తం తాము తీసుకునే వారు. ఇలా ఈ గ్యాంగ్ ఇప్పటి వరకు 60 వాహనాల క్రయవిక్రయాలకు పాల్పడి రూ.కోటికి పైగా స్వాహా చేసింది. దీనిపై సమాచారం అందుకున్న సౌత్-ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం జాఫర్ మినహా మిగిలిన ముగ్గురినీ అరెస్టు చేసి రూ.44.8 లక్షలు విలువైన 28 ఈవీలు స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యల నిమిత్తం నిందితులను మలక్‌పేట పోలీసులకు అప్పగించారు. లోతైన దర్యాప్తు చేస్తున్న పోలీసులు జాఫర్ కోసం గాలించడంతో పాటు ఈ స్కామ్‌తో పాత్ర ఉన్నట్లు అనుమానిస్తున్న ఫైనాన్స్ సంస్థల ఏజెంట్ల వివరాలు ఆరా తీస్తున్నారు. దీని కోసం మీర్జా, తన్వీర్, సచిన్, జాఫర్‌లను కోర్టు అనుమతితో తమ కస్టడీలోకి తీసుకోవాలని నిర్ణయించారు. వీరి ద్వారా సెకండ్ హ్యాండ్ మార్కెట్‌లోకి వెళ్లిన మిగిలిన వాహనాల కోసమూ ఆరా తీస్తున్నారు.

జలమండలి స్థలం ఆక్రమణకు యత్నం!

సాక్షి,సిటీబ్యూరో: జలమండలి స్థలం ఆక్రమణ యత్నాన్ని అధికారులు అడ్డుకున్నారు. వివరాల్లోకి వెళితే..ఓ అండ్ ఎం డివిజన్ నం.7 మహీంద్ర హిల్స్ పరిధిలో సర్వే నంబర్.844/1 లో జలమండలికి 8072 చదరపు మీటర్ల స్థలం ఉంది. సదరు స్థలంలో అధికారులు ఫెన్సింగ్ ఏర్పాటు చేసేందుకు ప్రయత్నించగా అదే ప్రాంతానికి చెందిన వ్యక్తి భూమి తమదిగా పేర్కొంటూ అడ్డుకున్నారు. దీంతో జలమండలి విజిలెన్స్ బృందంతో పాటు జనరల్ మేనేజర్ తదితరులు స్థలాన్ని పరిశీలించేందుకు వెళ్లగా ఆతను వారితో ఘర్షణకు దిగడంతో అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. జలమండలి అధికారుల ఫిర్యాదు మేరకు మారేడ్‌పల్లి తహసీల్దార్ భూమిని సర్వే చేసి జలమండలికి చెందినదిగా నిర్ధారించారు. అందుకు సంబంధించిన ధ్రువపత్రాలను తుకారం గేట్ పోలీస్ స్టేషన్‌లో సమర్పించారు. జలమండలికి సంబంధించిన భూములు, స్థలాలను ఎవరైనా ఆక్రమించాలని చూస్తే. కఠిన చర్యలు తీసుకుంటామని బోర్డు అధికారులు హెచ్చరించారు.

కుటుంబ కలహాలతో డ్రైవర్ ఆత్మహత్య

వెంగళరావునగర్: కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులతో డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... ఖమ్మం ప్రాంతానికి చెందిన జి.శ్రీనివాస్ (27) డ్రైవర్‌గా పని చేస్తూ యాదగిరినగర్‌లో ఉంటున్నాడు. ఇటీవల భార్యతో గొడవ కావడంతో ఆమె పాపను తీసుకుని పుట్టింటికి వెళ్ళిపోయింది. నాటి నుంచి కుటుంబ సభ్యుల ఫోన్ కూడా ఎత్తడం లేదు. గురువారం శ్రీ నివాస్ స్నేహితురాలు శిరీష అతని కజిన్ సోదరుడు శివసాయికి ఫోన్ చేసి శ్రీనివాస్ ఆత్మహత్య చేసుకున్నట్టుగా తెలిపింది. అతను వచ్చి చూడగా శ్రీనివాస్ ఆత్మహత్య చేసుకుని ఉన్నాడు. దీంతో తన సోదరుడు ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాల వల్ల ఆత్మహత్య చేసుకున్నట్టుగా మధురానగర్ పీఎస్‌లో ఫిర్యా దు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక ఆత్మహత్య

శామీర్‌పేట్: ఓ బాలిక ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అస్సాం రాష్ట్రానికి చెందిన కుటుంబం బతుకుదెరువు నిమిత్తం నగరానికి వలసవచ్చి తూంకుంట మున్సిపాలిటీ పరిధిలో నివాసం ఉంటున్నారు. వారి కుమార్తె (12) శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో వెంటిలేటర్‌కు చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సంఘటనా స్థలంలో లభ్యమైన లేఖ ఆధారంగా ప్రేమ వ్యవహారమే ఆమె మృతికి కారణంగా భావిస్తున్నారు.

ఎర్రకుంటలో పడి వ్యక్తి మృతి

మైలార్‌దేవ్‌పల్లి: ఎర్రకుంటలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ పైడినాయుడు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. శుక్రవారం ఎర్రకుంట చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని వెలికి తీశారు. మద్యం మత్తులో మూత్ర విసర్జన చేసేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు కుంటలో పడి మృతి చెంది ఉండవచ్చునని భావిస్తున్నారు. మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

శభాష్..సాలేహా

బ్యాంకు అధికారిణికి సీపీ సత్కారం



సాక్షి, సిటీబ్యూరో: సైబర్ నేరాల బారినపడిన బాధితులు మరింత మొత్తం నష్టపోకుండా అప్రమత్తంగా వ్యవహరించిన ఐసీఐసీఐ బ్యాంక్, నల్లకుంట బ్రాంచ్ డిప్యూటీ మేనేజర్ సాలేహా బేగంను నగర కొత్వాల్ సీపీ ఆనంద్ శుక్రవారం సత్కరించారు. వారాసిగూడకు చెందిన ఎస్.శ్రీనివాస్ ట్రేడింగ్ ఫ్రాడ్‌లో సైబర్ నేరగాళ్ల బారినపడ్డారు. అప్పటికే రూ.30 లక్షలు చెల్లించిన ఆయన మరో రూ.9 లక్షలు చెల్లించడానికి బుధవారం నల్లకుంటలోని ఐసీఐసీఐ బ్యాంక్‌కు వెళ్లారు. ఈయన లావాదేవీలను చూసిన సాలేహా బేగం అనుమానించారు. వెంటనే సిటీ సైబర్ క్రైమ్ పోలీసుస్టేషన్ హెడ్-కానిస్టేబుల్ ఫెరోజ్‌కు సమాచారం ఇచ్చారు. తక్షణం శ్రీనివాస్‌ను సంప్రదించిన ఫెరోజ్ రూ.9 లక్షలు డిపాజిట్ చేయకుండా ఉండటంతో పాటు సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేసేలా చేశారు. సైబర్ నేరగాళ్ల వల్లోపడిన అడిక్‌మెట్‌కు చెందిన నవీన్ కుమార్ సైతం అదే రోజు రూ.11.5 లక్షలు చెల్లించడానికి వచ్చారు. ఈయన కూడా ఆ మొత్తం చెల్లించకుండా అడ్డుకున్న సాలేహా బేగం మరోసారి ఫెరోజ్‌కు సమాచారం ఇచ్చి అప్రమత్తం చేశారు. సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు ఈ రెండు కేసులను నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. అయితే ఇద్దరు బాధితులు రూ.20.5 లక్షలు నష్టపోకుండా అడ్డుకున్న సాలేహా విషయాన్ని డీసీపీ దార కవిత, ఏసీపీ ఆర్‌జీ శివమారుతి నగర కొత్వాల్ ఆనంద్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో శుక్రవారం బషీర్‌బాగ్‌లోని ఓల్డ్ కమిషనరేట్‌లోని తన క్యాంపు కార్యాలయానికి సాలేహా బేగంను పిలిచిన ఆయన జ్ఞాపికతో సత్కరించారు.

అధికారులు సమస్యలను పరిష్కరించాలి

-ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



బాలానగర్: ప్రజా సమస్యలను పరిష్కరించడంలో అధికారులు చొరవ చూపాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బాలానగర్ డివిజన్ పరిధిలోని ఇంద్రానగర్‌లో స్థానికుల ఫిర్యాదు మేరకు శుక్రవారం కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి, అధికారులతో కలిసి పర్యటించారు. తాగునీటి సమస్య, డ్రైనేజీ సమస్యను పరిశీలించారు. సమస్య ఉన్న ప్రాంతంలో పైపులు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. సమస్య అధికారుల దృష్టికి వచ్చిన వెంటనే పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు.



మూసాపేట రేణుకా ఎల్లమ్మ ఆలయంలో మహిషాసురమర్దినిగా ఎల్లమ్మతల్లి



సుమిత్రానగర్‌లోని కనకదుర్గ ఆలయంలో మహిషాసురమర్దినిగా అమ్మవారు



వివేకానంద నగర్‌లో మహిషాసురమర్దినిగా చిత్తారమ్మ అమ్మవారు

అమ్మవారి దర్శనం.. ఉప్పొంగిన భక్తిభావం

నియోజకవర్గ జంట సర్కిళ్ల పరిధిలో దసరా నవరాత్రోత్సవాల సందర్భంగా శుక్రవారం పలు దేవాలయాల్లో అమ్మవార్లను ప్రత్యేక అలంకరణ చేశారు. ఉదయం నుంచి భక్తులు ఆలయాలకు విచ్చేసి పూజలు నిర్వహించారు. మండపాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగాయి. -జోన్‌బృందం



అంబేడ్కర్ నగర్‌లో అమ్మవారి పూజలో..



పూజలో పాల్గొన్న బండి రమేష్, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు తదితరులు



మూసాపేటలోని మండపంలో అమ్మవారి పూజలో మాజీ కార్పొరేటర్ శ్రావణ్‌కుమార్



కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారి పూజలో పాల్గొన్న భక్తులు



కైత్లాపూర్‌లోని అమ్మవారి పూజలో భక్తులు



అంజయ్య నగర్‌లోని అమ్మవారి వద్ద..



దసరా పండుగ సందర్భంగా కాంగ్రెస్ శేరిలింగంపల్లి నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ శిరీష సత్తూర్ శుక్రవారం టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఆయన చిత్రంతో కూడిన ఫొటోను అందజేశారు. కార్యక్రమంలో ఈవూరు సుజిత్‌కుమార్, మధు, గాయత్రి తదితరులు పాల్గొన్నారు. -ఆల్విన్‌కాలనీ

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఆల్విన్‌కాలనీ: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. నియోజకవర్గ పరిధిలోని పలువురు వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా 50 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.21.34 లక్షల చెక్కులను లబ్ధిదారులకు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నాయినేని చంద్రకాంత్ రావు, పోతుల రాజేందర్, చిన్నోళ్ల శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతి, ప్రసాద్, రమణారెడ్డి పాల్గొన్నారు.

నేడు రమ్యా గ్రౌండ్స్‌లో దసరా వేడుకలు

కూకట్‌పల్లి: దసరా పండుగ సందర్భంగా కేపీహెచ్‌బీ రమ్యాగ్రౌండ్స్‌లోని రామ్‌లీలా మైదానంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు శుక్రవారం ఉత్సవ కమిటీ చైర్మన్ హరీష్‌రెడ్డి, నిర్వాహకులు ప్రీతంరెడ్డి, సాయినాథ్‌రెడ్డి ప్రకటన విడుదల చేశారు. సాయంత్రం 6:30 గంటలకు వేడుకలు ప్రారంభమవుతాయని, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

జీహెచ్ఎంసీ సిబ్బందికి దుస్తులు అందజేత



ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గం వివేకానందనగర్ డివిజన్‌లోని జీహెచ్ఎంసీ, ఇంజినీరింగ్, శానిటేషన్, ఎంటమాలజీ, ఎలక్ట్రికల్, హెచ్ఎండబ్ల్యూఎస్ సీవరేజ్ సిబ్బందికి విజయదశమి సందర్భంగా శుక్రవారం కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు నూతన వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వినాయక చవితి నుంచి బతుకమ్మ, నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఎటువంటి ఇబ్బంది లేకుండా పలు డిపార్టుమెంట్‌లకు చెందిన సిబ్బంది వారి కుటుంబ సభ్యుల దూరంగా ఉంటూ పని చేశారన్నారు.

దసరా శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యేలు



కూకట్‌పల్లి: దసరా పండుగ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు నియోజకవర్గ ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. విజయదశమి ప్రతి ఒక్కరికీ విజయాలు చేకూర్చుతూ, వారి వ్యాపార కార్యకలాపాల్లో, వారి ఉద్యోగాల్లో ముందుకు వెళ్లాలని, విద్యార్థులు చదువుల్లో రాణిస్తూ అందరికి విజయం చేకూర్చాలని ఆ అమ్మవారిని వేడుకుంటున్నట్లు పేర్కొన్నారు.

శుభాకాంక్షలు తెలిపిన గాంధీ



ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలకు పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే గాంధీ దసరా శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై గెలిచే విజయానికి ప్రతీకగా దసరా పర్వదినం జరుపుకుంటామని తెలిపారు. ప్రజలందరు సుఖ సంతోషాలతో ఆనందంగా పండుగను ఘనంగా జరుపుకోవాలన్నారు.

మతసామరస్యానికి ప్రతీక హైదరాబాద్



గోల్కొండ దసరా వేడుకల ఆహ్వాన పత్రాన్ని ఎంపీ అసదుద్దీన్‌కు అందజేస్తున్న ఎస్.రాజువస్తాద్ తదితరులు

గోల్కొండ: హైదరాబాద్ మతసామరస్యానికి పెట్టింది పేరు అని హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసి అన్నారు. హిందూ సేవా సమాజ్ ఆధ్వర్యంలో శనివారం గోల్కొండ కోటలో జరగనున్న దసరా వేడుకలకు రావాలని కోరుతూ సమాజ్ చైర్మన్ ఎస్.రాజువస్తాద్ ఆయనకు శుక్రవారం ఆహ్వాన పత్రం అందించారు. ఈ సందర్భంగా అసదుద్దీన్ ఒవైసి మాట్లాడుతూ హైదరాబాద్ ఎప్పుడూ గంగా జమునా తహజీబ్‌కు ప్రతీకగా నిలుస్తూ వస్తోందని అన్నారు. పండగల సందర్భాల్లో హైదరాబాద్ నగరం సరికొత్త శోభను సంతరించుకుంటుందన్నారు. ఎన్నోసార్లు హిందూ ముస్లింల పండుగలు ఒక రోజు గ్యాప్‌లో వచ్చాయని చెప్పారు. హైదరాబాద్ నగరం హిందూ ముస్లింల ఐక్యతకు నిదర్శనమని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్, శోభాపాండే తదితరులు ఉన్నారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



చిక్కడపల్లి: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వైఎస్ఆర్ మూర్తి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చిక్కడపల్లిలో నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలో ప్రముఖ నర్తకి, ప్రొఫెసర్ డాక్టర్ వేలూరి సమిత్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేలూరి సమిత్ర మాట్లాడుతూ దసరా కవితలు, పాటలు మన పూర్వ వైభవాన్ని గుర్తుచేస్తాయన్నారు. ఈ సందర్భంగా కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుంది. అనంతరం నృత్య కళాకారులకు ప్రశంసా పత్రాలను అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో ప్రముఖులు మనస్విని, ములుగు వర్ష, కావేరి, శ్రావ్య, అరుణాశ్రీనివాస్, రామ్‌కిషన్, అన్నపూర్ణ, మంజుల, అనంత రామకృష్ణ, సుబ్బలక్ష్మి, ప్రసాద్, రాణి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న స్పెషల్ ఈవెంట్ ఎక్స్‌పో



శ్రీనగర్‌కాలనీ: చేనేత కళాకారులు ప్రత్యేకంగా రూపొందించిన చీరలతో మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అమీర్‌పేట కమ్మ సంఘంలో స్పెషల్ ఈవెంట్ ఎక్స్‌పో పేరిట ఏర్పాటు చేసిన చేనేత వస్త్ర ప్రదర్శన మహిళలను విశేషంగా ఆకట్టుకుంటోంది. బెనారస్, గద్వాల్, పటోల, గుజరాత్, పోచంపల్లి, వెంకటగిరితో పాటు దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన నిష్ణాతులైన చేనేతకారుల సిల్క్, కాటన్ వస్త్రాలు ఎక్స్‌పోలో అందుబాటులో ఉంచారు. ఈ నెల 15వ తేదీ వరకూ ఈ చేనేత ప్రదర్శన అందుబాటులో ఉంటుందని మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్ వీవర్స్ సర్వీస్ సెంటర్ హెడ్ ఆఫ్ ఆఫీస్ డాక్టర్ అరుణ్‌కుమార్ తెలిపారు.

కులగణనలో అగ్రవర్ణ పేదల లెక్కలు తేల్చండి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం



కాచిగూడ: రాష్ట్రంలో సమగ్ర కులగణన చేపట్టడానికి ప్రభుత్వం జీవో నంబర్–18 జారీ చేయడం హర్షణీయమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం అన్నారు. సమగ్ర కులగణనలో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు పొందుతున్న అగ్రవర్ణాల్లోని పేదల లెక్కలు కూడా తేల్చాలని ఆయన ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కులాల వారీగా లెక్కలు తేల్చిన తర్వాత వారి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు చేయాలని ఆయన సూచించారు. కులగణనపై ఎవరూ రాజకీయ కుట్రలు చేయకుండా సాఫీగా జరిగేలా చూడాలని ఆయన కోరారు. ఇది బీసీల సంఘటిత పోరాట విజయమని ఆయన పేర్కొన్నారు. జీవో–18 జారీ చేయడం పట్ల సీఎం రేవంత్‌రెడ్డికి ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

పండుగకు పూలు ఫుల్

నగర మార్కెట్‌కు భారీగా వివిధ రకాల పూల దిగుమతి

- ఈ ఏడాది లక్షా ఇరవై వేల కిలోల పూల దిగుమతులు
- గతేడాదితో పోలిస్తే 40 వేల కేజీలు ఎక్కువ
- రికార్డు స్థాయిలో బంతిపూల విక్రయాలు
- హోల్‌సేల్ బంతి కేజీ రూ.40–60, చామంతి రూ.60–80
- దిగుమతి పెరగడంతో ధరలు అంతంత మాత్రమే..



సాక్షి సిటీబ్యూరో: దసరా అంటేనే పూలకు విపరీతంగా డిమాండ్ ఉంటుంది. ఇళ్లలో పూజలతో పాటు షాపులు, వాహనాలకు సైతం పూజలు నిర్వహించి పూలతో అందంగా అలకరించుకుంటారు. ఇంటి గుమ్మాలను బంతి పూలతో అందంగా అలంకరిస్తారు. దీంతో దసరా పండగ రోజు పూలకు అధికంగా డిమాండ్ ఉంటుంది. ప్రతి సంవత్సరం దిగుమతులు తక్కువ ఉండటంతో పూల ధరలు అధికంగా ఉండేవి. ఈ ఏడాది పూల ధరలు అందరికీ అందుబాటులో ఉన్నాయి. ప్రత్యేకంగా బంతి, చామంతితో పాటు ఇతర పూల దిగుమతి విపరీతంగా పెరిగింది. నగర మార్కెట్లకు లక్షా ఇరవై వేల కేజీల వివిధ రకరకాల పూలు దిగుమతి అయ్యాయని మార్కెట్ అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఇవే కాకుండా వివిధ రకాల పూలు కూడా శివారు జిల్లాల నుంచి రైతులు తీసుకొచ్చి విక్రయిస్తున్నారు.

పొరుగు జిల్లాల్లో వరుస వర్షాలు

ఈ ఏడాది రంగారెడ్డి, వికారాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాల్లో వరుస వర్షాలతో పూల తోటలకు భారీగా నష్టం వాటిల్లింది. దాంతో పండుగ కోసం అనుకున్న స్థాయిలో పూలసాగు రాకపోవడంతో వ్యాపారులు ఇతర రాష్ట్రాల నుంచి పూలను కొనుగోలు చేసి మార్కెట్లకు తీసుకొచ్చారు. గులాబీ, చామంతి, బంతితో పాటు ఇతర పూలు ఎక్కువ మోతాదులో దిగుమతి అయ్యాయని మార్కెట్ అధికారులు తెలిపారు. ఈ ఏడాది కర్నాటకలోని వివిధ జిల్లాల నుంచి భారీగా పూలు దిగుమతి అయినట్లు చెప్పారు. ఈ ఏడాది లక్షా ఇరవై వేల కిలోల పూలు దిగుమతి అయినట్లు తెలిపారు. గతేడాదితో పోలిస్తే దాదాపు 40 వేల కేజీల పూలు మార్కెట్లకు అధికంగా దిగుమతి అయ్యాయి. ప్రత్యేకంగా బంతి, చామంతి ఎక్కువగా దాదాపు ఈ ఏడాది 80 వేల కిలోల పూలు దిగుమతి అయినట్లు వ్యాపారులు అంటున్నారు. గతేడాది బంతి రూ.80 నుంచి 60 వరకు ధర పలికితే ఈ ఏడాది బంతి ధర రూ.60 దాటడం లేదు. ఇతర పూల ధరలు కూడా గత ఏడాది కంటే చాల తక్కువగా ఉన్నాయి. దీంతో గిట్టుబాటు కావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రస్తుతం కిలో పూల ధరలు

పూలు హోల్‌సేల్ మార్కెట్లలో	-	రిటైల్‌లో
బంతి రూ.40-50	-	రూ.80-100
చామంతి రూ.50-70	-	రూ.110 నుంచి రూ.120
గులాబీ(కట్‌ఫ్లవర్) రూ.200	-	రూ.350
మల్లెలు రూ.350	-	రూ.450
కాడమల్లె/జాజిమల్లె రూ.350	-	రూ.700
లిల్లీ రూ.350	-	రూ.500

రైతులకు గిట్టుబాటు ధరలు అందేలా..

గతేడాది బంతి ధర రూ.100లోపే ఉండగా చామంతి ధర రూ.200 వరకు ఉంది. ఈ ఏడాది శివారు జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి అత్యధికంగా బంతి, చామంతి, సెంట్ గులాబ్, లిల్లీ తదితర రకాల పూలతో పాటు మల్లె మొగ్గలు కూడా దిగుమతి అవుతున్నాయి. డిమాండ్‌కు సరిపడా దిగుమతులు ఉంటే ధరలు పెరగవు. ధరలు మరింత పడిపోకుండా ఉండేలా ప్రయత్నిస్తున్నాం. రైతులకు గిట్టుబాటు ధరలు అందేలా చూస్తున్నాం.

– శ్రీనునాయక్, కార్యదర్శి, గుడిమల్కాపూర్ మార్కెట్

అర్హులందరికీ 'సంక్షేమ' ఫలాలు

- ఏఐసీసీ జాతీయ పరిశీలన కమిటీ కో ఆర్డినేటర్‌గా దేశ్‌కాంత్



దేశ్‌కాంత్

మణికొండ: కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడంతో పాటు అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తానని ఏఐసీసీ జాతీయ పరిశీలన కమిటీ కో ఆర్డినేటర్ దేశ్‌కాంత్ తెలిపారు. కోకాపేట్‌కు చెందిన చెందిన ఆయనను ఏఐసీసీ జాతీయ పరిశీలన కమిటీ కో ఆర్డినేటర్‌గా నియమిస్తూ చైర్మన్ గిరిజా వ్యాస్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయనకు నియామక పత్రాన్ని ఆమె చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా కోకాపేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో దేశ్‌కాంత్ మాట్లాడుతూ గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఎన్సీపీ అధ్యక్షుడిగా పనిచేశానని తెలిపారు. శరత్ పవార్ ప్రోత్సాహంతో టీజేఏసీలో క్రియాశీలక పాత్ర పోషించడం జరిగిందన్నారు. ఇప్పటికే ఎన్సీపీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరడం జరిగిందన్నారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడంతో పాటు పేద ప్రజలకు అండగా నిలుస్తామన్నారు. తనపై నమ్మకంతో ఏఐసీసీ జాతీయ పరిశీలన కమిటీ కో ఆర్డినేటర్‌గా బాధ్యతలు అప్పగించినందుకు పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ పదవి మరింత బాధ్యత పెంచిందని, చిత్తశుద్ధితో పనిచేస్తానని ఆయన తెలిపారు.

కార్మికుల సంక్షేమం కోసం ఐఎన్‌టీయూసీ పోరాటం

ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జి.సంజీవరెడ్డి



మొగుళ్ల రాజిరెడ్డికి పత్రాన్ని అందజేస్తున్న జి.సంజీవరెడ్డి

కాచిగూడ: దేశవ్యాప్తంగా శ్రామికవర్గం సంక్షేమం కోసం అవిశ్రాంతంగా ఐఎన్‌టీయూసీ పోరాడుతోందని ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జి.సంజీవరెడ్డి అన్నారు. 77 సంవత్సరాలుగా అనేక పోరాటాలు చేసి ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చి కార్మికుల వేతనాలు, సంక్షేమం, భద్రతపై చట్టాలను తీసుకురావడానికి కారణమైందని ఆయన తెలిపారు. బర్కత్‌పురాలోని ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో అనుబంధ సంఘంగా జలమండలి కాంగ్రెస్ యూనియన్‌ను ఏర్పాటు చేశారు. యూనియన్ అధ్యక్షుడిగా మొగుళ్ల రాజిరెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడిగా బి.భూమయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కె.రామరాజు, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్. సురేష్‌బాబు, కోశాధికారిగా టి.సురేష్, ముఖ్య ఉపాధ్యక్షుడిగా ఆర్.సీతయ్యను నియమించారు. యూనియన్ బలోపేతం కోసం కృషి చేస్తూ కార్మికుల హక్కులు, ప్రయోజనాలను పరిరక్షించడం లక్ష్యంగా పోరాటాలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.డి.చంద్రశేఖర్, యూనియన్ నేతలు అర్జున్‌వర్మ, బీఆర్ శ్రీనివాస్, ప్రవీణ్ కుమార్, భూషయ్య, రఘునాథ్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో నేడు

- మాదాపూర్‌లోని శిల్పారామంలో దసరా ఉత్సవాల సందర్భంగా ఆదివాసీ బజార్, శారీస్ ఆఫ్ ఇండియా ఎగ్జిబిషన్ ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- దసరా పండుగను పురస్కరించుకుని చార్మినార్ ప్రాంతంలోని సాలార్జంగ్ మ్యూజియం సందర్శనను నిలిపివేశారు.
- మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో స్పెషల్ ఈవెంట్ ఎక్స్‌పో పేరిట అమీర్‌పేట కమ్మ సంఘంలో చేనేత వస్త్ర ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

బేగంపేటకు అయోధ్య రాముడి ధనుస్సు

- భక్తుల సందర్శనార్థం నేడు రాక
- సందర్శన సమయం సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు



సనత్‌నగర్: అయోధ్య రాముడి కోసం తయారు చేయించిన ధనుస్సు, విల్లును భక్తుల సందర్శనార్థం బేగంపేట ప్రకాష్‌నగర్ రామలింగేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలోని భూలక్ష్మీ అమ్మవారి దేవాలయంలో ఉంచనున్నారు. విజయదశమి రోజున భక్తులకు ఈ అవకాశాన్ని కల్పించారు. శనివారం సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు ధనుస్సు, విల్లును భక్తుల సందర్శనార్థం తీసుకురావడం జరుగుతుందని ఆలయ ధర్మకర్త విశాల్ సూదం తెలిపారు. దేశవ్యాప్తంగా పుణ్యక్షేత్రాల్లో పూజలు చేయించి అయోధ్య రాముడికి సమర్పించే క్రమంలో ఇక్కడి ఆలయానికి తీసుకురావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. దీన్ని చల్లా శ్రీనివాస శర్మ బహుకరిస్తున్నారని, నంగునూరి చంద్రశేఖర్ సహకారంతో భక్తులకు సందర్శనార్థం ఇక్కడకు తీసుకువస్తున్నట్లు చెప్పారు. 13 కిలోల సిల్వర్, ఒక కిలో గోల్డ్‌తో ఈ ధనుస్సు తయారు చేసినట్లు విశాల్ సూదం తెలిపారు.

పోస్ట్‌హుమానిటీస్ హబ్ సైంటిఫిక్ అడ్వైజరీ బోర్డుకు నామినేట్

హెచ్‌సీయూ ప్రొఫెసర్ ప్రమోద్ కె నాయర్‌కు అరుదైన అవకాశం



రాయదుర్గం: హెచ్‌సీయూ సీనియర్ ప్రొఫెసర్ ప్రమోద్ కే నాయర్‌కు అరుదైన అవకాశం లభించింది. పోస్ట్‌హుమానిటీస్ హబ్ సైంటిఫిక్ అడ్వైజరీ బోర్డుకు ఆయన నామినేట్ కావడం విశేషం. ఈ బోర్డులో ఉన్న ఏకైక భారతీయ విద్యావేత్త ప్రొఫెసర్ ప్రమోద్ కె నాయర్ కావడం మరో విశేషం. యునెస్కో చైర్ ఇన్ వల్నరబిలిటీ స్టడీస్ సీనియర్ ప్రొఫెసర్‌గానే కాకుండా డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇంగ్లిష్‌లో ఆయన సీనియర్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఈ రంగంలో డజనుకు పైగా వ్యాసాలతో పాటు చాలా ఉదహరించబడిన పోస్ట్ హుమానిజం (పాలిటీ ప్రెస్) పుస్తక రచయిత కూడా ఆయనే. పోస్ట్‌హుమానిస్ట్ అధ్యయనాల కోసం ప్రపంచంలోని అతిపెద్ద పరిశోధనా నెట్‌వర్క్‌లలో ఒకటైన సైంటిఫిక్ అడ్వైజరీ బోర్డుకు నామినేట్ కావడం ఆయన పనితీరుకు నిదర్శనం. పోస్ట్ హుమానిటీస్ హబ్ లింకోపింగ్ విశ్వవిద్యాలయం స్వీడన్‌లో ఉంది. మానవ మానవీయ శాస్త్రాలు, సహజీవన కళలు, శాస్త్రాల్లో పని 'సమస్యాత్మకమైన ప్రపంచంలో ఎలా సహజీవనం చేయాలి, పనిచేయాలి, కలిసి మెరుగ్గా ఆలోచించడం ఎలా?' అనే అంశంపై ఆలోచించేందుకు వీలు కల్పించే మరణానంతర పరిశోధకులు, అభ్యాసకులు/ఆచారాల మధ్య కొత్త పొత్తులను ఏర్పర్చడం దీని లక్ష్యం. ఈ సందర్భంగా ఆయనను పలువురు ప్రొఫెసర్లు, అధ్యాపకులు, అధికారులు అభినందించారు.

ధైర్యమే ఆయుధం

- ఆత్మవిశ్వాసంతో పోరాడాలి
- కేన్సర్ బాధిత చిన్నారులతో క్రికెటర్ మహ్మద్ సిరాజుద్దీన్



కేన్సర్ బాధిత చిన్నారులతో క్రికెటర్ మహ్మద్ సిరాజుద్దీన్

బంజారాహిల్స్: రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్‌ను టీమిండియా ఫాస్ట్ బౌలర్ మహ్మద్ సిరాజుద్దీన్ శుక్రవారం సందర్శించారు. కేన్సర్ బాధిత చిన్నారులను పరామర్శించి వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేన్సర్ వ్యాధి మానసిక ఆరోగ్య పరిస్థితులకు దారితీస్తోందన్నారు. క్రికెట్ మ్యాచ్‌లో క్యాచ్‌ను వదులుకోవడం వల్ల కొన్నిసార్లు మన ఆటకు నష్టం వాటిల్లుతుందని, అదే విధంగా జీవితంలో కూడా ఆత్మవిశ్వాసం, భావోద్వేగ సమతుల్యతను కోల్పోవడం వల్ల తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. కానీ మనం క్రికెట్‌లో తిరిగి పోరాడినట్లుగానే, ప్రతిఒక్కరూ బలంగా ఉండాలన్నారు. కేన్సర్‌తో పోరాడటంలో ధైర్యమే ఆయుధంగా పేర్కొన్నారు. రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ పీడియాట్రిక్ హెమటాలజిస్ట్, అంకాలజిస్ట్ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ శిరీషారాణి మాట్లాడుతూ కేన్సర్ చికిత్సలో పురోగతి ఆ వ్యాధి బాధిత చిన్నారుల్లో మనుగడ రేటును పెంచిందన్నారు. పిల్లల ప్రాణాలను కాపాడేందుకు కేన్సర్‌ను ముందస్తుగా గుర్తించడం ముఖ్యమన్నారు. హాస్పిటల్ ఇంటెన్సివిస్ట్ సర్వీసెస్ డైరెక్టర్ దినేష్‌కుమార్, పీడియాట్రిషన్ డాక్టర్ ఫైసల్ బి.నక్వి, కన్సల్టెంట్ చైల్డ్ అండ్ అడోలసెంట్ న్యూరాలజిస్ట్ డాక్టర్ లోకేష్ లింగప్ప, గ్రూప్ మెడికల్ డైరెక్టర్ అండ్ రీజనల్ డైరెక్టర్ బిజినెస్ ఆపరేషన్స్ ప్రశాంత్ పాల్గొన్నారు.

నేడు సాలార్జంగ్ మ్యూజియం బంద్

చార్మినార్: దసరా పండుగను పురస్కరించుకొని ఈ నెల 12వ తేదీన సాలార్జంగ్ మ్యూజియం మూసి ఉంటుందని సంబంధిత అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. దూర ప్రాంతాల నుంచి మ్యూజియం సందర్శనకు వచ్చే పర్యాటకులు దీన్ని గమనించాలన్నారు.

ఎన్టీఆర్ స్టేడియంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు



ఎన్టీఆర్ స్టేడియంలో దుర్గామాత పూజలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

- హైదరాబాద్ బెంగాలి సమితి ఆధ్వర్యంలో నిర్వహణ
- హాజరైన తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

కవాడిగూడ: నగరంలోని ఎన్టీఆర్ స్టేడియంలో హైదరాబాద్ బెంగాళి సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన పూజా కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, బెంగాళి సమితి ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం భక్తులను ఉద్దేశించి గవర్నర్ మాట్లాడారు. దేవీ నవరాత్రి ఉత్సవాలను ప్రతి సంవత్సరం హైదరాబాద్ బెంగాళి సమితి ఆధ్వర్యంలో నిర్వహించడం అభినందనీయం అన్నారు. 83 ఏళ్లుగా ఉత్సవాలు నిర్వహిస్తూ భక్తి భావాన్ని పెంపొందిస్తున్న సమితి నేతలను గవర్నర్ అభినందించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ స్టేడియంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పూజల్లో నగరంలోని బెంగాలీలు పెద్ద సంఖ్యలో హాజరై పూజలు నిర్వహించారు.

యావత్ తెలంగాణ సమాజం రేవంత్‌రెడ్డిని కాపాడుకోవాలి



మాట్లాడుతున్న మాజీ మంత్రి రవీంద్రనాయక్

పంజగుట్ట: బీఆర్ఎస్ ప్రభుత్వంలో 10 సంవత్సరాలు దగాపడ్డ తెలంగాణను తిరిగి పునర్నిర్మించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేస్తున్న కృషి మరువలేనిదని, యావత్ తెలంగాణ సమాజం రేవంత్‌రెడ్డిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని మాజీ ఎంపీ, మాజీ మంత్రి రవీంద్రనాయక్ అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో వందలాది చెరువులు కబ్జాకు గురయ్యాయని, వాటిని హైడ్రా పేరుతో కాపాడుతుంటే హైడ్రాకు ఎన్నో అడ్డంకులు సృష్టించేందుకు కేటీఆర్, హరీష్‌రావు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం కేసీఆర్‌కు ఏటీఎంలా మారిందని, అది ఆయనకు ఉచ్చులా మారుతుందని ప్రధాని మోదీ అన్నారు. కానీ ఇప్పటివరకు అలా జరగకపోవడంతో కేసీఆర్ కేంద్రానికి ఏటీఎంలా మారినట్లు అర్థం అవుతోందన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కేవలం అధికారం ఉంటేనే బయటకు వస్తారా ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న ఆయన ప్రజాసమస్యలు పట్టించుకోకుండా కేవలం ఫాంహౌస్‌కే పరిమితం అవడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. ఒక బీసీ నాయకురాలు మంత్రి కొండా సురేఖపై అన్ని పార్టీల నాయకులు ట్రోల్ చేస్తున్నారని, వాస్తవానికి ఫోన్ ట్యాంపరింగ్ వ్యవహారం బయటపడ్డప్పుడే మాట్లాడుకున్న మాటలనే కొండా సురేఖ బయటకు చెప్పిందని అన్నారు.

ప్రాథమిక దశలో గుర్తిస్తే ఆర్థరైటిస్‌ను ఎదుర్కోవచ్చు



అవగాహన నడకలో డాక్టర్ బీరప్ప, వైద్యులు, వైద్య విద్యార్థులు

- నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప

ఖైరతాబాద్: ఆర్థరైటిస్ అనే వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తిస్తే సమర్థవంతమైన వైద్యాన్ని అందించి రోగిని సాధారణ స్థితికి తీసుకురావచ్చని నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప అన్నారు. ప్రపంచ ఆర్థరైటిస్ డే సందర్భంగా జలవిహార్ వద్ద శుక్రవారం ఇండియన్ రుమటాలజీ అసోసియేషన్ హైదరాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో అవగాహన వాక్ నిర్వహించారు. కార్యక్రమానికి నిమ్స్ డైరెక్టర్ బీరప్ప, నిమ్స్ రుమటాలజీ విభాగం డీన్ లీజా రాజశేఖర్ ముఖ్య అతిథులుగా హాజరై వాక్‌ను ప్రారంభించారు. అనంతరం డాక్టర్ బీరప్ప మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రుమటాలజిస్టులు చాలా తక్కువ మంది ఉన్నారని, వ్యాధిని గుర్తించడంలో చాలామంది ఆలస్యం చేస్తున్నారని, దాని వల్ల రోగులు తీవ్ర అవస్థలు పడుతున్నారని అన్నారు. వీరికి చేసే వైద్యం కూడా చాలా ఖరీదైన మందులతో కూడి ఉంటుందని, ప్రభుత్వాలు కూడా ఈ వ్యాధితో బాధపడుతున్న వారికి అండగా నిలవాల్సిన అవసరం ఉందని తెలిపారు. జన్యుపరమైన లోపాల వల్ల చాలా మందికి చిన్న వయసులోనే, యుక్త వయసులో కూడా కీళ్లవాతం రుమటైడ్ ఆర్థరైటిస్ వచ్చే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. వ్యాధి లక్షణాలను గుర్తించిన వెంటనే రుమాటలజిస్ట్‌లను సంప్రదించి మంచి వైద్యం తీసుకుంటే త్వరగా కోలుకుంటారని వివరించారు. ఈ సందర్భంగా ఆర్థరైటిస్‌తో బాధపడుతున్న వారికి మందులను అందజేశారు. కార్యక్రమంలో ఆపి ఎలక్ట్ ప్రెసిడెంట్ డాక్టర్ నర్సింహులు, రుమటాలజీ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ వరప్రసాద్, సెక్రటరి డాక్టర్ విజయ ప్రసన్న, వైద్యులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రుమటాలజీపై అవగాహన ప్లకార్డులను పట్టుకొని వాక్‌ను నిర్వహించారు.

నేడు మైహోం భూజా నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్‌లో పేరొందిన గేటెడ్ కమ్యూనిటీల్లో అగ్రస్థానంలో కొనసాగుతున్న మైహోం భూజా నూతన కమిటీ నేడు ప్రమాణ స్వీకారం చేయనుందని కమిటీ అధ్యక్షుడు నండిపల్లి నానిరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యక్షులుగా మాధవి సిద్దం, ప్రధాన కార్యదర్శి విద్యారెడ్డి, సంయుక్త కార్యదర్శి కుమార్, కోశాధికారి గౌరవ్ సోని, సంయుక్త కోశాధికారి కళ తాటికొండ, ఈసీ సభ్యులు టీవీ శ్రీనివాస్, ఎస్. రామకృష్ణ, దేవి జోత్స్న, సంజయ్ సంఘ్వీలు ఎన్నికయ్యారని తెలిపారు. ఈ మేరకు శనివారం మధ్యాహ్నం 2.31 గంటలకు భుజాలోని త్రివిక్రమ స్వామి ఆలయంలో నూతన కమిటీ ప్రమాణ స్వీకారం ఉందని వివరించారు.

చిన్నారి చికిత్సకు లయన్స్ క్లబ్ చేయూత

చందానగర్: ఆటిజం సమస్యతో బాధపడుతున్న చిన్నారి చికిత్సకు లయన్స్ క్లబ్ ఆఫ్ హోప్ చేయూతనిచ్చింది. చందానగర్‌లో శుక్రవారం చిన్నారి నాగ సహస్ర తండ్రి నాగ సురేష్‌కు రూ.20వేల నగదును కొండ విజయ్ కుమార్ అందజేశారు.

సాక్షి సిటీ ప్లస్
9
హైదరాబాద్, శనివారం, 12, అక్టోబర్, 2024



ఆ అనుభూతి అద్భుతం..

నేను నాకెంతో ఇష్టమైన లక్ష్మీదేవిలా అలంకరించుకున్నాను. మనం చేతులెత్తి మొక్కే అమ్మ రూపాన్ని ఆ'ధరించడం' అంటే ముందు ఏదో ఇష్టంగా మాత్రమే అనుకుంటాం కానీ.. ఆ రూపం లోకి మారాక మనల్ని మనం చూసుకోవడం.. అద్భుతంగా అనిపిస్తుంది. కనేదీ కాపాడేదీ అమ్మే. ప్రతి మహిళ తనను తాను కాపాడుకోవడం ఎలా అనేది నేర్పే పాఠాలే అమ్మ చేతుల్లోని ఆయుధాలు.. అమ్మ ప్రతీ రూపం ఓ సందేశం. - లావణ్య

శక్తితో మమేకం..

మహిళ ఎంత శక్తివంతురాలో అమ్మ అవతారాలు మనకు చెబుతాయి. మన కున్న శక్తిని వినియోగించుకుంటే ఎన్నో విజయాలు సాధించవచ్చు అని మనకు అర్థమవుతుంది. దుర్గాదేవి అలంకారం నాలో ఎన్నో భావోద్వేగాలు కలిగించింది. తెలియని శక్తి ఆవరించినట్టు అనిపించింది. - భవాని

చదువుల సరస్వతి కావచ్చు.. అన్నం పెట్టే అన్నపూర్ణ కావచ్చు..ఇష్టులను ఆదరించే అమ్మ కావచ్చు.. దుష్టులను దునుమాడే ఆదిశక్తి కావచ్చు.. అమ్మవారి దశావతారాల ప్రతిరూపాలెన్నో మన చుట్టూ ఉన్న మహిళలల్లోనూ కనిపిస్తుంటాయి. దసరా అంటే ఒక పండుగ మాత్రమే కాదు మహిళా శక్తికి నిండైన నిదర్శనం కూడా. అందుకేనేమో అమ్మలా అలంకరించుకోవడం.. మహిళలకు ఎంతో ఇష్టమైన అంశంగా మారింది. ఈ నేపథ్యంలో అలంకరణలకు సంబంధించిన మరిన్ని విశేషాలు..

- సాక్షి, సిటీబ్యూరో



దాండియా 'రంగ్ రాత్రి'లో శ్రీముఖి

సాక్షి, సిటీబ్యూరో: బతుకమ్మ పండుగ, దసరా ఉత్సవాల నేపథ్యంలో ఏర్పాటు చేసిన రంగ్ రాత్రి దాండియా వేడుకల్లో ప్రముఖ యాంకర్, సినీనటి శ్రీముఖి సాంస్కృతి దాండియా నృత్యాలతో ఉర్రూతలూగించారు. నార్సింగిలోని ఓం కన్వెన్షన్ వేదికగా ఔరం ఈవెంట్స్ మూడు రోజులుగా రంగ్ రాత్రి దాండియా వేడుకలను నిర్వహిస్తోంది. కార్యక్రమంలో యాంకర్ శ్రీముఖి ముఖ్య అతిథిగా హాజరై దాండియాతో పాటు గర్బా రాత్రుల అద్భుతమైన బతుకమ్మ వేడుకను ప్రదర్శించారు. ఇందులో భాగంగా ప్రేక్షకులతో కలిసి సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఔరం ఈవెంట్స్ సీఈఓ కవితా శెట్టి మాట్లాడుతూ 'రంగ్ రాత్రి' దాండియాకు నగరవాసుల నుంచి విశేష స్పందన లభించిందని అన్నారు. సాంస్కృతిక నృత్యాల ద్వారా మన గొప్ప సంస్కృతిని ప్రదర్శించడం ఉత్సాహవంతంగా ఉందని పేర్కొన్నారు. ఈ వేడుకల్లో విభిన్న ప్రేక్షకులు ఒకచోట చేరడం, శ్రీముఖి వంటి సెలబ్రిటీలు రావడం ఉత్సవాల్లో మరింత సందడి నెలకొందని అన్నారు.



అమ్మలా.. అపురూపం..

అమ్మవారి అలంకరణ కోసం నగరవాసుల క్యూ

- మేకప్ ఆర్టిస్టులకు పెరిగిన డిమాండ్
- చెన్నైలో సుప్రసిద్ధ మేకప్ కళాకారుడు హర్షద్
- కేవలం కొన్ని గంటల వ్యవధిలోనే
- పలు రాష్ట్రాల మహిళల ఆసక్తి
- సోషల్ మీడియా వేదికగా ఫొటోలు

చెన్నైలో హర్షద్ జీ అనే ఒక ప్రసిద్ధ మేకప్ కళాకారుడు ఉన్నారు.. ఆయన గొప్పతనం ఏమిటంటే.. తన దగ్గరకు వచ్చిన ఏ మహిళనైనా అచ్చం అమ్మవారిలా మారుస్తారు. చూసిన వాళ్లు ఆమెకు సాష్టాంగ నమస్కారం చేయాల్సిందే.. అది కూడా కేవలం కొన్ని గంటల వ్యవధిలోనే. అందుకుగానూ ఆయన అక్షరాలా రూ.30వేల కనీస మొత్తం వసూలు చేస్తారు. అంతేకాదు అపాయింట్‌మెంట్ కూడా వెంటనే దొరకనంత బిజీగా ఉంటారాయన. ఆయన దగ్గరకు వేర్వేరు నగరాల నుంచి కూడా వెళ్లి మేకప్ చేయించుకుని ఆ ఫొటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేసి మురిసిపోయే మహిళల్లో నగరవాసులు కూడా ఉన్నారు.

ఆసక్తిగా.. అది'శక్తి'లా..

అమ్మవారి నవరాత్రుల సందర్భంగా అమ్మరూపంలోకి పరకాయ ప్రవేశం చేయాలని పలువురు మహిళలు ఉవ్విళ్లూరుతున్నారు. అత్యాధునిక మేకప్ వనరులు సైతం అందుబాటులోకి రావడంతో వీరి ఆసక్తికి తగ్గట్టు రూపం మార్పు చేసుకుంటున్నారు. నగరంలోనూ ఈ ట్రెండ్ బాగానే కనిపిస్తోంది. ముఖ్యంగా దసరా నవరాత్రుల సందర్భంగా పలుచోట్ల కాలనీ సంఘాలు ఏర్పాటు చేసే ఉత్సవాల్లో మహిళలు ఈ తరహా మేకప్‌తో దర్శనమిస్తున్నారు. అంతేకాకుండా ఈ సందర్భంగా నిర్వహిస్తున్న పలు రకాల సాంస్కృతిక ప్రదర్శనలు కూడా మహిళల ఆసక్తి ప్రదర్శించుకునేందుకు ఊతమిస్తున్నాయి. స్థానిక మేకప్ కళాకారుల దగ్గర ఈ తరహా మేకప్‌కి కనీసం రూ.5వేలు ఆపై ఖర్చు అవుతోంది. అయినప్పటికీ వ్యయప్రయాసలకు ఓర్చుకుని మహిళలు అమ్మల్లా మారుతున్నారు.



అనిర్వచనీయం..

దసరా పండుగ విశిష్టతే దశావతారాలు ఎంత చూసినా ఎంత మొక్కినా తనివి తీరని అపురూపాలు. పాలించినా, లాలించినా అమ్మ మాత్రమే చేయగలదు. లలిత సహస్రనామాలు వినని భక్తులు ఉండరు. అలాంటి లలితాదేవి అలంకారంలో నన్ను నేను చూసుకున్నప్పుడు.. అనిర్వచనీయమైన భావన కలిగింది. చాలా రోజుల పాటు అది నన్ను అంటిపెట్టుకునే ఉంటుంది. - స్పందన



ఆకలి తీర్చే వేల్పు..

అమ్మ అంటే అన్నం పెట్టే అన్నపూర్ణ. అన్నం అంటే తిండి ఒక్కటే కాదు వివేకం, విజ్ఞానం.. ఇలా జీవితంలో ఎదుగుదలకి కావాల్సిన ప్రతిదీ అందిస్తుంది అమ్మ. ఈ అన్నపూర్ణ అలంకారం నా మనసును హత్తుకుంది. ఇప్పటి దాకా అమ్మవారి రూపాన్ని గుండెల్లో నింపుకున్న నాకు.. ఆ రూపం ఎదురుగా వచ్చి నిలుచున్నట్ల యింది. - జ్యోతి



ఆ ఆహార్యం ఓ అద్భుతం..

సరస్వతి అలంకారం పూర్తి అవుతుంటేనే మనలో ఏదో తెలియని శక్తి ఆవరించుకుంటున్నట్టు అనిపిస్తుంది. అమ్మ వారి గొప్పతనం అదే.. మహిళలు తమ శక్తి యుక్తుల్ని గుర్తించేలా చేయడమే అమ్మ రూపాల వెనుక విశేషం. - సంధ్య

పక్షులు వాలితే మేలే..

పీహెచ్‌డీ పూర్తిచేసిన నెహ్రూ జూపార్కు బయాలజిస్టు లక్ష్మీనారాయణ

'వ్యవసాయంపై పక్షుల ప్రభావం' అనే అంశంపై పరిశోధన

సాక్షి, సిటీబ్యూరో: కీటకాలను తినే పక్షులతో వ్యవసాయానికి ఎలా మేలు జరుగుతుందనే అంశంపై జరిపిన పరిశోధనలకు బుద్ధి లక్ష్మీ నారాయణ డాక్టరేట్ పొందారు. ప్రస్తుతం నెహ్రూ జూలాజికల్ పార్కులో సీనియర్ బయాలజిస్టుగా పనిచేస్తున్న లక్ష్మీ నారాయణ.. జేఎన్‌టీయూహెచ్‌లో డాక్టర్ వాసుదేవరావు, డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి గైడెన్స్‌లో ఇటీవల పీహెచ్‌డీ పూర్తి చేశారు. కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం ఎల్లంపేట అనే మారుమూల గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ ఎంతో కష్టపడి పీహెచ్‌డీ దాకా చదువుకున్నారు. కామారెడ్డిలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో బీఎస్సీ ఫారెస్ట్రీ, వైల్డ్‌లైఫ్ బయాలజీలో ఎమ్మెస్సీ పూర్తిచేశారు. బయోడైవర్సిటీపై 90కి పైగా రీసెర్చ్ పత్రాలను పలు జర్నల్స్‌లో ప్రచురించారు. చిన్న గ్రామం నుంచి వచ్చి ఎన్నో కష్టనష్టాలకోర్చి పీహెచ్‌డీ పూర్తి చేయడం చాలా సంతోషంగా ఉందని, తల్లిదండ్రులు, కుటుంబసభ్యులకు తాను ఇచ్చిన పెద్ద బహుమతి ఇదేనంటూ మురిసిపోయాడు.







హైదరాబాదీ ఎడ్‌టెకీ!

బైట్‌ఎక్స్‌ఎల్ పేరిట స్టార్టప్ స్థాపించిన అంబర్‌పేటవాసి


- ఇండస్ట్రీ, కాలేజీ విద్యకు మధ్య అనుసంధానం
- వేలాది మందికి స్కిల్స్ నేర్పిస్తున్న అన్నదమ్ములు
- ఏడు రాష్ట్రాల్లోని దాదాపు వంద కాలేజీలతో ఒప్పందం

సాక్షి, సిటీబ్యూరో: దేశవ్యాప్తంగా ఇంజినీరింగ్ పూర్తయిన వారిలో దాదాపు 80 శాతం మందికి సరైన ఉద్యోగాలు రావట్లేదు. ఇంజినీరింగ్ చదివే సమయంలో జాబ్ మార్కెట్‌కు కావాల్సిన నైపుణ్యాలు సంపాదించుకోవడంలో యువత విఫలం అవుతోంది. ఇంజినీరింగ్ అయిపోయిన తర్వాత చాలా మంది రియలైజ్ అవుతున్నారు. ఆ తర్వాతే ఏదో ఒక కోచింగ్ సెంటర్‌లో చేరి.. ఆ కోర్సు.. ఈ కోర్సు అంటూ కుస్తీలు పడుతున్నారు. చివరికి ఆపసోపాలు పడి ఏదో ఒక జాబ్‌లో చేరుతున్నారు. ఆ తర్వాత సరైన నైపుణ్యం లేకపోవడంతో ఉద్యోగంలో చేరిన తర్వాత తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొందరైతే జాబ్ మానేస్తున్నారు. అందుకే ఇంజినీరింగ్ చేసే సమయంలోనే.. బయట జాబ్ మార్కెట్‌కు అనుగుణంగా విద్యార్థులకు స్కిల్స్ నేర్పిస్తే బాగుంటుంది కదూ..! ఈ చిన్న ఆలోచన నుంచి పుట్టుకొచ్చిందే బైట్‌ఎక్స్‌ఎల్ స్టార్టప్..

సొంత అనుభవాల నుంచి..

హైదరాబాద్‌లోని అంబర్‌పేట తిలక్‌నగర్‌కు చెందిన అన్నదమ్ములు కరుణ్ తాడేపల్లి, చరణ్ తాడేపల్లి కలిసి ఈ సంస్థను స్థాపించారు. జేఎన్‌టీయూలో ఇంజినీరింగ్ పూర్తి చేసిన కరుణ్.. ఉద్యోగం కోసం అమెరికా వెళ్లారు. అక్కడ ఉద్యోగం చేసే సమయంలో తాను ఎదుర్కొన్న సమస్యలు, అనుభవాల నుంచే సంస్థ స్థాపించాలనే ఆలోచన చేశారు. చివరకు సోదరుడు చరణ్‌తో కలిసి 2020లో ఈ స్టార్టప్‌ను క్రౌడ్ ఫండింగ్ ద్వారా ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి వేలాది మంది విద్యార్థులకు కాలేజీల్లో స్కిల్స్ నేర్పిస్తున్నారు. కృత్రిమ మేధ, మెషీన్ లెర్నింగ్, జెన్‌ఏఐ, కోడింగ్, క్లౌడ్ కంప్యూటింగ్, వంటి కోర్సులను వీరి కంపెనీ నేర్పిస్తోంది. తొలుత కాలేజీల్లో టీచర్లకు స్కిల్స్ నేర్పించాలని అనుకున్నారట. అయితే అలా చేస్తే విద్యార్థులకు పూర్తిస్థాయి న్యాయం జరగకపోవచ్చనే ఉద్దేశంతో నేరుగా విద్యార్థులకే నైపుణ్యాలు నేర్పించాలని నిర్ణయించుకుని ముందుకు సాగుతున్నారు.

ఏడు రాష్ట్రాలు 100 కాలేజీలు..



దేశంలోని చాలా కాలేజీల్లో ఈ సంస్థ ప్రస్తుతం సేవలు అందిస్తోందని కరుణ్ వివరించారు. ఏడు రాష్ట్రాల్లోని దాదాపు 100కు పైగా కాలేజీల విద్యార్థులకు ప్రస్తుతం పాఠాలు చెబుతోందని తెలిపారు. తెలంగాణలో కూడా దాదాపు ఏడెనిమిది కాలేజీలతో ఒప్పందం కుదుర్చుకున్నారు. నాలుగేళ్లు పూర్తయ్యే సరికి ప్లేస్‌మెంట్ సమయంలో కచ్చితంగా ఉద్యోగం సాధించే నైపుణ్యాలు నేర్చుకుంటున్నారని పేర్కొన్నారు. దాదాపు 64 శాతం మేర విద్యార్థులు మంచి ప్యాకేజీతో ఉద్యోగాలు సాధిస్తున్నారని చెప్పారు. ఇలా వేలాది మందికి స్కిల్స్ నేర్పిస్తూ ఉపాధి కల్పించడమే కాకుండా కాలేజీ విద్యకు, ఇండస్ట్రీకి మధ్య ఉన్న గ్యాప్‌ను పూడుస్తున్నారు. పదుల సంఖ్యలో కాలేజీలతో ఒప్పందం కుదుర్చుకుని.. ఉద్యోగానికి కావాల్సిన నైపుణ్యాలు నేర్పించడమే కాకుండా ఉద్యోగంలో చేరాక ఎదురయ్యే సవాళ్లను ఎలా ఎదుర్కోవాలో నేర్పిస్తూ విద్యార్థులను సన్నద్ధం చేస్తోంది. సాధారణంగా ఇంజనీరింగ్ సిలబస్‌లో చాలా ఏళ్లుగా ఎలాంటి మార్పులూ లేకపోవడంతో.. ప్రస్తుతం సాంకేతికత, జాబ్ మార్కెట్, ఇండస్ట్రీకి అవసరమైన నైపుణ్యాలను బోధించలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులకు రియల్ టైం ప్రాక్టికల్ నాలెడ్జ్ అందించాలన్నదే బైట్‌ఎక్స్‌ఎల్ లక్ష్యం. - తాడేపల్లి కరుణ్, సంస్థ వ్యవస్థాపకుడు



వారాహిలో ఫ్యాషన్ వాక్





జూబ్లీహిల్స్ రోడ్ నెం. 36లో నూతనంగా ఏర్పాటు చేసిన వారాహి సిల్క్స్‌లో శుక్రవారం నిర్వహించిన ఫ్యాషన్ వాక్‌లో అందాల భామలు హొయలు ఒలకబోశారు. స్టోర్‌లో అందుబాటులోకి వచ్చిన సరికొత్త కలెక్షన్స్‌ను ఈ సందర్భంగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సామాజికవేత్త పింకీరెడ్డి, నిర్వాహకులు మణిదీప్ పాల్గొన్నారు. తాము సేకరించిన ప్రతి చీరా ఓ ప్రత్యేక కథను చెప్పే విధంగా విభిన్న రీతిలో ఉంటాయని ఈ సందర్భంగా నిర్వాహకులు వెల్లడించారు. - బంజారాహిల్స్





హైదరాబాద్ చాదర్‌ఘాట్‌లోని విక్టరీ ప్లే గ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన 65 అడుగుల దుర్గా మాత విగ్రహం



సిద్ధిధాత్రి రూపంలో బాసర జ్ఞాన సరస్వతి



సిద్ధిధాత్రిదేవిగా అలంపూర్ జోగులాంబ



మహిషాసురమర్దినిగా వరంగల్ భద్రకాళి

▼ నగరోత్సవంలో ఉత్సవమూర్తులు





శ్రీ మహిషాసురమర్దినిగా దుర్గమ్మ

మహిషాసురమర్దినిగా అనుగ్రహించిన దుర్గమ్మ

నేటి రాజరాజేశ్వరి అలంకారంతో ముగియనున్న దసరా ఉత్సవాలు.. పెరుగుతున్న భవానీ భక్తులు

సాక్షి ప్రతినిధి, విజయవాడ/వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలు చివరి దశకు చేరాయి. తొమ్మిదోరోజు శుక్రవారం మహిషాసురమర్దిని రూపంలో అమ్మవారు దర్శనమిచ్చారు. ఇక ఈ ఉత్సవాలు శనివారం పూర్ణాహుతితో ముగియనున్నాయి. ఈ ఏడాది ఉత్సవాల్లో మూలానక్షత్రం నుంచి భక్తుల రద్దీ కొనసాగుతూనే ఉంది. ఉత్తరాంధ్ర నుంచి వచ్చే భక్తుల సంఖ్య బాగా పెరిగింది. ముందస్తు అంచనాలకు అనుగుణంగా ఈ ఏడాది పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారని అంచనా వేసినప్పటికీ గత ఏడాదితో పోల్చుకుంటే భక్తుల సంఖ్య తగ్గింది. ఇప్పటికి దాదాపు 7 లక్షల నుంచి 7.5 లక్షల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకొన్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. మహర్నవమి సందర్భంగా తరలి వచ్చిన భక్తులు నగరోత్సవంలో అమ్మవారిని దర్శించుకుని తరించారు.

కనుల పండువగా తెప్పోత్సవం

దసరా ఉత్సవాల ముగింపు సందర్భంగా విజయదశమి రోజు కనకదుర్గాదేవికి కృష్ణానదిలోని దుర్గాఘాట్‌లో సాయంత్రం 5 గంటలకు శ్రీగంగా, దుర్గ అమ్మవార్ల సమేత మల్లేశ్వరస్వామి తెప్పోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ కమనీయ దృశ్యాలను భక్తులు వీక్షించేందుకు వీలుగా ప్రత్యేకంగా గుర్తించిన పది ప్రాంతాల్లో ఎల్ఈడీలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. చివరిరోజు అమ్మవారిని దర్శించుకొనేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉంది.

బీఆర్ఎస్‌లో ఎమ్మెల్సీ సందడి

పట్టభద్రుల కోటా టికెట్ కోసం ఇప్పటి నుంచే ఆశావహుల ప్రయత్నాలు

- అధినేత కేసీఆర్ దృష్టిలో పడేలా సభ్యత్వ నమోదు పేరిట హడావుడి
- ముందస్తుగా ప్రచారం పేరిట ఫ్లెక్సీల ఏర్పాటు
- ఉపాధ్యాయ కోటా స్థానాల ఎన్నికలకు దూరంగా బీఆర్ఎస్?

సాక్షి, హైదరాబాద్: శాసనమండలిలో ఉపాధ్యాయ కోటాలో ఇద్దరు ఎమ్మెల్సీలు, పట్టభద్రుల కోటాలో ఒక ఎమ్మెల్సీ ఆరేళ్ల పదవీకాలం వచ్చే ఏడాది మార్చిలో ముగియనుంది. ఖాళీ అయ్యే స్థానాల్లో ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం సన్నాహాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో బరిలో నిలిచేందుకు బీఆర్ఎస్ నుంచి ఔత్సాహికులు ఇప్పటి నుంచే సందడి చేస్తున్నారు. ఎన్నికలు జరిగే స్థానాల్లో ఓటరు నమోదు కార్యక్రమం ప్రారంభమైన నేపథ్యంలో.. ఆశావహులు సోషల్ మీడియా, ఇతర మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కుల సంఘాల పేరిట జరుగుతున్న సమావేశాల్లో పాల్గొంటూ తమకు మద్దతు ఇవ్వాల్సిందిగా కోరుతున్నారు. పట్టణాలు, మండల కేంద్రాలు, ప్రధాన రహదారుల వెంట ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి సభ్యత్వ నమోదు పేరిట ప్రచారం చేసుకుంటున్నారు. తద్వారా తాము పార్టీ అభ్యర్థిత్వాన్ని ఆశిస్తున్నట్టు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు సంకేతాలు పంపుతున్నారు.

ఉపాధ్యాయ కోటాపై అనాసక్తి

వచ్చే ఏడాది మార్చిలో 'మెదక్–కరీంనగర్–ఆదిలాబాద్–నిజామాబాద్' ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తమరెడ్డి(పీఆర్‌టీయూ)తోపాటు 'వరంగల్–ఖమ్మం–నల్లగొండ' ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి(యూటీఎఫ్) పదవీకాలం ముగుస్తుంది. 2019లో జరిగిన ఎన్నికల్లో ఈ రెండు నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ అధికారికంగా అభ్యర్థులను బరిలోకి దించలేదు. పీఆర్‌టీయూకు పరోక్షంగా మద్దతు ప్రకటించింది. ప్రస్తుతం బీఆర్ఎస్‌తో పీఆర్‌టీయూ అంటీముట్టనట్టు వ్యవహరిస్తున్న నేపథ్యంలో ఉపాధ్యాయ కోటా ఎమ్మెల్సీ ఎన్నికలకు బీఆర్ఎస్ ప్రత్యక్షంగా, పరోక్షంగా దూరంగా ఉండే సూచనలు కనిపిస్తున్నాయి.



పట్టభద్రుల ఎన్నికల నేపథ్యంలో న్యాయవాదులతో సమావేశమైన సర్దార్ రవీందర్‌సింగ్

అందరి దృష్టి పట్టభద్రుల స్థానంపైనే

'మెదక్–కరీంనగర్–ఆదిలాబాద్–నిజామాబాద్' పట్టభద్రుల నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు పలువురు బీఆర్ఎస్ నేతలు ఆసక్తి చూపుతున్నారు. 13 జిల్లాల్లోని 42 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఈ పట్టభద్రుల నియోజకవర్గం విస్తరించి ఉంది. ఓటర్లను చేరుకునేందుకు ఇప్పటి నుంచే ఆశావహులు తమ వంతు ప్రయత్నాలు ప్రారంభించారు. కరీంనగర్ నుంచి మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, మెదక్ నుంచి మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి, నిజామాబాద్ నుంచి రాజారాంయాదవ్ బీఆర్ఎస్ నుంచి పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. తమ మద్దతుదారులను రంగంలోకి దించి ఓటరు నమోదు కార్యక్రమంలో చురుగ్గా పాల్గొంటున్నారు. పార్టీ అధినేత కేసీఆర్ గతంలోనే తనకు హామీ ఇచ్చినట్టు రవీందర్ సింగ్ చెబుతున్నారు.

గతంలో.. బలమున్నా బరికి దూరం

మండలి పట్టభద్రుల కోటా 2019 ఎన్నికల సందర్భంలో 'మెదక్–కరీంనగర్–ఆదిలాబాద్–నిజామాబాద్' నియోజకవర్గ పరిధిలో కాంగ్రెస్‌కు కేవలం ఇద్దరు ఎమ్మెల్యేలు శ్రీధర్‌బాబు (మంథని), జగ్గారెడ్డి (సంగారెడ్డి) మాత్రమే ఉన్నారు. నాలుగు జిల్లాల పరిధిలో కాంగ్రెస్ నుంచి చేరిన ఎమ్మెల్యేల సంఖ్యను కలుపుకొని 40 మంది ఎమ్మెల్యేలున్న బీఆర్ఎస్ పోటీకి దూరంగా ఉంది. స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన చంద్రశేఖర్‌గౌడ్‌కు మద్దతు ప్రకటించగా, కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన టి.జీవన్‌రెడ్డి పట్టభద్రుల కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు.

ఇప్పుడు.. కీలక నేతలందరూ ఇక్కడే

ప్రస్తుతం 'మెదక్–కరీంనగర్–ఆదిలాబాద్–నిజామాబాద్' పట్టభద్రుల నియోజకవర్గ పరిధిలో 42 మంది ఎమ్మెల్యేలకుగాను కాంగ్రెస్‌కు 19, బీఆర్ఎస్‌కు 16, బీజేపీకి ఏడుగురు ఎమ్మెల్యేలు ఉన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు జి.మహిపాల్‌రెడ్డి (పటాన్‌చెరు), సంజయ్ (జగిత్యాల), పోచారం శ్రీనివాసరెడ్డి (బాన్సువాడ) కాంగ్రెస్ గూటికి చేరారు. అయితే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహా కీలక నేతలు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, గంగుల కమలాకర్ తదితరులు సిట్టింగ్ ఎమ్మెల్యేలుగా ఉన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో బీఆర్ఎస్‌కు క్షేత్రస్థాయిలో సానుకూల వాతావరణం ఉందని, పార్టీ అవకాశమిస్తే గెలుపు సాధిస్తామనే ధీమా ఆశావహుల్లో కనిపిస్తోంది.

స్కిల్స్ యూనివర్సిటీలో నాలుగు కొత్త కోర్సులు

- దసరా నుంచి దరఖాస్తుల స్వీకరణ
- తుది గడువు అక్టోబర్ 29
- నవంబర్ 4 నుంచి తరగతులు

సాక్షి, హైదరాబాద్: యువతలో నైపుణ్యం పెంచడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం స్థాపించిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ తొలి విడతలో నాలుగు కోర్సులను దసరా నుంచి ప్రారంభిస్తోంది. నైపుణ్య శిక్షణ కోసం యూనివర్సిటీ 'స్కూల్ ఆఫ్ లాజిస్టిక్స్', 'స్కూల్ ఆఫ్ ఈ కామర్స్', 'స్కూల్ ఆఫ్ హెల్త్‌కేర్' పేరిట ఇప్పటికే మూడు స్కూళ్లను ప్రారంభించింది. స్కూల్ ఆఫ్ లాజిస్టిక్స్, ఈ కామర్స్‌లో 'వేర్ హౌజ్ ఎగ్జిక్యూటివ్', 'కీ కన్‌సైనర్ ఎగ్జిక్యూటివ్' కోర్సులను ఆఫర్ చేస్తున్నాయి. స్కూల్ ఆఫ్ హెల్త్‌కేర్ ద్వారా 'నర్సింగ్ ఎక్సలెన్స్', 'ఫార్మా అసోసియేట్ ప్రోగ్రామ్' కోర్సుల్లో నైపుణ్య శిక్షణ ఇస్తారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ వెబ్‌సైట్ ద్వారా ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలని యూనివర్సిటీ ఒక ప్రకటనలో కోరింది. దరఖాస్తు చేసుకునేందుకు అక్టోబర్ 29 చివరి తేదీ కాగా, నవంబర్ 4వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయి. తరగతులను తాత్కాలికంగా ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఇస్కి), నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (నాక్) ఆవరణలో నిర్వహిస్తారు. యువతకు ఉపాధి కల్పన లక్ష్యంగా వివిధ రంగాల్లో నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో ఇటీవల యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేయడం తెలిసిందే.



అమెరికాలో బతుకమ్మ సంబరాలు

రాయికల్ (జగిత్యాల): అమెరికాలోని విస్కాన్సిన్ స్టేట్ సన్‌ప్రేరీ సిటీలో శుక్రవారం బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల పూలతో బతుకమ్మను పేర్చి గౌరీదేవిని ప్రతిష్ఠించిన అనంతరం ఆడిపాడుతూ ఉత్సాహంగా గడిపారు. అనంతరం వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన సింధు, ప్రవాస తెలంగాణ మహిళలు ఉష, రమ్య, కవిత, ప్రత్యూష, లక్ష్మి, సుస్మిత, లావణ్య, తేజ, దీపిక, హారిక, స్వప్న, శాంతి, శ్వేత, ఆకృతి పాల్గొన్నారు.

ఏడేళ్ల బాలునిపై కుక్కల దాడి

జనగామ: జనగామ పట్టణంలో కుక్కల దాడిలో ఒక బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. పారిశ్రామిక ప్రాంతానికి చెందిన రమేష్‌చంద్ర ఏడేళ్ల కుమారుడు మాదంశెట్టి మహోన్నత్ శుక్రవారం ఇంటి బయట ఆడుకుంటున్న సమయంలో.. కుక్కలు దాడి చేశాయి. దీంతో బాలుని చెయ్యి, కాళ్లు, తల భాగంలో తీవ్రగాయాలు కాగా, స్థానికులు వాటిని తరిమారు. వెంటనే బాలుడిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

వివాహ విందులో విషాహారం

సుమారు 40 మందికి అస్వస్థత

మల్లాపూర్(కోరుట్ల)/జగిత్యాల క్రైం: జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం సాతారంలో పెళ్లింట విషాదం నెలకొంది. గ్రామానికి చెందిన ఎండీ రఫీక్ – సుల్తానా బేగం దంపతుల పెద్ద కుమారుడు మునీర్‌కి జగిత్యాల రూరల్ మండలం గుల్లపేటకు చెందిన యువతితో గురువారం వివాహం జరిగింది. శుక్రవారం మగపెళ్లివారు కోరుట్ల మండలం అయిలాపూర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన రిసెప్షన్‌లో.. విషాహారం తీవ్ర కలకలం సృష్టించింది. పెళ్లి వేడుకలో విందు భోజనాలు చేసిన సాతారం, గుల్లపేటకు చెందిన సుమారు 40 మంది అస్వస్థతకు గురయ్యారు. బాధితులను హుటాహుటిన జగిత్యాల జిల్లా కేంద్రంతో పాటు కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాల్లోని ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

ప్రవాసీ ప్రజావాణి మార్గదర్శకాలు విడుదల

సాక్షి, హైదరాబాద్/లక్డీకాపూల్: గల్ఫ్‌తోపాటు, ఇతర దేశాల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారం కోసం వారి కుటుంబాల నుంచి వినతులు స్వీకరించేందుకు ప్రత్యేకంగా నిర్వహిస్తున్న ప్రవాసీ ప్రజావాణి కార్యక్రమానికి సంబంధించిన మార్గదర్శకాలను ప్రభుత్వం విడుదల చేసింది. ప్రతి మంగళ, శుక్రవారం జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు వినతులు స్వీకరిస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ విభాగానికి సమర్పించే దరఖాస్తులు, వాటి పరిష్కారానికి సంబంధించిన మార్గదర్శకాలను రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు, ప్రజావాణి ఇన్‌చార్జి జి.చిన్నారెడ్డి శుక్రవారం విడుదల చేశారు. ప్రజాభవన్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. బాధితుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం గతనెల 16న రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులకు అనుగుణంగా ఈ ప్రజావాణిని నిర్వహిస్తామన్నారు. ప్రవాసీ ప్రజావాణిలో స్వీకరించిన ఫిర్యాదుల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని తెలిపారు. గల్ఫ్ తదితర దేశాల్లో మరణించిన తెలంగాణ కార్మికుల మృతదేహాలను రాష్ట్రానికి తెప్పించడం, విదేశాల నుంచి వచ్చిన శవపేటికలను హైదరాబాద్ విమానాశ్రయం నుంచి వారి స్వగ్రామం వరకు తరలించడానికి ఉచిత అంబులెన్స్ ఏర్పాటు చేయడం (బీపీఎల్ కేటగిరీకి చెందిన వారు మాత్రమే), జబ్బుపడినవారిని స్వదేశానికి తీసుకురావడం, విదేశీ జైళ్లలో ఉన్నవారికి న్యాయ సహాయం చేసి.. విడుదలకు కృషి చేయడం, వీసా గడువును మించి (ఓవర్ స్టే) అక్కడే నివసించడం, క్షమాభిక్ష (ఆమ్నెస్టీ), జీతం బకాయిలు ఇప్పించడం వంటి అంశాల్లో ప్రభుత్వం సాయం చేస్తుందని ఆయన వివరించారు. కాగా, బాధితులు తమ దరఖాస్తుతోపాటు సంబంధిత వ్యక్తుల పాస్‌పోర్టు కాపీ, ఆధార్, రేషన్‌కార్డు కాపీలు, విదేశాల్లో పనిచేస్తున్నవారి వివరాలు, రాష్ట్రంలో ఉంటున్న కుటుంబం వివరాలు, ఫోన్‌నంబర్లు ఇవ్వాల్సి ఉంటుంది.



బాధితులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న చిన్నారెడ్డి

ఎలక్ట్రిక్ బైక్స్ జీఎస్టీ స్కామ్‌పై ఈడీ ఆరా

రూ.46 కోట్లు రిఫండ్ చేసుకున్న జీఎస్టీ అధికారులు

సాక్షి, హైదరాబాద్: ఎలక్ట్రిక్ బైక్‌ల జీఎస్టీ రీఫండ్ స్కామ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) దర్యాప్తు ప్రారంభించింది. మాదాపూర్ జీఎస్టీ సర్కిల్–2లో ఎలక్ట్రిక్ బైక్‌ల జీఎస్టీ రీఫండ్‌కు సంబంధించి స్కామ్‌పై సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు ఈ ఏడాది మార్చి 6న ఏడు కేసులు నమోదు చేసిన విషయం తెలిసిందే. గ్రోమోర్ ఈ–బైక్స్ కంపెనీ సహా మరో ఏడుగురితో కలిసి జీఎస్టీ అధికారులు కుట్ర చేశారు. ట్యాక్స్ కన్సల్టెంట్స్‌తో కలిసి వివిధ సంస్థల పేర్లతో ఈ–బైక్స్ బోగస్ యూనిట్ల సంస్థలు రిజిస్టర్ చేశారు. నకిలీ బిల్స్, రెంటల్ అగ్రిమెంట్స్ క్రియేట్ చేసి జీఎస్టీ పోర్టల్‌లో అప్‌లోడ్ చేశారు. నకిలీ ఈ–వాయిస్‌లు సృష్టించి క్లెయిమ్ చేశారు. ఇలా వివిధ సంస్థల పేర్లతో రూ.46 కోట్లు జీఎస్టీ రీఫండ్‌లను క్లెయిమ్ చేసినట్టు సీసీఎస్ పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. వారి ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ ఈసీఐఆర్ నమోదు చేసింది. ఇందులో మనీలాండరింగ్ కోణంలో ఈడీ అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసులో లంచాలు తీసుకొని జీఎస్టీ రిటర్న్స్ రీఫండ్ చేసిన ఐదుగురు జీఎస్టీ అధికారులను మే 4న సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టుబడిన నిందితులకు సమన్లు జారీ చేసి, విచారించనున్నట్టు ఈడీ అధికారులు వెల్లడించారు.

సాక్షి రియల్టీ




పెట్ పార్క్ కిర్రాక్..!

సాక్షి, హైదరాబాద్: పెంపుడు జంతువులు పెంచుకోవడం స్టేటస్ సింబల్‌గా మారిపోయింది. పెట్స్‌తో రక్షణతో పాటు మానసిక ప్రశాంతత కూడా చేకూరుతుండటంతో ఇదొక హాబీగా మారింది. చాలా మంది ఎగువ మధ్యతరగతి కుటుంబాలు కుక్కలు, పిల్లులు, కుందేళ్లు.. ఇలా రకరకాల పెంపుడు జంతువులను పెంచుకుంటుంటారు. విదేశాల నుంచి కూడా పెట్స్‌ను కొనుగోలు చేస్తుంటారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. అయితే చాలా మంది ఉదయం, సాయంత్రం వేళల్లో తమ వెంట పెట్స్‌ను రోడ్ల మీద, పార్క్‌లకు తీసుకెళుతుంటారు. దీంతో ఇతరుల నుంచి ఇబ్బందులు ఎదుర్కొంటుంటారు. దీంతో చాలా మంది డెవలపర్లు నివాస సముదాయాల్లోనే పెంపుడు జంతువుల కోసం ప్రత్యేకంగా పెట్ పార్క్‌ను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో పెట్స్ పార్క్ ఉన్న ప్రాజెక్ట్‌లకు డిమాండ్ పెరిగింది.

వందకు పైగా వసతులు..

హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ నిర్మాణ సంస్థ ప్రణీత్ గ్రూప్ జేఎన్‌టీయూ సమీపంలో ఇక్సోరా పేరుతో ప్రీమియం హైరైజ్ రెసిడెన్షియల్ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తోంది. 8.31 ఎకరాల్లోని ఈ ప్రాజెక్ట్‌లో నాలుగు టవర్లుంటాయి. జీ+37 అంతస్తుల్లో మొత్తం 1,504 యూనిట్లుంటాయి. 1,305 చ.అ. నుంచి 3,130 చ.అ. మధ్య ఫ్లాట్ల విస్తీర్ణాలుంటాయి. వెహికల్ ఫ్రీ పోడియం పార్కింగ్, పెట్ పార్క్, యాంపీ థియేటర్, చిల్డ్రన్స్ ప్లే ఏరియా, స్విమ్మింగ్ పూల్, ఫిట్‌నెస్ స్టేషన్, యోగా డెక్.. ఇలా వందకు పైగా వసతులుంటాయి. 50 వేల చ.అ. క్లబ్ హౌస్ కోసం కేటాయించారు. ఈ ప్రాజెక్ట్‌లో 80 శాతం ఓపెన్ స్పేస్ ఉంటుంది. గడువులోగా ప్రాజెక్ట్‌ను పూర్తి చేసి కొనుగోలుదారులకు అందించాలనే లక్ష్యంగా శరవేగంగా నిర్మాణ పనులను చేపడుతున్నామని ప్రణీత్ గ్రూప్ ఎండీ నరేంద్ర కుమార్ తెలిపారు. ఇప్పటికే టవర్ 1,2లలో బేస్‌మెంట్ నిర్మాణం పూర్తయిందని, గ్రౌండ్ ఫ్లోర్ పనులు జరుగుతున్నాయని చెప్పారు.

డౌన్



54 శాతం తగ్గిన ప్రాజెక్ట్ లాంచింగ్స్

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ స్థిరాస్తి రంగం తిరోగమన బాట పట్టింది. డెవలపర్లు కొత్త ప్రాజెక్ట్‌ల జోలికి వెళ్లడం లేదు. నిర్మాణంలో ఉన్న సముదాయాలను పూర్తి చేయడంపైనే దృష్టిసారించారు. జూలై–సెప్టెంబర్ (క్యూ3) త్రైమాసికంలో నగరంలో ప్రాజెక్ట్ లాంచింగ్స్ 54%, గృహ విక్రయాలు 42% క్షీణించాయని ప్రాప్ ఈక్విటీ నివేదిక వెల్లడించింది. గతేడాది క్యూ3లో 25,370 యూనిట్లు ప్రారంభం కాగా.. ఇప్పుడవి 11,601లకే పరిమితమయ్యాయి. 2023 క్యూ3లో 20,658 గృహాలు అమ్ముడుపోగా.. ఈ క్యూ3 నాటికి కేవలం 12,082 యూనిట్లు విక్రయమయ్యాయి. క్యూ2తో పోలిస్తే లాంచింగ్స్ 15%, విక్రయాలు 18% తగ్గాయి.

ఒక్క రోజులో రూ.500 కోట్ల విక్రయాలు

సాక్షి, హైదరాబాద్: నగరానికి చెందిన నిర్మాణ సంస్థ ఏఎస్‌బీఎల్ సరికొత్త రికార్డులను సృష్టించింది. కూకట్‌పల్లిలో నిర్మిస్తున్న ల్యాండ్‌మార్క్ ప్రాజెక్ట్ లాంచ్ చేసిన తొలి రోజులోనే రూ.500 కోట్ల విలువైన విక్రయాలను పూర్తి చేసినట్లు సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. 6.6 ఎకరాల్లో నిర్మితమవుతున్న ఈ ప్రాజెక్ట్ జీ+19, 20 అంతస్తుల్లో నాలుగు టవర్లుంటాయి. జీ+4 అంతస్తుల్లో క్లబ్ హౌస్ ఉంటుంది. 52 వేల చ.అ. స్థలాన్ని ఇండోర్ ఎమినిటీస్ కోసం కేటాయింరు. గతేడాది ఎస్‌బీఎల్ రూ.2.200 కోట్ల విక్రయాలను పూర్తి చేసిందని కంపెనీ సీఈఓ అజితేష్ తెలిపారు.



స్లీపర్ వందేభారత్ జిగేల్..!

ఆధునిక సౌకర్యాలు
అత్యాధునిక వసతులు
దివ్యాంగుల కోసం ప్రత్యేక బెర్త్‌లు

సాక్షి, హైదరాబాద్: భారతీయ రైల్వే గతిని మార్చిన 'వందేభారత్' సిరీస్‌లో స్లీపర్ బెర్తులతో కూడిన రైలు త్వరలో పట్టాలెక్కేందుకు సిద్ధమైంది. పరిమిత దూరంలో ఉన్న నగరాల మధ్య 160 కి.మీ. గరిష్ట వేగంతో దూసుకుపోతున్న వందేభారత్ రైళ్లు.. ఇక వేయి కిలోమీటర్లను మించిన దూరంలో ఉన్న ప్రాంతాల మధ్య తిరిగేందుకు సిద్ధమయ్యాయి. ఇందుకుగాను తొలిసారి స్లీపర్ బెర్తులతో కూడిన వందేభారత్ రైలు పూర్తిస్థాయిలో సిద్ధమై తొలి పరుగుకు సన్నద్ధమైంది. ఇప్పటి వరకు మన రైళ్లలో కనిపించని ఆధునిక రూపుతో ఇవి కళ్లు చెమర్చేలా ఉండటం ప్రత్యేక ఆకర్షణగా మారింది. రైల్వే శాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్ ఇటీవల ఈ రైలును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. దీనికి ఆమోదముద్ర పడటంతో మరిన్ని రైళ్ల తయారీ కూడా ఊపందుకుంది. త్వరలో దేశంలోని ప్రధాన ప్రాంతాల మధ్య ఇవి రాత్రి వేళ పరుగులు పెట్టబోతున్నాయి. 14 రూట్‌లలో వీటినే నడిపే ఆలోచనలో రైల్వే అధికారులు ఉన్నారు. స్వదేశీ పరిజ్ఞానం, పూర్తిస్థాయి అగ్ని నిరోధక భద్రతా ప్రమాణాలతో ఈ రైలు రూపుదిద్దుకుంది.

→ ఈ రైలును ఆస్టెనిటిక్ స్టెయిన్‌లెస్ స్టీల్‌తో రూపొందించారు. వందేభారత్ తరహాలో దీని వెలుపలి రూపు ఏరో డైనమిక్ డిజైన్‌తో కనువిందు చేయనుంది.

→ ఇంటీరియర్‌ను జీఎఫ్ఆర్‌పీ ప్యానల్‌తో రూపొందించారు.

→ అగ్ని నిరోధ వ్యవస్థ ఈఎన్ 45545 ప్రమాణ స్థాయితో రూపొందింది (హజార్డ్ లెవెల్:3).

→ దివ్యాంగులు కూడా సులభంగా వినియోగించగలిగే పద్ధతిలో ప్రత్యేక బెర్తులు ఇందులో పొందుపరిచారు.

→ ఆటోమేటిక్ పద్ధతిలో తెరుచుకొని, మూసుకునే పద్ధతి గల డోర్‌లు ఏర్పాటు చేశారు. ఇవి సెన్సార్ ఆధారిత ఇంటర్ కమ్యూనికేషన్‌తో పనిచేస్తాయి.

→ దుర్వాసనను నియంత్రించే ప్రత్యేక వ్యవస్థతో కూడిన పూర్తి సౌకర్యవంతమైన టాయిలెట్లను అందుబాటులోకి తీసుకొచ్చారు. లోకోపైలట్ల కోసం ప్రత్యేక టాయిలెట్లను ఏర్పాటు చేశారు.

→ మొదటి శ్రేణి ఏసీ కోచ్‌లో వేడి నీటితో కూడిన షవర్ వ్యవస్థ అందుబాటులో ఉంటుంది.

→ కోచ్‌లలోని బెర్తుల వద్ద రీడింగ్ లైట్లు, యూఎస్‌బీ చార్జింగ్ వసతి ఉంటుంది.

→ అనౌన్స్‌మెంట్‌ల కోసం ఆడియో, వీడియో వ్యవస్థ, ప్రయాణికుల లగేజీ భద్రపరిచేందుకు విశాలమైన కోచ్ ఉంటుంది.





స్లీపర్ వందే భారత్ రైలు లోపలి దృశ్యాలు



◀ స్లీపర్ వందే భారత్ రైలు

మొత్తం 16 కోచ్‌లు

ఈ ఆధునిక స్లీపర్ వందేభారత్ రైలులో 16 కోచ్‌లు ఉంటాయి. అప్పర్ బెర్తులోకి చేరుకునేందుకు ప్రత్యేక నిచ్చెన తరహా ఏర్పాటు ఉంటుంది. మిడిల్ బెర్తు నారింజ రంగులో, లోయర్, అప్పర్ బెర్తులు గ్రే కలర్‌లో ఉంటాయి. అప్పర్ బెర్తులను నిలిపి ఉంచేందుకు గతంలో గొలుసు తరహా ఏర్పాటు ఉంటే, ఇందులో ప్రత్యేక స్టీల్ స్ట్రిప్ ఏర్పాటు చేశారు. బెర్తుల వద్ద మేగజైన్ బ్యాగు, మొబైల్ ఫోన్ పెట్టుకునే బాక్సు ఏర్పాటు చేశారు. బెర్తులు ఆరడుగుల పొడవుతో ఏర్పాటు చేశారు. సెక్యూరిటీ, రైల్వే సిబ్బందికి ప్రత్యేక గది ఏర్పాటు చేశారు. లోకో పైలట్‌తో నేరుగా మాట్లాడేందుకు ప్రత్యేక ఆడియో వ్యవస్థ అక్కడ అందుబాటులో ఉంటుంది.

కోచ్‌లు	బెర్తులు
11 ఏసీ 3 టైర్ కోచ్‌లు	611
4 ఏసీ 3టైర్ కోచ్‌లు	188
ఒక ఫస్ట్ క్లాస్ ఏసీ కోచ్	24

ప్రతి అమ్మా దుర్గమ్మే

విజయ దశమి సందర్భంగా ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, ప్రవచనకర్త డాక్టర్ మైలవరపు శ్రీనివాసరావు సాక్షి ఫ్యామిలీకి ప్రత్యేకంగా చెప్పిన ముఖ్య విశేషాలు...

పదవరోజుతో ఎందుకు ముగించాలి...

లోకంలోని ప్రతి అమ్మా ఆ లోకంలోని జగదంబకి ప్రతిరూపం. ఈమె కనిపిస్తుంది. ఆమె కన్పించదు. ఈమె ఎలాగైతే తొమ్మిది నెలలపాటు తనలో జరిగే వ్యాధులూ అలజడీ... తో పోరాడి 10వ నెలలో సంతాన విజయాన్ని సాధిస్తోందో– అలా అమ్మ ఈమెకి మార్గదర్శకురాలిగా తొమ్మిది రాత్రులపాటు (రాక్షసులకి రాత్రే బలం అధికం. నిశా– చరులు కదా) పోరాడి పోరాడి 10వ నాడు దశమి విజయాన్ని సాధించింది కాబట్టి దేవీ నవరాత్రులంటే ప్రతి స్త్రీ విజయానికీ సాక్ష్యమన్నమాట. సంతానాన్ని కనగలగడమంటే అమ్మ అనుగ్రహంతో జయాన్ని సాధించి పండంటి బిడ్డని పొందడమన్నమాట. జయమంటే గెలుపు. అమ్మ అనుగ్రహం దానికి అండగా నిలిస్తే అది విజయం అన్న మాట!

రోజూ అమ్మకి కొత్తకొత్తగా ముస్తాబు...

అమ్మ అలంకారాల విషయానికి వద్దాం... స్థూలంగా చెప్తే– యోగసాధన చేయదలచిన సాధకుడు మొదటి రోజున బాల్య స్థితిలో ఉంటాడు. అదే బాలా త్రిపుర సుందరీ రూపం. అమ్మ తన సంతానాన్ని బడికి పంపే ముందు కడుపునిండుగా అన్నం పెట్టి పంపుతుంది. అదుగో అదే అన్నపూర్ణా రూపం. సంతానం బడికెళ్లాక మూడవ కన్నయిన జ్ఞానాన్ని పొందుతారు. అదే గాయత్రీ రూపం. గాయత్రీ మంత్రానుష్ఠానం సాగగానే ఆ వ్యక్తికి ఓ వాక్శక్తి వచ్చి, అతడు ఏం చెప్తే అది జరగడం ప్రారంభమౌతుంది. ఆ శక్తిని ధనార్జనకి ఉపయోగిస్తాడా? లేక పై చదువుకోసం వినియోగిస్తాడా... అని పరీక్షించడం కోసం 4వ రోజున పరీక్ష కోసం మహాలక్ష్మీ రూపం వేస్తారు. ఆ ఆలోచనని జయిస్తే సరస్వతి లక్ష్మి ఇతర దేవతలూ... ఇలా అందర్నీ శాసించగల లలితారూపాన్ని దర్శించేలా 5వ రోజున లలితా రూపాన్ని వేస్తారు. ఆరవ రోజున షష్ఠి తిథి మూలా నక్షత్రం ఉండే కారణంగా సరస్వతీ రూపాన్ని వేయించి జ్ఞాన అజ్ఞానాలకీ, విరోధం విచక్షణం అనే రెంటికీ మూలమైన శక్తిని తెలుసుకునేలా చేస్తారు. 7వ రోజున వివాహిత అయిన స్త్రీ తన భర్తతో కలిసి ఉన్నప్పుడే భోగాన్నీ (మానసికానందం) పొందగలదని ఉపదేశిస్తూ భవానీ రూపాన్ని వేస్తారు. 8వ రోజున ఎంతటి కష్టానికైనా అండగా ఉంటుందనే విషయాన్ని తెలియజేస్తూ దుర్గా రూపాన్నీ– 9వ రోజున శత్రువుని ఎదుర్కొనే సాహసాన్ని ప్రతి స్త్రీ కలిగి ఉండాలనే దృష్టిని నేర్పుతూ మహానవమి నాడు క్రోధ రూపిణి అయిన కాలి రూపాన్నీ– 10వ రోజున మహిసాసుర మర్దినీ రూపాన్నీ (జాడ్యం బద్ధకం నిర్లక్ష్యం సిగ్గులేనితనం.. వంటి లక్షణాలని తొలగించగల) వేస్తారు. స్త్రీ అలా ఉన్న రోజున రాజరాజేశ్వరిగా సర్వులకీ అధిపత్నిగా ఉంటూ అ–పరాజిత (చేపట్టిన కార్యక్రమంలో ఓటమి లేనిది) గా అవుతుందని ఈ రూపాలతో నిరూపిస్తారు.

అమ్మ చేతిలో మారణాయుధాలా?

మనింట్లో ఉండే కూరగాయల్ని తరుక్కునే కత్తిపీట– వంటింట్లో ఉండే పొయ్యిమంటా... ఏవి కావు మారణాయుధాలు? వాటి ఉపయోగాన్ని బట్టి అవి ప్రయోజనాన్ని సాధించుకునే ఉపాయాలూ లేదా మారణాయుధాలూ ఔతాయి. అమ్మ చేతిలో పాశం అనురాగపాశం. అందుకే మనం ఈ ఉత్సవాలను చేసుకునేలా దాంతో బంధించింది. అమ్మ చేతిలోని అంకుశం మనం అహంకారం గర్వం హోదా ఉందనే దర్పంతో ఉన్నప్పుడు (తమోగుణం)– ఆ మదగజంలా ఉన్న మనని తోవలో పెట్టేందుకు ఉపయోగించే సాధనం. అలాగే ఆమె చేతిపుష్పబాణం మనని తన దగ్గరకి రప్పించుకునేందుకు చూపే ఆకర్షణా కుసుమం. మనని కోరికకి లొంగిపోకుండా నిలబడగల ధైర్యాన్ని పొందవలసిందిగా సూచించే పుష్ప బాణం. పరిస్థితుల్ని దాటినట్లైతే మనని వధించడానికి లేదా శిక్షించి తోవలోకి తెచ్చేందుకు అమ్మ వాడే చాపం. అర్థం చేసుకోగలగాలి! అవి రక్షణాయుధాలు– వ్యతిరేకించిన పక్షంలో మారణాయుధాలు.



దేవీ నవరాత్రుల ద్వారా తెలుసుకోవలసింది..?

సంవత్సర చక్రంలో ఉగాది రాగానే అమ్మకి వసంత నవరాత్రోత్సవాలు పేరిట 9 రోజులపాటు ఉత్సవాలు, కొందరైతే పూర్ణిమ వరకూ పండుగ చేస్తారు. మళ్లీ శ్రావణ మాసంలో నాలుగు లేదా ఐదు మంగళవారాలు, మళ్లీ నాలుగు లేదా ఐదు శుక్రవారాలూ అమ్మ పండుగలే. ఇదుగో ఈ ఆశ్వయుజంలో పాడ్యమినుండి అమావాస్య వరకూ ఆమె పండుగలే 30 రోజులపాటు. కార్తికమాసం అంతటా శివునితో కలిపి పూజాఉత్సవాలే ఆమెకి. మొత్తం అమ్మకి పండుగరోజులెన్ని... అని ఆలోచిస్తే.. కనిష్ఠంగా 9+4+4+30+15=62 స్త్రీని ఓ దేవతగా ప్రతి సంవత్సరమూ ఆరాధించే ఉత్తమ సంస్కారం భారత దేశానిదే.

లలితా సహస్ర నామాల్లో ఏముంటుందంటే...

అమ్మకున్న వెయ్యి నామాల్లో అమ్మ వారి భౌతిక రూప వర్ణనం– ఆమె ఏ మంత్ర రూపంలో ఉంటుందో ఆ మంత్ర స్వరూప విధానం– స్త్రీలలో చైతన్యాన్ని ఎలా అమ్మ నింపి 'శక్తి సేన' అనే ఓ దాన్ని సిద్ధం చేసిందో ఆ పద్ధతీ– ఆమెకి తన సాహస పరాక్రమాలతో దుర్మార్గులూ లోకకంటకులూ అయిన పురుష రాక్షసుల్ని ఎలా సహరించిందో తన సైన్య సహాయంతో ఆ దృశ్యం – గర్భవతి అయిన ఆమెలో ఎదుగుతున్న శిశువుకి ఏ నెలలో ఏ తీరు ఆహారసారాన్ని అందించాలో ఆ వైద్యక్రమం, శత్రువుల్ని ఎలా వధించాలో ఆ తీరు తెన్నులూ, భర్తతో ఎలా అన్యోన్యంగా ఉండాలో ఆ జీవన విధానం.. ఇలా వివరించబడ్డాయి.



డా. మైలవరపు శ్రీనివాసరావు

దేవీ నవరాత్రాల ముఖ్యోద్దేశం

అరాచకాలు చేసే పురుషుల్ని సాహస పరాక్రమాలని తోటి స్త్రీల సహాయంతో ఎదిరించి వాళ్లకి భయం కలిగేలా చేయడం– భర్తతో కలిసే ఉండే తీరుని నేర్పడం– కుటుంబ రహస్యాలని గోప్యంగా ఉంచుకుంటూ సత్త్వ గుణంతో పరిస్థితిని సానుకూలత ఉండేలా చేసుకోవడం– ఎవరో వచ్చి తమ కుటుంబాన్ని ఆదుకోవాలనుకోవడం, ఎదురు చూడ్డం కాకుండా తమ కుటుంబాన్ని తామే రక్షించుకోగల నేర్పరితనాన్ని సధైర్యంగా సాధించుకోగల విధానాన్ని నేర్పడమనేవి వీటి ముఖ్యోద్దేశాలు.

మన రక్షణ దుర్గం

శివుడు స్థాణువు. కదలడు. అమ్మవారు కదలిక. సైన్సు పరిభాషలో అయితే అయ్య స్టాటిక్ ఎనర్జీ. అమ్మ కైనెటిక్ ఎనర్జీ. జగతి గతికి రెండు శక్తులూ కావాలి. ఇద్దరూ కలిస్తేనే మన మనుగడకు కావాల్సిన జడ శక్తి; చిత్ శక్తి దొరుకుతున్నాయి.

శివః శక్త్యా యుక్తో యది భవతి శక్తః ప్రభవితుం న చేదేవం దేవో న ఖలు కుశలః స్పందితుమపి

అని అంటాడు శంకరాచార్యులు సౌందర్య లహరిలో. శక్తితో కలిసి ఉంటేనే శివుడు ఏదైనా చేయగలుగుతాడు. శివుడు– శక్తి వేరు కాదని శంకరుడు సౌందర్యలహరి మొట్టమొదటి శ్లోకంలోనే సూత్రీకరించాడు. 'కలాభ్యాం చూడాలంకృత–శశి కలాభ్యాం నిజ తపః ఫలాభ్యాం" అంటూ శివుడిని పొందడానికి పార్వతి; పార్వతిని పొందడానికి శివుడు తపస్సు చేయడాన్ని అనన్యసామాన్యంగా ఆవిష్కరించాడు శంకరులు శివానందలహరి మొట్ట మొదటి శ్లోకంలో. ఒకరినొకరు కలవడానికి, కొలవడానికి వారిది నిజమైన తపోఫలం.

ఆధునిక జీవనంలో మన మనుగడ సుఖంగా ఉండడానికి ఈ రెండు శ్లోకాలను పట్టుకుంటే చాలు. వీటి అర్థాన్ని, అంతరార్థాన్ని ఆకళింపు చేసుకుని...ఆచరిస్తే చాలు– శోకాలన్నీ మాయమవుతాయి.

ఆధ్యాత్మిక కోణంలో శక్తిగా మనం అమ్మవారిని కొలుచుకుంటాం. లౌకిక విషయాల్లో మహిళల శక్తిని కొలిచేప్పుడు చిన్న చూపు చూస్తాం. అమ్మవారి శక్తి లేకపోతే అంతటి శివుడే కనీసం అటు గడ్డి పోచను ఇటు జరపలేడని శంకరుడన్న మాటను నోరు నొవ్వంగ స్తోత్రం చేస్తూ ఉంటాం కానీ... ఆచరణలో ఎంతవరకు పాటిస్తున్నామన్నది ఎవరికివారు ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన విషయం.

'సర్వతీర్థాత్మికే; సర్వమంత్రాత్మికే; సర్వయంత్రాత్మికే; సర్వతంత్రాత్మికే; సర్వచక్రాత్మికే; సర్వశక్త్యాత్మికే; సర్వపీఠాత్మికే; సర్వవేదాత్మికే; సర్వవిద్యాత్మికే; సర్వయోగాత్మికే; సర్వవర్ణాత్మికే; సర్వగీతాత్మికే; సర్వనాదాత్మికే; సర్వశబ్దాత్మికే; సర్వవిశ్వాత్మికే; సర్వవర్గాత్మికే...' అంటూ శ్యామలాదండకం చివరిలో కాళిదాసు అందరిలో, అన్నిటిలో, విశ్వమంతా అమ్మవారినే దర్శించాడు.

'అమ్మల గన్నయమ్మ, ముగురమ్మల మూలపుటమ్మ, చాల పెద్దమ్మ...' అన్నాడు బమ్మెర పోతన. లక్ష్మి, పార్వతి, సరస్వతి– ముగ్గురు అమ్మలు. ఈ ముగ్గురు అమ్మలను కన్నది ఆదిపరాశక్తి దుర్గ. దేవతల తల్లి అదితి. రాక్షసుల తల్లి దితి. ఆ దితికి కడుపు కోత కలిగించిన తల్లి. అంటే రాక్షసులను సర్వనాశనం చేసిన తల్లి. తనను నమ్మే దేవతల మనసులో కొలువై ఉండే తల్లి. అలాంటి తల్లి నాకు గొప్ప పటుత్వం ఉన్న కవిత్వం ప్రసాదించుగాక.

ఇది పైకి ధ్వనించే అర్థం. ఇంతకుమించి ఇందులో ఇంకా లోతయిన అర్థం ఉంది. పద్యం మొదట ఉన్న అమ్మలగన్న అమ్మ... ముగ్గురమ్మలను మహత్వ, కవిత్వ, పటుత్వ, సంపదలను క్రమాలంకారంలో అన్వయించుకుంటే–

మహత్వం – ఓం,
కవిత్వం– ఐం,
వశిత్వం– క్లీం
పటుత్వం– హ్రీమ్,
సంపద– శ్రీమ్

అవుతుంది. బీజాక్షరాలను ఎలాపడితే అలా, ఎక్కడ పడితే అక్కడ చెప్పకూడదు కాబట్టి– వాటి సంకేతాలను పోతన ఈ రూపంలో ఆవిష్కరించాడు. 'చాల పెద్ద' అద్భుతమయిన ప్రయోగం. సంస్కృతంలో 'మహా శక్తి' అన్న మాటకు తెలుగు అనువాదం.

దురితాలను పోగొట్టేది; దుర్గంలా మన చుట్టూ రక్షణకవచంలా నిలబడేది దుర్గ. మనలో, మన చుట్టూ ఉండి నడిపించే శక్తిని కాళిదాసు దర్శించినట్లు మనం కూడా సర్వవిశ్వాత్మికగా దర్శించగలిగితే మనకు కూడా దుర్గ కట్టని కోటగా నిలబడి రక్షణనిస్తుంది.

– పమిడికాల్వ మధుసూదన్
సీనియర్ పాత్రికేయులు

● దసరా స్పెషల్

వంటిల్లు

అమ్మవారికి ఆరోగ్య నైవేద్యాలు

నవరాత్రులు పూర్తయ్యాయి.
ఈ రోజే దసరా పండుగ.
అమ్మవారికి ప్రసాదాలు ఏం వండాలి?
ఆరోగ్యంగా రుచిగా సులువుగా ఉండాలి.
ముందురోజు నానబోసే శనగ గుగ్గిళ్ల బదులు...
అప్పటికప్పుడు స్వీట్ కార్న్ సుండలు చేయండి.
చిటికెలో పూర్తయ్యే రవ్వ పొంగలి వండండి.
తీపి లేకపోతే పండుగ ఫీల్ రాదంటే
పాలపాయసం ఉంది.



స్వీట్ కార్న్ సుండలు

కావలసినవి: స్వీట్ కార్న్ – 2 కప్పులు; పచ్చి కొబ్బరి తురుము – 4 టేబుల్ స్పూన్‌లు; నెయ్యి – టేబుల్ స్పూన్; ఆవాలు – టీ స్పూన్; మినపప్పు – టీ స్పూన్; ఎండుమిర్చి – 2; పచ్చిమిర్చి – 2 (తరగాలి); ఇంగువ – చిటికెడు; కరివేపాకు – 8 రెమ్మలు; ఉప్పు – అర టీ స్పూన్ లేదా రుచినిబట్టి;

తయారీ: ● స్వీట్ కార్న్ గింజలను కడిగి ప్రెషర్ కుకర్‌లో వేసి టేబుల్ స్పూన్ నీటిని చిలకరించి మూడు విజిల్స్ వచ్చే వరకు ఉడికించి దించేయాలి. ప్రెషర్ తగ్గిన తర్వాత మూత తీసి వడపోసి పక్కన పెట్టాలి. ● బాణలిలో నెయ్యి వేడి చేసి ఆవాలు, ఎండుమిర్చి, మినపప్పు, పచ్చిమిర్చి వేసి వేయించాలి. ఇవన్నీ వేగిన తర్వాత కరివేపాకు, ఇంగువ, పచ్చికొబ్బరి తురుము వేసి బాగా కలపాలి. పోపు దినుసులు కొబ్బరికి సమంగా పట్టిన తర్వాత స్వీట్ కార్న్ గింజలు, ఉప్పు వేసి కలిపి చిన్న మంట మీద రెండు నిమిషాల సేపు ఉంచి, మరోసారి బాగా కలిపి దించేయాలి.

పాలపాయసం

కావలసినవి: బియ్యం– కప్పు; వెన్న తీయని పాలు – లీటరు; చక్కెర – ఒకటిన్నర కప్పు; నెయ్యి– టేబుల్‌స్పూన్; యాలకులపొడి– అర టీ స్పూన్; కుంకుమ పువ్వు – పది రేకలు.

తయారీ: ● బియ్యం కడిగి నీరంతా పోయేటట్లు చిల్లుల పాత్రలో వేసి ఉంచాలి. ● ఒక పాత్రలో పాలను మరిగించి పక్కన పెట్టాలి. ● పెద్ద పాత్ర పెట్టి అందులో నెయ్యి వేడి చేసి అందులో బియ్యం వేసి సన్నమంట మీద వేయించాలి. బియ్యం ఒక మోస్తరుగా వేగిన తరవాత అందులో పాలను పోసి కలిపి ఉడికించాలి. సగం ఉడికిన మంట తగ్గించాలి.● బియ్యం మొత్తగా ఉడికిన తరవాత అందులో చక్కెర, యాలకుల పొడి వేసి కలిపి మరికొంత సేపు ఉడకనివ్వాలి. చక్కెర కరిగి తిరిగి మిశ్రమం చిక్కబడిన తర్వాత దించే ముందు కుంకుమ పువ్వు రేకలు వేయాలి. పాల పాయసాన్ని గరిట జారుడుగా ఉండగానే దించేయాలి, పొంగలి వండినట్లు తేమ ఇంకిపోయే వరకు ఉడికించకూడదు.





గోధుమ రవ్వ పొంగలి

కావలసినవి: గోధుమరవ్వ – 150 గ్రాములు; పెసరపప్పు – 100 గ్రాములు; నెయ్యి– 4 టేబుల్ స్పూన్‌లు; జీలకర్ర – టీ స్పూన్; మిరియాలు లేదా మిరియాలపొడి – టీ స్పూన్; అల్లం తురుము – టీ స్పూన్; ఇంగువ – చిటికెడు; జీడిపప్పు– 15; కరివేపాకు – 2 రెమ్మలు; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి; నీరు – అర లీటరు.

తయారీ: ● మందపాటి బాణలిలో పెసరపప్పును దోరగా వేయించాలి. చల్లారిన తర్వాత కడిగి ప్రెషర్ కుకర్‌లో వేసి పప్పు మునిగేవరకు నీటిని పోసి నాలుగు విజిల్స్ వచ్చే వరకు ఉడికించాలి. చల్లారిన తర్వాత మెదిపి పక్కన పెట్టాలి. ● అదే పెనంలో గోధుమపిండి వేసి దోరగా వేయించి పక్కన పెట్టాలి. ● బాణలిలో నెయ్యి వేడి చేసి జీడిపప్పు, జీలకర్ర, మిరియాలు, పచ్చిమిర్చి, అల్లం, కరివేపాకు, ఇంగువ వేసి వేగిన తర్వాత అందులో మిగిలిన నీటిని పోయాలి. ● నీరు మరగడం మొదలైన తర్వాత ఉప్పు వేసి కలిపి అందులో రవ్వను వేయాలి. రవ్వ ఉండలు కట్టకుండా ఉండడానికి నీటిలో వేస్తున్న సేపు గరిటతో కలుపుతూ ఉండాలి. ● రవ్వ ఉడికి దగ్గరవుతున్న సమయంలో ముందుగా ఉడికించి, మెదిపి పక్కన పెట్టిన పెసరపప్పు వేసి కలిపితే రవ్వ పొంగలి రెడీ.

లైవ్ దుర్గ



దసరా ఉత్సవాల్లో మండపాలలో దుర్గామాత విగ్రహాలు కనిపించడం సాధారణ దృశ్యమే. అయితే కోల్‌కత్తాలలో బ్రహ్మ కుమారీస్ నిర్వహించే 'లైవ్ దుర్గా ఉత్సవ్'లో 30 ఏళ్లు దాటిన మహిళలు కొన్ని గంటల పాటు కదలకుండా విగ్రహాల్లా కూర్చుంటారు!

'జీవకళ ఉట్టిపడుతుంది' అనుకునే వాళ్లకు దగ్గరకు వచ్చి చూస్తేగానీ అసలు విషయం తెలియదు.

'ఇది సహనానికి పరీక్ష. కదలకుండా కూర్చోవడం అనేది అంత తేలికైన విషయం కాదు. పెద్ద సవాలు. ఈ సవాలు కోసం ప్రతి సంవత్సరం ఇష్టంగా ఎదురు చూస్తుంటాను' అంటుంది 32 ఏళ్ల సులేఖ.

గత పదిహేను సంవత్సరాలుగా లక్ష్మి, సరస్వతితో సహా వివిధ దేవతల రూపంలో మండపంలో కూర్చుంటూ ఉంది సులేఖ. సందర్శకులు నాణేలు, పువ్వులు వేదికపై విసురుతుంటారు.

'ఒక్కో దేవతకు ఒక్కో రకమైన ముఖకవళికలు ఉండాలి. దుర్గ ముఖంలో కోపం, శక్తి, ప్రశాంతత మిళితమై ఉంటాయి. నేను వేదికపై ధ్యానముద్రలో ఉంటాను కాబట్టి ఏ విషయంపైనా నా దృష్టి మళ్లదు' అంటుంది 'లైవ్ దుర్గా'గా పేరుగాంచిన సులేఖ.

ఖాన్‌లు చేస్తున్న రావణ బొమ్మ



ఉత్తరప్రదేశ్ రాంపూర్‌లోని ఒక ముస్లిం కుటుంబానికి దసరా వస్తుందంటే చాలు... చేతి నిండా పని ఉంటుంది. తరతరాలుగా ఈ కుటుంబం దసరాకు రావణాసురుడి దిష్టి బొమ్మలను తయారు చేస్తోంది. ఈ ఏడాది ప్రత్యేకత విషయానికి వస్తే 80 అడుగుల ఎత్తులో రావణాసురుడి దిష్టి బొమ్మను తయారుచేశారు.

'తాతముత్తాతల కాలం నుంచి ఈ పనిలో ఉన్నాం. మా తాత చేసిన పనిని మా నాన్న చేశాడు. నాన్న చేసిన పనిని నేను చేస్తున్నాను. నేను చేసిన పనిని పిల్లలు చేస్తున్నారు. ఈ పనివల్ల పెద్దగా డబ్బు సంపాదించకపోయినా మా తాతలు చేసిన పనిని మేము కొనసాగించడం సంతృప్తిగా, సంతోషంగా ఉంది' అంటున్నాడు ముంతాజ్ ఖాన్.

ఖాన్ కుటుంబం తయారు చేసిన దిష్టి బొమ్మల కోసం మొరాదాబాద్, ఫతేపూర్, హాపూర్...లాంటి ప్రాంతాల నుంచి వస్తుంటారు. ఈ సంవత్సరం హరియాణా, పంజాబ్‌ల నుంచి కూడా దిష్టి బొమ్మల కోసం ఆర్డర్లు వస్తున్నాయి

'దిష్టిబొమ్మల తయారీలో మేము ఉపయోగించే గన్ పౌడర్ ప్రభుత్వ నిబంధనల ప్రకారం కాలుష్య రహితంగా ఉంటుంది. పెద్ద అధికారులు ఈ దిష్టిబొమ్మలను తనిఖీ చేసిన తరువాతే విక్రయిస్తాం' అంటున్నాడు ఖాన్.

రావణుడి దిష్టి బొమ్మలను తయారు చేయడం అనేది ఒక ముస్లిం కుటుంబం చేసే పని అనుకోవడం కంటే మన దేశంలో మత సామరస్యానికి ఉదాహరణ అని సగర్వంగా చెప్పుకునే పని.

లేవద్దు.. ఇది నీ సింహాసనం!

ఈ ఫొటోలో కూర్చుని ఉన్న అమ్మాయి జోయా అగర్వాల్. ఎయిర్ ఇండియా కెప్టెన్. ఆమె పక్కనే నిలబడి ఉన్నది రతన్ టాటా. న్యూయార్క్ నుండి ఢిల్లీ వస్తున్న బోయింగ్ 777 విమానాన్ని అప్పుడు ఆమె నడుపుతున్నారు. అదే ఫ్లయిట్ లో రతన్ టాటా ఉన్నారు. ఫ్లయిట్ ఢిల్లీ లో దిగగానే ఆయనతో ఒక ఫొటో కావాలని అడిగారు జోయా. ఆయన అంగీకరించారు. ఫొటో కోసం ఆమె లేవబోతుంటే ఆయన వారించారు. 'ఇది నీ సింహాసనం కెప్టెన్. నువ్వు సంపాదించుకున్నది' అని అన్నారు. అలా ఆమె కూర్చొని ఉండగా, ఆమె పక్కన ఆయన నిలబడి ఉన్నప్పుడు తీసిన ఫొటో ఇది. ఈ అపురూపమైన జ్ఞాపకాన్ని జోయా ట్విట్టర్ లో షేర్ చేసుకున్నారు. ఆ సంఘటన తనను ఎలా ఇన్స్పైర్ చేసిందో రాశారు.



రతన్ టాటా, జోయా అగర్వాల్

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 -(30). RNI Reg No. TELTEL/2008/23482.


LG
Life's Good.
LG OLED DAYS
This Dussehra, enjoy limited period offers* on LG OLED TVs.
LG OLED evo AI
WORLD'S No. 1 OLED TV FOR 11 YEARS
webOS Re:New Program
5-YEAR GUARANTEED
New Smart Platform Experience*
India ka Celebration
Widest Range of LG AI TVs
LG OLED evo AI | G4/C4 Series
246cm (97) / 195cm (77) / 164cm (65) / 139cm (55) 121cm (48) / 106cm (42)
α11 4K AI Processor | Dolby VISION·ATMOS | Brightness Booster Max | 144Hz G-SYNC
Offer Price ₹129990* onwards MRP ₹267990* onwards | EMI ₹2999* onwards
LG OLED AI | B4 Series
164cm (65) / 139cm (55)
α8 4K AI Processor | Dolby VISION·ATMOS | NVIDIA G-SYNC | 120 Hz Refresh Rate
Offer Price ₹119990* onwards MRP ₹193990* onwards | EMI ₹2999* onwards
LG QNED AI | 88T/83 Series
189cm (75) / 164cm (65) / 139cm (55)
α8 4K AI Processor 4K | Quantum Dot NanoCell | Dolby VISION·ATMOS | 120 Hz Refresh Rate
Offer Price ₹79990* onwards MRP ₹159990* onwards | EMI ₹1999* onwards
LG NanoCell AI | 77/80T Series
164cm (65) / 139cm (55) / 108cm (43)
α5 4K Gen7 AI Processor 4K | NanoCell Color Technology | AI Sound Pro | HDR10
Offer Price ₹45990* onwards MRP ₹61990* onwards | EMI ₹999* onwards
Life's Good Offers*
3 YEAR* WARRANTY (With Select LG TVs)
Win Dream Home Package* EVERY DAY
To participate, send an SMS <"First Name" "Last Name" GTM Code> to 7835073507
Grab Assured Gifts* Up to ₹51 CRORES
Up to 26%* CASHBACK Max ₹26000* ON SELECT CREDIT / DEBIT CARDS
1 EMI FREE* (On Select Paper Finance)
FIXED EMI Starting from ₹999*
UP TO 30% OFF ON LG SOUNDBAR* (With Select 4K TVs)
OLED CIRCLE Get benefits up to ₹50000*
LG BEST Care | LG 24 x 7 CUSTOMER CARE 08069379999 www.lg.com/in/support
LG WhatsApp No. 9711709999
LG Service India Mobile App Available at Google Play
www.facebook.com/lgindiapage/
www.twitter.com/LGIndia
To know more about LG, visit www.lg.com/in
For Corporate/Institutional enquiries, please write to corp.enquiries@lge.com
Now shop at LG Brand Store https://qrco.de/bfS3os
LG Greencycle
Regd. Office: LG Electronics India Pvt. Ltd., A-24/6, Mohan Cooperative Industrial Estate, Mathura Road, New Delhi-110044
CIN No. U32107DL1997PTC220109
AMERICAN EXPRESS
AXIS BANK
BOBCARD
FEDERAL BANK
HDFC BANK
ICICI Bank
IDFC FIRST Bank
IndusInd Bank
J&K Bank
RBL BANK
SBI card
Contact your nearest LG Authorised Dealer.

సాక్షి ప్లస్
శనివారం । 12-10-2024


నంది విగ్రహం


కొత్తగా నిర్మిస్తున్న లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయం

చెన్నకేశవస్వామి ఆలయం..

గ్రామంలో దక్షిణం వైపు ఈ ఆలయం ఉంది. శ్రీదేవి, భూదేవిలతో స్వామివారు కొలువై ఉన్నారు. ప్రస్తుతం ఈ ఆలయం పూర్తిగా నిర్వీర్యం కావడంతో తిరిగి నిర్మిస్తున్నారు.

గోన గన్నారెడ్డి ఇలాకా.. వర్ధమానపురం

- కాలక్రమేణా నందివడ్డెమాన్‌గా మార్పు
- దాదాపు 2వేల ఏళ్ల చరిత్ర గల ప్రాంతం
- 4 శతాబ్దాలు పాలించిన గోన వంశీయులు
- నేటికీ సజీవంగా చారిత్రక ఆనవాళ్లు


వీరభద్ర స్వామి విగ్రహం

నాగర్‌కర్నూల్:

'కాకతీయుల చరిత్రగా పిలిచే వర్ధమానపురమే నేటి నందివడ్డెమాన్ గ్రామం. తెలంగాణలో వర్ధమానపురానికి 2 వేల ఏళ్ల ఘనమైన చరిత్ర ఉంది. క్రీస్తుశకం 8 నుంచి 12వ శతాబ్దం వరకు వర్ధమానపురాన్ని రాజధానిగా చేసుకుని 400 ఏళ్ల పాటు ఈ ప్రాంతాన్ని కాకతీయ సామంతరాజులు పరిపాలించినట్లు చారిత్రక సాక్ష్యాలు చెబుతున్నాయి. గ్రామంలో నేటికీ కనిపించే ఆలయాలు, కోటగోడలు, శాసనాలే ఇందుకు నిదర్శనం.

నందివడ్డెమాన్‌గా ఎలా మారిందంటే..

క్రీస్తు పూర్వం 6వ శతాబ్దంలో ఆవిర్భవించిన జైనమతం నాటి ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశించిందని సాహిత్యపరంగా పురావస్తు శాఖ ద్వారా తెలుస్తోంది. నాటి జైనమత ప్రచారకుల్లో కొందరు సన్యాసులు ఈ ప్రాంతాన్ని సందర్శించారు. వారి ప్రభావం వల్ల జైనమత తీర్థంకరుల్లో 24వ వాడైన వర్ధమాన మహావీరుడి పేరుమీద ఈ గ్రామానికి వర్ధమానపురం పేరు వచ్చింది. గ్రామం వెలుపల నంది విగ్రహం ఉండడంతో నందివర్ధమానపురంగా పేరొందింది. ఇది కాలక్రమేణా నందివడ్డెమాన్‌గా మారింది.

1100 గ్రామాలతో పాలన..

ఉదయచోళుడు 8వ శతాబ్దంలో వర్ధమానపురాన్ని రాజధానిగా చేసుకుని 1100 గ్రామాలతో కందూరు నుంచి నేలకొండపల్లి (ఖమ్మం జిల్లా) విస్తరించిన రాజ్యాన్ని పరిపాలించినట్లు చరిత్రకారులు చెబుతారు. కాకతీయ సామ్రాజ్యంలో సామంతుడిగా ఉన్న ఆయన.. తరువాత తనను స్వతంత్రుడిగా ప్రకటించుకున్నాడు. దీంతో కాకతీయ మహారాజు గణపతిదేవుడు వీరుడైన గోన బుద్దారెడ్డి సహకారంతో ఉదయచోళుడిని ఓడించి తిరిగి వర్ధమానపురాన్ని స్వాధీనం చేసుకున్నారు. తరువాత గోన బుద్దారెడ్డినే సామంత రాజుగా ప్రకటించి పట్టాభిషేకం చేశారు. గోన బుద్దారెడ్డి మరణానంతరం ఆయన ముగ్గురు కుమారుల్లో ఒకడైన గోన గన్నారెడ్డి ఈ రాజ్యం పగ్గాలు చేపట్టారు.


వర్ధమానపుర చరిత్రను తెలిపే శిలాశాసనాలు

గుణశేఖర్ సినిమాలో..

2015లో గుణశేఖర్ దర్శకత్వంలో వచ్చిన రుద్రమదేవి సినిమాలో 'నేను తెలుగుభాష లెక్క.. ఆడా ఉంటా.. ఈడా ఉంటా', 'గమ్మునుండవోయ్'అంటూ తెలంగాణ యాసలో ఆకట్టుకునే డైలాగులతో అల్లు అర్జున్ చేసిన పాత్ర గోన గన్నారెడ్డిదే. గోన బుద్దారెడ్డి తరువాత వర్ధమానపురం రాజ్యం పగ్గాలు చేపట్టిన గోన గన్నారెడ్డి రుద్రమదేవికి కుడిభుజంగా ఉండి సమస్త కాకతీయ రాజ్యాలను రక్షించిన యోధుడిగా చెప్పుకుంటారు. ఆయన అశ్వ శిక్షణలో, గుర్రపు స్వారీలో, కత్తి యుద్ధంలో కాకతీయ రాజుల సామంతులలో ఎవరూ సాటి వచ్చేవారు కాదని చెప్పుకొంటారు. కాకతీయ సామ్రాజ్యంపైకి ఎవరైనా శత్రువులు వస్తే.. తన సైన్యంతో గుట్టుగా మాటు వేసి దాడులు చేసేవారని, ఇందుకోసం ప్రత్యేకంగా సొరంగ మార్గాలు కూడా ఉండేవని చరిత్రకారులు చెబుతారు.

'రంగనాథ రామాయణం'ఆవిష్కరణ

గోన బుద్దారెడ్డి మంచి సాహిత్యకారుడిగా పేరుపొందారు. వాల్మీకి రామాయణాన్ని అనుసరించి బుద్దారెడ్డి రంగనాథ రామాయణం పేరుతో తొలి ద్విపద కావ్యాన్ని రచించారు. యుద్ధకాండ వరకు బుద్దారెడ్డి రచించగా ఆయన కుమారులు మిగిలిన భాగాన్ని పూర్తి చేశారు. వాల్మీకి రచించిన రామాయణంలో లేని కొన్ని సంఘటనలు కూడా ఇందులో పొందుపరిచారు. గోన గన్నారెడ్డి సైతం వర్ధమానపురాన్ని పరిపాలించే సమయంలో రాజ్యానికి 12 కిలోమీటర్ల దూరంలో అరణ్యంలో ఓ ఆశ్రమం ఏర్పాటు చేసుకుని సాహిత్య కార్యక్రమాలు నిర్వహించేవారు. ఈ ప్రాంతాన్ని నాడు బుద్ధవరంగా.. ప్రస్తుతం బుద్దారంగా పిలుస్తారు. నంది వర్ధమానపురాన్ని పరిపాలించిన కాకతీయులు, గోన వంశీయులు దైవభక్తిపరులు, దీనికి నిదర్శనం గ్రామంలో నేటికీ చెక్కుచెదరని ఆలయాలే. ఇక్కడ తొమ్మిది ప్రధానాలయాలున్నాయి. వర్ధమానపురం సామ్రాజ్యానికి సంబంధించిన శిలాశాసనాలు నేటికీ అక్కడ దర్శనమిస్తాయి. కాకతీయ చక్రవర్తి గణపతి దేవుడి కాలం 24-1-1229 నాటి శిలాశాసనాలు కూడా ఉన్నాయి. పలు ఆలయాల్లో శిలాశాసనాలు, రాజ్యం చుట్టూ నిర్మించిన కోటగోడలు కూడా కనిపిస్తాయి.

పర్యాటక కేంద్రంగా గుర్తించాలి



వేల ఏళ్ల చరిత్ర కలిగిన నంది వడ్డెమాన్‌ను పర్యాటక కేంద్రంగా గుర్తించాలి. నంది వడ్డెమన్‌కు ఉన్న చరిత్రను భవిష్యత్ తరాలకు అందరికీ తెలిసేలా చేయాలి. మా వంతుగా ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నాం. నందివడ్డెమాన్ చరిత్ర అందరికీ తెలిసేలా పర్యాటక ప్రాంతంగా గుర్తించాలి.

\- వంగ సుదర్శన్‌గౌడ్, మాజీ సర్పంచ్


పూర్వవైభవం తేవాలి..



గతంలో నేచర్ అండ్ ఇండియన్ కల్చర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆలయాల చుట్టూ శుభ్రం చేశారు. ఈ కార్యక్రమానికి అన్ని యువజన సంఘాలు, యువకులు సహకరించారు. ఆలయాలకు పూర్వవైభవం తీసుకొచ్చేందుకు, దేవతలను ప్రతిష్ఠించేందుకు, ప్రతి ఒక్కరూ కృషి చేస్తున్నారు.

\- భూపతి, గ్రామస్తుడు

ప్రధాన ఆలయాలివి..



కాళికామాత ఆలయం..

గ్రామ చెరువు భీమ సముద్రం కట్టకు దగ్గరలో కాళికామాత దేవాలయం ఉంది. అత్యంత జీవకళ ఉట్టిపడేలా ఉండే ఈ దేవాలయంలో విగ్రహాలు రజాకార్ల కాలంలో ధ్వంసమైనట్లు చెబుతుంటారు. ఎన్నో కళాఖండాలతో నగిషీలతో దేవాలయం అద్భుతంగా ఉంటుంది.

శివగౌరమ్మ ఆలయం..



తూర్పు దిక్కున శివుడు, దొంతుల గౌరమ్మ, పంచ గౌరమ్మ ఆలయాలున్నాయి. ఆలయం ముందున్న విఘ్నేశ్వరుడి విగ్రహం అద్భుత కళా నైపుణ్యంతో చెక్కబడి కనిపిస్తుంది.




త్రిమూర్తుల ఆలయం..

ఆగ్నేయ దిశలో అరుదుగా ఉండే త్రిమూర్తులు బ్రహ్మ, విష్ణు, మహేశ్వర ఆలయాలున్నాయి. ఈ దేవాలయాలు ఎత్తుగా ఉండి నిర్మాణ శైలి అలంపూర్‌లోని ఆలయాలను పోలి ఉంటాయి. ఈ దేవాలయం నుంచి గుడిపల్లి గట్టు వరకు సొరంగ మార్గం ఉన్నట్లు చెబుతుంటారు. విగ్రహాలను దుండగులు అపహరించుకుపోవడంతో ఆలయాలు మాత్రమే దర్శనమిస్తాయి.



వీరభద్రాలయం..

పడమర దిక్కున వీరభద్రస్వామి, శివుడు ఆలయాలు ఉన్నాయి. నిలువెత్తు వీరభద్రస్వామి విగ్రహం గాంభీర్యంతో కత్తి ధరించి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.



నందీశ్వర, శనైశ్వర ఆలయం..

ప్రధానంగా శివుడు, పార్వతి, ప్రత్యేక ఆకర్షణగా నంది విగ్రహాలుంటాయి. నంది విగ్రహం అద్భుత కళానైపుణంతో చెక్కి ఉంటుంది. ఇది శ్రీశైలంలోని ప్రధాన నందిని పోలి ఉంటుంది. దీనికి సమీపంలో శనేశ్వరస్వామి ఆలయం ఉంది. ఎంతో విశిష్టత కలిగిన ఈ ఆలయానికి ప్రతి శని త్రయోదశి రోజు వేల సంఖ్యలో భక్తులు వస్తారు.



రాజ్‌భవన్‌లో వాహన, ఆయుధపూజలు

గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ శుక్రవారం రాజ్‌భవన్‌లో ఆయుధ, వాహన పూజలు నిర్వహించారు. రాజ్‌భవన్ ఆవరణలో గల ఆలయంలో ఈ ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ అందరికీ పేరుపేరునా దసరా శుభాకాంక్షలు తెలిపారు. గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ బి.వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

రద్దీ.. ఖాళీ





దసరా వేళ నగరంలో కనిపించిన భిన్న దృశ్యాలివి. పండుగకు ఊరెళ్లే వారితో బస్సు, రైల్వేస్టేషన్లు కిటకిటలాడగా.. మరోపక్క నగరం ఊరెళ్లిందా అన్నట్టు రహదారులన్నీ బోసిపోయి కనిపించాయి.

యాసంగికీ బేఫికర్

- నిండుకుండలా శ్రీరాంసాగర్ జలాశయం
- ఇప్పటికీ ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో
- ఈ సీజన్‌లో ఇప్పటివరకు ఎగువ నుంచి 245 టీఎంసీల ఇన్‌ఫ్లో
- అవుట్‌ఫ్లో 171 టీఎంసీలు


శ్రీరాంసాగర్ జలాశయం

ఉత్తర తెలంగాణ వరప్రదాయినిగా గుర్తింపు పొందిన శ్రీరాంసాగర్ జలాశయం వచ్చే యాసంగి పంటకు సైతం భరోసా ఇస్తోంది. ఈ ఏడాది ఎస్సారెస్పీలోకి ఎగువ నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరడంతో అనుకున్న సమయానికే నిండింది. ఇప్పటివరకు ఎగువ ప్రాంతం నుంచి వచ్చిన వరద కారణంగా జలాశయంలోకి ఈ సీజన్‌లో మొత్తం 245 టీఎంసీల నీరు వచ్చింది. దిగువ గోదావరిలోకి, కెనాల్స్ ద్వారా మొత్తం 171 టీఎంసీలు బయటకు వెళ్లింది. ఇప్పటికీ జలాశయం నిండుకుండలా ఉంది. దీంతో విడతలవారీగా నీటిని అధికారులు దిగువకు వదులుతున్నారు. ఈ క్రమంలో ప్రస్తుత సీజన్ వానాకాలం పంటకు సమృద్ధిగా నీటిని వదిలారు. అయినా పూర్తి స్థాయి నీటిమట్టంతో జలాశయం.. వచ్చే యాసంగి పంటకు సైతం సరిపడా నీటిని అందించే స్థితిలో ఉంది. యాసంగికి నీరు వదిలినప్పటికీ.. ఇంకా మిగులు జలాలుండే పరిస్థితి ఉంది.

\- సాక్షి ప్రతినిధి, నిజామాబాద్

ఈ నెల 28 వరకు ఎగువ మహారాష్ట్ర నుంచి వరద..

సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఎగువ మహారాష్ట్రలోని బాబ్లీ బ్యారేజ్ గేట్లను ఈ నెల 28న మూసివేయనున్నారు. అప్పటివరకు శ్రీరాంసాగర్ జలాశయంలోకి వరద కొనసాగుతుంది. జలాశయం నుంచి వచ్చే నవంబర్ రెండోవారం వరకు వానాకాలం పంటకు నీటిని విడుదల చేయనున్నారు. అయినా జలాశయంలో 70 టీఎంసీల మేర నీటి నిల్వ ఉంటుంది. దీంతో యాసంగి పంటకు ఢోకా లేకుండా పోయింది. ఎస్సారెస్పీ కింద ఉన్న ఉమ్మడి కరీంగనర్, వరంగల్, నల్లగొండ, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో 18 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ ఆయకట్టుకు ఒక పంటకు నీరివ్వాలంటే 56 టీఎంసీల నీరు జలాశయంలో ఉండాలి. ఈ నేపథ్యంలో రెండో పంటకు బేఫికర్ అయింది. ఎస్సారెస్పీలోకి ప్రస్తుతం 12వేల క్యూసెక్కుల వరద నీరు ఎగువ నుంచి వస్తోంది. జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 1,091 అడుగులు, 80.5 టీఎంసీలు. ప్రస్తుతం పూర్తిస్థాయి నీటిమట్టంతో ఉంది. డిసెంబర్ రెండో వారం నుంచి యాసంగి పంటకు నీటి విడుదల మొదలవు తుంది. వారబందీ ప్రకారం నీటి విడుదల చేస్తారు.

మొత్తం 245 టీఎంసీల నీరు రాక..

శ్రీరాంసాగర్ జలాశయంలోకి ఇప్పటివరకు ఈ సీజన్‌లో మొత్తం 245 టీఎంసీల నీరు రాగా, 171 టీఎంసీలు బయటకు వెళ్లింది. వరద గేట్ల ద్వారా దిగువ గోదావరిలోకి 96.25 టీఎంసీలు, ఎస్కేప్ గేట్ల ద్వారా గోదావరిలోకి 4.90 టీఎంసీలు, వరద కాలువ ద్వారా 34.2 టీఎంసీలు, కాకతీయ కాలువ ద్వారా 25.50 టీఎంసీలు, సరస్వతి కాలువ ద్వారా 1.44 టీఎంసీలు, లక్ష్మి కాలువ ద్వారా 0.46 టీఎంసీలు, మిషన్ భగీరథకు 2.63 టీఎంసీలు వదిలారు. ఆవిరి రూపంలో 5.08 టీఎంసీల నీరు ఖర్చయింది. ఎస్సారెస్పీలోకి జూన్ నెలలో ఎగువ నుంచి 3.99 టీఎంసీలు, జూలైలో 27.25 టీఎంసీలు, ఆగస్టులో 33.48 టీఎంసీలు, సెప్టెంబర్‌లో 154.43 టీఎంసీలు, అక్టోబర్‌లో 24.71 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది.


శ్రీరాంసాగర్ కెనాల్

క్లుప్తంగా...

భార్యను కిడ్నాప్ చేశారని ఫిర్యాదు

వెంకటగిరి రూరల్: తన భార్యను గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కిడ్నాప్ చేశాడంటూ దట్టం గురవయ్య అనే వ్యక్తి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. తిరుపతి జిల్లా వెంకటగిరి రూరల్ మండలం, చిన్నన్నపేటకు చెందిన దట్టం గురవయ్య, తిరుమలమ్మ(30) భార్యాభర్తలు. వీరికి ముగ్గురు పిల్లలు. వీరు వెంకటగిరి పట్టణంలోని ఓ కాంప్లెక్స్‌లో అద్దె ఇంట్లో ఉంటున్నారు. ఈనెల ఒకటో తేదీన కూలి పనులకు వెళ్లిన తిరుమలమ్మ తిరిగి ఇంటికి రాలేదని, వారంరోజులపాటు వెదికినా ఫలితం లేదని గురవయ్య ఫిర్యాదులో పేర్కొన్నాడు. అదే గ్రామానికి చెందిన పుట్ట గురవయ్య తన భార్యతో సన్నిహితంగా ఉండేవాడని, అతనే తన భార్యను కిడ్నాప్ చేసి ఉంటాడని అనుమానం వ్యక్తం చేశాడు. అంతేగాక గురవయ్య పార్లపల్లి గ్రామానికి చెందిన మరికొందరితో కలిసి మహిళలను ట్రాప్ చేస్తున్నట్టు తెలిసిందని పేర్కొన్నాడు.

జాతీయ జెండాకి అవమానంపై వివరాలు సమర్పించండి

మన్యం జిల్లా అధికారులకు హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: పార్వతీపురం మన్యం జిల్లా జీఎల్ పురం గ్రామంలో ఉన్న కురుపాం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఈ ఏడాది ఆగస్టు 15న జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ఉద్దేశపూర్వకంగా జాతీయ జెండాను అవమానించారని, ఇందుకు గాను ఆమెపై తగిన చర్యలు తీసుకోవాలంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. జగదీశ్వరిపై తామిచ్చిన ఫిర్యాదు మేరకు చర్యలు తీసుకునేలా జిల్లా అధికారులను ఆదేశించాలని కోరుతూ సాలూరు మండలానికి చెందిన డిప్పాల పాత్తయ్య, ముచ్చల పుష్పారావు, రాయగడ సుదర్శన రాయుడు ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై ఇటీవల న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప విచారణ జరిపారు. ప్రభుత్వ సహాయ న్యాయవాది స్పందిస్తూ, ఈ వ్యాజ్యంలో పూర్తి వివరాలు కోర్టు ముందుంచేందుకు గడువు కావాలని కోరారు. ఇందుకు న్యాయమూర్తి అంగీకరిస్తూ పూర్తి వివరాల సమర్పణ నిమిత్తం విచారణను దసరా సెలవుల తరువాతకు వాయిదా వేశారు.

కత్తులతో టీడీపీ నేతల స్వైర విహారం

సాక్షి టాస్క్‌ఫోర్సు : చిత్తూరు జిల్లా చౌడేపల్లె మండలంలో శుక్రవారం టీడీపీ నేతలు కత్తులు పట్టుకుని గ్రామంలో స్వైర విహారం చేశారు. దాదేపల్లెకు చెందిన ఆ పార్టీ నేతలు ఎస్ఎండీ ఘని, ఫరీద్‌ఖాన్, నసీబ్‌ఖాన్, సయ్యద్‌ఖాన్, నదీం, నవాజ్‌ఖాన్, సిద్దిక్, జబీవుల్లా, సయ్యద్‌ఖాన్‌లతో పాటు మరికొందరు కలిసి కత్తులు తీసుకుని గ్రామంలో వీరంగం సృష్టించారు. అంతటితో ఆగకుండా మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జన్మదినం సందర్భంగా అభిమానులు ఏర్పాటు చేసిన బ్యానర్లను కోసి వేస్తూ.. బ్యానర్లు కట్టిన కట్టెలను నరికేస్తూ గ్రామంలో భయానక వాతావరణం సృష్టించారు. ఇదేంటని అడిగిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను నరికేస్తాం.. చంపేస్తాం.. అంటూ కత్తులు చూపుతూ బెదిరింపులకు దిగారు. దీనిపై వైఎస్సార్‌సీపీ నేతలు సనావుల్లా, షేర్‌ఖాన్, చిన్నరెడ్డిబాషా, మహమ్మదాలి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నాణ్యమైన మద్యం తాగితే అనారోగ్య సమస్యలు రావా?

సింగరాయకొండ: టీడీపీ కూటమి ప్రభుత్వం నాణ్యమైన మద్యం ఇస్తామని చెబుతోందని, ఈ మద్యం తాగితే అనారోగ్య సమస్యలు రావా? అని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ప్రశ్నించారు. ప్రకాశం జిల్లా జరుగుమల్లి మండలంలో పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు శుక్రవారం ఆయన వావిలేటిపాడు గ్రామం వచ్చిన సందర్భంగా విలేకరులతో మద్యం టెండర్లపై మాట్లాడారు. రాష్ట్రంలో మద్యం టెండర్ల ద్వారా టీడీపీ నాయకుల అరాచకపాలన బట్టబయలైందన్నారు. మద్యం టెండర్ల విషయంలో ప్రతి ఎమ్మెల్యే వీధి రౌడీలా మారి తాము చెప్పిన వారే టెండర్లు వేయాలని, ఒక వేళ వేసినా షాపు నిర్వహించకుండా అడ్డుకుంటామని, షాపు మాకు అప్పగించాల్సిందే.. అని బెదిరిస్తున్నారన్నారు.

అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌పై జానీమాస్టర్ బంధువు ఫిర్యాదు

నెల్లూరు (క్రైమ్): కొరియోగ్రాఫర్ జానీమాస్టర్ వ్యవహారంలో మరో ట్విస్ట్ వెలుగులోకి వచ్చింది. జానీమాస్టర్ కేసులో బాధితురాలైన అసిస్టెంట్ కొరియోగ్రాఫర్ తనను లైంగికంగా వేధిస్తోందని ఓ యువకుడు శుక్రవారం శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా నగరంలోని సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సేకరించిన సమాచారం మేరకు.. రంగనాయకుల పేటకు చెందిన సమీర్ ప్రస్తుతం బీటెక్ చదువుతున్నాడు. అతను కొరియోగ్రాఫర్ జానీమాస్టర్ మేనమామ కుమారుడు. సమీర్ ఎక్కువగా హైదరాబాద్‌లో జానీమాస్టర్ వద్ద ఉండేవాడు. ఈ క్రమంలో అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌గా పని చేస్తున్న యువతితో అతనికి పరిచయం అయింది. ఆమె 2020 నుంచి తనను తరచూ లైంగిక వేధింపులకు గురిచేసిందని సమీర్ ఆరోపించారు. ఆమెపై చర్యలు తీసుకోవాలని సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇప్పటికే సదరు యువతి జానీమాస్టర్‌పై లైంగిక వేధింపుల కేసు పెట్టడం, అతన్ని పోలీసులు అరెస్ట్ చేయడంతో జైల్లో రిమాండ్ ఖైదీగా ఉండడం తెలిసిందే.

వీలైతే ఒక టూర్.. కుదిరితే రెండు దేశాలు

భారత్ నుంచి భారీగా పెరుగుతున్న విదేశీ పర్యటనలు





దసరా సెలవులు.. వేసవి విహారం.. ఇలా అకేషన్ ఏదైనా.. లొకేషన్ మార్చాలని ప్రతి భారతీయుడూ భావిస్తున్నాడు. రాబోయే పదేళ్లలో భారత్ అంతర్జాతీయ పర్యాటకంలో ప్రపంచదేశాల్ని వెనక్కి నెట్టి అగ్రభాగాన నిలుస్తుందని ఫిక్కీ–నాంగియా నాలెడ్జ్ పేపర్ 'నేవిగేటింగ్ హారిజన్స్.. ది రైజ్ అండ్ ఫ్యూచర్ ఆఫ్ ఇండియన్ అవుట్‌బౌండ్ టూరిజం' నివేదిక చెబుతోంది. 2034 నాటికి భారత్ అంతర్జాతీయ పర్యాటకం విలువ 5,500 కోట్ల డాలర్లకు చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు. అదేవిధంగా 2027 నాటికి ఇండియన్ ట్రావెల్ మార్కెట్ 12,500 కోట్ల డాలర్లకు చేరుకుంటుందని ఈ నివేదిక స్పష్టం చేసింది. పర్యాటక మార్కెట్ విలువ పెరుగుతున్న నేపథ్యంలో ఈ రంగానికి మరింత ఊపునిచ్చేందుకు కేంద్రం కొన్ని విధానపరమైన మార్పులు తీసుకువచ్చే అవకాశం ఉందని కూడా నివేదిక స్పష్టం చేస్తోంది.

అవుట్ బౌండ్ టూరిజంలో శాసించే స్థాయికి చేరుకుంటున్న భారత్

- 2034 నాటికి 5,500 కోట్ల డాలర్లకు భారత్ విదేశీ పర్యాటక మార్కెట్
- 2027 నాటికి 12,500 కోట్ల డాలర్లకు చేరుకోనున్న ఇండియన్ ట్రావెల్ మార్కెట్

సాక్షి, విశాఖపట్నం: ఆర్థిక ప్రగతిలో పర్యాటకరంగం ప్రాధాన్యత రోజు రోజుకీ పెరుగుతోంది. అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగాల్లో టూరిజం అగ్రస్థానంలో ఉంది. భారీ ఎత్తున ఉపాధి అవకాశాలనూ సృష్టిస్తోంది. దేశీయంగా ఆర్థిక కార్యకలాపాల వృద్ధితో పాటు కీలకమైన విదేశీ మారకద్రవ్య ఆర్జనకు దోహదపడుతోంది. రాబోయే సంవత్సరాల్లో ప్రపంచ పర్యాటకాన్ని శాసించే శక్తిగా భారత్ అవతరించబోతోంది. ప్రతిభారతీయుడూ ఏడాదికోసారైనా వీలైతే ఒక టూర్.. కుదిరితే రెండు దేశాలు.. అన్నట్లు.. పర్యాటక విహారానికి ప్రణమిల్లుతున్నాడు. అందుకే అవుట్‌బౌండ్ టూరిజంలో భారత్ అగ్రగామిగా దూసుకుపోతోంది. ఇండియా నుంచి విదేశీయానం చేసే వారి సంఖ్య పెరుగుతూ వస్తోంది. 2034 నాటికి ఇండియా అవుట్‌బౌండ్ టూరిజం మార్కెట్ 55.39 బిలియన్ డాలర్లకు చేరుకుంటూ.. దేశ ఆర్థిక వ్యవస్థకు గేమ్ చేంజర్‌గా మారనుంది.

2027 నాటికి అవుట్‌బౌండ్ టూరిజం మార్కెట్ ఇలా...

- యూఎస్- 245 బిలియన్ డాలర్లు
- చైనా- 230 బిలియన్ డాలర్లు
- జర్మనీ- 125 బిలియన్ డాలర్లు
- యూకే-105 బిలియన్ డాలర్లు
- భారత్- 89 బిలియన్ డాలర్లు

2027 నాటికి డొమెస్టిక్ టూరిజం మార్కెట్ ఇలా...





- యూఎస్- 1.25 ట్రిలియన్ డాలర్లు
- చైనా- 1.25 ట్రిలియన్ డాలర్లు
- భారత్- 0.2 ట్రిలియన్ డాలర్లు



ఖర్చెంతైనా.. ఖల్లాస్..!

ఒకప్పుడు డబ్బులు ఖర్చు చేసేందుకు ఒకటికి పదిసార్లు ఆలోచించే భారతీయులు ఇప్పుడు ఖర్చు ఎంతైనా ఫర్వాలేదు.. కాస్తా ఆటవిడుపు కోసం విదేశాల్లో చక్కర్లు కొట్టేసి వస్తాం అనే స్థాయికి చేరుకున్నారు. దేశంలోని పర్యాటక గమ్యస్థానాలన్నింటినీ చుట్టేసి వచ్చిన తర్వాత.. విదేశీయానాలకు కొందరు మొగ్గు చూపుతున్నారు. మరికొందరు.. కాస్తా కాలిక్యులేటివ్‌గా ఆలోచిస్తూ.. ఇక్కడ పెట్టే ఖర్చు కంటే.. మరో 10, 20 వేల రూపాయలు అదనంగా పెడితే.. విదేశాల్లో విహరించి రావొచ్చు కదా!.. అప్పుడు.. సహచరుల దగ్గర.. మేం ఫారిన్ టూర్ వెళ్లొచ్చాం అని గర్వంగా చెప్పుకోవచ్చు అనే రీతిలో ఆలోచిస్తున్నారు.. పెరుగుతున్న ఆదాయం, అభివృద్ధి చెందుతున్న విమాన కనెక్టివిటీ కూడా పర్యాటక మార్కెట్‌ని పెంచుతోంది.

వీసా లేకుండా వచ్చేయండి..

విదేశాలకు వెళ్లేందుకు పాస్‌పోర్టు తప్పనిసరి. పాస్‌పోర్టు ఉంటేనే ఆయా దేశాలు వీసా మంజూరు చేస్తుంటాయి. వీసా ఉంటేనే విదేశాల్లో చుట్టే అవకాశం ఉంటుంది. చాలా మందికి ఎంట్రీ లేదా టూరిస్ట్ వీసాలు దొరక్క.. తమకు నచ్చిన దేశంలో విహరించే ఆలోచనల్ని మధ్యలోనే విరమించుకుంటున్నారు. అలాంటి వారందరికీ ఇప్పుడు గోల్డెన్ ఛాన్స్ వచ్చేసింది. ''భారతీయులూ... వీసా లేకుండా మా దేశాన్ని సందర్శించండి..'' అంటూ ఇటీవల వరుసగా వివిధ దేశాలు ప్రకటిస్తున్నాయి. ఈ అవకాశాన్ని వినియోగించుకుంటూ.. ఇంటర్నేషనల్ ట్రిప్స్ కోసం ఎదురుచూస్తున్న వారంతా విమానంలో ఎగిరిపోయేందుకు సిద్ధమవుతున్నారు. ఇందు కోసం భారతీయులకు మరిన్ని అవకాశాలు అందించేందుకు విమానయాన సంస్థలు సిద్ధమవుతున్నాయి. విశాఖపట్నం వంటి టైర్-2 సిటీస్‌లో.. అంతర్జాతీయ విమానాశ్రయాలున్న నగరాలపై దృష్టిసారిస్తున్నాయి. ఇటీవల ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్(ఐఏటీఏ) విడుదల చేసిన వీసా ఫ్రీ దేశాల లిస్ట్‌లో భారత్ 83వ స్థానంలో నిలిచింది. ఈ కారణంగా.. కొన్ని దేశాలు.. భారతీయుల్ని విహారానికి వీసాఫ్రీగా ఆహ్వానం పలుకుతున్నాయి. ఈ అవకాశాల్ని విమాన యాన సంస్థలు సద్వినియోగం చేసుకుంటున్నాయి. ఇప్పటి వరకు దాదాపు 60 దేశాలు వీసా ఫ్రీ ప్రకటించాయి. 30 రోజుల నుంచి 90 రోజుల వరకూ వీసా లేకుండానే భారతీయులు తమ దేశానికి వచ్చి ఆతిథ్యాన్ని ఎంజాయ్ చెయ్యొచ్చంటూ ప్రకటించాయి. ఇది కూడా అవుట్‌బౌండ్ టూరిజం పెరిగేందుకు దోహదపడుతోంది.

ఆన్‌లైన్ ట్రావెల్ మార్కెట్ వృద్ధి..

2024–29 మధ్య భారత్‌లో ఆన్‌లైన్ ట్రావెల్ మార్కెట్ 10.5 శాతం సమ్మిళిత వార్షిక వృద్ధి నమోదుచేస్తుందని ఫిక్కీ నివేదిక చెబుతోంది. 2028 నాటికి జీడీపీలో టూరిజం సెక్టార్ 516 బిలియన్ డాలర్ల వాటాకు చేరుకుంటుంది. ఈ ఏడాది 40 శాతం మంది భారతీయులు ప్రీప్లాన్డ్ టూర్స్‌కు అవసరమైన ఏర్పాట్లు చేసుకున్నారని వెల్లడైంది. అదేవిధంగా ఏవియేషన్ డేటా ప్రొవైడర్ సిరియమ్ ప్రకారం ఈ ఏడాది రికార్డు స్థాయిలో 1,15,000కి పైగా విమానాలు విదేశాలకు ఎగిరాయి. గతేడాది కంటే ఈ డిపార్చర్ వృద్ధి 9 శాతం పెరిగింది. ఇండిగో ఎయిర్‌లైన్స్, ఎయిరిండియా గతేడాది వరుసగా 500, 470 కొత్త విమానాలు ఆర్డర్ చేశాయి. ఇవి విమానయాన చరిత్రలో అతిపెద్ద ఆర్డర్లు కావడం విశేషం.

మెచ్చిన చోటు.. నచ్చిన ఆహారం..

విదేశాలకు వెళ్తున్న భారతీయులు ముఖ్యంగా రెండింటిపైనే దృష్టిసారిస్తున్నారు. వెళ్లే దేశంలో అద్భుతమైన పర్యాటక ప్రాంతాలున్నాయా అనేది మొదటి ప్రాధాన్యమైతే.. దేశంలో దొరకని విభిన్న రుచులతో ఫుడ్‌ని ఎంజాయ్ చెయ్యగలమా అనేది రెండోది. ఈ రెండు అంశాలనే కొలమానంగా తీసుకుని టూరిజం డెస్టినేషన్‌ని ఫిక్స్ చేసుకుంటున్నారు. టూరిస్ట్ ఫ్రీ కంట్రీ, ఖర్చు అనేవి తర్వాత ప్రాధాన్యాలుగా పరిగణించడం విశేషం. భారత పర్యాటకులు ఎక్కువగా వీసా ఫ్రీ కంట్రీస్ వైపే మొగ్గు చూపుతున్నారు.

2027 నాటికి ఆసీస్, కెనడా, ఫ్రాన్స్‌ని వెనక్కినెట్టేలా..

అంతర్జాతీయ నివేదికల ప్రకారం 2027 నాటికి ఆస్ట్రేలియా, కెనడా, ఫ్రాన్స్ దేశాల్ని వెనక్కి నెట్టి, ప్రపంచంలో ఐదో అతిపెద్ద అవుట్‌బౌండ్ టూరిజం మార్కెట్‌గా భారత్ అవతరించనుంది. భారతీయ పర్యాటక మార్కెట్ విలువ 89 బిలియన్ డాలర్లకు చేరుకోనుంది. 2019లో నమోదైన 38 బిలియన్ డాలర్లతో పోల్చుకుంటే ఇది రెండింతలు ఎక్కువ. భారతీయుల అవుట్‌బౌండ్ ప్రయాణానికి ఎక్కువగా మధ్య ఆసియా దేశాలవైపే మొగ్గు చూపుతున్నారు. దాదాపు సగం విదేశీ పర్యటనలు ఈ దేశాలవైపే ఉంటున్నాయి. పొరుగున ఉన్న సౌదీ అరేబియా, ఒమన్ కంటే దుబాయ్‌కి ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. అదేవిధంగా.. తమ దేశానికి భారత్‌లోని అహ్మదాబాద్, చండీగఢ్, లక్నో నుంచి ఎక్కువ మంది పర్యాటకులు వస్తున్నారని థాయ్‌లాండ్‌లోని టూరిజం అథారిటీ వెల్లడించింది.

సర్వీసుల సంఖ్య పెరగడమే ప్రధాన కారణం



అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న రంగంగా పర్యాటక రంగాన్ని కేంద్రప్రభుత్వం గుర్తించింది. దేశంలోని వివిధ నగరాల నుంచి విదేశాలకు వెళ్లేందుకు విమాన సర్వీసులు అందుబాటులోకి రావడంతో విదేశాలకు వెళ్లే భారతీయుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. టైర్-2 నగరాల నుంచి కూడా విదేశీయానానికి అవకాశాలు పుష్కలంగా పెరగడంతో అవుట్‌బౌండ్ టూరిజం గణనీయంగా వృద్ధి చెందుతోంది. దీనికి తోడు వీసా లేకుండా రావొచ్చంటూ వివిధ దేశాలు ప్రకటించడం శుభపరిణామం. ట్రావెల్ మార్కెట్, టూరిజం మార్కెట్ వృద్ధి చెందితే కనీసం 5 కోట్ల మందికి పైగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. భవిష్యత్తులో అవుట్‌బౌండ్ టూరిజం విషయంలో భారత్ నంబర్ వన్‌గా నిలుస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

– విజయ్‌మోహన్, ఏపీ టూరిజం ఫోరం అధ్యక్షుడు

ఉచిత ఇసుకపై సర్కార్ కొత్త 'ఆడిట్' డ్రామా

కొనుగోలుదారుల నుంచి సచివాలయాల ఉద్యోగులతో వివరాల సేకరణకు మొబైల్ యాప్

- ఆరు ప్రశ్నలకు కేవలం ఎస్ లేదా నో అన్న వివరాలు మాత్రమే నమోదు..



సాక్షి, అమరావతి: ఉచిత ఇసుకపై పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో ప్రభుత్వం సచివాలయాల ఉద్యోగుల ద్వారా ఆడిట్ నిర్వహణ అంటూ కొత్త డ్రామాకు తెరలేపింది. ప్రభుత్వ ఇసుక విధానం, ఇసుక డెలివరీపై ప్రజల నుండి అభిప్రాయాలను సేకరించేందుకు 'ఏపీ శాండ్ పోస్టు డెలివరీ ఆడిట్ బై జీఎస్‌డబ్ల్యూఎస్' అంటూ కార్యక్రమాన్ని చేపట్టనుంది. ఈ కార్యక్రమంలో ఆరు ప్రశ్నలతో గ్రామ వార్డు సచివాలయాల్లో పనిచేసే గ్రామ పంచాయతీ కార్యదర్శులు లేదా వార్డు అడ్మిన్ సెక్రటరీల ద్వారా వివరాల సేకరించనున్నారు. ఇందుకు సంబంధించి మొబైల్ యాప్ వివరాలు, యాప్ ద్వారా వివరాల సేకరణ విధానంపై రూపొందించిన మాన్యువల్‌ను గ్రామ వార్డు సచివాలయాల శాఖ అన్ని గ్రామ వార్డు సచివాలయాల సిబ్బందికి పంపింది.

ఆరు ప్రశ్నలు ఇవే..

- ఇసుక డెలివరీ మీ సచివాలయం పరిధిలో జరిగిందా?
- ఉచిత ఇసుకపై మీరు సంతృప్తిగా ఉన్నారా?
- మీరు ఇసుక కోసం పట్టికలో నిర్ణయించిన ధరనే చెల్లించారా?
- ఇసుక రవాణా కోసం డ్రైవర్‌కు పట్టికలో నిర్ణయించిన ధరనే చెల్లించారా?
- మీ రశీదులో చూపించినంత ఇసుక ఇవ్వడం జరిగిందా?
- మీకు ఇచ్చిన ఇసుక నాణ్యత బాగుందా?

ఈ ప్రశ్నలకు కేవలం ఎస్ లేదా నో అన్న సమాచారాన్ని సంబంధిత కొనుగోలుదారు నుంచివివరాలు సేకరించి యాప్‌లో నమోదు చేయాలని ఆయా ఉద్యోగులకు అందజేసిన మాన్యువల్‌లో పేర్కొన్నారు.

శాకాహారంతో దీర్ఘాయువు

కూరగాయలు, పండ్లలోని ఫైటోన్‌ల సమ్మేళనంతో ఆరోగ్యానికి మేలు



అల్జీమర్స్‌ను నిరోధించడంతో పాటు ఆయుష్షు పెంచుతుంది

స్పెయిన్, ఇంగ్లాండ్ శాస్త్రవేత్తల పరిశోధనలో వెల్లడి

ప్రాసెస్, అల్ట్రా ప్రాసెస్ ఆహారంతో అల్జీమర్స్ ముప్పు

సాక్షి, అమరావతి: అల్జీమర్స్‌ను నిరోధించడంతోపాటు దీర్ఘాయువు అందించే సూపర్ ఫుడ్‌ను శాస్త్రవేత్తలు కనుగొన్నారు. సాధారణంగా టమోటాలు, క్యారెట్లు, ఆప్రికాట్లు, ఎర్ర మిరియాలు, నారింజ, కృష్ణ ఫలాల్లో లభించే 'ఫైటోన్'లోని కెరోటినాయిడ్స్ యాంటీ ఏజింగ్‌పై పోరాడతాయని గుర్తించారు. స్పెయిన్‌కు చెందిన యూనివర్సిటీ ఆఫ్ సెవిల్లె, ఇంగ్లాండ్‌లోని యూనివర్సిటీ ఆఫ్ కెంట్ శాస్త్రవేత్తలు సమ శీతోష్ణ ప్రాంతాల్లో నివసించే చిన్న పురుగులు కైనోరాబ్డిటిస్ ఎలిగాన్స్ (సి ఎలిగాన్స్)పై పరిశోధనలు చేశారు. కూరగాయలు, పండ్లలోని ఫైటోన్ల సమ్మేళనాన్ని వాటికి అందించడం ద్వారా అల్జీమర్స్ ముప్పును తగ్గించడంతోపాటు దీర్ఘాయువును ప్రోత్సహిస్తున్నట్టు తేల్చారు. అది చిన్న పురుగుల జీవిత కాలన్ని 10 నుంచి 18.6 శాతం పెంచిందని వెల్లడించారు. ఈ పరిశోధనను శాస్త్రవేత్తలు చాలా ముఖ్యమైనదిగా భావిస్తున్నారు. కేనోరబ్డిటిస్ ఎలిగాన్స్ బయోమెడికల్ పరిశోధనలలో తరచుగా ఉపయోగించే ఒక నమూనా జీవి. దీని సెల్యూలర్ మెకానిజమ్స్ మానవుల మాదిరిగా ఉంటాయి. అల్జీమర్స్‌తో వచ్చే పక్షవాతాన్ని ఫైటోన్ తగ్గిస్తుందని బలంగా విశ్వసిస్తున్నారు. అల్జీమర్స్ (మతిమరుపు) వ్యాధితో ముడిపడి ఉన్న మెదడులోని అమిలాయిడ్ ఫలకాల ప్రభావాన్ని 30–40 శాతం తగ్గించినట్టు అధ్యయనం చెబుతోంది.

ప్రాసెస్ చేసిన మాంసాహారాలతో..

పాశ్చాత్య దేశాల ఆహారంతో పోలిస్తే చైనా, జపాన్, భారత్‌లో కనిపించే మొక్కల ఆధారిత సాంప్రదాయ ఆహారాలు అల్జీమర్స్ వ్యాధి ప్రమాదాన్ని తగ్గిస్తాయని అమెరికాకు చెందిన నస్‌లైట్, న్యూట్రిషన్, హెల్త్ రీసెర్చ్ సెంటర్ పరిశోధకులు చెబుతున్నారు. పాశ్చాత్య ఆహారంలో పోషకాలు లేకపోవడంతో అల్జీమర్స్ బాధితులు పెరుగుతున్నట్టు అధ్యయనంలో పేర్కొన్నారు. బర్గర్లు, రెడ్ మీట్, హాట్‌డాగ్ లాంటి ప్రాసెస్ చేసిన మాంసాహారాలు ఇతర అల్ట్రా ప్రాసెస్డ్ ఆహారంతో అల్జీమర్స్ ముప్పు పెరగటానికి కారణంగా ధ్రువీకరించారు. ఆకు కూరలు, రంగురంగుల పండ్లు, చిక్కుళ్లు (బీన్స్ లాంటివి), గింజలు, ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు, తృణధాన్యాలు తీసుకుంటే సమృద్ధిగా పోషకాలు లభిస్తాయంటున్నారు. అల్ట్రా ప్రాసెస్ ఫుడ్ ఊబకాయం, మధుమేహం ప్రమాదాన్ని పెంచడంతో అల్జీమర్స్ వ్యాధికి దారి తీయవచ్చని చెబుతున్నారు.



శ్రీవారి దర్శనానికి 12 గంటలు


తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 26 కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 60,775 మంది స్వామివారిని దర్శించుకోగా 25,288 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.88 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

వైభవంగా ఆయుధపూజ



శ్రీకాళహస్తి: ముక్కంటీశ్వరాలయంలో శుక్రవారం ఆయుధపూజ వైభవంగా నిర్వహించారు. ఆలయంలోని స్వామి అమ్మవార్ల కల్యాణోత్సం నిర్వహించే వేదిక సమీపంలో స్వామి అమ్మవార్ల ఆభరణాలు, ఆయుధాలు, పరివార దేవతల వద్ద ఉన్న ఆభరణాలను ఉంచి పూజలు చేశారు. ఆలయ అర్చకులు నైవేద్యం, దీపారాధన, మంత్రపుష్పం జరిపారు.

మహిషాసురమర్ధినిగా గంగమ్మ దర్శనం




తిరుపతి కల్చరల్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం తిరుపతిలోని తాతయ్యగుంట గంగమ్మ మహిషాసురమర్ధిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి అభిషేకం, దేవీ హోమం, సహస్ర నామార్చన, రాత్రి ఉయ్యాలసేవ నిర్వహించారు. విజయ దశమి పురస్కరించుకుని శనివారం రాత్రి అమ్మవారు రాజరాజేశ్వరిదేవి అలంకరణతో 7 గంటలకు పుర విహారం చేస్తారని ఈఓ ఏ.జయకుమార్ తెలిపారు.

వైభవంగా చండీ కల్యాణం




అమరావతి: ప్రముఖ శైవక్షేత్రమైన అమరావతిలోని బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి దేవాలయంలో శ్రీ దేవీ శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి చండీ కల్యాణం వైభవంగా నిర్వహించారు. తొలుత అమ్మవారికి, స్వామి వారికి ఎదుర్కోల మహోత్సవం నిర్వహించి ఆలయంలోని వెంకటాద్రి నాయుని మండపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై స్వామి వారిని ఉంచి ఆలయ అర్చకులు కౌశిక చంద్రశేఖరశర్మ యాజ్ఞీక పర్యవేక్షణలో ఆలయ అర్చకులు విఘ్నేశ్వరపూజ, రక్షాబంధనం, పుణ్యహావచనం, కన్యాదానం శాస్త్రోక్తంగా కల్యాణ క్రతువు నిర్వహించారు. ఆయన చండీకల్యాణ విశిష్టతను భక్తులకు వివరిస్తూ స్వామివారికి సంవత్సరానికి రెండుసార్లు అనగా మహాశివరాత్రి, దసరా శరన్నవరాత్ర మహోత్స వాలకు కల్యాణం నిర్వహించటం విశేషమన్నారు.

దేవీ వైభవం



డాబాగార్డెన్స్ (విశాఖ): దసరా వేడుకలు నగరంలో వైభవంగా జరుగుతున్నాయి. శరన్నవరాత్రి మహోత్సవాల వేళ జగజ్జనని, ఆదిపరాశక్తిని రోజుకో రూపంలో కొలిచి, అమ్మ సన్నిధిలో కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు చేస్తున్నారు. విశాఖవాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మి శుక్రవారం మహాలక్ష్మిగా దర్శనమిచ్చారు. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లతో అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు. వాసవీ మాత మానసాదేవిగా విశేష అలంకరణలో దర్శనమిచ్చారు. కన్యకాపరమేశ్వరి ఆలయంలో సౌభాగ్యవ్రతాల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అప్పన్న జమ్మివేట ఉత్సవం రేపు



సింహాచలం: విజయదశమి సందర్భంగా ఆదివారం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి జమ్మివేట ఉత్సవం జరగనుంది. కొండదిగువ పూలతోటలో ఈ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం ఈవో వి.త్రినాథరావు ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ అధికారులు ఏర్పాట్లు చేశారు. పెద్ద ఎత్తున విద్యుద్దీపాలంకరణ చేశారు. స్వామి పూజలందుకునే పూలతోటలోని ప్రధాన మండపానికి, శ్రీకృష్ణ కొలనుకి రంగులు వేశారు. పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గోపాలపట్నం పోలీసులు భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.

14 నుంచి హెచ్‌ఎంలకు శిక్షణ

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న హెచ్‌ఎంలకు ఈ నెల 14వ తేదీ నుంచి రాష్ట్రస్థాయి రెసిడెన్షియల్ శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ అధికారులు జిల్లా విద్యాశాఖకు ఉత్తర్వులు పంపారు. ఈ నెల 14 నుంచి 19వ తేదీ వరకు ఏలూరు జిల్లా ఆగిరిపల్లిలో 6 రోజుల పాటు ఈ రెసిడెన్షియల్ శిక్షణ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. హెచ్‌ఎంలకు లీడర్‌షిప్ క్వాలిటీ అనే అంశంపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణకు నియమించిన జిల్లాలోని హెచ్‌ఎంలు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. ఎవరైనా గైర్హాజరైతే చర్యలు తప్పవని ఆ ఉత్తర్వుల్లో హెచ్చరించారు.



ఎల్‌ఎల్‌బీ ఫలితాల విడుదల

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలో ఎల్‌ఎల్‌బీ తృతీయ, ఐదు సంవత్సరాల కోర్సుకు ఈ ఏడాది జూన్‌లో జరిగిన మొదటి సెమిస్టర్ ఫలితాలను శుక్రవారం విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎం.దామ్లానాయక్ తెలిపారు. ఫలితాల కోసం విద్యార్థులు వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

14 నుంచి విద్యార్థులకు క్రీడా పోటీలు

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి విద్యార్థులకు వివిధ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనున్నారు. దీంతోపాటు ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టుకు క్రీడాకారుల ఎంపికలు కూడా ఉంటాయని ఫెడరేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి మెల్లంపూడి రవి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.







సైన్సు సినిమా



హెరాల్డ్ అండ్ ది పర్పుల్ క్రేయాన్

చిన్న పిల్లలకు గీతలు గీయడమన్నా, బొమ్మలు వేయడమన్నా ఎంతో ఇష్టం. పూర్వం బలపాలు, పెన్సిళ్లు వాడేవాళ్ళు. ఇప్పటి జెనరేషన్ క్రేయాన్స్ వాడుతున్నారు. పిల్లలు ఒక్కోసారి పిచ్చి గీతలు గీస్తారు. ఒక్కోసారి పేరు లేని ఆకారాలను వేస్తారు. ఏది గీసినా, రాసినా వాటికి జీవమొస్తే? అన్న చిలిపి ఆలోచన హాలీవుడ్ దర్శకుడు కార్లోస్‌కు వచ్చింది. ఇంకేముంది 'హెరాల్డ్ అండ్ ది పర్పుల్ క్రేయాన్' అనే సినిమాను రూపొందించాడు. కథాపరంగా 'హెరాల్డ్ అండ్ ది పర్పుల్ క్రేయాన్'లో హెరాల్డ్ అనే బాలుడు ఓ పుస్తకంలోని పాత్ర. అతనితో పాటు మూస్, పోర్క్‌పైన్ అనే మరో రెండు పాత్రలు ఉంటాయి. హెరాల్డ్ తన మానాన తాను ఉండగా బయటి ప్రపంచంలో అతనికి తెలిసిన ఓ వృద్ధుడు కనిపించకుండా పోతాడు. దాంతో హెరాల్డ్ ఆ వృద్ధుణ్ణి వెతకడానికి పర్పుల్ క్రేయాన్‌తో ఓ తలుపు బొమ్మ గీసి పుస్తకంలో నుంచి మానవ ప్రపంచంలోకి అడుగుపెడతాడు. అతనితో పాటు తోడుగా మూస్, పోర్క్‌పైన్ కూడా బయటకు వస్తాయి. ఇక అక్కడ నుండి మానవ ప్రపంచంలో అతడు ఏది గీస్తే అది నిజమైపోయి కథను నడిపిస్తుంది. హెరాల్డ్ ఆ ముసలివాడిని కనుగొంటాడా, మానవ ప్రపంచంలో తన మాయాజాలంతో ఎదుర్కొన్న ఇబ్బందులేంటి అన్నది మాత్రం సినిమా చూస్తేనే తెలుస్తుంది. ఈ సినిమాలో కారు బొమ్మ, హెలికాప్టర్ బొమ్మ ఇలా ఏది క్రేయాన్‌తో గీసినా అది నిజంగా అయిపోవడం పిల్లలకు బాగా నచ్చుతుంది. విజువల్‌గా గ్రాఫిక్స్ పిల్లలకే కాదు పెద్దవాళ్ళను ఆకట్టుకుంటాయి. పండుగ సెలవలకు పిల్లలతో పాటు పెద్దలు కూడా సరదాగా చూడగలిగిన సినిమా 'హెరాల్డ్ అండ్ ది పర్పుల్ క్రేయాన్'. మస్ట్ టు వాచ్ ఇట్.

– ఇంటూరు హరికృష్ణ

సంస్కృతి



భలే బావులు

నీరే మన జీవన ఆధారం. 'ఎడ తెగక పారే ఏరు లేని ఊరు'ని వెంటనే వదిలి పెట్టమన్నాడు వేమన మహాకవి. నీరు కాపాడుకుంటే భవిష్యత్తు ఉంటుంది. నీటి జాడను కాపాడుకోవడానికి పూర్వం నుంచి మానవుడు అనేక విధాలుగా ప్రయత్నించాడు. చెరువులు, బావులు కట్టుకున్నాడు. చెరువు ఊరి వ్యవసాయానికి ఆధారం అయితే బావి మంచినీటికి ఆధారం. బోర్లు లేని కాలంలో ఊరికి, వీధికి, ఇంటికి బావి ఉండేది. ముందు బావి తవ్వి ఆ తర్వాత ఇల్లు కట్టే వారు. ఎప్పుడూ నీళ్లుండే బావి ఉన్న ఇంటికి మర్యాద ఎక్కువ ఉండేది. ఇప్పటికీ బావులు ఉన్నాయి. వాటిని తెలుసుకోవడం, వాటిని కాపాడుకునే స్పృహ కలిగి ఉండటం అవసరం. బావికి తెలుగులో ఉన్న మరో మాట 'నుయ్యి'.

దిగుడు బావుల నగరం

ప్రజలకు నీటి వనరులుగా ఉపయోగపడుతున్న దిగుడు బావులు, చేదుడు బావులు ఇప్పుడు కాలగర్భంలో కలిసి పోతున్నాయి. కాని కొన్ని చోట్ల దిగుడు బావులు విస్తారంగా ఉన్నాయి. ఉదాహరణకు గుజరాత్‌లోని దిగుడుబావులు. ఈ రాష్ట్రంలో దాదాపు 120 విశిష్టమైన దిగుడుబావులు ఉన్నాయి. గాంధీనగర్ జిల్లాలోని అదాలజ్‌ను దిగుడుబావుల నగరం అనొచ్చు. అక్కడ ఉన్న 'రుడాబాయి దిగుడుబావి' ఐదంతస్తుల లోతు ఉండి ఆశ్చర్యపరుస్తుంది. ఒక్కసారైనా చూడ దగ్గ పర్యాటక చోటు ఇది. ఇక్కడ లోతైన బావిలోకి చక్కని మెట్ల నిర్మాణము కనిపించి ఆనాటి వారి ఇంజనీరింగ్ పరిజ్ఞానానికి చిహ్నంగా నిలుస్తుంది. బావి చుట్టూ చక్కని రాతినిర్మాణము ఉంటుంది. అంచెలంచెలుగా విశాలమైన వసారాలు, గదులు, స్తంభాలు , వాటి మీద లతలు, అల్లికలు, నగిషీలు చెక్కబడి దేవాలయ నిర్మాణాన్ని తలపిస్తాయి. నాటి ప్రజలు వీటిని గంగామాతగా



భావించేవారు. అందుకే ఈ జలాన్ని దేవతగా భావించి ఈ నిర్మాణం చేశారు. అష్టకోణాల నిర్మాణం ఇది. బావిలోకి ప్రవేశించేందుకు మూడువైపులనుండి ప్రవేశద్వారాలుంటాయి. వీటిలో నుండి దిగితే ఒక అంతస్తు నుండి మరో అంతస్తుకు దిగుతూ మొత్తం ఐదంతస్తుల కిందికి దిగాల్సివుంటుంది . అంత లోతునుండి నీరు పైకి చేరవేయడం చాలా శ్రమతో కూడుకున్న పనే. అందుకే ఆ శ్రమ తెలియకుండా వుండేందుకే ఇటువంటి విశాలమైన, నెమ్మదిగా ఎక్కే మెట్లు కలిగిన సుందర నిర్మాణాలు చేపట్టారు. గుజరాత్‌లోని దిగుడుబావులన్నీ 10–15 శతాబ్దాల మధ్య జరిగిన నిర్మాణాలే. దిగుడు బావులు ఎక్కువగా ఉన్న రాష్ట్రం రాజస్థాన్. అక్కడి అభానేరి గ్రామంలోని 'చాంద్ బౌరి' అనే దిగుడుబావి విశేషమైన ఖ్యాతి పొందింది. ప్రపంచ పర్యాటకులందరూ దీనిని చూడటానికి వస్తారు.

హైదరాబాద్‌లో..

హైదరాబాద్‌లోని బన్సిలాల్‌పేట్‌లో అద్భుతమైన దిగుడుబావి ఉంది. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం తెలంగాణలోని దిగుడుబావుల పునరుద్ధరణకు నడుము బిగించింది. అలాగే చెరువుల రక్షణకు హైడ్రాను ఏర్పాటు చేసింది. నీటిని రక్షించుకోకపోతే భవిష్యత్తు నాశనం. ఈ అవగాహన మనందరం కలిగి ఉండాలి. నీరు వృధా చేయరాదు.



బావులలో రకాలు

ఊట బావి: ఈ బావులలో ప్రకృతి సిద్ధంగా నీరు ఊరుతుంది. అందువల్ల ఇవి వేసవి కాలంలో కూడా ఎండిపోవు.
దిగుడు బావి: ఈ బావులు భూమి ఉపరితలంలో కలిసిపోయి ఉంటాయి. అంటే వీనికి గట్లు ఉండవు. అందువల్ల వీనిలో పశువులు, చిన్న పిల్లలు పడిపోయే ప్రమాదం ఉంది. కొన్నింటి లోనికి దిగడానికి మెట్లు ఉంటాయి.
గొట్టపు బావి: ఈ బావులు యంత్రాల సహాయంతో చాలా లోతు వరకు తవ్వించే అవకాశం ఉన్నవి. ఇవి భూగర్భ జాలాలలోని కింది పొరల లోనికి వేసి నీటిని మోటారు పంపు ద్వారా బయటకు తెస్తారు. పెద్ద పట్టణాలలోని ఎక్కువ మంది ఇండ్లలో ఈ రకం బావులు ఉంటున్నాయి. ఆధునిక వ్యవసాయంలో కూడా ఇవి ఎక్కువగా తవ్విస్తున్నారు.
గిలక బావి: ఈ బావులు గట్టుతో ఉండి సురక్షితమైనవి. చేదతో నీరు తోడుకోవడానికి మధ్యలో గిలక నిర్మించబడి ఉంటుంది. ఇవి గతంలో ఇంటింటా ఉండేవి.

ఉత్సవం

దసరా కళాతోన్ జాతర



దసరా ఉత్సవాల్లో భాగంగా 'కళాతోన్' పేరుతో మైసూర్‌లో చిన్నారులు నిర్వహించిన జాతర సూపర్ హిట్ అయింది. పిల్లలలోని కళా ప్రతిభను వెలికి తీసే కార్యక్రమం ఇది. మైసూర్ ప్యాలెస్ ఆవరణలోని ఆంజనేయస్వామి ఆలయం నుంచి మహారాజా ప్రభుత్వ ఉన్నత పాఠశాల వరకు నిర్వహించిన 'కళాతోన్'లో వెయ్యిమందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు.జానపద సంప్రదాయాలు, వివిధ కళారూపాలను ప్రతిబింబించే వివిధ దుస్తులు ధరించిన పిల్లలు 'కళాతోన్'లో పాల్గొన్న దృశ్యాలు కన్నుల పండగ చేశాయి.

'కళాతోన్‌లో పాల్గొనడం ద్వారా ఎన్నో పాటలు, డ్యాన్స్‌ల గురించి తెలుసుకునే అవకాశం వచ్చింది' అంటున్నాడు వేదాంత్. 'ఫస్ట్ టైమ్ కళా తోన్‌లో పాల్గొన్నాను.

నా ఫొటోలు చూసి ఇందులో ఉన్నది నేనేనా అని ఆశ్చర్యపోయాను' అంటుంది ప్రణవి.



ఇంగ్లిష్‌లో మాట్లాడడం, రాయడం మంచిదే. అలా అని మన తల్లి భాషను మరవకూడదు. ఇక్కడ ఉన్న పదాలు మీకు తెలియపోతే తెలుసుకోండి. రాతలోనో, మాటలలోనో వాడితే అది మీ సొంతం అవుతుంది.

ఈ వారం కొన్ని పదాలు...

ఆకాండపాతం	అనుకోకుండా జరగడం
చోద్యం	వింత, ఆశ్చర్యం, ప్రశ్న
చోరుడు	దొంగ
మాలిక	పూలదండ
మాలిమికాడు	ఓడ నడిపే వ్యక్తి
వెన్నెల గుత్తి	చంద్రుడు
కాడు	స్మశానం
కాపాయం	పొదుపు
కాపట్యం	మోసం

డోరెమాన్ గొంతు మూగబోయింది



డోరెమాన్ మనకు ఇష్టమైన కామిక్ క్యారెక్టర్. తెలుపు, నీలం రంగుల్లో ఉండే ఈ రోబో పిల్లి పదేళ్ల నోబితాకు అన్ని విధాలా సాయపడుతూ, గదమాయిస్తూ మనకు బోలెడంత వినోదం పంచుతుంది. డోరెమాన్ పిల్లి పాత్రను ప్రసిద్ధ జపనీస్ కామిక్ ఆర్టిస్టులు ఫ్యుజిమొటో, అబికో కలిసి సృష్టించారు. ఈ పాత్ర ముందు జపనీస కామిక్ బుక్స్‌లోకి వచ్చింది. ఆ తర్వాత యానిమేషన్ రూపంలో టీవీలో పాపులర్ అయ్యింది. ఆ సమయంలో జపనీస్ ఈ పాత్రకు గొంతు ఇవ్వడం ద్వారా నొబుయు యమయ పేరు గడించింది. 1979 నుంచి 2005 దాకా మొత్తం 26 సంవత్సరాలు డోరెమాన్ పాత్రకు గొంతు ఇచ్చింది నొబుయు. డోరెమాన్ పాత్ర అంతగా హిట్ కావడానికి ఆమె డబ్బింగ్ చెప్పిన విధానమే కారణం. 90 ఏళ్లు జీవించిన నొబుయు మొన్న సెప్టెంబర్ 29న మరణించింది. జపాన్ దేశం ఆమెకు నివాళులు అర్పించింది. అన్నట్టు డోరెమాన్ ఇంగ్లిష్ యానిమేషన్స్‌ను ఇప్పుడు డిస్నీ తయారు చేస్తోంది.



కామెడీ క్లాస్

తల్లి : నిద్ర పొమ్మంటే పుస్తకం పట్టుకుంటున్నావేమిటి?
చింటు : నాకు పుస్తకం పట్టుకుంటూనే నిద్ర వస్తుంది.

చింటు : టీవి చూస్తూ హోంవర్క్ చేస్తాను మమ్మీ
తల్లి : అలాగే. టీవి చూడు...అయితే ఆన్ చేయకు!

బంధువు: రాజూ...నీ ఫ్యూచర్‌ప్లాన్ ఏమిటి?
రాజు : మీరు బయటికి వెళ్లగానే ఐస్‌క్రీమ్ తింటాను.

తండ్రి : ఎగ్జామ్స్‌లో పాస్ అయ్యావా?
కొడుకు : డాడీ....నువ్వు చాలా లక్కీ
తండ్రి : ఎలా?
కొడుకు : నేను మళ్లీ ఫెయిలయ్యాను
తండ్రి : నువ్వు ఫెయిలైతే నేను ఎలా లక్కీ అవుతాను!
కొడుకు : పై క్లాసు కోసం మీరు పుస్తకాలు కొనవలసిన అవసరం లేదు కదా!



నోటికి పాఠం

కథ



చాలా సంవత్సరాల క్రితం ఒక ఊరిలో ఒక అమ్మాయి ఉండేది. ఆ అమ్మాయి రోజంతా గాలి కబుర్లు చెప్పుకుంటూ గడిపేసేది. ఇక్కడ మాట అక్కడా, అక్కడి మాట ఇక్కడా చెబుతూ వుంటే చూసి వాళ్ళమ్మ చాలా బాధ పడేది. ఇలా గాలి కబుర్లు చెప్పడం తప్పని ఎంత చెప్పినా ఆ అమ్మాయి మట్టుకు పట్టించుకునేది కాదు. ఈ గాలి కబుర్ల వల్ల లేనిపోని తగాదాలు కూడా వచ్చేవి.

ఒక రోజు ఆ ఊరికి ఒక సాధువు వచ్చాడు. ఆయన దర్శనానికి వెళ్లిన ఆ అమ్మాయి వాళ్ల అమ్మ తన బాధ చెప్పుకుంది. 'మా అమ్మాయికి బుద్ధి చెప్పండి స్వామీ' అని కోరుకుంది. సాధువు మర్నాడు అమ్మాయిని తన దగ్గరికి తీసుకురమ్మని చెప్పాడు.

మర్నాడు పొద్దున్నే అమ్మ తన కూతురుని సాధువు వద్దకు తీసుకుని వెళ్ళింది. సాధువు చారుమతికి ఒక కోడిని చూపించి 'రోజంతా ఆ కోడి ఈకలు తీసి వూరు మొత్తం చల్లమ్మా' అని చెప్పాడు.

ఎక్కడ తిడతాడో అని భయపడుతూ వచ్చిన అమ్మాయి 'ఇంతేనా?' అనుకుంటూ కోడి ఈకలతో వూరంతా తిరుగుతూ కనిపించిన వారందరికి కబుర్లు చెపుతూ ఇక్కడో ఈక, అక్కడో ఈక విసిరేసింది.

సాయంత్రం సూర్యాస్తమయం అవుతుంటే ఆ అమ్మాయిని తల్లి మళ్ళీ ఆ సాధువు దగ్గిరకు తీసుకెళ్లింది.

'ఈ రాత్రి నిద్రపోయి మళ్ళి తెల్లవారగానే రండి' అని పంపాడు సాధువు.

మర్నాడు పొద్దున్నే వాళ్లు వెళితే సాధువు అమ్మాయితో, 'నిన్న రోజంతా విసిరేసిన కోడి ఈకలు వెతికి తీసుకు రామ్మా' అన్నాడు.

అమ్మాయి సరేనని ఊరంతా వెతకడం మొదలెట్టింది. సాయంత్రం దాక ఊరిలో ప్రతి అంగుళం వెతికినా ఒక్క ఈక కనిపించలేదు. దిగాలుగా సాయంత్రానికి ఆ సాధువు దగ్గరకు వెళ్ళి 'స్వామి, నన్ను క్షమిచండి. నాకు ఒక్క ఈక కూడ దొరకలేదు' అని చెప్పింది. అప్పుడు సాధువు 'చూశావా... మన మాటలు కూడా ఆ ఈకల లాంటివే. ఒక్క సారి నోరు జారితే ఆ మాటలను మనం యెన్నటికీ తిరిగి తీసుకోలేము' అని చెప్పాడు. 'నోరు అదుపులో ఉంటే సమయం వృధా కాదు. చేయవలసిన పనులు పూర్తవుతాయి. జీవితంలో పెట్టుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చు' అన్నాడు.

ఆ రోజు నుంచి ఆ అమ్మాయి గాలి కబుర్లు మానేసి చక్కగా చదువుకుని వాళ్ల అమ్మను సంతోషపెట్టింది.



మన పండగ పాటలు



రాకు రాకుల బండి
రామల్ల బండి
వచ్చింది పోయింది ఓ రామచిలుక
నిప్పుల మీద రానా
నీళ్ల మీద రానా

తోడు పాయసం తోడు
తోడితే నా చెయ్యి వేడి
వేడి పాయసం జుర్రు

కాముడోయి భీముడోయి
కందిపప్పు దేముడోయి
చెన్నపట్నం చెరుకు ముక్కా
నీకో ముక్కా నా కో ముక్కా

మన సామెతలు

- అరనిమిషం తీరిక లేదు అరకాను సంపాదన లేదు.
- ఇంట్లో ఈగల మోత, బయట పల్లకీల మోత
- ఉన్న ఊరు కన్న తల్లి
- కొంగ జపం చేపల కొరకే
- మంచి కొంచెం అయినా చాలు విత్తనం చిన్నదైనా చాలు
- పిండి కొద్దీ రొట్టే
- ఎంత గుమ్మడి కాయ అయినా కత్తిపీటకు లోకువే
- అమ్మబోతే అడివి కొనబోతే కొరివి



బిజినెస్ రీల్

కొత్త పాలసీల ప్రీమియం 14 శాతం జూమ్




న్యూఢిల్లీ: జీవిత బీమా సంస్థలు ఈ ఏడాది సెప్టెంబర్‌లో కొత్త పాలసీల ప్రీమియం రూ.35,020 కోట్లు నమోదు చేశాయి. 2023 సెప్టెంబర్‌తో పోలిస్తే ప్రీమియం 14 శాతం పెరగడం విశేషం. లైఫ్ ఇన్సూరెన్స్ కౌన్సిల్ సెప్టెంబర్ గణాంకాల ప్రకారం.. బీమా రక్షణ పట్ల వ్యక్తిగత కస్టమర్ల నుంచి డిమాండ్ పెరగడంతో సెప్టెంబర్‌లో జారీ అయిన కొత్త పాలసీల సంఖ్య 45.49 శాతం దూసుకెళ్లి 32,17,880 నమోదైంది. ఇండివిడ్యువల్ సింగిల్ ప్రీమియం 13 శాతం అధికమై రూ.5,142 కోట్లు సాధించింది. లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ 25 శాతం వృద్ధితో నూతన ప్రీమియం రూ.20,369 కోట్లు అందుకుంది. ఈ ఏడాది ఏప్రిల్–సెప్టెంబర్‌లో నూతన పాలసీల ద్వారా అందుకున్న ప్రీమియం గతేడాది ఇదే కాలంతో పోలిస్తే 19 శాతం ఎగసి రూ.1,89,214 కోట్లకు చేరుకుంది.

వెల్‌స్పన్ కొత్త ప్లాంటు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: హోమ్ టెక్స్‌టైల్స్ తయారీ దిగ్గజం వెల్‌స్పన్ లివింగ్ యూఎస్‌లోని గ్రోవ్ సిటీలో కొత్త ప్లాంటు ప్రారంభించింది. ఈ కేంద్రానికి తొలి దశలో ఏటా 1.35 కోట్ల యూనిట్ల స్లీప్, డెకొరేటివ్ పిల్లోస్ తయారు చేయగలిగే సామర్థ్యం ఉంది. ప్లాంటుకు 12.5 మిలియన్ డాలర్లు వెచ్చించినట్టు వెల్‌స్పన్ సీఈవో, ఎండీ దిపాలీ గోయెంకా తెలిపారు. మెరుగైన నిద్ర కోసం పెరుగుతున్న వినియోగదారుల డిమాండ్‌కు అనుగుణంగా యూఎస్‌లో సంవత్సరానికి 3.5 కోట్ల దిండ్లు ఉత్పత్తి చేసే ప్రణాళికలో భాగంగా నూతన ఫ్యాక్టరీ నెలకొల్పినట్టు చెప్పారు.

మరింత మెరుగ్గా జియోఫైనాన్స్ యాప్



న్యూఢిల్లీ: జియోఫైనాన్స్ యాప్‌ను మరింత మెరుగ్గా ప్రారంభించినట్టు జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ శుక్రవారం ప్రకటించింది. రుణాలు, పొదుపు ఖాతాలు, యూపీఐ బిల్లు చెల్లింపులు, రీఛార్జ్‌లు, డిజిటల్ ఇన్సూరెన్స్‌తో సహా అనేక రకాల సేవలను ఈ యాప్ అందిస్తోంది. జియోఫైనాన్స్ యాప్ బీటా వెర్షన్ 2024 మే 30న ప్రారంభమైంది. 60 లక్షలకు పైగా వినియోగదారులు ఉన్నారు. బీటా అందుబాటులోకి వచ్చినప్పటి నుండి అనేక రకాల ఆర్థిక ఉత్పత్తులు సేవలు జోడించామని, మ్యూచువల్ ఫండ్‌లపై రుణాలు, గృహ రుణాలు (బ్యాలెన్స్ బదిలీతో) సహా ఆస్తిపై రుణాలు వీటిలో ఉన్నాయని జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ తెలిపింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

12-10-2024	
విశాఖ	525-00
చిత్తూరు	538-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	525-00
విజయవాడ	525-00
రిటైల్ ధర (డజను)	78.00
హైదరాబాద్	510-00
వరంగల్	512-00
రిటైల్ ధర	5.70

నిఫ్టీ 50 — టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TRENT	8,231.00	2.52
HINDALCO	746.7	2.27
HCLTECH	1,839.95	1.73
TECHM	1,645.00	1.56
ONGC	292.65	1.35

నిఫ్టీ 50 — టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TCS	4,146.00	-1.93
M&M	3,136.80	-1.8
ICICIBANK	1,223.30	-1.62
CIPLA	1,594.30	-1.52
ADANIENT	3,129.95	-1.39

స్టాక్ మార్కెట్ డేటా


	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	5,682
ఎన్ఎస్ఈ	81,981
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,44,098
ఎఫ్ఐఐ	- 4,163
డీఐఐ	+ 3,731

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	75.22	$ 75.85
బ్రెంట్	79.04	$ 79.04



టెస్లా.. రోబోట్యాక్సీ..





లాస్ ఏంజెలిస్: వాహనప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న రోబోట్యాక్సీ 'సైబర్ క్యాబ్'ను టెస్లా చీఫ్ ఎలాన్ మస్క్ ఎట్టకేలకు ఆవిష్కరించారు. అటానామస్ వాహనంగా ఉండే రోబోట్యాక్సీలో స్టీరింగ్ వీల్, పెడల్స్ ఉండవు. ఇద్దరు ప్రయాణికులు మాత్రమే పట్టేంత క్యాబిన్ ఉంటుంది. స్వయంచాలిత వాహనాలు మనుషులు నడిపే వాహనాల కన్నా 10–20 రెట్లు సురక్షితంగా ఉంటాయని, సిటీ బస్సులతో పోలిస్తే వీటిలో ప్రయాణ వ్యయాలు కూడా చాలా తక్కువేనని మస్క్ చెప్పారు. సైబర్‌క్యాబ్ ఉత్పత్తి 2026లో ప్రారంభమవుతుందని, ధర 30,000 డాలర్ల లోపే ఉంటుందని మస్క్ తెలిపారు. అలాగే 20 మంది పట్టే రోబోవ్యాన్‌ను కూడా మస్క్ ప్రవేశపెట్టారు. అటు వివిధ పనులు చేసి పెట్టే ఆప్టిమస్ రోబోను కూడా అభివృద్ధి చేస్తున్నట్లు మస్క్ చెప్పారు. దీని ధర 20,000–30,000 డాలర్ల మధ్యలో ఉంటుందని పేర్కొన్నారు. అటానామస్ వాహనాలు ప్రమాదాలకు దారి తీస్తున్న ఉదంతాలపై విచారణ జరుగుతున్న నేపథ్యంలో టెస్లా స్వయంచాలిత వాహనాలకు అనుమతులపై సందేహాలు నెలకొన్నాయి.

30 వేల డాలర్ల లోపు ధర



'నెట్టింట' యువతరం

- పల్లెల్లో 82 శాతం వినియోగం
- పట్టణాల్లో 92% మందికి చేరువ
- 95 శాతం ఇళ్లకు టెలిఫోన్ సేవలు
- వైద్యం కోసం రూ.5,000కుపైనే వ్యయం
- జాతీయ సర్వేలో వెల్లడైన విషయాలు



న్యూఢిల్లీ: స్మార్ట్‌ఫోన్ సాయంతో యువతకు ఇంటర్నెట్ చేరువ అయింది. గ్రామీణ ప్రాంతాల్లో 82 శాతం మంది (15–24 ఏళ్ల వయసులోని వారు), పట్టణాల్లో 92 శాతం మంది ఇంటర్నెట్‌ను వినియోగిస్తున్నట్టు కేంద్ర ప్రభుత్వ సర్వేలో తెలిసింది. 15–24 ఏళ్ల వయసులోని 95.7 శాతం గ్రామీణ యువత మొబైల్ ఫోన్లను వినియోగిస్తున్నారు. పట్టణాల్లో ఇది 97 శాతంగా ఉంది. కేంద్ర ప్రణాళికలు, కార్యక్రమాల అమలు శాఖ 'కాంప్రహెన్సివ్ యాన్యువల్ మాడ్యులర్ సర్వే' (సీఏఎంఎస్) వివరాలను విడుదల చేసింది. 79వ జాతీయ శాంపిల్ సర్వే (ఎన్ఎస్ఎస్)లో భాగంగా ఇది జరిగింది.

సర్వే ఫలితాలు..

- 15–24 ఏళ్లలోని 78.4 శాతం యువత అటాచ్డ్ ఫైల్స్‌తో మెస్సేజ్‌లు పంపుకుంటున్నారు. 71.2 శాతం మంది కాపీ–పేస్ట్ టూల్స్ వాడుతున్నారు.
- 26.8 శాతం మంది సమాచారం కోసం శోధిస్తున్నారు. అలాగే, మెయిల్స్ పంపడం, ఆన్‌లైన్ బ్యాంకింగ్ లావాదేవీలు నిర్వహిస్తున్నారు.
- 95.1 శాతం ఇళ్లల్లో టెలిఫోన్/మొబైల్ ఫోన్ సదుపాయం ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో 94.2 శాతంగా ఉంటే, పట్టణాల్లో 97.1 శాతం ఇళ్లకు ఈ సదుపాయం ఉందని సర్వేలో తెలిసింది.
- 9.9 శాతం ఇళ్లల్లోనే డెస్క్‌టాప్ లేదా ల్యాప్‌టాప్ సదుపాయం ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో 4.2 శాతం ఇళ్లకే ఈ సదుపాయం ఉంటే, పట్టణాల్లో 21.6 శాతంగా ఉంది.
- 96.9 శాతం మంది యువతీ యువకులు సులభంగా ఉండే ప్రకటనలు చదవడం, రాయడం, అర్థం చేసుకోవడం చేస్తున్నారు. సులభమైన లెక్కలు వేయగలుగుతున్నారు. పురుషుల్లో ఇలాంటి వారు 97.8 శాతంగా ఉంటే, మహిళల్లో 95.9 శాతంగా ఉన్నారు.
- ఆస్పత్రిపాలైనప్పుడు వైద్యం కోసం జేబులోంచి చేస్తున్న ఖర్చు గ్రామీణ ప్రాంతాల్లో అయితే ఒక్కో కుటుంబం నుంచి ఏడాదికి రూ.4,129గా ఉంటే, పట్టణాల్లో రూ.5,290గా ఉంది. అదే ఆస్పత్రిలో చేరకుండా పొందే వైద్యం కోసం గడిచిన 30 రోజుల్లో గ్రామీణ ప్రాంతాల్లో ఒక్కో ఇంటివారు రూ.539 ఖర్చు చేయగా, పట్టణ ప్రాంతాల్లో ఇది రూ.606గా ఉంది.
- బస్సు, కారు, ట్యాక్సీ, ఆటో వంటి చౌక ప్రజా రవాణా సాధనాలను పట్టణాల్లోని 93.7 శాతం మంది సౌకర్యవంతంగా పొందుతున్నారు.
- విద్య, ఉపాధి, శిక్షణ పొందని యువత గ్రామీణ ప్రాంతాల్లో 25 శాతం మేర ఉంటే, పట్టణాల్లో 19 శాతం ఉన్నారు.

యూపీఐ లావాదేవీలు 78.97 బిలియన్లు

న్యూఢిల్లీ: తక్షణ చెల్లింపుల వ్యవస్థ యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) లావాదేవీల సంఖ్య 2024 జనవరి–జూన్ మధ్య దేశవ్యాప్తంగా 78.97 బిలియన్లకు చేరుకున్నాయి. గతేడాది ఇదే కాలంతో పోలిస్తే లావాదేవీలు 52 శాతం పెరిగాయని పేమెంట్ టెక్నాలజీ సర్వీసులు అందిస్తున్న వరల్డ్‌లైన్ నివేదిక వెల్లడించింది. 'లావాదేవీల విలువ రూ.83.16 ట్రిలియన్ల నుంచి రూ.116.63 ట్రిలియన్లకు చేరింది. చెల్లింపుల వ్యవస్థను యూపీఐ నడిపిస్తోంది. 2023 జనవరిలో యూపీఐ లావాదేవీల సంఖ్య 8.03 బిలియన్లు. 2024 జూన్‌కు ఇది 13.9 బిలియన్లకు ఎగసింది. లావాదేవీల విలువ రూ.12.98 ట్రిలియన్ల నుంచి రూ.20.07 ట్రిలియన్లకు చేరింది. విలువ, పరిమాణం పరంగా ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం వరుసగా మూడు స్థానాలను ఆక్రమించాయి. సగటు లావాదేవీ విలువ 2023 జనవరి–జూన్ మధ్య రూ.1,603 నమోదైంది. 2024 జూన్‌తో ముగిసిన ఆరు నెలల్లో ఇది రూ.1,478కి వచ్చి చేరింది. ఆన్‌లైన్ పరిశ్రమలో ఈ–కామర్స్, గేమింగ్, యుటిలిటీస్, ప్రభుత్వ సేవలు, ఆర్థిక సేవలు మొత్తం లావాదేవీల పరిమాణంలో 81 శాతం, విలువలో 74 శాతం కైవసం చేసుకున్నాయి' అని నివేదిక వివరించింది.

ఇరెడా లాభం జూమ్

క్యూ2లో రూ. 388 కోట్లు

న్యూఢిల్లీ: పీఎస్‌యూ సంస్థ ఇండియన్ రెనెవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఏజెన్సీ(ఇరెడా) ఈ ఆర్థిక సంవత్సరం(2024–25) రెండో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జులై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 36 శాతం జంప్‌చేసి రూ. 388 కోట్లకు చేరింది. ఇందుకు ఆదాయం పుంజుకోవడం సహకరించింది. గతేడాది(2023–24) ఇదే కాలం(క్యూ2)లో రూ. 285 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 39 శాతం ఎగసి రూ. 1,630 కోట్లను అధిగమించింది. గతేడాది క్యూ2లో రూ. 1,177 కోట్ల టర్నోవర్ సాధించింది. లోన్‌బుక్ 36 శాతం బలపడి రూ. 64,564 కోట్లను తాకింది. గత క్యూ2లో రూ. 47,514 కోట్లుగా నమోదైంది. రుణ మంజూరీ నాలుగు రెట్లు దూసుకెళ్లి రూ. 8,724 కోట్లకు చేరింది. గత క్యూ2లో రూ. 2,852 కోట్లు మాత్రమే మంజూరు చేసింది. రుణాల విడుదల సైతం 44 శాతం ఎగసి రూ. 4,462 కోట్లను తాకింది.



అనుబంధ సంస్థకు ఓకే

పూర్తి అనుబంధ సంస్థ ఏర్పాటుకు తాజాగా దీపమ్ ఆమోదముద్ర వేసినట్లు ఇరెడా వెల్లడించింది. పునరుత్పాదక ఇంధన విభాగంలో రిటైల్, బీటూబీ బిజినెస్‌లను అనుబంధ సంస్థ చేపట్టనున్నట్లు తెలియజేసింది. పీఎం సూర్యఘర్(సోలార్ రూఫ్‌టాప్), పీఎం కుసుమ్ పథకాలలో భాగంగా రిటైల్ బిజినెస్‌లకు మద్దతివ్వనున్నట్లు వివరించింది. ఇందుకు సూత్రప్రాయ అనుమతి మంజూరు చేసినట్లు తెలియజేసింది. ఈవీలు, ఎనర్జీ స్టోరేజీ, గ్రీన్ టెక్నాలజీస్ తదితరాలను సైతం అనుబంధ కంపెనీ హ్యాండిల్ చేయనున్నట్లు వెల్లడించింది.

జస్ట్ డయల్ లాభం రెట్టింపు



క్యూ2లో రూ. 154 కోట్లు

న్యూఢిల్లీ: స్థానిక సెర్చ్ ఇంజిన్ జస్ట్ డయల్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024–25) రెండో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జులై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం రెట్టింపునకుపైగా ఎగసి రూ. 154 కోట్లను తాకింది. రిలయన్స్ రిటైల్ వెంచర్స్ నిర్వహణలోని కంపెనీ గతేడాది(2023–24) ఇదే కాలంలో కేవలం రూ. 72 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 261 కోట్ల నుంచి రూ. 285 కోట్లకు జంప్‌చేసింది. ఇది సరికొత్త రికార్డ్‌కాగా.. అటు బిజినెస్‌లు, ఇటు కన్జూమర్లకు అత్యుత్తమ డిజిటల్ సొల్యూషన్లు అందిస్తున్నట్లు కంపెనీ పేర్కొంది. మొత్తం వ్యయాలు రూ. 226 కోట్ల నుంచి రూ. 217 కోట్లకు పెరిగాయి.

సెప్టెంబర్‌లో 'సిప్' సరికొత్త రికార్డు

రూ.24,509 కోట్ల పెట్టుబడులు



న్యూఢిల్లీ: క్రమానుగత పెట్టుబడుల ప్రణాళిక (ఎస్ఐపీ- సిప్)పై ఇన్వెస్టర్ల భరోసా పెరుగుతోంది. అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా (ఏఎంఎఫ్ఐ) సెప్టెంబర్ తాజా గణాంకాల ప్రకారం– సిప్‌లోకి సమీక్షా నెల్లో రికార్డు స్థాయిలో రూ.24,509 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. సిప్‌లోకి ఒకే నెలలో ఈ స్థాయి పెట్టుబడులు రావడం ఇదే తొలిసారి. క్రమశిక్షణతో కూడిన దీర్ఘకాలిక సంపద వైపు మళ్లుతున్న పెట్టుబడిదారుల సెంటిమెంట్‌ను ఈ పరిణామం తెలియజేస్తోందని ఏఎంఎఫ్ఐ చీఫ్ ఎగ్జిక్యూటివ్ వెంకట్ చలసాని అన్నారు. కాగా, ఆగస్టులో సిప్‌లోకి వచ్చిన పెట్టుబడుల విలువ రూ.23,547 కోట్లు.

ఈక్విటీ ఫండ్స్‌లోకి రూ.34,419 కోట్లు..

ఇక మొత్తంగా చూస్తే, ఈక్విటీ ఫండ్స్‌లోకి ఇన్వెస్ట్‌మెంట్లు సెప్టెంబర్‌లో 10 శాతం (ఆగస్టుతో పోల్చి) పడిపోయి రూ.34,419 కోట్లుగా నమోదయ్యాయి. లార్జ్ క్యాప్, థీమెటిక్ ఫండ్స్‌లోకి పెట్టుబడులు భారీగా తగ్గాయి. అయితే ఈక్విటీ ఫండ్స్‌లోకి నికర పెట్టుబడులు సుస్థిరంగా 43 నెలలుగా కొనసాగుతుండడం సానుకూల అంశం. మ్యూచువల్ ఫండ్స్ పట్ల ఇన్వెస్టర్ల విశ్వాసానికి ఇది అద్దం పడుతోందని సంబంధిత వర్గాలు పేర్కొంన్నాయి. ఇక ఫండ్స్ నిర్వహణలో ఉన్న ఆస్తుల విలువ ఆగస్టులో రూ.66.7 లక్షల కోట్లు ఉంటే, సెప్టెంబర్‌లో రూ.67 లక్షల కోట్లకు ఎగసింది.

ట్రాఫిక్‌సోల్ ఐపీవోకు షాక్

- లోతైన దర్యాప్తునకు తెరతీసిన సెబీ
- ఇప్పటికే లిస్టింగ్ నిలిపేసిన బీఎస్ఈ



న్యూఢిల్లీ: ఎస్ఎంఈ సంస్థ ట్రాఫికోల్ ఐటీఎస్ టెక్నాలజీస్ లిమిటెడ్ లిస్టింగ్‌కు క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ సైతం చెక్ పెట్టింది. బీఎస్ఈ ఎస్ఎంఈ ప్లాట్‌ఫామ్‌పై కంపెనీ లిస్ట్‌కావలసి ఉంది. ఇప్పటికే బీఎస్ఈ లిస్టింగ్‌ను వాయిదా వేసింది. కాగా.. ఐపీవో చేపట్టేందుకు దాఖలు చేసిన ముసాయిదా ప్రాస్పెక్టస్‌పై పూర్తిస్థాయి దర్యాప్తునకు సెబీ తాజాగా ఆదేశించింది. దీంతో లిస్టింగ్‌ను నిలిపివేయవలసిందిగా బీఎస్ఈకి తెలియజేసింది. అంతేకాకుండా ఐపీవో నిధులను వడ్డీ ఆర్జించగల ఎస్క్రో ఖాతాలో నిలిపి ఉంచవలసిందిగా మధ్యంతర ఉత్తర్వుల ద్వారా బీఎస్ఈని ఆదేశించింది. తదుపరి ఆదేశాలు జారీ చేసేవరకూ ట్రాఫిక్‌సోల్ లేదా సంబంధిత సంస్థలను ఈ ఖాతాకు దూరంగా ఉంచవలసిందిగా పేర్కొంది. 30 రోజుల్లోగా దర్యాప్తును పూర్తి చేయనున్నట్లు తెలియజేసింది. ఇన్వెస్టర్ల ఆందోళనల నేపథ్యంలో బీఎస్ఈ ట్రాఫిక్‌సోల్ ఐటీఎస్ టెక్నాలజీస్ లిస్టింగ్‌ను నెల రోజులుగా నిలిపివేసింది. కంపెనీకి వ్యతిరేకంగా వెలువడిన ఫిర్యాదులపై దర్యాప్తు చేపట్టవలసిందిగా బీఎస్ఈని సెబీ ఆదేశించింది.

ఏం జరిగిందంటే?

ఎస్ఎంఈ కంపెనీ ట్రాఫిక్‌సోల్ రూ. 45 కోట్ల సమీకరణకు పబ్లిక్ ఇష్యూని చేపట్టింది. ఇష్యూకి 345 రెట్లు అధికంగా స్పందన లభించింది. అంటే రూ. 10,000 కోట్ల విలువైన బిడ్స్ దాఖలయ్యాయి. రూ. 66–70 ధరల శ్రేణిలో గత నెల(సెప్టెంబర్) 10–12 మధ్య ఐపీవో వెలువడింది. సాఫ్ట్‌వేర్ కొనుగోళ్లు, రుణ చెల్లింపులు, వర్కింగ్ క్యాపిటల్ అవసరాలకు ఐపీవో నిధులు వెచ్చించనున్నట్లు ప్రాస్పెక్టస్‌లో కంపెనీ పేర్కొంది. అయితే ఇష్యూ తదుపరి షేర్ల కేటాయింపు తదితరాలపై ఇన్వెస్టర్ల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ప్రధానంగా సాఫ్ట్‌వేర్ కొనుగోళ్లకు వినియోగించే నిధులపై సందేహాలు తలెత్తాయి. ఇందుకు కంపెనీ ఎంపిక చేసుకున్న థర్డ్ పార్టీకి కాంట్రాక్టును పూర్తిచేయగల సామర్థ్యం లేదన్న ఆరోపణలు వెలువడ్డాయి.

దివ్యాంగులకు సులభంగా డిజిటల్ చెల్లింపులు

తగిన మార్పులు చేయాలని ఆర్‌బీఐ ఆదేశం

ముంబై: వైకల్యంతో బాధపడే కస్టమర్లు సులభంగా సేవలు పొందే విధంగా బ్యాంక్‌లు తమ చెల్లింపుల వ్యవస్థలను సమీక్షించుకోవాలని ఆర్‌బీఐ కోరింది. సమాజంలోని అన్ని వర్గాలు, దివ్యాంగులు సైతం డిజిటల్ చెల్లింపులను అనుసరిస్తున్న విషయాన్ని గుర్తు చేసింది. ''మరింత మెరుగైన సేవలను పొందేందుకు వీలుగా చెల్లింపుల వ్యవస్థల భాగస్వాములు (పీఎస్‌పీలు/బ్యాంక్‌లు/నాన్ బ్యాంక్ పేమెంట్ సిస్టమ్ ప్రొవైడర్లు) తమ చెల్లింపుల వ్యవస్థలు/పరికరాలను సమీక్షించాలి. దివ్యాంగులు సైతం సులభంగా వినియోగించుకునే విధంగా ఉండాలి. సమీక్ష అనంతరం దివ్యాంగులు సైతం వినియోగించుకునేందుకు వీలుగా.. బ్యాంక్‌లు, నాన్ బ్యాంక్ పేమెంట్ సిస్టమ్ ప్రొవైడర్లు తమ వ్యవస్థల్లో, పీవోఎస్ మెషిన్లలో అవసరమైన మార్పులు చేయాలి''అని ఆర్‌బీఐ తన సర్క్యులర్‌లో పేర్కొంది.

11 లక్షల వాణిజ్య వాహనాలు

తుక్కు తుక్కు!

- 15 ఏళ్లు నిండిన పాత వాహనాలు
- నిబంధనల ప్రకారం తుక్కుగా మారాలి
- అన్నీ స్క్రాపేజీ కిందకు రాకపోవచ్చు
- రేటింగ్ ఏజెన్సీ ఇక్రా అంచనా



ముంబై: దేశంలో ఈ ఏడాది మార్చి నాటికి 15 ఏళ్ల జీవిత కాలం పూర్తయిన మధ్యస్థ, భారీ వాణిజ్య వాహనాలు (ఎంఅండ్‌హెచ్‌సీవీలు) 11 లక్షల మేర ఉంటాయని, నిబంధనల ప్రకారం ఇవన్నీ తుక్కు కిందకు వెళ్లాల్సి ఉంటుందని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా తెలిపింది. కానీ, గడువు ముగిసిన తర్వాత కూడా వాటిని నడిపిస్తుండడం వల్ల తుక్కు కిందకు మారేవి వాస్తవంగా ఇంతకంటే తక్కువగా ఉండొచ్చని అంచనా వేసింది. వీటిల్లో కొంత మేర తుక్కుగా మారినా కానీ, వాణిజ్య వాహన అమ్మకాల డిమాండ్‌కు కొంత మేర మద్దతుగా నిలవొచ్చని పేర్కొంది. 'వాలంటరీ వెహికల్ ఫ్లీట్ మోడరేషన్ ప్రోగ్రామ్' లేదా స్క్రాపేజీ పాలసీని 2021 మార్చిలో ప్రకటించగా.. 2023 ఏప్రిల్ 1 నుంచి దశలవారీగా అమలు చేస్తుండడం గమనార్హం. మొదటి దశలో 15 ఏళ్ల జీవిత కాలం ముగిసిన ప్రభుత్వ వాహనాలను తుక్కుగా మార్చనున్నారు. ఈ ఏడాది జూన్ 1 నుంచి అమల్లోకి వచ్చిన రెండో దశలో భాగంగా.. వాహనం వయసుతో సంబంధం లేకుండా ఫిట్‌నెస్ ఆధారంగా తుక్కుగా మార్చడం తప్పనిసరి చేశారు. అంటే నిబంధనలకు మించి కాలుష్యం విడుదల చేసే వాహనాలను కాలంతో సంబంధం లేకుండా తుక్కుగా మార్చనున్నారు.

మరో 5.7 లక్షల వాహనాలు..

2027 మార్చి నాటికి మరో 5.7 లక్షల వాహనాలు 15 ఏళ్ల జీవిత కాలం పూర్తి చేసుకుంటాయని ఇక్రా తెలిపింది. మొదటి దశలో భాగంగా 9 లక్షల ప్రభుత్వ వాణిజ్య వాహనాలు తుక్కుగా మార్చడం వంటివి కొత్త వాహన కొనుగోళ్ల డిమాండ్‌ను పెంచనున్నట్టు అంచనా వేసింది. ఇక ప్యాసింజర్ వాహనాలు, తేలికపాటి వాణిజ్య వాహనాలు, ద్విచక్ర వాహనాల వినియోగం తక్కువగా ఉన్నందున ఈ విభాగాల నుంచి తుక్కుగా మారేవి తక్కువగానే ఉండొచ్చని ఇక్రా తెలిపింది. స్క్రాపేజీ పాలసీ అమల్లోకి వచ్చినప్పటికీ వాహన యజమానుల నుంచి స్పందన పరిమితంగానే ఉన్నట్టు ఇక్రా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. 2024 ఆగస్ట్ 31 నాటికి వాహన తుక్కు కేంద్రాలు కేవలం 44,803 ప్రైవేటు వాహనాలు, 41,432 ప్రభుత్వ వాహనాలకు సంబంధించిన స్క్రాప్ దరఖాస్తులనే అందుకున్నట్టు ఇక్రా నివేదిక తెలిపింది.

దీర్ఘకాలంలో ప్రయోజనాలు..

''వాహన తుక్కు విధానంతో దీర్ఘకాలంలో పలు ప్రయోజనాలున్నాయి. పాత వాహనాలను తుక్కుగా మార్చడం వల్ల వాయు కాలుష్యం తగ్గుతుంది. ఫ్లీట్ ఆధునికీకరణ (కొత్త వాహన కొనుగోళ్లు) కార్యక్రమానికి ఇది దారితీస్తుంది. మొత్తం మీద ఆటో పరిశ్రమలో అమ్మకాలకు మద్దతుగా నిలుస్తుంది. ఆటోమోటివ్ ఓఈఎంలకు ముడి సరుకుల వ్యయాలను గణనీయంగా తగ్గిస్తుంది''అని ఇక్రా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కింజాల్ షా వివరించారు.

అక్రమ లావాదేవీల పట్ల తస్మాత్ జాగ్రత్త

- బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలకు ఆర్‌బీఐ మార్గదర్శకాలు
- సమాచార సేకరణపైదృష్టి పెట్టాలని నిర్దేశం



ముంబై: అక్రమ లావాదేవీలపై బ్యాంకులు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలు (ఎన్‌బీఎఫ్‌సీ)సహా తన నియంత్రణలో ఉన్న అన్ని సంస్థలూ ఎల్లప్పుడు అప్రమత్తంగా ఉండాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) నిర్దేశించింది. ఈ సమస్య అరికట్టడానికి సంబంధిత అంతర్గత, బాహ్య వనరుల నుండి పొందిన సమాచారాన్ని వినియోగించుకోవాలని సూచించింది. ఈ మేరకు సెంట్రల్ బ్యాంక్ 'మనీ లాండరింగ్/టెర్రరిస్ట్ ఫైనాన్సింగ్ ఇంటర్నల్ రిస్క్ అసెస్‌మెంట్ గైడెన్స్'ను జారీ చేసింది. అక్రమ ధనార్జన, తీవ్రవాదులకు ఫైనాన్సింగ్ వంటి అంశాలు వ్యవస్థలపై తీవ్ర ప్రభావం చూపుతాయని, బ్యాంక్ సాధరణ ఖాతాదారులకు, దేశాలకు, భౌగోళిక ప్రాంతాలకు, ఉత్పత్తులకు, సేవలకు, లావాదేవీలకు అలాగే డెలివరీ చానెళ్ల ప్రయోజనాలకు తీవ్ర విఘాతం కలుగజేస్తాయని వివరించింది. ఈ నేపథ్యంలో ఈ సమస్యకు సంబంధించిన సవాళ్లను ఎదుర్కొనడానికి నిరంతర నిఘా, కాలానుగుణమైన పర్యవేక్షణ అవసరమని సెంట్రల్ బ్యాంక్ స్పష్టం చేసింది. ఎప్పటికప్పుడు మారుతున్న వ్యాపార పరిస్థితులు, బ్యాంకులు–తదితర నియంత్రిత సంస్థలు అందించే బ్యాంకింగ్, ఇతర ఆర్థిక ఉత్పత్తులలో పెరుగుతున్న సంక్లిష్టత స్థాయిలు, పోటీ పరిస్థితుల నేపథ్యంలో మనీలాండరింగ్, ఉగ్రవాద ఫైనాన్సింగ్ వంటి సవాళ్లు పెరిగే అవకాశం ఉంటుందని హెచ్చరించింది. అత్యాధునిక సాంకేతికత వినియోగం, చెల్లింపుల విధానాల్లో కొత్త పద్ధతులు వంటి అంశాలు సమస్యను మరింత తీవ్రతరం చేస్తున్నాయని పేర్కొంది.


ప్రాక్టీస్‌లో భారత ఫుట్‌బాల్ జట్టు

భారత్ X వియత్నాం

- నేడు స్నేహపూర్వక ఫుట్‌బాల్ మ్యాచ్
- సాయంత్రం గం. 4:30 నుంచి

నామ్ దిన్హ్ (వియత్నాం): కొత్త కోచ్‌గా మనోలో మార్క్వెజ్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలి విజయం కోసం చూస్తున్న భారత సీనియర్ పురుషుల ఫుట్‌బాల్ జట్టు శనివారం వియత్నాంతో అంతర్జాతీయ స్నేహపూర్వక మ్యాచ్ ఆడనుంది. షెడ్యూల్ ప్రకారం భారత జట్టు ఈ నెల 7 నుంచి 15 వరకు వియత్నాం వేదికగా ముక్కోణపు టోర్నీలో పాల్గొనాల్సి ఉండగా... మూడో దేశమైన లెబనాన్ తప్పుకోవడంతో టోర్నీ రద్దయింది. లెబనాన్, ఇజ్రాయిల్ మధ్య యుద్ధ వాతావరణం కొనసాగుతుండటంతో లెబనాన్ టోర్నీకి దూరమైంది.. ముక్కోణపు టోర్నీ సాధ్యపడకపోవడంతో భారత్, వియత్నాం మధ్య స్నేహపూర్వక మ్యాచ్ నిర్వహణకు మొగ్గు చూపాయి. వియత్నాం రాజధాని హనోయ్‌కి సమీపంలోని తియోన్ తువోంగ్ స్టేడియంలో ఇరు జట్ల మధ్య మ్యాచ్ జరగనుంది. మనోలో మార్క్వెజ్ భారత ఫుట్‌బాల్ హెడ్‌కోచ్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం హైదరాబాద్ వేదికగా ఆడిన ఆసియా కాంటినెంటల్ కప్‌లో భారత్ ఒక్క విజయం కూడా సాధించలేకపోయింది. మారిషస్‌తో పోరును 'డ్రా'చేసుకున్న భారత్... సిరియా చేతిలో 0–3 తేడాతో ఓటమి పాలైంది. 'ఫిఫా' ప్రపంచ ర్యాంకింగ్స్‌లో భారత్ ప్రస్తుతం 126వ స్థానంలో ఉండగా... వియత్నాం 116వ ర్యాంక్‌లో ఉంది. ఈ శతాబ్దంలో ఇరు జట్ల మధ్య ఇప్పటి వరకు మూడు మ్యాచ్‌లు జరగగా... వాటిలో వియత్నం రెండు మ్యాచ్‌ల్లో, భారత్ ఒక దాంట్లో గెలుపొందాయి. 'ప్రపంచకప్ క్వాలిఫయర్స్‌లో చివరి రౌండ్‌కు చేరిన వియత్నాంతో ఆడటం భారత్‌కు మంచిదే. ఇరు జట్లు హోరాహోరీగా పోరాడటం ఖాయం. ఇటీవలి కాలంలో వియత్నాం ప్లేయర్ల ఆటతీరు బాగా మెరుగైంది. నైపుణ్యం ఉన్న 20 మంది ప్లేయర్లు అందుబాటులో ఉన్నారు. పరిస్థితులను బట్టి ముందుకు సాగుతాం. ప్రత్యేక శిక్షణ శిబిరం నిర్వహించడం వల్ల మేలు జరిగింది'అని భారత కోచ్ మార్క్వెజ్ అన్నాడు. ఈ మ్యాచ్ కోసం ఆకాశ్ సాంగ్వాన్ జాతీయ జట్టుకు తొలిసారి ఎంపికవగా... ఫారూఖ్ చౌదరి మూడేళ్ల తర్వాత టీమ్‌లోకి వచ్చాడు. ప్రస్తుతం జాతీయ జట్టులో ఉన్న ఆటగాళ్లందరూ ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్) వివిధ జట్లకు ప్రాతినిధ్యం వహిస్తుండటంతో... అంతర్జాతీయ మ్యాచ్ కోసం లీగ్‌కు పది రోజుల విరామం ఇచ్చారు.

అదరగొట్టిన ఆంధ్ర బౌలర్లు

- విదర్భ 118 ఆలౌట్
- ఆంధ్ర తొలి ఇన్నింగ్స్ 114/1
- హైదరాబాద్‌తో మ్యాచ్‌లో గుజరాత్ 334/8
- రంజీ ట్రోఫీ

నాగ్‌పూర్: దేశవాళీ ప్రతిష్టాత్మక క్రికెట్ టోర్నమెంట్ రంజీ ట్రోఫీ ఆరంభ పోరులో ఆంధ్ర జట్టు అదరగొట్టింది. గ్రూప్ 'బి'లో భాగంగా శుక్రవారం ప్రారంభమైన పోరులో ఆంధ్ర బౌలర్లు చెలరేగడంతో విదర్భ తొలి ఇన్నింగ్స్‌లో 38.5 ఓవర్లలో 118 పరుగులకే ఆలౌటైంది. కెప్టెన్ అక్షయ్ వాడ్కర్ (92 బంతుల్లో 46 నాటౌట్; 4 ఫోర్లు) టాప్ స్కోరర్ కాగా.. కరుణ్ నాయర్ (12), దానిశ్ మాల్వేర్ (8), యష్ రాథోడ్ (0), అమన్ మొఖడే (0), అథర్వ (17), హర్ష్ దూబే (5), నచికేత్ భూటె (2) విఫలమయ్యారు. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న విదర్భకు ఏదీ కలిసి రాలేదు. స్కోరు బోర్డుపై ఒక్క పరుగు కూడా జతకాక ముందే అమన్ రనౌట్ రూపంలో వెనుదిరగగా... ఆ తర్వాత ఆ జట్టు కోలుకోలేకపోయింది. వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయింది. మూడో ఓవర్‌లో యష్ రాథోడ్‌ను పెవిలియన్‌కు పంపిన స్టీఫెన్... ఆదుకుంటాడు అనుకున్న అథర్వను కూడా బుట్టలో వేసుకోవడంతో ఇక విదర్భ జట్టు కోలుకోలేకపోయింది. కెప్టెన్ అక్షయ్ వాడ్కర్ ఒంటరి పోరాటం చేయగా.. అతడికి సహకరించేవారే కరువయ్యారు. ఆఖర్లో ఉమేశ్ యాదవ్ (20; 2 ఫోర్లు, ఒక సిక్సర్) ధాటిగా ఆడాడంతో జట్టు కనీసం వంద పరుగుల మార్కు దాటగలిగింది. ఆంధ్ర బౌలర్లలో కేవీ శశికాంత్ 3, చీపురుపల్లి స్టీఫెన్, సత్యనారాయణ రాజు, లలిత్ మోహన్ తలా రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆంధ్ర జట్టు శుక్రవారం ఆట ముగిసే సమయానికి 33 ఓవర్లలో వికెట్ నష్టానికి 114 పరుగులు చేసింది. ఓపెనర్ అభిషేక్ రెడ్డి (105 బంతుల్లో 62 బ్యాటింగ్; 11 ఫోర్లు) అర్ధశతకంతో రాణించగా... రైజింగ్ ఆటగాడు షేక్ రషీద్ (91 బంతుల్లో 49 బ్యాటింగ్; 7 ఫోర్లు) సత్తాచాటాడు. స్టార్ ఆటగాడు హనుమ విహారి (1) ఆకట్టుకోలేకపోయాడు. విదర్భ బౌలర్లలో ఆదిత్య ఒక వికెట్ పడగొట్టాడు. చేతిలో తొమ్మిది వికెట్లు ఉన్న ఆంధ్ర జట్టు ప్రత్యర్థి స్కోరుకు 4 పరుగులు వెనుకబడి ఉంది. మరో మూడు రోజుల ఆట మిగిలుండగా... ఈ మ్యాచ్‌పై పట్టు సాధించేందుకు ఆంధ్ర బౌలర్లు అనువైన వేదికను సిద్ధం చేశారు.

స్కోరు వివరాలు


విదర్భ తొలి ఇన్నింగ్స్: అథర్వ (సి) రికీ భుయ్ (బి) స్టీఫెన్ 17; అమన్ (రనౌట్/విజయ్) 0; యష్ రాథోడ్ (సి) హనుమ విహారి (బి) స్టీఫెన్ 0; కరుణ్ నాయర్ (ఎల్బీడబ్ల్యూ) శశికాంత్ 12; దానిశ్ మాలేవర్ (సి) రషీద్ (బి) రాజు 8; అక్షయ్ వాడ్కర్ (నాటౌట్) 46; హర్ష్ దూబే (ఎల్బీడబ్ల్యూ) శశికాంత్ 5; నచికేత్ (బి) రాజు 2; ఉమేశ్ యాదవ్ (సి) శశికాంత్ (బి) లలిత్ మోహన్ 20; అక్షయ్ వాఖరె (సి) శ్రీకర్ భరత్ (బి) లలిత్ మోహన్ 0; ఆదిత్య (సి) అశ్విన్ హెబ్బర్ (బి) శశికాంత్ 5; ఎక్స్‌ట్రాలు 3, **మొత్తం: (38.5 ఓవర్లలో ఆలౌట్) 118. వికెట్ల పతనం:** 1–0, 2–6, 3–26, 4–30, 5–47, 6–62, 7–65, 8–97, 9–101, 10–118, **బౌలింగ్:** చీపురుపల్లి స్టీఫెన్ 11–3–43–2; సత్యనారాయణ రాజు 9–2–26–2; శశికాంత్ 11.5–3–31–3; లలిత్ మోహన్ 7–2–18–2.

ఆంధ్ర తొలి ఇన్నింగ్స్: అభిషేక్ రెడ్డి (నాటౌట్) 62; హనుమ విహారి (సి) దానిశ్ (బి) ఆదిత్య 1; షేక్ రషీద్ (నాటౌట్) 49; ఎక్స్‌ట్రాలు 2, **మొత్తం (33 ఓవర్లలో వికెట్ నష్టానికి) 114. వికెట్ల పతనం:** 1–2, **బౌలింగ్:** ఉమేశ్ యాదవ్ 6.5–1–18–0; ఆదిత్య 9–2–34–1; హర్ష్ దూబే 7–0–30–0; నచికేత్ 5–0–23–0; అథర్వ 0.1–0–4–0; అక్షయ్ వాడ్కర్ 5–1–5–0.


శశికాంత్

మనన్ అజేయ సెంచరీ

సాక్షి, హైదరాబాద్: గత ఏడాది ప్లేట్ గ్రూప్‌లో బలహీన జట్లపై భారీ విజయాలతో ఎలైట్ డివిజన్‌కు అర్హత సాధించిన హైదరాబాద్ జట్టు ఈ సీజన్ తొలి మ్యాచ్‌లో ఓ మాదిరి ప్రదర్శన చేసింది. సికింద్రాబాద్‌లోని జింఖానా మైదానంలో శుక్రవారం హైదరాబాద్, గుజరాత్ మధ్య రంజీ మ్యాచ్ ప్రారంభమైంది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న గుజరాత్ తొలి రోజు ఆట ముగిసే సమయానికి 86 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 334 పరుగులు చేసింది. మిడిలార్డర్ ప్లేయర్ మనన్ హింగ్‌రాజియా (259 బంతుల్లో 174 బ్యాటింగ్; 24 ఫోర్లు, 2 సిక్సర్లు) భారీ సెంచరీతో కదం తొక్కాడు. బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉన్న పిచ్‌పై మనన్ చక్కటి ఇన్నింగ్స్‌తో చెలరేగగా... మిగిలిన ప్లేయర్లను అడ్డుకోగలిగిన హైదరాబాద్ బౌలర్లు మనన్ జోరును మాత్రం ఆపలేకపోయారు. వికెట్ కీపర్ ఉర్విల్ పటేల్ (94 బంతుల్లో 60; 5 ఫోర్లు, 2 సిక్సర్లు) అర్ధశతకంతో రాణించాడు. రిషిల్ పటేల్ (0), ప్రియాంక్ పాంచల్ (15), సిద్ధార్థ్ దేశాయ్ (8), జయ్‌మీత్ పటేల్



(1), కెప్టెన్ చింతన్ గాజా (0) విఫలమయ్యారు. హైదరాబాద్ బౌలర్లు కలిసి కట్టుగా రాణించడంతో ఒక దశలో గుజరాత్ 98 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. అయితే ఈ దశలో ఉర్విల్ పటేల్ సహకారంతో మనన్ ఇన్నింగ్స్‌ను నిలబెట్టాడు. ఆచితూచి ఆడుతూనే వీలు చిక్కినప్పుడల్లా బౌండ్రీలు బాదుతూ స్కోరు బోర్డును నడిపించాడు. వీరిద్దరు ఆరో వికెట్‌కు 112 పరుగులు జోడించడంతో గుజరాత్ కోలుకోగలిగింది. ఆ తర్వాత స్వల్ప వ్యవధిలోనే మరో రెండు వికెట్లు పడ్డా... ఆఖర్లో రికేశ్ వాఘేలా (51 బంతుల్లో 24 బ్యాటింగ్; 5 ఫోర్లు) అండతో మనన్ జట్టును భారీ స్కోరు దిశగా నడిపించాడు. ఈ ఇద్దరూ అబేధ్యమైన తొమ్మిదో వికెట్‌కు 104 పరుగులు జోడించడం గమనార్హం. హైదరాబాద్ బౌలర్లలో చామా మిలింద్ 3 వికెట్లు పడగొట్టగా... నిశాంత్, తనయ్ త్యాగరాజన్ చెరో రెండు వికెట్లు తీశారు. టీమిండియా ఆటగాడు ఠాకూర్ తిలక్ వర్మ అందుబాటులో లేకపోవడంతో ఈ మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టుకు రాహుల్ సింగ్ సారథిగా వ్యవహరించాడు.

స్కోరు వివరాలు

గుజరాత్ తొలి ఇన్నింగ్స్: రిషి పటేల్ (సి) రోహిత్ రాయుడు (బి) మిలింద్ 0; ప్రియాంక్ పాంచల్ (సి)రోహిత్ రాయుడు (బి) నిశాంత్ 15; సిద్ధార్థ్ దేశాయ్ (సి) తన్మయ్ (బి) రక్షణ్ రెడ్డి 8; మనన్ హింగ్‌రాజియా (నాటౌట్) 174; ఉమంగ్ కుమార్ (బి) నిశాంత్ 28; జయ్‌మీత్ పటేల్ (సి) రాహుల్ సింగ్ (బి) తనయ్ త్యాగరాజన్ 1; ఉర్విల్ పటేల్ (సి) రక్షణ్ రెడ్డి (బి) తనయ్ త్యాగరాజన్ 60; చింతన్ గాజా (సి) రాధేశ్ (బి) మిలింద్ 0; అర్జాన్ (సి అండ్ బి) మిలింద్ 8; రింకేశ్ (నాటౌట్) 24; ఎక్స్‌ట్రాలు 16, **మొత్తం (86 ఓవర్లలో 8 వికెట్లకు) 334. వికెట్ల పతనం:** 1–0, 2–19, 3–38, 4–97, 5–98, 6–210, 7–216, 8–230, **బౌలింగ్:** చామా మిలింద్ 15–3–51–3; రక్షణ్ రెడ్డి 16–2–71–1; నిశాంత్ 12–2–46–2; తనయ్ త్యాగరాజన్ 20–1–62–2; రోహిత్ రాయుడు 11–3–38–0; అనికేత్ రెడ్డి 12–0–51–0.


తమిళనాడు బౌలర్ మొహమ్మద్‌కు సహచరుల అభినందన

సౌరాష్ట్ర 203 ఆలౌట్

- తమిళనాడుతో రంజీ మ్యాచ్
- చతేశ్వర్ పుజారా విఫలం

కోయంబత్తూర్: రంజీ ట్రోఫీలో గ్రూప్ 'డి'లో భాగంగా సౌరాష్ట్రతో మ్యాచ్‌లో తమిళనాడు బౌలర్లు సమష్టిగా సత్తాచాటారు. సోను యాదవ్ (3/30), మొహమ్మద్ (3/38), సాయి కిశోర్ (3/54) రాణించడంతో... సౌరాష్ట్ర తొలి ఇన్నింగ్స్‌లో 77 ఓవర్లలో 203 పరుగులకు ఆలౌటైంది. భారత టెస్టు జట్టులో చోటు కోల్పోయిన సీనియర్ ప్లేయర్ చతేశ్వర్ పుజారా (16) విఫలం కాగా... అర్పిత్ వసవాడా (149 బంతుల్లో 62 నాటౌట్; 5 ఫోర్లు) అర్ధశతకంతో రాణించాడు. చిరాగ్ జానీ (34), పర్శ్వరాజ్ రాణా (15), షెల్డన్ జాక్సన్ (21), ప్రేరక్ మాన్కడ్ (20), కెప్టెన్ జయ్‌దేవ్ ఉనాద్కట్ (21) మెరుగైన ఆరంభాలను భారీ స్కోర్లుగా మలచలేకపోయారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన తమిళనాడు ఆట ముగిసే సమయానికి రెండు ఓవర్లలో వికెట్ నష్టపోకుండా పరుగులేమీ చేయలేదు. గ్రూప్‌లో భాగంగా ఢిల్లీతో జరుగుతున్న మ్యాచ్‌లో ఛత్తీస్‌గఢ్ 86 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 277 పరుగులు చేసింది. అస్సామ్‌తో మ్యాచ్‌లో జార్ఖండ్ 75 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 247 పరుగులు చేసింది.

బరోడా తొలి ఇన్నింగ్స్ 241/6

వడోదర: డిఫెండింగ్ చాంపియన్ ముంబైతో జరుగుతున్న రంజీ ట్రోఫీ గ్రూప్ 'ఎ' మ్యాచ్‌లో బరోడా జట్టు ఫర్వాలేదనిపించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న బరోడా... తొలి రోజు శుక్రవారం ఆట ముగిసే సమయానికి 87 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 241 పరుగులు చేసింది. మితేశ్ పటేల్ (159 బంతుల్లో 86; 8 ఫోర్లు), అతిత్ సేథ్ (143 బంతుల్లో 60 బ్యాటింగ్; 2 ఫోర్లు) అర్ధశతకాలతో ఆకట్టుకున్నారు. టాపార్డర్ విఫలం కావడంతో ఒక దశలో 90 పరుగులకే 5 వికెట్లు కోల్పోయిన బరోడా జట్టు... ఆ తర్వాత మితేశ్, అతిత్ పోరాటంతో కోలుకోగలిగింది. జ్యోత్స్నిల్ సింగ్ (10), శివాలిక్ శర్మ (0), శాశ్వత్ రావత్ (25), విష్ణు సోలాంకి (18), కెప్టెన్ కృనాల్ పాండ్యా (21) ఎక్కువసేపు నిలువలేకపోయారు. ముంబై బౌలర్లలో షమ్స్ ములానీ, తనుశ్ కొటియాన్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. శార్దూల్ ఠాకూర్, మోహిత్ అవస్థి చెరో వికెట్ తీశారు. అతిత్ సేథ్‌తో పాటు రాజ్ లింబాని (14 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. గ్రూప్‌లో భాగంగా మహారాష్ట్రతో జరుగుతున్న మ్యాచ్‌లో జమ్మూ కశ్మీర్ జట్టు 80 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 264 పరుగులు చేసింది. శుభమ్ ఖజురియా (200 బంతుల్లో 130 బ్యాటింగ్; 18 ఫోర్లు, 2 సిక్సర్లు) సెంచరీతో చెలరేగాడు. మేఘాలయాతో జరుగుతున్న మరో మ్యాచ్‌లో సర్వీసెస్ 90 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 298 పరుగులు చేసింది. రవి చౌహాన్ (164 బంతుల్లో 113; 12 ఫోర్లు, 2 సిక్సర్లు) శతకం సాధించాడు.

వ్యక్తిగత కోచ్ కావాలి

పంచ్ పవర్‌లో పుంజుకోవాలి

భారత బాక్సర్ నిఖత్ జరీన్

న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్ నుంచి చేదు ఫలితంతో తిరిగొచ్చిన ప్రపంచ చాంపియన్, తెలంగాణ స్టార్ నిఖత్ జరీన్ త్వరలోనే పంచ్ పవర్‌ను పెంచుకొని రింగ్‌లోకి దిగుతానని చెప్పింది. ఇందుకోసం వ్యక్తిగత కోచ్ అవసరమని... ప్రస్తుతం కోచ్‌ను నియమించుకునే పనిలో నిమగ్నమైనట్లు నిఖత్ వెల్లడించింది. మహిళల 50 కేజీల ఈవెంట్‌లో భారత్ ఆమెపై ఆశలు పెట్టుకుంది. ఈ చాంపియన్ బాక్సర్ తప్పకుండా పతకం సాధిస్తుందనే అంచనాలతో బరిలోకి దిగగా ఊహించని స్థాయిలో భారత శిబిరానికి నిరాశ ఎదురైంది. ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన ఆరుగురిలో అందరికంటే ముందుగా బెర్తు సాధించిన తెలంగాణ స్టార్... పారిస్‌లో ప్రిలిమినరీ దశలో ఆసియా క్రీడల చాంపియన్ వూ యు (చైనా) చేతిలో కంగుతింది. 'లోపాలు లేకుండా ఎవరూ ఉండరు. పైగా ఆ రోజు నాకు కలిసిరాలేదు. నేను అన్‌సీడెడ్ ప్లేయర్ కాబట్టి ఆరంభంలోనే నాకు క్లిష్టమైన ప్రత్యర్థి ఎదురైంది. చిత్రమేమిటంటే ఈ ఒలింపిక్స్‌లో పతకాలు గెలిచిన వారెవరైతే ఉన్నారో వాళ్లను గతంలో నేను ఓడించాను. ఇది తలచుకుంటేనే బాధేస్తుంది. ఏదేమైనా జీవితంలో అన్నింటిని స్వీకరించాలి గెలుపైనా... ఓటమైనా! నాతో ఎలాంటి ప్రణాళిక లేదు. కానీ ఎలా ఎదగాలో... ఎలా పుంజుకోవాలో తెలుసు. ఇప్పటివరకు నాకు వ్యక్తిగత కోచ్ లేదు. నేను నా శక్తిసామర్థ్యాలు పెంచుకోవాలంటే కోచ్ కావాల్సిందే. అతని శిక్షణతో రాటుదేలాలి. ఉత్తమ బాక్సర్‌గా ఎదగాలంటే మంచి కోచ్ వద్ద ట్రెయినింగ్ తప్పనిసరి. సుశిక్షితుడైన కోచ్ దొరికితే ఎలా సన్నద్ధం కావాలో నాకు తెలుసు' అని రెండుసార్లు ప్రపంచ చాంపియన్ అయిన నిఖత్ జరీన్ వివరించింది. భిన్నశైలి బాక్సర్లతో విభిన్నమైన పద్ధతుల్లో తలపడితేనే ఆట తీరు మారుతుందని ఆమె ఆశిస్తోంది. తనలో లోపాలున్న చోట సరి దిద్దుకునే పనిలో ఉన్నానని ముందుగా బలంగా తయారయ్యేందుకు ప్రాధాన్యమిస్తున్నట్లు చెప్పింది. తద్వారా పంచ్ పవర్‌ను పెంచుకోవచ్చని తెలిపింది.





సెమీఫైనల్లో శ్రీవల్లి రష్మిక

మైసూర్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) మహిళల టోర్నీ మైసూర్ ఓపెన్‌లో తెలంగాణ క్రీడాకారిణి భమిడిపాటి శ్రీవల్లి రష్మిక సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 318వ ర్యాంకర్ శ్రీవల్లి రష్మిక 6–2, 6–3తో ఆకాంక్ష (భారత్)పై విజయం సాధించింది. మ్యాచ్ ఆరంభం నుంచి పూర్తి ఆధిపత్యం కనబర్చిన రష్మిక... ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా వరస సెట్లలో విజయం సాధించింది. మరో తెలంగాణ ప్లేయర్ స్మృతి భాసిన్ క్వార్టర్ ఫైనల్లో 6–0, 3–6, 5–7తో రియా భాటియా (భారత్) చేతిలో ఓడింది. మరో క్వార్టర్ ఫైనల్లో జెస్సీ యానీ (అమెరికా) 6–4, 6–0తో పూజా ఇంగాలె (భారత్) పై గెలిచి ముందంజ వేసింది. మూడో సీడ్ ఎలీనా జంషిడి (డెన్మార్క్) అనారోగ్యం కారణంగా మ్యాచ్ మధ్యలో తప్పుకోవడంతో... భారత ప్లేయర్ లక్ష్మి 6–4, 2–1తో ముందంజ వేసింది. మహిళల డబుల్స్ సెమీఫైనల్లో నాలుగో సీడ్ సోహా సాధిఖ్–ఆకాంక్ష (భారత్) జంట 6–1, 6–3తో పోలీనా–రలీనా (రష్యా) జోడీపై విజయం సాధించింది. మరో సెమీఫైనల్లో జెస్సీ యానీ (అమెరికా)–రియా భాటియా (భారత్) ద్వయం 6–2, 6–0తో దివ భాటియా–సాయి సంహిత (భారత్) జంట విజయం సాధించింది.

ఫెనెస్టా టెన్నిస్ టోర్నీ ఫైనల్లో అహాన్


న్యూఢిల్లీ: ఫెనెస్టా ఓపెన్ జాతీయ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో ఒడిశా ప్లేయర్ అహాన్ అదరగొట్టింది. అండర్–16, అండర్–14 విభాగాల్లో బరిలోకి దిగిన అహాన్ రెండింట్లోనూ ఫైనల్‌కు దూసుకెళ్లింది. అండర్–16 బాలికల సింగిల్స్ సెమీఫైనల్లో అహాన్ 7–5, 6–0తో ఏంజెల్ పటేల్‌పై విజయం సాధించింది. మరో సెమీఫైనల్లో ఐశ్వర్య జాదవ్ 6–4, 6–3తో యషిక షోకీన్‌పై గెలిచి తుదిపోరుకు అర్హత సాధించింది. అండర్–14 బాలికల సింగిల్స్ సెమీఫైనల్లో అహాన్ 6–1, 6–0తో అవిష్టపై గెలిచి ఫైనల్లో అడుగుపెట్టింది. బాలుర విభాగంలో సమర్థ్ తుదిపోరుకు చేరాడు.



కోల్‌కతాలోని బాఘా జతిన్ పూజా మంటపంలో శాంతమూర్తికి బదులు రౌద్రరూపంలో కాళీమాత



కోల్‌కతాలోని కంకుర్‌గచ్చిలో షేమ్ ఇతివృత్తంతో రూపుదిద్దుకున్న మంటపం



కుట్టు మిషన్ దగ్గర కూర్చున్న బాధితురాలి తండ్రి, గోడకు తగిలించిన ఆమె ఫొటో.. మంచంపై బాధితురాలి తల్లి ప్రతిమలతో మంటపం

మండపాలు వేదికగా ▸ నిరసనలు

నవరాత్రి ఉత్సవాలు అంటే.. బెంగాల్. బెంగాల్ అంటే నవరాత్రి ఉత్సవాలు. అలాంటిది ఈ సారి పండుగ దృశ్యం పూర్తిగా మారిపోయింది. కోల్‌కతాలోని ఆర్.జి.కర్ ఆస్పత్రిలో ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం, హత్య తరువాత.. దుర్గామాత మండపాలు సైతం నిరసనలను ప్రతిబింబిస్తున్నాయి. సాధారణంగా బెంగాల్‌లోని దుర్గా పూజ మండపాల్లో దేవత నిలబడి ఉంటుంది. ఇరువైపులా వినాయకుడు, కార్తికేయుడు, దేవతలు లక్ష్మీ, సరస్వతులు ఉంటాయి. ఆమె పాదాల దగ్గర రాక్షసుడు ఉంటాడు. ఇంకొందరైతే మరికొంత విశాలంగా ఆలోచించి.. బుర్జ్ ఖలీఫా ప్రతీకనో, సుందర్‌బన్ అడవులనో ప్రతిబింబిస్తారు. ఇంకొందరు నీటి సంరక్షణ, ప్రపంచశాంతి వంటి సామాజిక సందేశాలను ప్రదర్శిస్తారు. కానీ ఈసారి ఇవేవీ జనాన్ని ఆకర్షించడం లేదు. చాలా మండపాలు నిరసన ప్రదర్శనలుగా మారాయి. వాటిని చూడటానికి కూడా జనం ఆసక్తి చూపుతున్నారు.

కోల్‌కతాలోని కంకుర్‌గచ్చిలో పూజ ఇతివృత్తంగా లజ్జ(షేమ్)ను ఎంచుకున్నారు. దుర్గాదేవి కళ్లు మూసుకుని ఉండగా.. తెల్లని షీటుతో చుట్టిన ఒక మహిళ శరీరంపై ఓ సింహం నిఘా పెట్టింది. పక్కనే బాధిత కుటుంబాన్ని ప్రదర్శించారు. మంచంపై కూర్చున్న తల్లి, కుట్టు మిషన్ దగ్గర కూర్చున్న తండ్రి, గోడపై కుమార్తె ఫొటో ఉన్నాయి. మహిళల ఆధ్వర్యంలో నడిచే ఓ మండపం థీమ్ వివక్ష. ఈ సంవత్సరం వారు దుర్గా పూజను పండుగ అని కాకుండా ప్రతిజ్ఞ అని పిలుస్తున్నారు. భారత రాజ్యాంగాన్ని, అందులోని అధికరణలను నేపథ్యంగా తీసుకున్నారు. ఒక మహిళ న్యాయం చేయాలనే రెండు చేతులు పైకెత్తి శూన్యంలోకి సహాయం కోసం అర్థిస్తోంది. 'రాజ్యాంగం చెప్తున్నదేమిటి? వాస్తవానికి జరుగుతున్నదేమిటి?' అంటూ స్థానిక నటులు వీధి నాటకం ప్రదర్శిస్తున్నారు. మరోచోట దేవత శక్తిని.. నిరసనల్లోని కొవ్వొత్తిని ప్రతిబింబిస్తూ ఏర్పాటు చేశారు. దక్షిణ కోల్‌కతాలోని బాఘా జతిన్ మండపం... దుర్గామాతను మరింత భయానకంగా ఏర్పాటు చేసింది. ఈ ఏడాది వేడుకలు జరుపుకొనే ఉత్సాహం లేదని.. అందుకే డ్యాన్సులను రద్దు చేసుకున్నామని మండపాల నిర్వాహకులు చెబుతున్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

భారత్‌లో దిగుమతి సుంకాలు అత్యధికం


గెలిస్తే నేనూ తిరిగి వడ్డిస్తా: ట్రంప్



వాషింగ్టన్: భారత్ ప్రపంచంలోనే అత్యధికంగా దిగుమతి సుంకాలు విధించే దేశమని రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ అన్నారు. అధ్యక్షుడిగా గెలిస్తే అమెరికాకు భారత్ ఎగుమతులపై తానూ సమానస్థాయిలో పన్నులు విధిస్తానని స్పష్టం చేశారు. విదేశీ వస్తువులపై భారత్‌లోనే దిగుమతి సుంకాలు అత్యధికమని, అయితే చిరునవ్వుతో పన్నులు విధిస్తుందని తనదైన శైలిలో ముక్తాయించారు. 'అమెరికాను అత్యంత సుసంపన్నం చేయడానికి నా ప్రణాళికలోని ముఖ్యమైన అంశం.. పరస్పర క్రయ విక్రయాలపై సమానస్థాయిలో పన్నులు విధించడం (ఒక దేశం అమెరికా వస్తువులపై ఎంత శాతమైతే పన్ను వేస్తుందో.. అదే స్థాయిలో అమెరికాకు వాటి ఎగుమతులపై పన్ను వేయడం). సాధారణంగా మనం దిగుమతి సుంకాలు వేయం. అధ్యక్షుడిగా ఉండగా నేనే పన్నులు వేసే ప్రక్రియను మొదలుపెట్టా. చైనా 200 శాతం దిగుమతి సుంకం వేస్తుంది. బ్రెజిల్ కూడా భారీగా పన్నులు విధిస్తుంది. అందరికంటే భారత్ అత్యధికంగా వసూలు చేస్తుంది' అని ట్రంప్ డెట్రాయిట్‌లో గురువారం ఒక ఆర్థిక విధాన ప్రసంగంలో అన్నారు. అయితే ప్రధాని మోదీపై ప్రశంసలు కురిపించి.. తన మాటల్లోని కాఠిన్యాన్ని తగ్గించే ప్రయత్నం చేశారు. 'భారత్‌తో మనకు సత్సంబంధాలు ఉన్నాయి. నాకూ అంతే. ముఖ్యంగా నాయకుడు మోదీతో. ఆయన గొప్ప నాయకుడు. చక్కటిపాలన అందిస్తున్నారు. చాలావాటిల్లో చైనా కంటే ఎక్కువగా భారత్ పన్నులు వేస్తుంది. కాకపోతే చిరునవ్వుతో.. భారత్ వస్తువులు కొన్నందుకు ధన్యవాదాలు అని చెబుతారు' అని ట్రంప్ అన్నారు. తాను అధ్యక్షుడిగా ఉన్నప్పుడు హార్లీ డేవిడ్‌సన్ మోటర్‌సైకిల్ కంపెనీ ప్రతినిధులు తనకిదే విషయం చెప్పారని వివరించారు.

అమెరికాలోనూ ఉచిత తాయిలాలు..!

ఇంధన బిల్లులు తగ్గిస్తానన్న ట్రంప్ హామీపై కేజ్రీవాల్



సాక్షి, న్యూఢిల్లీ: 'ఉచితాలు అమెరికా వరకూ వెళ్లాయి'అంటూ ఆప్ అధినేత, ఢిల్లీ మాజీ సీఎం కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో గెలిస్తే విద్యుత్తు చార్జీలను సగానికి తగ్గిస్తానంటూ అక్కడి రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ ఇచ్చిన హామీని శుక్రవారం ఆయన 'ఎక్స్'లో ప్రస్తావించారు. ట్రంప్ ట్వీట్‌ను ఆయన రీ ట్వీట్ చేస్తూ.. 'విద్యుత్తు బిల్లులు సగానికి తగ్గిస్తానంటూ ట్రంప్ ప్రకటించారు. ఉచిత తాయిలాలు అమెరికా వరకూ వెళ్లాయి'అంటూ పేర్కొన్నారు. కేజ్రీవాల్ ట్వీట్ ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరలవుతోంది. విద్యుత్, వైద్యం, విద్య ఉచితమంటూ ప్రజలను మభ్యపెడుతున్నారంటూ కేంద్రంలోని బీజేపీ, ఎన్డీఏ పక్షాలు కేజ్రీవాల్‌పై మండిపడుతుండటం తెలిసిందే. కాగా, అధ్యక్షుడిగా ఎన్నికై తే 12 నెలల్లో కరెంట్ బిల్లులతో పాటు ఇంధన బిల్లులను 50 శాతానికి తగ్గిస్తానని, దీనివల్ల అమెరికాలో వ్యాపారావకాశాలు పెరుగుతాయని ట్రంప్ ట్వీట్ చేశారు. విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు పర్యావరణ అనుమతులను వేగవంతం చేస్తానని కూడా ట్రంప్ ప్రకటించారు.

మరో నాలుగేళ్లు భరించలేం

ట్రంప్ అహంకారి, అసమర్థుడు, బడాయికోరు.. మనకు అవసరం లేదు

- మెరుగైన భవిష్యత్తు కావాలంటే కమలా హారిస్‌ను గెలిపించుకోవాలి
- పిట్స్‌బర్గ్ ఎన్నికల ప్రచారంలో డెమొక్రటిక్ నేత బరాక్ ఒబామా పిలుపు



వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న డొనాల్డ్ ట్రంప్‌పై మాజీ అధ్యక్షుడు, డెమొక్రటిక్ నాయకుడు బరాక్ ఒబామా విరుచుకుపడ్డారు. అహంకారి, అసమర్థుడు, బడాయికోరు, ప్రజల మధ్య చిచ్చు పెట్టే నాయకుడు మనకు అవసరం లేదని తేల్చిచెప్పారు. అలాంటి వ్యక్తిని మరో నాలుగేళ్లపాటు మనం భరించలేమని అన్నారు. పేజీ తిప్పేయడానికి అమెరికా సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఒకరిపై ఒకరు తిరగబడే పరిస్థితి రాకుండా కలిసి పనిచేసేలా ఉత్తమమైన పేజీ మన కోసం సిద్ధమవుతోందని తెలిపారు. అధ్యక్షురాలు కమలా హారిస్ కోసం మనం ఎదురు చూస్తున్నామని వ్యాఖ్యానించారు. పెన్సిల్వేనియా రాష్ట్రంలోని పిట్స్‌బర్గ్‌లో గురువారం డెమొక్రటిక్ పార్టీ ప్రచార కార్యక్రమంలో బరాక్ ఒబామా మాట్లాడారు. ట్రంప్ ప్రతిపాదిస్తున్న పన్ను విధానం, విదేశాంగ విధానాన్ని తప్పుపట్టారు. ట్రంప్ పచ్చి అబద్ధాలకోరు అని మండిపడ్డారు. జో బైడెన్ ప్రభుత్వం రిపబ్లికన్లకు తుపాను సాయం అందించలేదంటూ ట్రంప్ చేసిన ఆరోపణలను కొట్టిపారేశారు. బాధితులకు సాయం అందించడంలో ఎలాంటి వివక్ష ఉండదన్నారు. అమెరికా విలువలను ఉల్లంఘించవద్దని ట్రంప్‌నకు సూచించారు. ఈసారి అధ్యక్ష ఎన్నికలు హోరాహోరీగా జరగబోతున్నాయని, రిపబ్లికన్ అభ్యర్థి కమలా హారిస్ విజయం ఖాయమని ఒబామా స్పష్టంచేశారు. ఈ ఎన్నికల్లో కమలా హారిస్‌కు మద్దతుగా ఆయన ప్రచారంలో పాల్గొనడం ఇదే మొదటిసారి. అధ్యక్ష పదవిని చేపట్టేందుకు హారిస్ సర్వసన్నద్ధంగా ఉన్నారని ఒబామా తేల్చిచెప్పారు. ఆమె విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరని చెప్పారు. కమలా హారిస్‌ను గెలిపిస్తే ఆమె తన సొంత సమస్యలపై కాకుండా ప్రజల సమస్యలపై దృష్టి పెట్టి పరిష్కరిస్తారని వివరించారు. ప్రజల కష్టాలు ఏమిటో ఆమెకు క్షుణ్నంగా తెలుసని చెప్పారు. ఒకవేళ డొనాల్డ్ ట్రంప్‌ను ఎన్నుకుంటే ఇబ్బందులు కొని తెచ్చుకున్నట్లేనని ప్రజలను అప్రమత్తం చేశారు. ట్రంప్ వస్తే సంపన్నులు, కార్పొరేట్లపై పన్నులు తగ్గిస్తారని, సామాన్య ప్రజలపై పన్నులు పెంచుతారని అన్నారు. మెరుగైన జీవితం, పిల్లలకు మంచి భవిష్యత్తు కావాలనుకుంటే ఎన్నికల్లో కమలా హారిస్‌ను గెలిపించుకోవాలని అమెరికా ప్రజలకు ఒబామా పిలుపునిచ్చారు.

150 మంది ఉగ్రవాదులు కాచుక్కూర్చున్నారు..

ఎల్‌వోసీ వెంట పరిస్థితిపై బీఎస్‌ఎఫ్ ఐజీ అశోక్ యాదవ్ వెల్లడి



శ్రీనగర్: శీతాకాలం సమీపిస్తున్నండగా కశ్మీర్ లోయలో నియంత్రణ రేఖ (ఎల్‌వోసీ) వెంబడి 150 మంది వరకు ఉగ్రవాదులు మన భూభాగంలోకి దొంగచాటుగా ప్రవేశించేందుకు అవకాశం కోసం ఎదురు చూస్తున్నారని బీఎస్‌ఎఫ్(సరిహద్దు భద్రతా దళం) తెలిపింది. చొరబాటుదారులు చేసే ఎలాంటి ప్రయత్నాలనైనా తిప్పికొట్టేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేసింది. 'చొరబాటు యత్నాలు కొనసాగుతూనే ఉన్నాయి. వివిధ నిఘా విభాగాల నుంచి అందుతున్న సమాచారం ఆధారంగా ఆర్మీతో సమన్వయం చేసుకుంటూ సరిహద్దుల్లో భద్రతపై అప్రమత్తంగా ఉన్నాం'అని బీఎస్‌ఎఫ్ ఐజీ(కశ్మీర్) అశోక్ యాదవ్ శుక్రవారం మీడియాకు తెలిపారు. 'పాక్ వైపు సరిహద్దులకు సమీపంలోని స్థావరాల్లో ఉండే ముష్కరుల గురించిన అంచనాలను బట్టి, చొరబాటుయత్నాలను తిప్పికొట్టి, వారిపై పైచేయి సాధించేలా మా వ్యూహాలను సిద్ధం చేసుకుంటున్నాం'అని యాదవ్ వివరించారు. 'ఎల్‌వోసీకి సమీపంలోని స్థావరాల్లో కాచుకుని ఉండే ఉగ్రవాదుల సంఖ్య 130-150 మధ్య మారుతూ ఉంటుంది. ఒక్కోసారి ఇంతకంటే కాస్త ఎక్కువమందే ఉండొచ్చు'అని తెలిపారు. అంతర్జాతీయ పరిణామాలను కూడా పరిగణనలోకి తీసుకుంటూ కార్యాచరణ ప్రణాళికలను అమలు చేస్తామని ఆయన చెప్పారు. ఎల్‌వోసీ వెంట ఉన్న తంగ్‌ధర్, కెరన్ సెక్టార్ల పరిధిలో డ్రగ్స్ అక్రమ రవాణాకు అవకాశాలున్నాయంటూ ఆయన..వీటిని అడ్డుకునేందుకు మొబైల్ బంకర్లు, మహిళా ట్రూపర్లను రంగంలోకి దించామని వెల్లడించారు. స్మగ్లర్లు డ్రగ్స్ కొరియర్లుగా మహిళలను వాడుకుంటున్నారని ఐజీ అశోక్ యాదవ్ తెలిపారు.



స్కాట్లాండ్‌లోని కింగ్‌హార్న్ వద్ద శనివారం ఆకాశంలో కనువిందు చేసిన అరోరా బొరియాలిస్

రష్యా నిర్బంధంలో ఉన్న ఉక్రెయిన్ జర్నలిస్టు మృతి




కీవ్: రష్యాలో నిర్బంధంలో ఉన్న ఉక్రెయిన్ జర్నలిస్ట్ 27 ఏళ్ల విక్టోరియా రోషినా మృతి చెందారు. సెప్టెంబర్ 19న రోషినా మరణించినట్లు రష్యా గురువారం ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం అందించింది. రష్యా ఆక్రమిత ఉక్రెయిన్‌లో జీవితం గురించి ప్రత్యక్ష కథనాలు రాసిన విక్టోరియా.. గత ఏడాది ఆగస్టులో ఉక్రెయిన్‌లోని రష్యా ఆక్రమిత ప్రాంతాలకు రిపోర్టింగ్‌కు వెళ్లారు. ఆ తరువాత ఆమె కనిపించకుండా పోయింది. ఆమె కుటుంబం, ఉక్రెయిన్ అధికారులు, జర్నలిస్టుల హక్కుల సంస్థ ఆర్‌ఎస్‌ఎఫ్ పదేపదే అభ్యర్థించినా రష్యా అధికారులు ఆమె నిర్బంధం గురించి ఎటువంటి సమాచారాన్ని అందించలేదు. చివరకు విక్టోరియా తమ కస్టడీలో ఉందని రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ మే నెలలో ఆమె తండ్రికి రాసిన లేఖలో అంగీకరించింది. విక్టోరియా మరణానికి సంబంధించిన సమాచారం ధృవీకరించినట్లు ఉక్రెయిన్ యుద్ధ ఖైదీల సమన్వయ ప్రధాన కార్యాలయం ప్రతినిధి పెట్రో యాట్సెంకో చెప్పారు. ఆమె ఎలా చనిపోయిందనే దానిపై దర్యాప్తు కొనసాగుతోందన్నారు. 2014లో ఉక్రెయిన్ నుండి రష్యా స్వాధీనం చేసుకున్న క్రిమియాలో, అలాగే రష్యా నిధులతో వేర్పాటువాదులు స్వాధీనం చేసుకున్న తూర్పు ఉక్రెయిన్ ప్రాంతాల్లో జీవితం గురించి విక్టోరియా అనేక కథనాలను రాశారు. 2022 ఫిబ్రవరిలో మాస్కో పూర్తి స్థాయి ఆక్రమణను ప్రారంభించిన తరువాత ఆమె పలు కథనాలు డాక్యుమెంట్ చేశారు. దేశం యుద్ధం ప్రారంభించిన కొద్దికాలానికే రష్యన్లు ఆమెను మొదట 10 రోజుల పాటు నిర్బంధించారు. ఆ తరువాత వదిలిపెట్టారు. 2022లో ఆమెకు ఇంటర్నేషనల్ ఉమెన్స్ మీడియా ఫౌండేషన్ 'కరేజ్ ఇన్ జర్నలిజం' అవార్డు ఇచ్చి సత్కరించింది.

వందేళ్ల క్రితం ఎవరెస్ట్‌పై గల్లంతు

తాజాగా బ్రిటిష్ పర్వతారోహకుడు శాండీ ఇర్విన్ ఆనవాళ్లు లభ్యం

లండన్: ప్రపంచంలోనే అతి ఎత్తైన ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించే క్రమంలో జాడ తెలియకుండా పోయిన బ్రిటిష్ పర్వతారోహకుడి ఆనవాళ్లు తాజాగా వందేళ్లకు బయటపడ్డాయి. నేషనల్ జియోగ్రాఫిక్ డాక్యుమెంటరీ బృందంలోని పర్వతారోహకులకు 1924లో కనిపించకుండా పోయిన ఇద్దరిలో ఎ.సి.ఇర్విన్(22) పాదం, బూటు, ఆయన పేరున్న ఎంబ్రాయిడరీ సాక్స్ దొరికాయి. ఇది తెలిసి ఇర్విన్ సోదరుని కుమార్తె ఆనందం వ్యక్తం చేశారు. దీంతోపాటు, ఎడ్మండ్ హిల్లరీ, టెన్జింగ్ నార్గే కంటే 29 ఏళ్ల ముందే ఎవరెస్ట్ అధిరోహించేందుకు వెళ్లిన ఈ ఇద్దరూ తమ ప్రయత్నంలో విజయం సాధించారా లేదా అన్న అనుమానాలకు తెరపడే అవకాశాలు కనిపిస్తున్నాయంటున్నారు.

నేషనల్ జియోగ్రాఫిక్ డాక్యుమెంటరీ బృందం ఈ ఏడాది సెప్టెంబర్‌లో చైనా ఆ.దీనంలోని ఎవరెస్ట్ ఉత్తర ప్రాంతంలో రొంగ్‌బుక్ గ్లేసియర్ వద్ద చిత్రీకరణ చేపట్టింది. ఈ బృందానికి ఆస్కార్ విజేత కూడా ప్రముఖ జిమ్మీ చిన్ నాయకత్వం వహిస్తున్నారు. అక్కడ వారికి 1933 నాటి ఆక్సిజన్ సిలిండర్ ఒకటి లభ్యమైంది. ఇర్విన్‌కు సంబంధించిన వస్తువు కూడా ఒకటి దొరికింది. దీంతో, చాలా రోజులు అక్కడే అన్వేషణ జరిపారు. ఫలితంగా వారికి ఓ కాలున్న బూట్ దొరికింది. అందులోని సాక్ ఎంబ్రాయిడరీపై 'ఎ.సి.ఇర్విన్'అనే పేరుంది. ఈ బూటును 1924 జూన్‌లో జార్జి మల్లోరీతో కలిసి ఎవరెస్ట్ అధిరోహించేందుకు వచ్చి అదృశ్యమైన బ్రిటిష్ దేశస్తుడు ఏసీ శాండీ ఇర్విన్‌దేనని తేల్చారు. 1999లో మల్లోరీ మృతదేహం పర్వతారోహకుల కంటబడగా, ఇర్విన్ ఆనవాళ్లు ఇప్పటికీ దొరకలేదు. అయితే, ఈయన వెంట తెచ్చుకున్న కెమెరా కోసం పలువురు గతంలో తీవ్రంగా గాలించారు. అందులోని ఫొటోల ఆధారంగా ఈ ఇద్దరు సాహసికుల ప్రయత్నం ఏమేరకు ఫలించిందన్న ప్రశ్నకు సమాధానం దొరుకుతుందని వారి ఆశ. తాజాగా దొరికిన ఆధారంతో ఇర్విన్ మృతదేహం వంటి ఆనవాళ్లు అదే ప్రాంతంలో దొరకవచ్చన్న అంచనాలు పెరిగిపోయాయి.



ఎవరెస్ట్‌పై లభ్యమైన బూటు

షిర్డీ సాయి ట్రస్టుకు పన్ను మినహాయింపు సబబే

ఐటీ అప్పిలేట్ ట్రిబ్యునల్ నిర్ణయాన్ని సమర్థించిన బాంబే హైకోర్టు

ముంబై: షిర్డీ సాయి బాబా ట్రస్టుకు హుండీ కానుకల రూపంలో వస్తున్న నగదుకు ఆదాయపు పన్ను మినహాయింపు సబబేనని బాంబే హైకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు గతేడాది అక్టోబరు 25న ఇన్‌కమ్ ట్యాక్స్ అప్పిలేట్ ట్రిబ్యునల్ (ఐటీఏటీ) ఇచ్చిన తీర్పును సమర్థించింది. శ్రీ సాయిబాబా సంస్థాన్ ట్రస్టు (షిర్డీ) ఒక ధార్మిక సంస్థ అని, ఎలాంటి మతపరమైన కార్యక్రమాలు చేపట్టడం లేదని ముంబై ఐటీ కమిషనర్ (మినహాయింపులు) వాదించారు. హుండీ రూపంలో గుర్తుతెలియని భక్తులు సమర్పిస్తున్న కానుకలు.. మొత్తం విరాళాల్లో ఐదు శాతాన్ని దాటుతున్నాయి కాబట్టి.. పన్ను పరిధిలోకి వస్తాయని పేర్కొన్నారు. 2015-16, 2017-18, 2018-19 ఆర్థిక సంవత్సరాల్లో హుండీ కానుకల రూపంలో షిర్డీ ట్రస్టుకు రూ.400 కోట్లు అందాయని, అందులో కేవలం రూ. 2.3 కోట్లు మాత్రమే మతపరమైన కార్యక్రమాలకు వెచ్చించారని ఐటీ కమిషనర్ హైకోర్టుకు తెలిపారు. అధికభాగం నిధులను విద్యాసంస్థలు, ఆసుపత్రులు, వైద్య సదుపాయాలకు మళ్లించారని పేర్కొన్నారు. జస్టిస్ జి.ఎస్.కులకర్ణి, జస్టిస్ సోమశేఖర్ సుందరేశన్‌లు ఈ వాదనతో విభేదించారు. షిర్డీ ట్రస్టు మతపరమైన, చారిటబుల్ ట్రస్టు అని పేర్కొన్నారు. ఆదాయపు పన్ను మినహాయింపు కోరడం చట్టబద్ధంగా న్యాయమని, సబబని తీర్పునిచ్చారు.

ఆ బంగళా అతిశికే

కేజ్రీవాల్ ఖాళీ చేసిన నివాసం అధికారికంగా కేటాయింపు

న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి అతిశి అధికారిక నివాసంపై నెలకొన్న వివాదం సమసిపోయింది. సీఎంగా అరవింద్ కేజ్రీవాల్ నివాసమున్న సివిల్ లైన్స్‌లోని 6, ఫ్లాగ్‌స్టాఫ్ రోడ్ బంగళాను శుక్రవారం అధికారికంగా అతిశికి కేటాయించారు. ఈ మేరకు పబ్లిక్‌వర్క్స్ డిపార్టమెంట్ (పీడబ్ల్యూడీ) ఆఫర్ లెటర్‌ను జారీ చేసింది. అధికారిక కేటాయింపు, అనుమతి లేకుండా బంగళాలోకి ప్రవేశించారని రెండురోజుల కిందట అతిశి సామాన్లను బయటపడేసిన విషయం తెలిసిందే. లెఫ్టినెంట్ గవర్నర్ వి.కే.సక్సేనా ఆదేశాల మేరకే పీడబ్ల్యూడీ అధికారులు ఇలా చేశారని, బీజేపీ కీలకనేతకు 6, ఫ్లాగ్‌స్టాఫ్ రోడ్ నివాసాన్ని కేటాయించాలని చూస్తున్నారని ఆప్ ఆరోపించింది. ఆప్‌ను నేరుగా ఎదుర్కొనలేక బీజేపీ ఎల్జీ ద్వారా ఇలాంటి కుయుక్తులను పాల్పడుతోందని ధ్వజమెత్తింది. సీఎం నివాసంలోని గృహోపకరణాలను, ఇతర సామాగ్రిని జాబితా చేశాక, అధికారిక ప్రక్రియను అనుసరించి.. అతిశికి ఆఫర్ లెటర్ ఇస్తున్నట్లు పీడబ్ల్యూడీ పేర్కొంది.

త్వరలోనే భారత్‌కు 'మహదేవ్ యాప్' సూత్రధారి

న్యూఢిల్లీ: మహాదేవ్ బెట్టింగ్ యాప్ ప్రధాన ప్రమోటర్లలో ఒకరైన సౌరభ్ చంద్రాకర్‌ను త్వరలో భారత్‌కు రప్పించనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. మనీ లాండరింగ్, మోసం కేసులో ఈడీ వినతి మేరకు ఇంటర్‌పోల్ అరెస్ట్ వారెంట్ జారీ చేయడంతో ఇటీవల దుబాయ్ అధికారులు అతడిని అరెస్ట్ చేశారు. ఈడీ వర్గాల వినతి మేరకు చంద్రాకర్‌తోపాటు ఈ యాప్ మరో ప్రమోటర్ రవి ఉప్పల్‌ను కూడా దుబాయ్ అధికారులు అదుపులోకి తీసుకుని, గృహ నిర్బంధంలో ఉంచారు. మరికొద్ది రోజుల్లో చంద్రాకర్ భారత్‌కు వస్తాడని ఆ వర్గాలు వివరించాయి. చంద్రాకర్ 2019లో దుబాయ్ పారిపోయేందుకు ముందు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దుర్గ్ జిల్లా భిలాయ్‌లో సోదరుడితో కలిసి జ్యూస్ షాపు నిర్వహించేవాడు. మహాదేవ్ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌తో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన పలువురు ఉన్నత స్థాయి రాజకీయ నాయకులు, అధికారులతో సంబంధాలున్నట్లు ఈడీ ఆరోపిస్తోంది. రూ.6 వేల కోట్ల మేర అక్రమలావాదేవీలకు సంబంధించిన ఈ కేసులో ఇప్పటి వరకు 11మందిని అరెస్ట్ చేసింది.

బంగారు గనిలో ప్రమాదం

ఒకరి మృతి, పలువురికి గాయాలు

కొలరాడో: మూతపడిన ఓ బంగారుగనిలో గంటల తరబడి చిక్కుకుని ఓ వ్యక్తి మృతి చెందారు. 23 మందిని సురక్షితంగా బయటికి తీసుకొచ్చారు. ఈ ఘటన కొలరాడోలోని క్రిప్ల్ క్రీక్‌పట్టణ సమీపంలో జరిగింది. ఇక్కడి మోలీ కాథ్లీన్ బంగారు గని పర్యాటక ప్రదేశంగా ప్రసిద్ధి చెందింది. దీనిని చూసేందుకు అనేక మంది ఆసక్తి చూపుతుంటారు. అలా గనిని చూసేందుకు గురువారం రెండు బృందాలు వెళ్లాయి. 12 మందితో కూడిన ఒక బృందం ముందే వెళ్లింది. రెండో బృందం లోపలికి దిగుతుండగా లిఫ్ట్‌కు సాంకేతిక సమస్య ఎదురైంది. దీంతో 500 అడుగుల (150 మీటర్లు) లోతులో లిఫ్ట్ ఆగిపోయింది. గంటల తరబడి గనిలోపల చిక్కుకుపోవడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. పలువురికి గాయాలయ్యాయి. తరువాత రెండు బృందాల్లోని 23 మందిని సురక్షితంగా బయటికి తీసుకొచ్చారు. శీతాకాలంలో ఈ గనిని మూసేస్తారు. ఇంకో వారం రోజుల్లో మూసివేయనుండగా ఈ ఘటన జరిగింది.

నవంబర్ 1న రాష్ట్ర జెండా ఎగురవేయాలి

కంపెనీలు, పాఠశాలలకు కర్ణాటక ఆదేశం

బెంగళూరు: కర్ణాటక రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నవంబర్ 1న రాష్ట్ర పతాకాన్ని ఎగురవేయాలని ప్రభుత్వం ఆదేశించింది. అన్ని పాఠశాలలు, పరిశ్రమలు, ఐటీ కంపెనీలు కార్యక్రమాన్ని తప్పనిసరిగా నిర్వహించాలని సూచించింది. అన్ని పాఠశాలల్లో కన్నడపై సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపింది. ఈ మేరకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. జనాభాలో 50% మంది రాష్ట్రం వెలుపల నుంచి వచ్చినందున, అటువంటి రోజును పాటించడం, రాష్ట్రాన్ని గౌరవించుకోడం చాలా ముఖ్యమన్నారు. విద్యార్థుల్లో భాషపై ప్రేమ, అవగాహన పెంపొందించేలా కన్నడపై దృష్టి సారించే సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించాలని పేర్కొన్నారు. కంపెనీలు జెండా ఎగురవేసిన ఫోటోలను బృహత్ బెంగళూరు మహానగర పాలికె (బీబీఎంపీ)కి సమర్పించాలని తెలిపారు. భాషా సంయుక్త రాష్ట్రాల ఏర్పాటులో భాగంగా 1956 నవంబర్ 1న కర్ణాటక రాష్ట్రం ఏర్పాటుకు గుర్తుగా ఉత్సవాలు నిర్వహిస్తారు.

ఇజ్రాయెల్‌కు సాయం చేయొద్దు

గల్ఫ్ దేశాలకు ఇరాన్ హెచ్చరిక

టెహ్రాన్: పశ్చిమ ఆసియాలో దాడులు విస్తరిస్తున్న నేపథ్యంలో ఇజ్రాయెల్ దాడుల కోసం తమ గగనతలాన్ని, సైనిక స్థావరాలను అనుమతించవద్దని అరబ్ దేశాలను టెహ్రాన్ హెచ్చరించింది. ఇజ్రాయెల్‌కు ఎలాంటి సాయం చేసినా ఆమోదయోగ్యం కాదని, దీనిపై స్పందిస్తామని ఇరాన్ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ప్రస్తుత ఘర్షణలో ఇజ్రాయెల్‌తో చేతులు కలిపితే ఇరాన్ తమ చమురు స్థావరాలపై దాడి చేస్తుందని గల్ఫ్ అరబ్ దేశాలు ఇప్పటికే భయపడుతున్నాయి. హెజ్‌బొల్లా చీఫ్ హసన్ నస్రల్లా హత్య నేపథ్యంలో ఇజ్రాయెల్‌పై ఇరాన్ దాడి చేసింది. దీనిపై ప్రతీకారం తీర్చుకునేందుకు ఇజ్రాయెల్ సిద్ధమవుతోందని, విస్తృత దాడిలో భాగంగా ఇరాన్‌లోని చమురు స్థావరాలను లక్ష్యంగా చేసుకోవచ్చని కొందరు సూచిస్తున్నారు. పెరుగుతున్న ముప్పు దృష్ట్యా ఇరాన్ చమురు స్థావరాలను ఇజ్రాయెల్ లక్ష్యంగా చేసుకోకుండా నిరోధించాలని గల్ఫ్ దేశాలు అమెరికాను కోరాయి. అంతేకాదు ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడికి తమ గగనతలాన్ని ఉపయోగించడానికి సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఖతర్‌లు నిరాకరించాయి.

పెంపుడు శునకం చేతిని కొరికేసింది!

ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రిలో యజమానురాలు

కాన్‌బెర్రా: ఆస్ట్రేలియాలోని క్వీన్స్‌ల్యాండ్‌కు చెందిన ఓ మహిళ ముంజేతిని ఆమె పెంపుడు కుక్క కొరికేసింది. తీవ్రంగా గాయపడిన బాధితురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సగం తెగిన చేతిని వైద్యులు తిరిగి అతికించారు. తీరప్రాంత టౌన్స్‌విల్లెలో శుక్రవారం ఈ ఘటన చోటుచేసుకుంది. సాయంత్రం 7 గంటల సమయంలో అత్యవసర ఫోన్ కాల్ రావడంతో పోలీసులు వెంటనే ఓ నివాసానికి చేరుకున్నారు. ఓ ఇంటి బయట మహిళ రక్తం కారుతున్న చేతితో విలవిల్లాడుతుండగా, లోపల ఓ భారీ శునకం బయటకు వచ్చేందుకు ప్రయత్నిస్తూ కోపంతో తిరుగుతోంది. దీంతో, వెంటనే పోలీసులు వైద్య సిబ్బందికి కబురు పంపారు. వారొచ్చి బాధితురాలి చేతికి కట్టుకట్టారు. లోపలున్న శునకం నియంత్రణలోకి రాకపోవడంతో నిపుణుల సూచన మేరకు కాల్చి చంపారు. బాధితురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆ కుక్క గతంలో తనపైనా కూడా దాడి చేసిందని పొరుగింటి వ్యక్తి చెప్పాడని స్థానిక మీడియా పేర్కొంది. పెంపుడు కుక్కలు ఇంతటి ప్రమాదకర స్థాయిలో దాడి చేయడం తన 37 ఏళ్ల సర్వీసులో ఎన్నడూ చూడలేదని సీనియర్ సార్జెంట్ స్కాట్ వారిక్ వ్యాఖ్యానించారు.

కాకతీయుల కాలం సాహిత్యానికి స్వర్ణయుగం



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

చరిత్ర

కాకతీయ యుగ విశేషాలు

భాషాసాహిత్యాలు

కాకతీయులు తెలుగుభాషను ఆదరించడం మొదటి ప్రోలరాజు తర్వాతే మొదలైంది. అప్పటి వరకు ఉన్న శాసనాలు కన్నడం, సంస్కృత భాషల్లో ఉన్నాయి. రెండో బేతరాజు తొలిసారిగా తెలుగులో శాసనాలు వేయించాడు. కానీ నన్నయకు ముందే వృత్త పద్యాలు వాడిన తొలి తెలుగు శాసనం ఇటీవలే బయల్పడింది. అది విరియాల కామసాని వేయించిన గూడూరి శాసనం(క్రీ.శ 1000). ఈ యుగంలో కనిపించే ప్రసిద్ధ శాసన కవులు అచింతేంద్రయతి, వెల్లంకి గంగాధర మంత్రి, నాగదేవ కవి, బ్రహ్మశివకవి, మల్లపురాజు, కవిచక్రవర్తి, అభినవ మయూర సూరి, రెండో ఈశ్వర భట్టోపాధ్యాయుడు. కాకతీయుల కాలం తెలంగాణ సాహిత్యంలో స్వర్ణయుగం. కాకతీయులతో సంబంధం లేకపోయినా ఈ యుగంలో కనిపించే తొలి ప్రముఖ కవి వేములవాడ భీమకవి.

ఆదికవి పాల్కురికి

తెలుగులో తొలిసారి స్వతంత్ర రచన చేసిన పాల్కురికి సోమనాథుడు(1160–1240) తెలుగు సాహిత్యంలోనే ఆదికవి. పాల్కురికి కంటే ముందే రుద్రదేవుడు నీతిసారం అనే గ్రంథాన్ని రచించాడు. ఈ కాలంలోనే భువనగిరి ప్రాంతానికి చెందిన నరహరి (సరస్వతీ తీర్థముని) మమ్మటుని కావ్యప్రకాశానికి బాల చిత్తానురంజనమనే వ్యాఖ్యానాన్ని, స్మృతి దర్పణం, తర్క రత్నాకరం అనే గ్రంథాలను రచించాడు. జాయపసేనాని పాల్కురికి తర్వాతి కాలానికి చెందిన కవి. ఇతడు గణపతిదేవుడి బావమరిది. ఇతడు నృత్త రత్నావళి గ్రంథంలో భరతుడి మార్గ నృత్తంతో పాటు ఆనాటి దేశీ నృత్తం గురించి వివరించాడు. చిందు, పేరణి, ప్రేంఖణ, వికటం, కందుక, బహురూప కోల్లాట, ఖాండిక మొదలైన దేశీ నృత్తరీతుల వివరణలు నాటి తెలంగాణ నృత్య, నాట్యరీతుల్ని తెలుపుతున్నాయి. చక్రపాణి రంగనాథుడు పాల్కురికి శిష్యుడు. ఇతడు శివభక్తి దీపిక, గిరిజాధినాయక శతకం లాంటి రచనల్లో పాల్కురికి మార్గాన్ని అనుసరించాడు. విశ్వేశ్వర దేశికుడు (శివదేవుడు) గణపతిదేవుడి దీక్షాగురువు. రుద్రమదేవి పాలనను, ప్రతాపరుద్రుడి యువరాజత్వాన్ని ప్రశంసించిన ఈ విద్వత్కవి శివతత్త్వ రసాయనం అనే గ్రంథాన్ని రచించాడు.పాల్కురికి తర్వాత పేర్కొనదగిన గొప్పకవి కృష్ణమాచార్యులు(1268–1323). తెలుగులో తొలి వచనాలైన 'సింహగిరి వచనాలు' రచించాడు. కృష్ణమాచార్యులు మహబూబ్‌నగర్ జిల్లాకు చెందినవాడు. ఇతణ్ని తెలంగాణలో తొలి వైష్ణవ కవిగా భావించవచ్చు. కొలని రుద్రదేవుడు(రుద్రుడు) ఓరుగల్లు నివాసి. ఇతడు 'రాజరుద్రీయం'ను రచించాడు. ప్రతాపరుద్రుడి వద్ద మంత్రిగా పనిచేశాడు.

కవిపోషకుడు.. ప్రతాపరుద్రుడు

విద్యానాథుడు, విశ్వనాథుడు, శాకల్యమల్లన, శరభాంకుడు, శివదేవయ్య లాంటి పేరొందిన కవి పండితులు ప్రతాపరుద్రుడి ఆశ్రయం పొందారు. గుండయభట్టు అనే విద్వాంసుడు, సకల శాస్త్రవేత్త వీరభల్లట దేశికుడు, నరసింహుడు, మహాభారతాన్ని నాటక రూపంలో రచించిన గంగాధరకవి, జినేంద్ర కల్యాణాభ్యుదయాన్ని రచించిన అప్పయార్య తదితరులు కూడా ప్రతాపరుద్రుడి ఆస్థానంలోని వారే. సంస్కృత, కన్నడ భాషల్లో అనేక గ్రంథాలు రచించిన రుద్రభట్టు, కేయూర బాహుచరిత్ర రచయిత మంచన కూడా ప్రతాపరుద్రుడి ఆదరణ పొందారు. ప్రతాపరుద్రుడు పండిత పోషకుడే కాకుండా స్వయంగా కవి. సంస్కృతంలో యయాతి చరిత్ర, ఉషారాగోదయం అనే నాటకాల్ని రచించాడు. విద్యానాథుడు ప్రతాపరుద్రుడి శాస్త్ర, సంగీత ప్రావీణ్యాన్ని ప్రశంసించాడు.

తొలి పురాణ అనువాదకర్త, మహాకవి మారన ఈ యుగం వాడే. ఆయన మార్కండేయ పురాణాన్ని అనువదించి ప్రతాపరుద్రుడి సేనాని గన్నయ నాయకుడికి అంకితమిచ్చాడు. స్వతంత్రంగా తెలుగులో రచించిన మొదటి మహాపురాణం మార్కండేయ పురాణం. మారన పురాణానికి కావ్యత్వాన్ని కల్పించి తర్వాతి కావ్య ప్రబంధ కవులకు మార్గదర్శకుడయ్యాడు. ఇతడి మరో రచన హరిశ్చంద్రోపాఖ్యానం.

సంస్కృతంలో అలంకార గ్రంథాలు రచించి ప్రసిద్ధి చెందిన మొదటి తెలుగు వ్యక్తి విద్యానాథుడు. ఇతడు ప్రతాపరుద్రుడి ఆస్థాన కవి. ఇతడు రచించిన ప్రతాపరుద్ర యశోభూషణం అనే గ్రంథాన్ని నాట్యశాస్త్రం, ధ్వన్యాలోకం లాంటి కావ్య శాస్త్రగ్రంథాల వరుసలో పేర్కొనవచ్చు. ప్రతాపరుద్ర యశోభూషణాన్నే రామరాజభూషణుడు నరస భూపాలీయంగా అనువదించాడు. విద్యానాథుడు ఈ గ్రంథంలో కావ్య, నాటక లక్షణాలను తెలపడంతో పాటు తాను చెప్పిన లక్షణాలకు ఉదాహరణగా ప్రతాపరుద్ర కల్యాణం అనే నాటకం రచించాడు. ఓరుగల్లుకు చెందిన మరో కవి అగస్త్యుడు (1289–1325). ఇతడు బాలభారతం, నలకీర్తి కౌముది, శ్రీకృష్ణచరిత, అగస్త్య నిఘంటువు మొదలైన సంస్కృత రచనలు చేశాడు. ప్రతాపరుద్రుడి మంత్రి శరభాంకుడు మంచి కవి. ఇతడు శరభాంక లింగ శతకాన్ని రచించాడు. ఓరుగల్లు కోట తోరణ ద్వారం మీద లిఖించిన శ్లోకాన్ని బట్టి బుక్కాయ కాకతీయ చరిత్ర, మలయవతి అనే గ్రంథాలను నరసింహుడు అనే కవి రచించాడని తెలుస్తోంది. ప్రఖ్యాత వ్యాఖ్యాత మల్లినాథ సూరి తండ్రి కపర్ది మెదక్ జిల్లా కొలిచెలిమ నివాసి. ఈయన గొప్ప భాష్యకారుడు. 'ఆపస్తంబ శ్రౌతసూత్ర భాష్యం' లాంటి రచనలు చేశాడు. మరో కవి విశ్వనాథుడు సౌగంధికాపహరణమ్ అనే సంస్కృత వ్యాయోగం (నాటక ప్రక్రియ) రచించాడు.

గోన బుద్ధారెడ్డి

కాకతీయుల కాలంలో పేరొందిన మరో కవి గోన బుద్ధారెడ్డి. వర్ధమానపురం పాలకుడైన గోన గన్నయ్యరెడ్డి సోదరుడైన విఠలుని కుమారుడే బుద్ధారెడ్డి. ఇతడు రచించిన రామాయణం రంగనాథ రామాయణంగా ప్రసిద్ధికెక్కింది. పాల్కురికి రచనలు శైవ మత ప్రచారానికి దోహదం చేస్తే రంగనాథ రామాయణం వైష్ణవ మతాన్ని జనంలోకి తీసుకెళ్లింది. గోన బుద్ధారెడ్డి కుమారులైన కాచభూపతి, విట్టల రాజులు తండ్రి కోరిక మేరకు ఉత్తర రామాయణాన్ని రచించారు. వీరు తెలుగులో తొలి జంట కవులు. ఉత్తర రామాయణంలో తిక్కన పూర్తి చేయలేకపోయిన భాగాలను ఇందులో చేర్చారు. తిక్కన సంక్షిప్తంగా రాసిన కొన్ని భాగాలను విపులీకరించారు. గోన బుద్ధారెడ్డి కుమార్తె కుప్పాంబిక తెలుగు సాహిత్యంలో తొలి కవయిత్రి. ఓరుగల్లుకు చెందిన గణపనారాధ్యుడు సర్వశాస్త్రాన్ని ద్విపదగా రాశాడు. గణపతిదేవుడు, రుద్రమదేవి, ప్రతాపరుద్రుడి వద్ద మంత్రిగా పని చేసిన శివదేవయ్య మంచి కవి. ఇతడు శివదేవధీమణిశతకం, పురుషార్థ సారం రచించాడు.

ఓరుగల్లు వర్ణన



తెలుగులో చంపువుగా వచ్చిన మొదటి రామాయణం భాస్కర రామాయణం. ప్రతాపరుద్రుడి ఆస్థానానికి చెందిన హుళక్కి భాస్కరుడు, అతడి కుమారుడైన మల్లికార్జున భట్టు, శిష్యుడైన రుద్రదేవుడు భాస్కర రామయణాన్ని రచించారు. అయ్యాలార్యుడు దీన్ని పూర్తి చేశాడు. రావిపాటి త్రిపురాంతకుడు ప్రేమాభిరామంలో కాకతీయ సామ్రాజ్య వైభవాన్ని కళ్లకు కట్టినట్టు వర్ణించాడు. ఈయన సంస్కృతంలో రాసిన ప్రేమాభిరామాన్ని అనుసరించే క్రీడాభిరామం (వినుకొండ వల్లభరాయలు) వచ్చింది. త్రిపురాంతకోదాహరణం, మదనవిజయం, చంద్రతారావళి, అంబికా శతకం మొదలైనవి త్రిపురాంతకుడి ఇతర రచనలు. పాల్కురికి రచనల తర్వాత తెలంగాణ (ఓరుగల్లు పట్టణ) జీవితాన్ని విస్తృతంగా వర్ణించిన గ్రంథమిదే. అప్పయాచార్యుడు అనే జైనకవి 1310లో జినేంద్రకల్యాణాభ్యుదయం అనే సంస్కృత కావ్యాన్ని రచించాడు. ఇతడు ప్రతాపరుద్రుడి కాలంలో ఓరుగల్లులో నివసించాడు. దీన్ని బట్టి కాకతీయులు శైవులైనా పరమత సహనం పాటించారని, జైన సాహిత్యం కూడా మనుగడలో ఉందని అర్థమవుతోంది. విజయనగర సామ్రాజ్య స్థాపనకు ప్రేరకుడైన మహామంత్రి విద్యారణ్యస్వామి ధర్మపురిలో పుట్టి పెరిగి, కంచిలో విద్యాభ్యాసం చేశాడు. సంగీతసారమనే సంగీతశాస్త్ర గ్రంథాన్ని రచించాడు.

మత పరిస్థితులు

కాకతీయుల కాలం నాటికి తెలంగాణలో బౌద్ధ మత ప్రభావం నామమాత్రంగా ఉండేది. కానీ జైనమతం ప్రబలంగా ఉండేది. ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల్లో జైన మతాన్ని వీర శైవులు క్షీణింపజేశారు. వీరు జైన మతంలోని వర్ణ రాహిత్యాన్ని తమ ముఖ్య సిద్ధాంతంగా గ్రహించారు. రాజులకు శైవ దీక్షనిచ్చి వారి గురువులుగా, మంత్రులుగా, దండనాథులుగా జైన మత నిర్మూలనకు ప్రయత్నించారు. వీరశైవానికి పోటీగా వీర వైష్ణవం విజృంభించింది. క్రీ.శ.1200 నాటికి జైనం క్షీణించింది. దాని స్థానాన్ని శైవం ఆక్రమించింది. చివరకు శైవ, వైష్ణవ మతాలు రెండే మిగిలాయి.

బౌద్ధం

ఆంధ్రదేశంలో 10, 11 శతాబ్దాల్లోనే ప్రాభవాన్ని కోల్పోయిన బౌద్ధం కాకతీయుల కాలంలో మరింతగా కనుమరుగైంది. ఈ కాలానికి చెందిన శాసనాల్లో చాలా అరుదుగా బౌద్ధ మత ప్రసక్తి కనిపిస్తుంది. కాలక్రమంలో బౌద్ధం హిందూ మతంలో కలిసిపోయింది.

జైనం

కాకతీయ సామ్రాజ్యంలో బౌద్ధం మందే క్షీణించినా జైనమతం మనుగడ సాగించింది. మొదటి బేతరాజు జైనమతావలంబి. హనుమకొండలోని పద్మాక్షి అనే జైన దేవాలయం ముందున్న శాసనాన్ని బట్టి మొదటి ప్రోలరాజు జైనమతాభిమానిగా తెలుస్తోంది. ఇతడి భార్య మైలమదేవి, మంత్రి బేతకు ప్రగ్గడ కూడా జైన మతాన్ని అవలంబించారు. మెదక్ జిల్లాలోని జోగిపేట జైనమత కేంద్రంగా ఉండేది. హనుమకొండలో సిద్ధేశ్వరాలయం అనే జైన దేవాలయం కూడా ఉంది. వీటిని బట్టి తొలి కాకతీయులు జైన మతస్థులని తెలుస్తోంది. ప్రతాపరుద్రుడి కాలంలో ఓరుగల్లుకు చెందిన జైన అప్పయార్య 'జినేంద్ర కల్యాణాభ్యుదయం'ను రచించాడు. దీన్నిబట్టి కాకతీయుల పాలన అంతమయ్యే వరకు తెలంగాణలో జైనం కొనసాగిందని తెలుస్తోంది. రాజుల పోషణ, ప్రజల ఆదరణ లభించకపోవడంతో జైనం క్రమంగా క్షీణించింది.

శైవం

శైవంలో పాశుపతం, కాలాముఖం, కాపాలికం, ఆరాధ్యశైవం, వీరశైవం అనే శాఖలుండేవి. వీటిలో పాశుపత శాఖ మాత్రమే రాజులు, ప్రజల ఆదరణ పొందింది. రెండో బేతరాజు మొదట జైనాన్ని ఆచరించినప్పటికీ, కాలాముఖ శైవానికి చెందిన రామేశ్వర పండితుడికి ఒక గ్రామాన్ని దానమివ్వడాన్ని బట్టి శైవుడిగా మారాడని చెప్పవచ్చు. రామేశ్వర పండితుడు రెండో బేతరాజు కుమారులైన దుర్గరాజు, రెండో ప్రోలరాజులకు కాలాముఖ శైవదీక్షనిచ్చాడు. దీన్ని బట్టి రెండో బేతరాజు కాలం నుంచి కాకతీయులు శైవమతాన్ని అవలంబించారని తెలుస్తోంది. ఆలంపురం ముఖ్య కాలాముఖ శైవ కేంద్రం. పన్నెండో శతాబ్దాంతం వరకు కాలాముఖ శైవం విస్తరించింది. గణపతిదేవుడి కాలం నుంచి పాశుపత శైవం ఆదరణ పొందింది. వీరశైవం కర్ణాటకలో ఉన్నంత ఉచ్ఛస్థితిలో ఆంధ్ర దేశంలో లేదు. కానీ పాల్కురికి బసవపురాణాన్ని బట్టి తెలంగాణలోనూ ఆదరణ పొందిందని చెప్పవచ్చు. గద్వాల సమీపంలోని పూడూరు గ్రామంలో ఆలయం వెలుపల నగ్న జైన విగ్రహాలు ఉండటాన్ని బట్టి, వేములవాడలో జైనాలయాన్ని శివాలయంగా మార్చి జైన విగ్రహాలను ఆలయం బయట ఉంచడాన్ని బట్టి జైనాన్ని క్షీణింపజేసి వీరశైవం మనుగడలోకి వచ్చిందని తెలుస్తోంది. గోళకి మఠాల స్థాపన కూడా ఈ విషయాన్ని సూచిస్తోంది. కాకతీయ రాజులు, రేచర్లరెడ్లు తదితరులు నిర్మించిన అనేక శివాలయాలను బట్టి శైవం విస్తృత ఆదరణ పొందినట్లు స్పష్టమవుతోంది.


వైష్ణవం

కాకతీయుల కాలంలో ప్రజాదరణ పొందిన మరో మతం వైష్ణవం. కాకతీయులు శైవులైనప్పటికీ వారి సామంతులు చాలామంది వైష్ణవులు. కాకతీయులు కూడా కొంతవరకు వైష్ణవాన్ని ఆదరించారు. రుద్రదేవుడు రుద్రేశ్వరాలయం(వేయిస్తంభాలగుడి)లో వాసుదేవుణ్ని ప్రతిష్ఠించాడు. అతడి మంత్రి గంగాధరుడు కేశవస్వామి ఆలయాన్ని నిర్మించాడు. గణపతిదేవుడి సోదరి మైలాంబ కృష్ణుడికి ఆలయాన్ని నిర్మించింది. ప్రతాపరుద్రుడి భార్య లక్ష్మీదేవి రామనాథ దేవుడికి కానుకలు సమర్పించింది. ఇవన్నీ కాకతీయులు వైష్ణవాన్ని కూడా ఆదరించారనేందుకు నిదర్శనాలు. ఈ కాలంలో ధర్మపురి ప్రసిద్ధ వైష్ణవ కేంద్రం. ఇన్ని మతాలున్నా కాకతీయుల కాలంలో మత సామరస్యం ఉండేదనడానికి మల్లిరెడ్డి బెక్కల్లు శాసనం నిదర్శనం. కర్ణాటకలో జరిగిన తరహాలో ఇక్కడ వీరశైవ, వైష్ణవ మతాల మధ్య, వాటికీ ఇతర మతాల మధ్య మత యుద్ధాలు జరగకపోవడానికి కాకతీయుల మతసామరస్యమే కారణం.

గ్రామదేవతారాధన

వైష్ణవ, శైవ దేవతలతోపాటు చరిత్ర పూర్వ యుగం నుంచి సంప్రదాయంగా వస్తున్న గ్రామదేవతలు, గ్రామ శక్తులను కూడా ప్రజలు ఆరాధించేవారు. ఏకవీర (రేణుక/ఎల్లమ్మ) మైలారు దేవుడు, భైరవుడు, వీరభద్రుడు, మూసానమ్మ, కాకతమ్మ, పోలేరమ్మ, గంగమ్మ, పోతురాజు మొదలైన గ్రామదేవతలు పూజలు అందుకునేవారు. బవనీలు (బైండ్ల వాళ్లు), మాదిగ స్త్రీలు రెండు రోజులపాటు ఎల్లమ్మ కథ చెప్పేవారు.

దేశంలో మైక్రో టీచింగ్‌పై పరిశోధన చేసింది?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

Methodology

1. విద్యార్థి వివరిస్తాడు అనేది బోధనలో ఒక..?
   1) లక్ష్యం 2) విలువ
   3) ఆశయం 4) స్పష్టీకరణం
2. ప్రాజెక్ట్ పద్ధతిలో విద్యార్థి..?
   1) ప్రయోగం చేస్తూ అభ్యసిస్తాడు
   2) పరిశీలిస్తూ అభ్యసిస్తాడు
   3) జీవిస్తూ అభ్యసిస్తాడు
   4) ఆలోచిస్తూ అభ్యసిస్తాడు
3. సహజీకరణం ఒక..?
   1) జ్ఞానాత్మక రంగానికి సంబంధించిన లక్ష్యం
   2) భావావేశ రంగానికి సంబంధించిన లక్ష్యం
   3) మానసిక చలనాత్మక రంగ లక్ష్యం
   4) జ్ఞానాత్మక, భావావేశ రంగ లక్ష్యం
4. వార్షిక ప్రణాళికను రూపొందించాల్సింది..?
   1) విద్యా సంవత్సర ఆరంభంలో ఉపాధ్యాయుడు
   2) విద్యా సంవత్సర అంతంలో వచ్చే నూతన విద్యా సంవత్సరం కోసం ఉపాధ్యాయుడు
   3) సంవత్సర అంతంలో నూతన సంవత్సరం కోసం ఉపాధ్యాయుడు
   4) సంవత్సర ఆరంభంలో ఉపాధ్యాయుడు
5. లక్ష్యం లక్షణం కానిది?
   1) పరీక్షించడానికి వీలుగా ఉండాలి
   2) వాక్యాలలో రాయాలి
   3) తరగతి బోధనానంతరం సాధించడానికి వీలుగా ఉండాలి
   4) లక్ష్యాలను ఉపాధ్యాయుడు పాఠ్య పథకంలో రాయాలి.
6. అవగాహన అనే లక్ష్యంలో గల ప్రవర్తనాత్మకమైన స్పష్టీకరణలలో సరికాని జత?
   1) పరస్పర సంబంధాలను గుర్తించడం, తప్పులను గుర్తించడం, వివరించడం
   2) వ్యాఖ్యానించడం, అనువదించడం, వర్గీకరించడం, తప్పులను సరిదిద్దడం,
   3) అనువదించడం, వ్యాఖ్యానించడం, వర్గీకరించడం, సరిపోల్చడం
   4) ఏదీ కాదు
7. పాఠ్యాంశాలను వరుస క్రమంలో బోధించడానికి ఉపయోగపడే పథకం?
   1) వార్షిక పథకం
   2) యూనిట్ పథకం
   3) పాఠ్య పథకం
   4) బ్లూ ప్రింట్
8. మన దేశంలో మైక్రో టీచింగ్‌పై పరిశోధన చేసింది?
   1) అజిత్ సింగ్ 2) జంగీరా
   3) బుచ్ 4) పాసీ
9. మన దేశంలో విషయతంత్ర పరీక్షలను ప్రవేశపెట్టాలని సూచించిన విద్యావేత్త?
   1) పాట్రిక్ 2) బ్లూమ్
   3) స్టీవెన్ సన్ 4) బుచ్
10. ప్రశ్నలను రూపొందించడంలో ఉపయోగపడేవి?
    1) విలువ 2) లక్ష్యాలు
    3) స్పష్టీకరణలు 4) గమ్యాలు
11. భావావేశ రంగంలోని లక్ష్యాన్ని ఆరోహణ క్రమంలో గుర్తించడం?
    1) గ్రహించడం, విలువ కట్టడం, ప్రతిస్పందించడం, విలువ కట్టడం, శీల స్థాపనం
    2) గ్రహించడం, ప్రతిస్పందించడం, వ్యవస్థాపనం, విలువ కట్టడం, శీలస్థాపనం
    3) గ్రహించడం, ప్రతిస్పందించడం, వ్యవస్థాపనం, శీలస్థాపనం, విలువ కట్టడం
    4) గ్రహించడం, ప్రతిస్పందించడం, విలువ కట్టడం, వ్యవస్థాపనం, శీల స్థాపనం.
12. మానసిక చలనాత్మక రంగంలోని లక్ష్యాలను అవరోహణ క్రమంలో గుర్తించడం?
    1) సహజీకరణం, సమన్వయం, హస్తలాఘవం, సునిశితత్వం, అనుకరణ
    2) అనుకరణ, హస్తలాఘవం, సునిశితత్వం, సమన్వయం, సహజీకరణం
    3) అనుకరణ, సునిశితత్వం, హస్తలాఘవం, సమన్వయం, సహజీకరణం
    4) సహజీకరణం, సమన్వయం, సునిశితత్వం, హస్తలాఘవం, అనుకరణ
13. పునఃస్మరణ..?
    1) విలువ 2) ఆశయం
    3) స్పష్టీకరణం 4) లక్ష్యం
14. జతపరచడం అనే ప్రశ్నల ద్వారా ఎక్కువగా పరీక్షించే లక్ష్యం?
    1) జ్ఞానం 2) అవగాహన
    3) వినియోగం 4) నైపుణ్యం
15. సాధన నికషకు సంబంధించి సరైన ప్రవచనం కానిది?
    1) నిర్ణీత సమయాల్లో మాత్రమే నిర్వహించాలి
    2) నీలి నికష (బ్లూప్రింట్)ను ముందుగానే తయారు చేసుకోవాలి
    3) జవాబులు రాయడంలో కాల పరిధిని లెక్కలోకి తీసుకోవడం జరగదు
    4) ప్రామాణిక నికష
16. బహుశైచ్ఛిక ప్రశ్నలు..?
    1) మూర్తిమత్వ పరీక్షలు
    2) సాధనా పరీక్షలు 3) ప్రజ్ఞా పరీక్షలు
    4) సహజ సామర్థ్యాన్ని పరీక్షించే ప్రశ్నలు
17. ఎవరు, ఎప్పుడు, ఎక్కడ, ఏమిటి.. అనే పదాలు ప్రశ్నల చివర్లో ఉంటే ఉపాధ్యాయుడు పరీక్షించాలనుకున్న లక్ష్యం?
    1) జ్ఞానం 2) అవగాహన
    3) వినియోగం 4) నైపుణ్యం
18. ఒక నికష ఏ విషయాన్ని పరీక్షించడానికి తయారు చేయడం జరిగిందో అదే విషయాన్ని సరిగా పరీక్షించినట్లయితే ఆ పరీక్షకు ఉన్న లక్షణం?
    1) విషయ నిష్ఠత 2) విశ్వసనీయత
    3) సప్రమాణత 4) వస్తు నిష్ఠత
19. సత్యాసత్య ప్రశ్నల్లో విద్యార్థి ఒక వాక్యం తప్పు అని పేర్కొంటే.. అతనిలో నెరవేరిన లక్ష్యం?
    1) జ్ఞానం 2) అవగాహన
    3) వినియోగం 4) నైపుణ్యం
20. సూక్ష్మ బోధనకు సంబంధించి సరైన ప్రవచనం కానిది?
    1) 5 నుంచి 10 మంది విద్యార్థులకు బోధించడం
    2) 5 నుంచి 10 నిమిషాల నిడివి
    3) 5 నుంచి 10 నైపుణ్యాలతో బోధించడం
    4) ఒకే భావనను బోధించడం
21. ఉత్తమ పాఠ్య పథకంలో..?
    1) పాఠ్యాంశ ఆశయాలు స్పష్టంగా రాయాలి
    2) పాఠ్యాంశ విలువలు స్పష్టంగా పేర్కొనాలి
    3) పాఠ్యాంశ ప్రయోజనాలు తెలపాలి
    4) సాధించాల్సిన లక్ష్యాలు రాయాలి
22. పాఠ్య పథకంలో సామాన్యీకరణం అనే సోపానాన్ని బోధించడానికి అనువైన పద్ధతి?
    1) ఉపన్యాస 2) చర్చ
    3) ప్రాజెక్ట్ 4) సమస్యా పరిష్కార
23. పాఠ్య పథకాన్ని రూపొందించాల్సింది?
    1) ప్రధానోపాధ్యాయుడు 2) విద్యావేత్తలు
    3) ఉపాధ్యాయుడు 4) విద్యార్థి
24. విద్యార్థుల్లో బలం, బలహీనతలను తెలుసుకోవడానికి ఉపయోగించాల్సిన మూల్యాంకనం?
    1) రూపణ 2) సంకలన
    3) లోప నిదాన 4) సమగ్ర
25. బ్లూప్రింట్‌లోని లక్ష్య భారత్వ పట్టికలోని ప్రాముఖ్యం కానని లక్ష్యం?
    1) నైపుణ్యం 2) వైఖరులు
    3) అవగాహన 4) వినియోగం
26. వైయక్తిక భేదాలకు అనుగుణంగా రూపొందించే భారత్వ పట్టిక?
    1) లక్ష్య 2) కఠిన స్థాయి
    3) విషయ భారత్వ 4) ప్రశ్న రూప
27. బృంద బోధనకు నాంది పలికిన మొదటి దేశం?
    1) ఇంగ్లండ్ 2) అమెరికా
    3) ఫ్రాన్స్ 4) ఇటలీ
28. సూక్ష్మ బోధనకు సంబంధించని వారు?
    1) కీత్ ఎక్సన్స్ 2) డ్వైట్ అలెన్
    3) రాబర్ట్ బుష్ 4) ఫ్రాన్సిస్ చేస్
29. స్వీయ అభిప్రాయ ప్రకటనకు అవకాశమిచ్చే పద్ధతి?
    1) ఉపన్యాస
    2) ఉపన్యాస ప్రదర్శన
    3) చర్చ 4) ప్రాజెక్ట్
30. ప్రాజెక్ట్ పద్ధతిని ఒక బోధనా పద్ధతిగా రూపొందించింది?
    1) ప్రాకృతిక వాదం 2) భావ వాదం
    3) నిజ వాదం
    4) వ్యవహారిక సత్తా వాదం
31. కింది వాటిలో వస్త్వాశ్రయత తక్కువగా ఉండే ప్రశ్న?
    1) రష్యా విప్లవం ఎప్పుడు జరిగింది?
    2) మీకు ఇచ్చిన ప్రపంచ పటంలో పోర్చుగల్‌ను గుర్తించండి?
    3) ముఖ్యమంత్రి మంత్రిమండలి నాయకుడని ఎలా చెప్పగలం?
    4) జెండా అవెస్తా.... పవిత్ర మతగ్రంథం.
32. హైస్కూల్ ఉపాధ్యాయుడు విద్యార్థులు ఏ లక్ష్యాలు సాధించారో తెలుసుకోవాలని యూనిట్ నికష తయారు చేశాడు. ఆ నికష విద్యార్థుల లక్ష్య సాధనను మాపనం చేసింది. ఆ నికషకు ఉన్న గుణం?
    1) విశ్వసనీయత 2) వస్త్వాశ్రయత
    3) సప్రమాణత 4) ఆత్మాశ్రయత
33. లోప నిర్ధారణ నికషకు సంబంధించి సరైన ప్రవచనం కానిది?
    1) ఎప్పుడు అవసరం అనుకుంటే అప్పుడు నిర్వహించవచ్చు
    2) నిర్ణీత సమయాల్లో మాత్రమే నిర్వహించాలి
    3) జవాబులు రాయడంలో కాల పరిధిని లెక్కలోకి తీసుకోవడం
    4) విద్యార్థి లోపాలు, బలహీనతలను ఉపాధ్యాయుడు కనుక్కోవచ్చు
34. విద్యార్థులు పటాలు అధ్యయనం చేయడానికి, గీయడానికి అనువైన దీపిక?
    1) ఉపాధ్యాయుల కరదీపిక
    2) విద్యార్థుల కరదీపిక
    3) విద్యార్థుల క్రియాదీపిక
    4) ఉపాధ్యాయుల క్రియాదీపిక
35. తరగతి గదిలో చేపట్టిన పని విభాగం అభివృద్ధిని తెలిపే యూనిట్?
    1) విషయజ్ఞాన 2) బోధనా
    3) వనరుల 4) నిర్మాణాత్మక
36. సూర్య కుటుంబం- భూమి అనే పాఠ్యం 5 నుంచి 8వ తరగతి వరకు క్రమానుగతంగా సంగ్రహ చిత్రంగా ఉంది, వివరణాత్మకంగా రాయడం ఏ ఉపగమం?
    1) వర్తులాకార 2) ఏకకేంద్ర
    3) కాలక్రమ 4) సమిశ్రణ

సమాధానాలు

1) 4; 2) 3; 3) 3; 4) 4; 5) 2;
6) 3; 7) 2; 8) 4; 9) 2; 10) 3;
11)4; 12)4; 13)3; 14)2; 15) 3;
16)2; 17)1; 18)3; 19)2; 20)3;
21) 4; 22) 1; 23) 3; 24) 3; 25) 2;
26) 2; 27) 2; 28) 4; 29) 3; 30) 4;
31) 3; 32) 3; 33) 2; 34) 3; 35) 2;
36) 2

లక్ష్యాలు -స్పష్టీకరణలు

1. కింది వాటిలో లక్ష్యం.. లక్షణం కానిది?
   1) సబ్జెక్టుకు, ఒక తరగతికి పరిమితం కావడం
   2) పరిధి తక్కువగా ఉంటుంది
   3) ప్రవర్తనా మార్పును సూచిస్తుంది
   4) పాఠశాల పరిధి దాటి ఉంటుంది
2. K అంటే పొటాషియం అని తెలిపిన విద్యార్థిలో ఉండే లక్ష్యం..?
   1) జ్ఞానం 2) అవగాహన
   3) వినియోగం
   4) శీల స్థాపన
3. లక్ష్యాలు వర్తమానానికి సంబంధించినవై ఉండాలి. ఈ సత్య వాక్యాన్ని సూచించే పదం?
   1) సమకాలీనత 2) అనుగుణ్యత
   3) ఆచరణ యోగ్యత 4) ఉపయోగిత్వం
4. జీవశాస్త్ర పితామహుడు ఎవరని ఉపాధ్యాయుడు అడిగిన ప్రశ్నకు లక్ష్మి.. అరిస్టాటిల్ అని సమాధానమిచ్చింది. ఆమె సాధించిన లక్ష్యం?
   1) జ్ఞానం
   2) అవగాహన
   3) వినియోగం
   4) బహిర్దీశనం
5. ఉభయ చర జీవికి ఒక ఉదాహరణ ఇవ్వండి..? అని అడిగిన ప్రశ్నకు కప్ప అని రాజు సమాధానమిస్తే అతనిలో ఏ లక్ష్యం నెరవేరినట్లు..?
   1) జ్ఞానం 2) అవగాహన
   3) ప్రాగుగ్తీకరణ 4) వినియోగం
6. ఒక పాఠంలో లేదా యూనిట్‌లో సాధించగల్గినవి..?
   1) ఉద్దేశాలు 2) గమ్యాలు
   3) లక్ష్యాలు 4) స్పష్టీకరణలు
7. పరిధి రీత్యా చిన్నగా ఉండి, ఏం చెప్పాలో ఉపాధ్యాయుడికి సూచనప్రాయంగా తెలియజేసేవి?
   1) లక్ష్యాలు 2) ఉద్దేశాలు
   3) స్పష్టీకరణలు 4) గమ్యాలు
8. ఆవర్తన పట్టికలోని మూలకాల పేర్లను విద్యార్థి జ్ఞప్తికి తెచ్చుకుంటాడు. ఇది ఒక?
   1) లక్ష్యం 2) గమ్యం
   3) ఉద్దేశం 4) స్పష్టీకరణ
9. కిరణ్.. మూలకాలకు, సంయోగ పదార్థాలకు మధ్య తేడాలను గుర్తించాడు. అతడు సాధించిన లక్ష్యం?
   1) వినియోగం 2) నైపుణ్యం
   3) జ్ఞానం 4) అవగాహన
10. భావావేశ రంగం గురించి వివరించిన ప్రముఖ విద్యావేత్త?
    1) బ్లూమ్స్
    2) డేవిడ్ ఆర్‌క్రాత్ హాల్
    3) సింప్సన్
    4) ఆర్.హెచ్.ధవే

సమాధానాలు

1) 4 2) 3 3) 1 4) 1 5) 2
6) 3 7) 1 8) 4 9) 4 10) 2

స్వచ్ఛమైన బంగారం క్యారెట్ విలువ?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
కెమిస్ట్రీ



మూలకాలు

విశ్వమంతా రెండు ప్రమాణాలతో తయారై ఉంటుంది. అవి పదార్థం, శక్తి. ఏదైనా కొద్దిగా ద్రవ్య రాశి ఉండి స్థలాన్ని ఆక్రమించ గలిగేది పదార్థం. ప్రత్యక్షంగా చూడలేనిది, అనుభూతి పొందగలిగేది శక్తి. విశ్వంలో ఏ భాగంలోని పదార్థం తీసుకున్నా దాని సంఘటనం అక్కడి మూలకాలపై ఆధారపడి ఉంటుంది. పదార్థాన్ని నిర్మించేవి మూలకాలు. విశ్వంలో అత్యధికంగా ఉన్న మూలకం హైడ్రోజన్. అదేవిధంగా భూమిపై సహజంగా ఉన్న మూలకాలు 92. మిగతావన్నీ మానవుడు కృత్రిమంగా తయారు చేసినవి. మూలకాలను వాటి పరమాణువుల రూపంలో అధ్యయనం చేయాల్సి ఉంటుంది. పదార్థ ప్రమాణమే పరమాణువు. తొలిసారిగా పరమాణువు సిద్ధాంతం 'వైశేషిక'లో కణాదుడు వివరించాడు. ఆధునిక కాలం లో డాల్టన్ పరమాణువు సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. ఒక మూలకానికి చెందిన పరమాణువులన్నీ ఒకే విధంగా ఉంటాయి. మూలకాలు ప్రకృతిలో వివిధ రూపాల్లో ఉంటాయి. అత్యధిక మూలకాలు ఘనరూపంలో ఉంటాయి.

ఉదా: కాల్షియం, భాస్వరం, బంగారం, ఇనుము. కొన్ని మూలకాలు వాయుస్థితిలో ఉంటాయి. **ఉదా:** ఆక్సిజన్, నియాన్, హైడ్రోజన్. సాధారణంగా మూలకాలను వాటి ఆంగ్ల నామంలోని మొదటి అక్షరం లేదా పదంలోని రెండు అక్షరాలతో సంబోధించే పద్ధతిని ప్రస్తుతం అవలంభిస్తున్నారు. **ఉదా:** హైడ్రోజన్-H, మెగ్నీషియం-Mg, జింక్-Zn, కొన్ని మూలకాలకు వాటి లాటిన్ పూర్వనామాలను బట్టి సంకేతాలు ఉన్నాయి.

ఉదా: బంగారం (ఆరం) Au
పాదరసం (హైడ్రోగైరం) Hg
సోడియం (నేట్రియం) Na

కేవలం రెండు మూలకాలు మాత్రమే సాధారణస్థితిలో ద్రవరూపంలో ఉంటాయి. ఉదా: బ్రోమిన్, పాదరసం.

మూలకాలను ప్రధానంగా మూడు రకాలుగా విభజిస్తారు. లోహాలు, అలోహాలు, అర్ధలోహాలు.

లోహాలు:

లోహాలు మెరిసే గుణాన్ని ప్రదర్శిస్తాయి. ఒక లోహాన్ని సులభంగా వైర్లు, షీట్‌ల రూపంలోకి మార్చడానికి వీలవుతుంది. లోహాలు మంచి ఉష్ణం, విద్యుత్ వాహకాలుగా వ్యవహరిస్తాయి. అలోహాలకు ఈ గుణం ఉండదు. ఒక లోహాన్ని సులభంగా వైర్ల రూపంలోకి మార్చే గుణం డక్టిలిటీ. అదే షీట్‌ల రూపంలోకి సులభంగా మార్చే గుణం మ్యాలియబిలిటీ. సాధారణంగా లోహాలు భూపటలంలో లభిస్తాయి. మానవ నాగరికత పరిణామం, ఆధునిక జీవనశైలిలో లోహాల పాత్ర చాలా కీలకమైంది. నిర్మాణరంగం మొదలు ఎలక్ట్రానిక్స్ పరికరాల వరకు లోహాలు వినియోగించని రంగం లేదు. సాధారణంగా ఒక లోహం భూపటలంలో ఖనిజ రూపంలో లభిస్తుంది. ఒక లోహాన్ని స్వాభావిక లేదా సంయోగ రూపంలో కలిగియున్న భూపటల పదార్థం ఖనిజం. స్వాభావిక రూపంలో ఖనిజాల్లో లభించే లోహాలు చాలా అరుదు. బంగారం ఈ కోవకు చెందింది. గాలి, నీరు, ఆమ్ల, క్షార పదార్థాల ద్వారా అల్పస్థాయిలో ప్రభావానికి గురవుతుంది. కాబట్టి ఇవి స్వాభావిక రూపంలో లభిస్తాయి తప్ప, ఆక్సైడ్, సల్ఫేట్, ఫాస్ఫేట్ మొదలైన రూపాల్లో లభించవు. ప్లాటినం కూడా ఈ రకమైన లక్షణాలనే ప్రదర్శిస్తుంది. వెండి, రాగి ఈ లక్షణాలను కొద్దిస్థాయిలో మాత్రమే ప్రదర్శిస్తాయి. ఏ ఇతర మూలకాలతో చర్యనొందవు కాబట్టి బంగారం, టైటానియంలను Noble Metals అంటారు.

భూ పటలంలోని అనేక ఖనిజాల్లో లోహాలు ఉన్నప్పటికీ వాటన్నింటి నుంచి లోహాలను లాభదాయకంగా సంగ్రహించడం కుదరదు. ఏ ఖనిజం నుంచి అయితే లోహాన్ని సులభంగా, లాభదాయకంగా వేరు చేయగలుగుతామో వాటిని ధాతువు (ore)లు అంటారు. అన్ని ధాతువులు ఖనిజాలు, కానీ కొన్ని ఖనిజాలు ధాతువులు కాదు. ప్రతి ధాతువులో ఎన్నో రకాల భూపటల మలినాలు ఉంటాయి. వీటిని గ్యాంగు లేదా మాత్రిక అంటారు. వీటిని తొలగించడానికి ఫ్లక్స్ అనే పదార్థాన్ని కలుపుతారు. ఇది గ్యాంగులతో కలిసి దానితో పాటు స్లాగ్‌గా బయటపడుతుంది. ఆ తర్వాత ధాతువును బట్టి విభిన్న రసాయన ప్రక్రియలకు గురి చేసి లోహాన్ని సంగ్రహిస్తారు. లోహాలను వెలికితీసి వినియోగించే ఈ విజ్ఞానం లోహ సంగ్రహణ శాస్త్రం (Metall-urgy). ప్రాచీన కాలం నుంచి బంగారం, రాగి లోహాలను నాణేలు తయారు చేయడంలో వినియోగించేవారు. ఇప్పటికి కూడా లోహాలను నాణేల తయారీలో వినియోగిస్తున్నారు.

యంత్రాల వినియోగం, వాహనాలు, పారిశ్రామిక పరికరాలు, ఉపగ్రహాల తయారీలో, ఆధునిక ఎలక్ట్రానిక్స్ పరికరాల తయారీలో వీటిని వినియోగిస్తున్నారు. నేడు సర్వసాధారణంగా వినియోగిస్తున్న లోహాల్లో చాలా ముఖ్యమైనవి ఇనుము, అల్యూమినియం, రాగి. ఇవి మంచి ఉష్ణ వాహకాలు. కాబట్టి వీటిని వంట సామగ్రి తయారీలో అధికంగా వినియోగిస్తారు. రాగిని కరెంటు వైర్ల తయారీలో ఉపయోగిస్తారు. ఈ మధ్య కాలంలో అల్యూమినియాన్ని కూడా అధికంగా వినియోగిస్తున్నారు. కంప్యూటర్స్, సోలార్ సెల్స్‌లో బంగారం, వెండిని ఉపయోగిస్తారు. బంగారం, వెండిని ఆభరణాల తయారీలో ప్రారంభం నుంచి వినియోగిస్తున్నాం. అయితే ఈ మధ్య కాలంలో ప్లాటినం కూడా విరివిగా వినియోగిస్తున్నారు. రెండు, అంతకంటే ఎక్కువ లోహాలు ఉన్న ఘన మిశ్రమాలను మిశ్రమలోహాలు (Alloys) అంటారు. ఒక లోహాన్ని మరో లోహానికి పూతగా పూయడాన్ని కూడా అల్లాయింగ్ అంటారు. ఉదా: ఏదైనా ఒక లోహానికి జింక్‌ను పూతగా పూయడాన్ని గాల్వనైజేషన్ అంటారు. ప్రారంభంలో రాగిని తగరంతో(Tin) కలిపి Bronze అనే మిశ్రమ లోహాన్ని మనిషి తయారు చేశాడు. ఆ తర్వాత ఇనుమును సంగ్రహించి వినియోగించడం ప్రారంభించాడు. వాణిజ్యపరంగా ఇనుముకు చెందిన మిశ్రమ లోహాలు అధిక వినియోగంలో ఉన్నాయి. ఇనుముకు కొద్దిగా కార్బన్‌ను కలపడం ద్వారా స్టీలు తయారవుతుంది. ఇనుముకు క్రోమియం నికెల్ లాంటివి కలిపి తయారు చేసే మిశ్రమ లోహం స్టెయిన్‌లెస్ స్టీల్. వంట సామగ్రి తయారీ ప్రస్తుతం అధిక వినియోగంలో ఇది ఉంది. మాంగనీస్ ప్రత్యేకంగా ఉన్న స్టీలు-మాంగనీసు స్టీల్. మంచి నాణ్యమైన మ్యాగ్నెట్‌లను అల్యూమినియం, నికెల్, కోబాల్ట్ లోహాలతో తయారు చేస్తారు. ఇలాంటి మిశ్రమ లోహాన్ని ఆల్‌నికో అంటారు. గత కొన్ని దశాబ్దాలుగా అల్యూమినియం ఆధారిత మిశ్రమ లోహాలు అధికంగా వాడుకలోకి వచ్చాయి. మ్యాగ్నేలియం, డ్యురాల్యుమిన్ వంటి అల్యూమినియం లోహాలు తేలికగా, దృఢంగా ఉం టాయి. కాబట్టి వీటిని ఆటోమొబైల్స్, ఏరోప్లేన్ రెక్కల తయారీలో విరివిగా ఉపయోగిస్తారు.

లోహాలు ఎదుర్కొనే ప్రధాన సమస్య క్రమక్షయం. ఇనుము క్రమక్షయం చెందడాన్ని Rusting/తుప్పుపట్టడం అంటాం. నీరు, ఆక్సిజన్ వంటివి లోహాలపై చేపట్టే చర్యల ద్వారా క్రమక్షయం జరుగుతుంది. లోహాల్లో క్రమక్షయాన్ని నిరోధించడానికి వినియోగించే సాధారణ పద్ధతి పెయింటింగ్. గ్రీసింగ్ పద్ధతిలో లోహంపై నూనె లేదా గ్రీస్‌ను పూసి కూడా క్రమక్షయాన్ని నిరోధించొచ్చు. లోహంపై తగరాన్ని పూతగా పూసే గాల్వనైజేషన్ ద్వారా క్రమక్షయాన్ని నిరోధించొచ్చు.

మిశ్రమ లోహం	లోహాలు
ఇన్‌వార్	ఇనుము, నికెల్
నిక్రోం	నికెల్,ఇనుము, క్రోమియం
టైప్‌మెటల్	సీసం, ఆంటిమొని, టిన్
వుడ్‌మెటల్	బిస్మత్, సీసం, టిన్, కాడ్మియం
సోల్డర్‌మెటల్	టిన్, సీసం, ఆంటిమొని
డ్యురాల్యుమిన్	అల్యూమినియం, రాగి, మాంగనీసు, మెగ్నీషియం
జర్మన్ సిల్వర్	రాగి, నికెల్, జింక్
బెల్‌మెటల్	రాగి, టిన్
బ్రాస్(ఇత్తడి)	రాగి, జింక్
బ్రోంజ్	రాగి, టిన్
గన్‌మెటల్	రాగి, టిన్, జింక్, సీసం
ఎలక్ట్రాన్	మెగ్నీషియం, జింక్, అల్యూమినియం, రాగి
కాన్‌స్టాంటిన్	రాగి, నికెల్
స్టెయిన్‌లెస్ స్టీల్	ఇనుము, నికెల్, కార్బన్, క్రోమియం
రోజ్‌మెటల్	బిస్మత్, సీసం, టిన్, రాగి

ధాతువు	సంగ్రహించే లోహం
మ్యాగ్నసైట్ డోలమైట్ ఎప్సొమైట్	మెగ్నీషియం
మ్యాలకైట్ అజురైట్	రాగి
అర్జెంటైట్	వెండి
క్యాలమైన్ విల్లిమైట్ జింకైట్	జింక్
బాక్సైట్ గిబ్సైట్ కొరండం డయాస్పోర్	అల్యూమినియం
కస్సిటరైట్	టిన్
గలినా ఆంగ్లిసైట్	సీసం
హేమటైట్ సిడరైట్ లియొనైట్	ఇనుము
పిచ్‌బ్లెండ్	యురేనియం, రేడియం
మొనజైట్	థోరియం
రుటైల్	టైటానియం
పైరోలుసైట్	మాంగనీసు
క్యాలోమెల్ సిన్నబాల్	పాదరసం
విదరైట్	బేరియం
వుల్ఫ్రమైట్	టంగ్‌స్టన్
జిప్సం లైంస్టోన్	కాల్షియం
సెలస్టైన్	స్ట్రాన్షియం
రాక్‌సాల్ట్	సోడియం

మాదిరి ప్రశ్నలు

1) కిందివాటిలో రెడ్‌లిక్విడ్ ఏది?
a) పాదరసం b) ఆంటిమొని
c) బిస్మత్ d) బ్రోమిన్

2) కిందివాటిలో కాంతి పరావర్తన గుణం అత్యధికంగా ఉన్న లోహం?
a) బంగారం b) అల్యూమినియం
c) వెండి d) రాగి

3) కిందివాటిలో చాల్కోజెన్ ఏది?
a) ఆక్సిజన్ b) సెలీనియం
c) పొలోనియం d) పైవన్నీ

4) అత్యంత తేలికైన లోహం?
a) బెరీలియం b) సోడియం
c) మెగ్నీషియం d) లిథియం

5) స్వచ్ఛమైన బంగారం క్యారెట్ విలువ?
a) 18 b) 22
c) 24 d) ఏదీకాదు

6) స్టెర్లింగ్ సిల్వర్‌లో రాగి శాతం ఎంత?
a) 50 b) 25
c) 16.5 d) 7.5

7) బరువులను కొలిచే నమూనాలను తయారు చేయడానికి వినియోగించే లోహాలు?
a) బంగారం, రాగి b) వెండి, రాగి
c)ప్లాటినం, బంగారం d)ప్లాటినం, ఇరీడియం

8) కిందివాటిలో బంగారంపై ప్రభావాన్ని ప్రదర్శించే వాయువు?
a) ఆక్సిజన్, b) నత్రజని
c) కార్బన్ డై ఆక్సైడ్ d) క్లోరిన్

9) బంగారాన్ని కరిగించడానికి వినియో గించేది?
a) అమటాల్ b) అమొనాల్
c) ఆక్వారెజియ d) ఏదీకాదు

10) స్టెయిన్‌లెస్ స్టీల్‌లో క్రోమియం శాతం ఎంత?
a) 25 b) 18
c) 5 d) 1

11) వెండిని క్రమక్షయానికి గురి చేసేది?
a) కార్బన్ డై ఆక్సైడ్ b) హీలియం
c) సల్ఫర్ డై ఆక్సైడ్ d) ఆక్సిజన్

12) ఏ ఉష్ణోగ్రత వద్ద ఇనుము కరుగుతుంది?
a) 1083°c b) 1535°c
c) 1845°c d) 2033°c

13) రెడ్ లెడ్ అని దేన్ని అంటారు?
a) లెడ్ ఆక్సైడ్ b) లెడ్ కార్బోనేట్
c) లెడ్ సల్ఫైడ్ d) ఏదీకాదు

14) కిందివాటిలో అలోహం?
a) ఇరీడియం b) బిస్మత్
c) కార్బన్ d) బేరియం

సమాధానాలు:
1) డి; 2) సి; 3) డి; 4)డి; 5) సి;
6) డి; 7) డి; 8) డి; 9) సి; 10) బి
11) సి; 12) బి; 13) ఎ;14) సి.

How the lady related to the man?



BLOOD RELATIONS

Some Common Relations:


- **Mother's or Father's mother:** Grand mother
- **Mother's or Father's father:** Grand father
- **Mother's or Father's Brother:** Uncle
- **Mother's or Father's sister:** Aunt
- **Wife's or Husband's mother:** Mother-in-law
- **Wife's or Husband's father:** Father-in-law
- **Could be a Brother or Sister:** Sibling
- **Childrens of Aunt or Uncle:** Cousin
- **Wife's or Husband's sister:** Sister-in-law
- **Wife's or Husband's brother:** Brother-in-law
- **Brother's or Sister's son:** Nephew
- **Brother's or Sister's daughter:** Niece
- **Son's wife:** Daughter-in-law
- **Daughter's husband:** Son-in-law
- **Grand father's son:** Father or Uncle
- **Grand father's only son:** Father
- **Grand mother's only son:** Mother
- **Daughter's father:** Husband
- **Son's mother:** Wife
- **Grand father's only daughter-in-law:** Mother
- **Grand mother's only daughter-in-law:** Mother

Some standard symbols are used to indicate the relationship among the family members:

Male → ☐
Female → ∆
Couples → ⇔
Children → ↓
Parents →
Paternal - Relations from the side of father
Maternal - Relations from the side of mother


Model Questions

1. If B says that his mother is the only daughter of A's mother, how is A related to B?
1) Son 2) Father
3) Brother-in-law
4) Grand father 5) Uncle
Ans: 5
Sol:



Mother's Brother - Uncle


2. Showing the lady in the park, Vinay said "She is the daugh-ter of my grand father's only son". How is Vinay related to that lady?
1) Brother 2) Cousin
3) Father 4) Uncle
5) None of these
Ans: 1
Sol:



Vinay is brother of that lady


3. Arun introduces Rohini as a daughter of the only sister of his father's wife. How is Rohini related to Arun?
1) Daughter 2) Sister
3) Wife 4) Cousin 5) Mother
Ans: 4
Sol: Rohini is the daughter of Arun's mother's only sister so, Rohini is cousin of Arun.

4. If Ankita is the sister of the daughter of Bhavani's son, how is Ankita related to Bhavani?
1) Grand daughter 2) Daughter
3) Sister 4) Mother 5) Friend
Ans: 1
Sol:




Ankita is Grand daughter of Bahavi

5. Pointing to man in a photograph, Aruna said "He is the father of my daughter's husband's son". How is Aruna related to the man?
1) Mother 2) Mother-in-law
3) Sister 4) Daughter
5) Sister-in-law
Ans: 2
Sol:




Aruna is Mother-in-law of that man

6. Pointing to a lady, a man said "The son of her only brother is the brother of my wife". How the lady related to the man?
1) Mother's sister
2) Grand mother
3) Sister of father-in-law
4) Mother-in-law
5) Maternal aunt
Ans: 3
Sol:




Sister of father-in-law

7. Q's mother is sister of R and daughter of S and N is daughter of R and sister of M. How is M related to S?
1) Son 2) Son's father
3) Brother 4) Daughter's son
5) Data inadequate
Ans: 5
Sol:




Data inadequate, either grand mother or grand father is the correct answer.


8. L and M are married couple. A and B are sisters. A is sister of C, who is the only son of married couple. How is B related to M?
1) Mother 2) Daughter 3) Wife
4) Grand mother 5) Sister
Ans: 2
Sol:



9. M is the wife of R. S is the only grand daughter of H, who is husband of G and father-in-law of R. How is M related to G?
1) Duaghter-in-law
2) Mother 3) Wife
4) Daughter 5) Sister
Ans: 4
Sol:




10. A family has a man, his wife, their two sons and their wives. The family of each son has 2 sons and 2 daughters. Find out the total number of female members in the family?
1) 5 2) 7 3) 9
4) 11 5) 13
Ans: 2
Sol:



Directions (11 and 12): Read the following information and answer the questions given below it.
P + Q means P is brother of Q
P – Q means Q is father of P
P × Q means Q is mother of P
P ÷ Q means P is sister of Q


11. How is P related to S in S+Q–P ?
1) Niece 2) Nephew
3) Brother 4) Uncle 5) None
Ans: 5
Sol:



P is either nice or Nephew of S

12. Which of the following means M is maternal uncle of R?
1) R × N ÷ M 2) M + N × R
3) M ÷ N × T ÷ R
4) Can't be determined
5) None of these
Ans: 5
Sol: None of these, we can't find either male or female from option (1).


13. P + Q means P is brother of Q; P– Q means P is mother of Q and P×Q means P is sister of Q. Which of the following means M is maternal uncle of R?
1) M – R + K 2) M + K – R
3) M + K × Q 4) No symbol
5) None of these
Ans: 2
Sol: From option (2)



M is maternal uncle of R

14. S × T means S is brother of T and S + T means S is father of T, which of the following shows O is cousin of R?
1) R × T + O 2) R + T × O
3) R × O × T 4) T × O + R
5) None of these
Ans: 5

15. P × Q means P is the sister of Q; P + Q means P is the father of Q and P – Q means P is the mother of Q. Which of the following means S is Aunt of T?
1) S × M + T 2) S + T × M
3) T × S + M 4) S × M + R – T
5) None of these
Ans: 1
Sol: From option (1)



Directions (16-18): Read the following information and answer the questions given below it.
A + B means A is the daughter of B
A × B means A is the son of B
A – B means A is the wife of B

16. If P × Q – S, which of the following is true?
1) S is wife of Q
2) S is father of P
3) P is daughter of Q
4) Q is father of P
5) None
Ans: 2

17. If T – S × B – M, Which of the following is not true?
1) B is mother of S
2) M is husband of B
3) T is wife of S
4) S is daughter of B
5) S is son of B
Ans: 4

18. If Z × T – S × U, what is U to Z?
1) Mother 2) Grand mother
3) Father
4) Can't be determined
5) None of these
Ans: 4